
'సంక్షేమ పథకాల అమలే సర్కారు పని తీరుకు కొలమానం'

సత్యమేవ జయతే

సాక్షి

WWW.SAKSHI.COM

పేజీలు: 14+4 వెల: ₹ 5.50

సంపుటి: 16
సంచిక: 336

సోమవారం 26-2-2024

SIMULTANEOUSLY PRINTED AT VIJAYAWADA | DELHI | CHENNAI | BANGALORE | HYDERABAD | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VISAKHAPATNAM | WARANGAL

తాగు, సాగునీటి కోసం దశాబ్దాలుగా ఎదురుచూస్తున్న కుప్పం ప్రజల చిరకాల వాంఛను నెరవేరుస్తూ...
కరువు తాండవమాడిన కుప్పం నియోజకవర్గానికి కృష్ణా జలాలను తరలిస్తానన్న మాట నిలబెట్టుకుంటూ..



కుప్పం నియోజకవర్గానికి కృష్ణా జలాలు..

కుప్పం నియోజకవర్గంలోని 110 మైనర్ ఇరిగేషన్ చెరువుల ద్వారా 6,300 ఎకరాల ఆయకట్టుకు సాగునీరు, కుప్పం, పలమనేరు నియోజకవర్గాల్లోని 4.02 లక్షల జనాభాకు తాగు నీరు అందిస్తూ.. అనంత వెంకటరెడ్డి హంద్రీ-నీవా సుజల స్రవంతిలో భాగంగా రూ. 560.29 కోట్ల వ్యయంతో చేపట్టిన కుప్పం బ్రాంచ్ కెనాల్ పనులు పూర్తి చేసి, కుప్పం నియోజకవర్గానికి నేడు చిత్తూరు జిల్లా రామకుప్పం మండలం రాజుపేట వద్ద కృష్ణా జలాలు విడుదల చేసి, శాంతిపురం మండలం గుండుశెట్టిపల్లె వద్ద బహిరంగ సభలో పాల్గొననున్న గౌరవ ముఖ్యమంత్రి శ్రీ. వై.ఎస్. జగన్ మోహన్ రెడ్డి..

కుప్పం బ్రాంచ్ కెనాల్ ప్రత్యేకతలు

- పుంగనూరు బ్రాంచ్ కెనాల్ 207.80 కి.మీ వద్ద (చిత్తూరు జిల్లా పెద్ద పంజాణీ మండలం అప్పినపల్లె చెరువు వద్ద) కుప్పం బ్రాంచ్ కెనాల్ ప్రారంభం..
- నీటి సామర్థ్యం : 6.130 క్యూమెక్స్ (216 క్యూసెక్కులు)
- కాలువ పొడవు : 123.641 కి.మీ
- వ్యయం : రూ. 560.29 కోట్లు
- కట్టడాలు : 330
- లిఫ్ట్ లు : 3
- ఆయకట్టు : 110 చెరువుల క్రింద 6,300 ఎకరాలు
- త్రాగునీరు : పలమనేరు, కుప్పం నియోజకవర్గాలకు చెందిన 4.02 లక్షల మంది ప్రజలకు..

'కుప్పం' అభివృద్ధికి జగనన్న ప్రభుత్వం చేపట్టిన కార్యక్రమాలు

- కుప్పంకు మున్సిపాలిటీ హెూదా.. రెవెన్యూ డివిజన్, పోలీస్ సబ్ డివిజన్ ఏర్పాటు..
- రూ. 66 కోట్లతో కుప్పం మున్సిపాలిటీలో అభివృద్ధి పనులు..
- నియోజకవర్గంలోని 4 మండలాల అభివృద్ధికి మరో రూ.100 కోట్లు మంజూరు..
- కుప్పం జలప్రదాయిని పాలారు ప్రాజెక్టులో భాగంగా రూ. 215 కోట్ల వ్యయంతో 0.6 టీఎంసి సామర్థ్యం గల రిజర్వాయర్ నిర్మాణానికి పరిపాలనా అనుమతుల మంజూరు..
- శాంతిపురం మండలం మాదనపల్లె వద్ద, గుడిపల్లె మండలం యామిగానిపల్లె వద్ద రూ.535 కోట్ల వ్యయంతో నిర్మించనున్న రెండు జలాశయాలకు పరిపాలన అనుమతుల మంజూరు
- కుప్పం పట్టణంలో ఇంటిగ్రేటెడ్ ఆఫీస్ కాంప్లెక్స్, కుప్పం నియోజకవర్గంలో మరో 2 విద్యుత్ సబ్‌స్టేషన్ల నిర్మాణం పూర్తి..
- "వైఎస్సార్ జగనన్న శాశ్వత భూ హక్కు మరియు భూరక్ష" ద్వారా ఇప్పటివరకు 104 గ్రామాల్లోని 53,718 ఎకరాల్లో రీసర్వే చేపట్టి 16,676 మంది లబ్ధిదారులకు భూహక్కు పత్రాలు జారీ..


ఈ 57 నెలల్లో కుప్పం నియోజకవర్గంలోని లబ్ధిదారులకు (ఒక్కొక్కరు ఒకటికన్నా ఎక్కువ పథకాల ద్వారా లబ్ధి పొందిన నేపథ్యంలో) డీబీటీ ద్వారా రూ. 1,400 కోట్లు..
డీబీటీ, నాన్ డీబీటీ ద్వారా రూ. 1,889 కోట్ల లబ్ధి అందించిన జగనన్న ప్రభుత్వం..

కుప్పం నియోజకవర్గం పరిధిలో వివిధ సంక్షేమ పథకాల అమలులో తేడా గమనించండి

పథకం పేరు	లబ్ధి పొందిన విధానం	గత 5 ఏళ్ల పాలనలో (2014-2018)	ప్రస్తుత పాలనలో (2019 - నేటి వరకు)
జగనన్న అమ్మఒడి	లబ్ధిదారులు	లేదు	35,951
	లబ్ధి మొత్తం (రూ.లలో)		154.93 Cr
వైఎస్సార్ చేయూత	లబ్ధిదారులు	లేదు	19,921
	లబ్ధి మొత్తం (రూ.లలో)		84.96 Cr
వైఎస్సార్ ఆసరా	లబ్ధిదారులు	లేదు	44,888
	లబ్ధి మొత్తం (రూ.లలో)		171.69 Cr
ఆరోగ్యశ్రీ	లబ్ధిదారులు	7,002	33,795
	లబ్ధి మొత్తం (రూ.లలో)	28,20,00,000	76,99,00,000
ఆరోగ్య ఆసరా	లబ్ధిదారులు	లేదు	21,286
	లబ్ధి మొత్తం (రూ.లలో)		9,98,00,000
పెన్షన్లు	లబ్ధిదారులు	31,252	38,162
	లబ్ధి మొత్తం (రూ.లలో)	203.01 Cr	507.40 Cr
సున్నావడ్డీ (మహిళలు)	లబ్ధిదారులు	29,355	59,662
	లబ్ధి మొత్తం (రూ.లలో)	15,49,00,000	30,30,00,000
ఇళ్లు	మంజూరు చేసిన ఇళ్లు	3,547	7898
	పూర్తయిన ఇళ్లు	2,968	4,871
ఇళ్ల పట్టాలు	మంజూరైన ఇళ్లపట్టాలు	సున్నా	14,898 (మరో 15.000 త్వరలో)
సంపూర్ణ పోషణ	నమోదు చేసుకున్న తల్లులు	10,156	21,020
	నమోదు చేసుకున్న పిల్లలు	24,367	58,541
	చేసిన వ్యయం	3,51,00,000	7,94,00,000
రైతు భరోసా-PM Kisan	లబ్ధిదారులు	లేదు	39,168
	లబ్ధి మొత్తం (రూ.లలో)		1,41,22,17,000
విద్యా దీవెన	లబ్ధిదారులు	8,459	12,093
	లబ్ధి మొత్తం (రూ.లలో)	27,87,15,417	41,12,04,004
వసతి దీవెన	లబ్ధిదారులు	7,384	11,504
	లబ్ధి మొత్తం (రూ.లలో)	5,84,68,646	20,20,38,691



కుప్పం బ్రాంచ్ కెనాల్ రూట్ మ్యాప్




కుప్పం బ్రాంచ్ కెనాల్ అక్విడక్ట్

శ్రీ. అంబటి రాంబాబు,
జలవనరుల శాఖామాత్యులు

గమనిక : రాష్ట్ర ముఖ్యమంత్రి శ్రీ. వై.ఎస్. జగన్ మోహన్ రెడ్డి "కుప్పం నియోజకవర్గానికి కృష్ణా జలాలు" విడుదల చేసే కార్యక్రమాన్ని చిత్తూరు జిల్లా రాజుపేట వద్ద 26 ఫిబ్రవరి, 2024 నాడు ఉదయం 10 గంటలకు ప్రారంభిస్తారు. ఈ కార్యక్రమాన్ని అన్ని ప్రముఖ న్యూస్ ఛానళ్లలో లైవ్ లో వీక్షించవచ్చు ..

జారీ చేసినవారు: కమిషనర్, సమాచార, పౌర సంబంధాల శాఖ, ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం

మంచిమాట

స్వేచ్ఛ



సృష్టి లోని జీవులన్నీ కోరుకునేది స్వేచ్ఛ. కాని, అది ఎంత వరకు సాధ్యం? మనమే తల్లి తండ్రులని ఎంచుకుని, పుట్టటం మన చేతుల్లో లేదు అనుకుంటాం. పుట్టిన తరువాత ఇక చేయగలిగినది ఏమీ లేదు. తల్లిగర్భంలో ఉన్నప్పుడు ఆ బంధంలో నుండి బయట పడాలని తాపత్రయం. బొడ్డు కోసి మాయనుండి వేరైన తరువాత అసలైన బంధనాల్లో ఇరుక్కుపోవటం జరిగింది. అప్పటి వరకు ఉన్న జ్ఞానం కూడా పోతుంది. పూర్తిగా తల్లితండ్రుల మీద ఆధారపడతారు. అక్కడి నుండి ప్రతిదానికి ఎవరో ఒకరి మీద ఆధార పడక తప్పదు. జ్ఞానసముపార్జన కోసం గురువుల మీద ఆధారపడ వలసి వస్తుంది. ఆహారం కోసం అయితే వడ్డించినవారి మీద, వండిన వారి మీద, సంబారాలని ఇంటికి తెచ్చినవారి మీద, పంటలు పండించినవారి మీద – ఇట్లా ఎందరి మీదనో ఆధార పడకుండా నాలుగు వేళ్ళు నోట్లోకి వెళ్ళవు కదా! ముందుగా అవన్నీ తెచ్చుకోవటానికి కావలసిన డబ్బులు ఉండాలి. అవి ఆకాశంలో నుండి ఊడి పడవు. మనం స్వంతంగా తయారు చేయలేము. మరి, నేను స్వేచ్ఛాజీవిని. ఎవరి మీదా ఆధారపడను అనటం ఎంత సమంజసం? ఆలోచించాల్సిన విషయమే కదా!

ఇది ఇరుకుగా ఉన్న గర్భంలో నుండి బయట పడి స్వేచ్ఛాజీవిని అనుకున్న మానవుడికి తాను ఇరుక్కున్న చుట్టరికపు బంధనాల నుండి విడివడాలని అంతర్గతంగా అంతరంగపు అట్టడుగు పొరల్లో మాటుపడి ఉన్న కోరిక. ఈ బంధనాలనే పురాణాలు ప్రతీకాత్మకంగా వృత్రాసురుడు అని చెప్పాయి. చుట్టుకున్నవే చుట్టరికాలు, బంధించేవే బంధనాలు.

నిజమైన స్వేచ్ఛ అంటే దేనినీ పట్టుకొని ఉండకపోవటం. దేనినీ పట్టించుకోక పోవటం అనుకుంటారు. నిజమైన స్వేచ్ఛాజీవి అందరికీ సమంగా అందుబాటులో ఉంటాడు. వీరు నాకు ఇష్టులు, మేలు చేసినవారు, బంధువులు, భవిష్యత్తులో నాకు సహాయ పడతారు, నాకు కీడు చేశారు, ఎందుకూ పనికిరారు మొదలైన భావనలతో ప్రవర్తించటం అభిప్రాయాల ఊబిలో కూరుకుపోవటమే. అది వ్యక్తుల విషయం మాత్రమే కాదు, వస్తువులు, సిద్ధాంతాలు మొదలైనవి కూడా. ఎదుటివారి పట్ల ఎటువంటి అభిప్రాయమూ లేకుండా వారికి మేలు కలిగేట్టు తనకు చేతనైనంత వరకు ప్రవర్తించటం, తరువాత ఎటువంటి ప్రతిఫలం కాని, గుర్తింపు కాని ఆశించకుండా ఉండటం స్వేచ్ఛాజీవి లక్షణం. ఏ మాత్రం ఆశించినా అది బంధమే. ఒకవేళ ఏదైనా ప్రతిఫలం లభిస్తే, దానిని ఎటువంటి వ్యామోహం లేకుండా స్వీకరించాలి. ''వద్దు, అది నన్ను బంధిస్తుంది.'' అని నిరాకరిస్తే, అదే పెద్ద బంధనం అవుతుంది. ''మానవుడు పుట్టుకతో స్వేచ్ఛాజీవి. తరువాత బంధనాలలో ఇరుక్కుంటాడు'' అన్న ఆంగ్ల సామెత వాస్తవానికి ఎంత దగ్గరగా ఉన్నదో చూడండి. నిజంగానే మనం స్వేచ్ఛని అనుభవిస్తున్నామా? స్వేచ్ఛ ఎవరు ఇచ్చేది కాదు. తనంతట తాను అనుభవించ వలసినది. ఆ విధంగా ఉండటానికి చేసే ప్రయత్నమే సాధన అంతా.

– డా. ఎన్. అనంత లక్ష్మి

స్వ+ ఇచ్ఛ అంటే తన అసలైన ఇచ్ఛ, అంటే కోరిక ఏదైతే ఉన్నదో, బంధనాల నుండి విడివడాలని - అది నెరవేరటానికి తగినట్టుగా ఉండగలగటమే స్వేచ్ఛ. దానిని గుర్తించక పోవటం వల్ల స్వేచ్ఛ అంటే ఇష్టం వచ్చినట్టు ఉండగలగటం, స్వేచ్ఛ అంటే విచ్చలవిడితనం, ఎవరినీ దేనినీ లెక్కచేయకపోవటం అనే అపోహ వ్యాపించి ఉంది లోకంలో. సర్వసంగపరిత్యాగులని చూస్తే ఈ విషయం బాగా తెలుస్తుంది. వారికి ఇల్లు, బంధువులు మొదలైన బంధాలు ఉండవు. పేరు ప్రఖ్యాతులు వంటి చుట్టలలో (వలయాల్లో) ఇరుక్కోరు. ఈ క్షణాన మోక్షం ఇస్తానంటే ఏవో సద్దుకొని వస్తాను అనకుండా ఉన్నవాళ్ళు ఉన్నట్టే బయలుదేరే వారు ఎంత మంది ఉంటారు? అదీ నిజమైన స్వేచ్ఛ అంటే.

తాత్త్వికథ

నేల తల్లి

ఒక సాఫ్ట్‌వేర్ ఉద్యోగికి అమెరికాలో ఉద్యోగ అవకాశం లభించింది.

'మొదటిగా ఆ విషయాన్ని ఎవరికి చెబుదాం?' అని ఆలోచించాడు. అప్పుడే రామాయణంలోని 'జననీ జన్మ భూమిశ్చ స్వర్గాదపీ గరీయసీ' శ్లోకం గుర్తుకొచ్చింది.

వెంటనే ఆ విషయాన్ని మొదటిగా పల్లెలో ఉన్న అమ్మకు చెప్పాలనుకున్నాడు. పట్టణంలోని పెద్ద మార్కెట్‌లో పండ్లు కొనుక్కుని ఆనందంగా పల్లెలోని తన ఇంటికి వెళ్ళాడు.

అమ్మ చేతికి పండ్లు ఇచ్చి విషయం చెప్పాడు. ఆమె ముఖం వందనేతి దీపాల వెలుగు వెలిగింది. అతడు భక్తి పూర్వకంగా అమ్మకు పాద నమస్కారం చేయబోయాడు. ఆమె కొద్దిసేపు ఆగమని చెప్పింది. ఆశ్చర్యపోయాడు.

కొడుకును ఇంటి ముందర నాటి ఉన్న పూల చెట్ల వద్దకి రమ్మంది.

'అమ్మ ఎందుకిలా చేస్తోంది?' అని ఆలోచిస్తూ ఆమె వెనుకే నడిచాడు.

పూల చెట్ల ముందరి మట్టిని చూపిస్తూ–'' నాకన్నా ముందు ఈ నేల తల్లికి దండం పెట్టు!'' అని చెప్పింది.

''అదేమిటమ్మా? నీకన్నా ముందు నేలకు దండం పెట్టమంటున్నావు, అమ్మవైన నీకన్నా గొప్పదా నేలతల్లి?'' అని అడిగాడు.



''కచ్చితంగా నాకన్నా నేల తల్లే గొప్పది బాబూ. ఎందుకంటే బిడ్డను తల్లి మోసేది తొమ్మిది నెలలే. అదే బిడ్డను జీవితాంతం మోసేది నేలతల్లి. అందుకు మనం కృతజ్ఞులుగా ఉండాలి. కాబట్టి నేల తల్లికి దండం పెట్టాక నాకు నమస్కరించు'' అని చెప్పింది.

అలాగేనని అమ్మకు పాద నమస్కారం చేశాడు.

''బాబూ... జనని, జన్మభూమి, స్వర్గం కంటే గొప్పదన్న విషయం నీకు తెలిసిందే. కాబట్టి నువ్వు ఏ దేశమెళ్ళినా, ఎంత పెద్ద పదవిని అలంకరించినా పుట్టి పెరిగిన ఈ నేల తల్లిని మాత్రం మరువవద్దు'' అని సలహా ఇచ్చింది.

'నిజమే, మనం ఎక్కడికి వెళ్ళినా మన మూలాలను మరువకూడదు' అని అనుకుంటూ అమెరికా ప్రయాణ ఏర్పాట్లు చేసుకున్నాడు.

– ఆర్.సి.కృష్ణస్వామి రాజు

ఒక్కసారయినా అక్కడ పాడాలి


వాగ్గేయకార వైభవం



ముత్తుస్వామి దీక్షితార్ వారు గంగే మాం పాహి... అంటూ కీర్తన చేస్తూ... గంగ వైభవాన్ని చాలా అద్భుతంగా కీర్తించారు. నీళ్ళబిందె తలమీద పెట్టుకుని ఆడుతుంటే ఎలా ఉంటుందో శివుడు తన జటాజూటంలో గంగను బంధించి తాండవం చేస్తుంటే ఆ దృశ్యం అలా ఉంటుందంటుంది రావణ కృత స్తోత్రం. భగీరథుడు ప్రార్థన చేస్తే వదిలిపెట్టాడు శివుడు గంగను. శంకరుడి శిరస్సు నుండి పాదాల వరకు తగిలి కిందకు ప్రవహించింది. ఆ గంగను ...ఆ నీళ్ళను తలమీద చల్లుకుంటే.. దేవతాస్థానాలనుంచి పడిపోతున్న వాళ్లుకూడా మళ్ళీ తమ పూర్వ వైభవాన్ని పొందుతారట.. అటువంటి శక్తి ఆ గంగమ్మది.

గంగే మాం పాహి గిరీశ శిరస్థితే/గంభీరకాయే గీత వాద్య ప్రియే/అంగజతాత ముదే అసి వరుణా మధ్యే....''. అంటారు దీక్షితార్ వారు తమ కీర్తనలో. ఆమె ప్రవాహ తీరును గంభీర కాయే.. అన్నారు.. ఆమె శరీరం అలా ఉంటుందట.'...శేషాహే రను కారిణీ ...' అంటారు శంకరులు. ఆది శేషుడు భూమి మీద పాకి వెడుతుంటే ఎలా ఉంటుందో గంగా ప్రవాహం అలా ఉంటుందంటారు ఆయన. శేషుడు ఉత్తర దిక్కున ఉంటాడు. ఆయనను స్మరిస్తే మనకున్న ఆపదలు తొలగుతాయని ఒక నమ్మకం. కాశీలో గంగకున్న విశేష లక్షణం ఏమిటంటే... అప్పటివరకు దక్షిణానికి ప్రవహించిన గంగానది అక్కడ ఉత్తర దిక్కుకు మళ్ళుతుంది. దానిని కాశీగంగ అంటారు. అక్కడ గంభీర శబ్దంతో ప్రవహించే గంగను సంగీత వాద్య ప్రియే ... అని కూడా అన్నారు. ఎందుకలా!!!

గంగమ్మకు గీతమన్నా, సంగీతమన్నా ఇష్టమట. గంగ ఒడ్డున కూర్చుని పాట పాడినా, వాద్యం మోగించినా, ఆలాపన చేసినా, నృత్యం చేసినా ఆమె సంతోష పడి పోతుందట. అంటే రాజోపచారాలన్నింటినీ అంత ప్రీతితో స్వీకరించగలిగిన భగవత్ స్వరూపం ఆమెది. అంటే నిజమయిన కళాకారుడు నిజజీవితంలో కోరుకోవలసింది ఏమిటంటే – ఒక్కసారయినా గంగ ఒడ్డున కూర్చుని తన ప్రదర్శన ఇచ్చి ఆమెను సంతోష పరచాలి, అని. కాశీలో ఇప్పటికీ ఒక ఏర్పాటు ఉంది. అక్కడ కొన్ని పడవలు అద్దెకిస్తారు. వాటితోపాటూ సంగీత విద్వాంసులు వస్తారు మనతో. వాద్యగోష్ఠి చేస్తారు.



బ్రహ్మశ్రీ చాగంటి కోటేశ్వరరావు

కొంతమంది తబలా, వయోలిన్, వీణ వాయిస్తే మరికొంతమంది పాడతారు. సూర్యోదయానికి ముందు తెల్లవారు ఝామున ... అసి, వరుణ – ఈ రెండింటి మధ్యలో అలా సంగీతం వింటూ పడవమీద వెడుతూ ఉంటే గంగమ్మ ప్రసన్నురాలవుతుందని అక్కడి వారి నమ్మకం. గీత వాద్య ప్రియే... అంగజ తాత ముదే... అసి వరుణా మధ్యే...దీక్షితార్ వారి కీర్తనలో కూడా ఇదే వ్యక్తమవుతుంది. అంగజ తాత ముదే... గంగమ్మ ఎవరు? అంగజుడు అంటే మన్మథుని తండ్రి.. మహావిష్ణువు. గంగమ్మ ఆయనకు సంతోషాన్ని కలిగిస్తుందట. తన స్పర్శను పొంది గంగ పునీతమయింది. తిరిగి గంగ ఆ ప్రభావంతో సర్వ జనుల పాపాలను నశింపచేసి ధర్మరక్షణకు కారణమవుతున్నందు వల్ల విష్ణువుకు ప్రీతిపాత్రమవుతున్నది అన్నారు ముత్తుస్వామి దీక్షితార్.

సినిమా



● ఎన్టీఆర్

రొమాంటిక్ దేవర!

డ్యాన్స్ మోడ్‌లోకి వెళ్లనున్నారు హీరో ఎన్టీఆర్. 'జనతా గ్యారేజ్' (2016) వంటి హిట్ ఫిల్మ్ తర్వాత హీరో ఎన్టీఆర్, దర్శకుడు కొరటాల శివ కాంబినేషన్‌లో రూపొందుతున్న తాజా చిత్రం 'దేవర'. ఈ మూవీలో జాన్వీకపూర్ హీరోయిన్‌గా నటిస్తుండగా, బాలీవుడ్ నటుడు సైఫ్ అలీఖాన్ ఓ కీలక పాత్ర చేస్తున్నారు. కల్యాణ్‌రామ్, కె. హరికృష్ణ, మిక్కిలినేని సుధాకర్ నిర్మిస్తున్న 'దేవర' చిత్రం రెండు భాగాలుగా విడుదల కానుంది. తొలిభాగం 'దేవర పార్ట్ 1' ఈ ఏడాది అక్టోబరు 10న రిలీజ్ కానుంది. తొలి భాగానికి సంబంధించిన మేజర్ యాక్షన్ సీక్వెన్స్‌ల చిత్రీకరణ ఓ కొలిక్కి వచ్చిందని సమాచారం. దీంతో టాకీ, పాటల చిత్రీకరణపై ఫోకస్ పెట్టారట దర్శకుడు కొరటాల శివ. సాంగ్స్ చిత్రీకరణలో భాగంగా గోవా, కొచ్చి లొకేషన్స్‌ను పరిశీలించారట చిత్రయూనిట్. మార్చి తొలి వారంలో 'దేవర' సాంగ్స్ చిత్రీకరణ మొదలు కానుందని ఫిల్మ్‌నగర్ సమాచారం. ఎన్టీఆర్, జాన్వీల కాంబినేషన్‌లో ఓ రొమాంటిక్ సాంగ్ ఉంటుందని ఫిల్మ్‌నగర్ టాక్. ఈ సినిమాకు అనిరుధ్ రవిచంద్రన్ సంగీతం అందిస్తున్నారు.



ఆ పోరాటం నా మనసును కదిలించింది

– ప్రియాంకా చోప్రా

ఆస్కార్ నామినేటెడ్ డాక్యుమెంటరీ ఫీచర్ ఫిల్మ్ 'టు కిల్ ఏ టైగర్'కు ఓ ఎగ్జిక్యూటివ్ ప్రొడ్యూసర్‌గా వ్యవహరిస్తున్నందుకు చాలా గర్వంగా ఉందంటున్నారు బాలీవుడ్ నటి ప్రియాంకా చోప్రా. భారత దేశంలో జన్మించి కెనడాలో పెరిగిన నిషా పహుజా 'టు కిల్ ఏ టైగర్' డాక్యుమెంటరీకి దర్శకత్వం వహించారు. జార్ఖండ్‌లో జరిగిన ఓ వాస్తవ ఘటన ఆధారంగా 'టు కిల్ ఏ టైగర్' తీశారు నిషా. కుమార్తెకు జరిగిన అన్యాయానికి న్యాయం జరగాలంటూ ఓ తండ్రి చేసే పోరాటం నేపథ్యంలో కథాంశం ఉంటుంది. తాజాగా 'టు కిల్ ఏ టైగర్' డిస్ట్రిబ్యూషన్ రైట్స్‌ను నెట్‌ఫ్లిక్స్ దక్కించుకుంది. అలాగే 'టు కిల్ ఏ టైగర్'కు ప్రియాంకా చోప్రా, దేవ్ పటేల్‌తో పాటు మరికొంతమంది ఎగ్జిక్యూటివ్ ప్రొడ్యూసర్స్‌గా వ్యవహరిస్తున్నారు. ఈ విషయంపై ప్రియాంకా చోప్రా స్పందించారు. ''టు కిల్ ఏ టైగర్'ను తొలిసారిగా నేను 2012లో చూశాను. తన కూతురికి న్యాయం జరగడం కోసం ఓ తండ్రి చేసే పోరాటం నా మనసును కదిలించింది. నేనూ జార్ఖండ్‌లోనే జన్మించాను. ఓ తండ్రికి కూతుర్ని కూడా. ఈ ప్రాజెక్ట్‌తో అసోసియేషన్ అవుతున్నందుకు చాలా గర్వంగా ఉంది'' అని పేర్కొన్నారు. మార్చి 10న లాస్ ఏంజెల్స్‌లో జరిగే 96వ ఆస్కార్ అవార్డ్స్‌లో ఉత్తమ డాక్యుమెంటరీ ఫీచర్ ఫిల్మ్ 'టు కిల్ ఏ టైగర్' అవార్డు గెలుస్తుందా? వేచి చూడాలి.



● నందకుమార్, సిద్ధు ముద్ద, చిరంజీవి, వరుణ్ తేజ్, శక్తి ప్రతాప్ సింగ్

ఆ బాధ్యత మనందరిపై ఉంది – చిరంజీవి

''మనందరిలో దేశభక్తి ఎంత ఉన్నా కానీ 'ఆపరేషన్ వాలెంటైన్' లాంటి సినిమాలు చూసినప్పుడు ఆ దేశభక్తి ఉప్పొంగిపోతుంది. ముఖ్యంగా మన యువత ఇలాంటి సినిమాలు చూడాలి. ఈ మూవీని తీయడం యూనిట్ బాధ్యత. విజయం అందించి మన రియల్ హీరోలైన సైనికులకు నివాళి అర్పించాల్సిన, అంకితం ఇవ్వాల్సిన బాధ్యత మనందరిపై ఉంది'' అని హీరో చిరంజీవి అన్నారు. వరుణ్ తేజ్ హీరోగా శక్తి ప్రతాప్ సింగ్ హడా దర్శకత్వం వహించిన చిత్రం 'ఆపరేషన్ వాలెంటైన్'. మానుషి చిల్లర్, రుహానీ శర్మ, నవదీప్ కీలక పాత్రలు పోషించారు. సోనీ పిక్చర్స్ ఇంటర్నేషనల్ ప్రొడక్షన్స్, సందీప్ ముద్ద రినైసన్స్ పిక్చర్స్‌పై నిర్మించిన ఈ సినిమా మార్చి 1న తెలుగు, హిందీ భాషల్లో రిలీజ్ అవుతోంది. ఈ సందర్భంగా నిర్వహించిన ప్రీ రిలీజ్ వేడుకకు ముఖ్య అతిథిగా హాజరైన **చిరంజీవి మాట్లాడుతూ–** ''శక్తి ప్రతాప్ సింగ్ 'ఆపరేషన్ వాలెంటైన్' 75 రోజుల్లోనే చాలా రీజనబుల్ బడ్జెట్లో తీశాడు. కానీ, ట్రైలర్ చూస్తే ఎంతో రిచ్‌నెస్, ఎక్కువ బడ్జెట్ మూవీలా కనిపిస్తోంది. డబ్బు ఖర్చు పెడితేనే రిచ్‌నెస్ రాదు.. మన ఆలోచనల నుంచి వస్తుంది. తక్కువ ఖర్చులో అలా రిచ్‌గా చూపిస్తే సినిమా బాగా వస్తుంది.. ఇటు నిర్మాతలూ బాగా ఉంటారు. సినిమా ఇండస్ట్రీ కూడా బాగుంటుంది. అందుకే శక్తి ప్రతాప్ సింగ్‌ని మన యంగ్ డైరెక్టర్స్ స్ఫూర్తిగా తీసుకోవాలి. వరుణ్ ప్రతి సినిమాలోనూ వైవిధ్యంగా కనిపిస్తాడు. నేను 'టాప్‌గన్' మూవీ చూసినప్పుడు ఇంత బాగా మనం చేయగలమా? అనిపించింది. ఆ విజువల్స్‌కి ఆశ్చర్యపోయాను. ఈరోజు 'టాప్‌గన్' లాంటి గొప్ప సినిమాని 'ఆపరేషన్ వాలెంటైన్' రూపంలో మనవాళ్లు సులభంగా చేశారంటే.. ప్రతిభ ఎవడి సొత్తు కాదు.. మనం ఆ స్థాయిలో ఉన్నామని ఈ మూవీ ద్వారా నిరూపించబడుతుంది. ఈ సినిమా కచ్చితంగా హిట్ అవుతుంది'' అన్నారు.

వరుణ్ తేజ్ మాట్లాడుతూ– ''మా వరుణ్‌గాడు మంచి సినిమా ఇచ్చాడని మీరు(మెగా అభిమానులు) గర్వపడేందుకు ప్రతి సినిమాకి కష్టపడుతుంటాను. 'ఆపరేషన్ వాలెంటైన్' చేయడం నాకు చాలా గర్వంగా ఉంది'' అన్నారు. ''ఈ సినిమాని ప్రేక్షకులు ఆదరించాలి'' అన్నారు శక్తి ప్రతాప్ సింగ్ హడా. ''మా మూవీని సైనికులకు అంకితం ఇస్తున్నాం'' అన్నారు నిర్మాత సిద్ధు ముద్ద.

ఈ వేడుకలో సహ నిర్మాత నందకుమార్, కెమెరామేన్ హరి కె.వేదాంతం, పాటల రచయిత రామజోగయ్య శాస్త్రి, నటులు నవదీప్, అభినవ్ గోమటం, శతాఫ్, మైత్రీ మూవీ డిస్ట్రిబ్యూటర్ శశి, ఆర్ట్ డైరెక్టర్ అవినాష్ కొల్ల, ఫైట్ మాస్టర్ విజయ్ తదితరులు పాల్గొన్నారు.

నిర్మాత మహేశ్ కన్నుమూత



ప్రముఖ సినీ, టీవీ నిర్మాత, రచయిత వి.మహేశ్ (85) శనివారం రాత్రి చెన్నైలో గుండెపోటుతో కన్నుమూశారు. స్వగృహంలో బాత్ రూమ్ నుంచి బయటికి వస్తూ కాలుజారి పడిన మహేశ్‌ని సమీపంలోని ఓ ఆసుపత్రికి తరలించగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు ధ్రువీకరించారు. నెల్లూరు జిల్లా కొరుటూరు వి.మహేశ్ స్వస్థలం. 'మాతృమూర్తి' సినిమాతో సినిమా నిర్మాణంలోకి ప్రవేశించారు మహేశ్. ఎన్టీ రామారావు హీరోగా దాసరి నారాయణరావు దర్శకత్వంలో 'మనుషులంతా ఒక్కటే', లక్ష్మి దీపక్ దర్శకత్వంలో 'మహా పురుషుడు', చిరంజీవి హీరోగా కోడి రామకృష్ణ దర్శకత్వంలో 'సింహపురి సింహం', బోయిన సుబ్బారావు దర్శకత్వంలో సుమన్, భానుప్రియ జంటగా 'ముసుగు దొంగ' వంటి పలు సినిమాలు నిర్మించారాయన. 'మనుషులంతా ఒక్కటే' చిత్రానికి ఉత్తమ కథా రచయితగా నంది అవార్డును అందుకున్నారు వి.మహేశ్. శ్రీ వెంకటేశ్వర భక్తి చానల్‌లో ప్రసారమైన 'హరి భక్తుల కథలు' సీరియల్‌కి ఆయన నిర్మాతగా, రచయితగా వ్యవహరించారు. అలాగే 'విప్ర నారాయణ'కు 2009లో ఉత్తమ టెలీ ఫిలింగా బంగారు నందితో పాటు, మరో మూడు విభాగాల్లో నంది పురస్కారాలు అందుకున్నారాయన. తన అన్నయ్య, ప్రముఖ కళా దర్శకుడు వి. వి. రాజేంద్ర కుమార్‌తో కలసి సినిమాలకు ప్రచార సామగ్రిని తయారు చేసేందుకు 'స్టూడియో రూప్ కళ' అనే సంస్థను, 'ఆదిత్య చిత్ర ' నిర్మాణ సంస్థను నెలకొల్పారు వి. మహేశ్. అయితే ఆయన వివాహం చేసుకోలేదు. వి.మహేశ్ మృతికి సినిమా, టెలివిజన్ రంగాలకు చెందిన పలువురు ప్రముఖులు సంతాపం తెలిపారు.



● హర్షివ్ కార్తీక్, శశికిరణ్

సైకలాజికల్ థ్రిల్లర్

హర్షివ్ కార్తీక్ హీరోగా నటించి, స్వీయ దర్శకత్వంలో నిర్మించిన సస్పెన్స్ అండ్ సైకలాజికల్ థ్రిల్లర్ మూవీ 'బహుముఖం'. 'గుడ్, బ్యాడ్ అండ్ ది యాక్టర్' అనేది ట్యాగ్ లైన్. ఈ చిత్రంలో స్వర్ణిమ సింగ్, మరియా మార్టినోవా హీరోయిన్లుగా నటించారు. త్వరలోనే ఈ సినిమా విడుదల కానుంది. ఈ మూవీ టీజర్ రిలీజ్ వేడుకకి అతిథిగా హాజరైన డైరెక్టర్ శశి కిరణ్ తిక్క మాట్లాడుతూ– ''బహుముఖం' టీజర్ బాగుంది. టీజర్ చూస్తుంటే విజువల్స్‌తో పాటుగా సౌండ్‌కి ప్రాధాన్యత ఇచ్చినట్లు తెలుస్తోంది. ఈ సినిమా కోసం కార్తీక్ చాలా కష్టపడ్డాడు. ఈ సినిమా కోసం ఆసక్తిగా ఎదురుచూస్తున్నా'' అన్నారు. ''అమెరికాలో చేసిన పక్కా తెలుగు సినిమా ఇది. ప్రేక్షకులకు గుర్తుండిపోవాలనే ఉద్దేశంతో ఈ చిత్రం చేశాం'' అన్నారు హర్షివ్ కార్తీక్. చిత్ర సంగీత దర్శకుడు ఫణి కళ్యాణ్, నేపథ్య సంగీతం అందించిన శ్రీ చరణ్ పాకాల మాట్లాడారు. ఈ చిత్రానికి సహ–నిర్మాత అరవింద్ రెడ్డి.



డైరెక్టర్ కుమార్ సహానీ ఇకలేరు

బాలీవుడ్ చిత్ర పరిశ్రమలో విషాదం నెలకొంది. ప్రముఖ దర్శకుడు కుమార్ సహాని (83) అనారోగ్యంతో శనివారం రాత్రి మృతి చెందారు. 1940 డిసెంబర్ 7న సింధ్‌లోని లర్కానాలో (ప్రస్తుతం పాకిస్థాన్‌లో ఉంది) జన్మించారు కుమార్ సహాని. అయితే పాక్ విభజన తర్వాత ఆయన కుటుంబం ముంబైకి వచ్చేసింది. ముంబై యూనివర్సిటీలో బీఏ గ్రాడ్యుయేట్ పట్టా పొందారు కుమార్ సహాని. ఆ తర్వాత పూణే ఫిల్మ్ అండ్ టెలివిజన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఇండియా (ఎఫ్‌టీఐఐ)లో డైరెక్షన్ కోర్స్ చేశారు. ఆ తర్వాత విదేశాల్లో కొన్ని సినిమాలకు సహాయకునిగా పనిచేసిన తర్వాత దర్శకుడిగా మారారాయన. 1972లో 'మాయా దర్పన్', 1984లో 'తరంగ్', 1989లో 'ఖయల్ గాథ', 1990లో 'కస్బా' లాంటి హిట్ సినిమాలు తీశారు కుమార్ సహాని. 'మాయా దర్పణ్' మూవీ జాతీయ ఉత్తమ చలన చిత్రంగా అవార్డు సొంతం చేసుకుంది. కేవలం దర్శకుడిగానే కాకుండా మంచి విద్యావేత్తగా, రచయితగా, నిర్మాతగా తనదైన ముద్ర వేశారాయన. కుమార్ సహానీ మృతిపై పలువురు బాలీవుడ్ చిత్ర ప్రముఖులు సంతాపం తెలిపారు.



● కోన వెంకట్, అంజలి, శ్రీ విష్ణు


ఆమెను చూస్తే గర్వంగా ఉంది

– శ్రీ విష్ణు

''అంజలిగారి కెరీర్‌లో 'గీతాంజలి మళ్లీ వచ్చింది' 50వ సినిమా. ఓ తెలుగమ్మాయి ఇన్ని సినిమాలు చేసి, విజయం సాధించడం గర్వంగా ఉంది. అంజలిగారు వందకుపైగా సినిమాలు చేయాలి. మార్చి 22న 'గీతాంజలి మళ్లీ వచ్చింది' సినిమాతో పాటు నా మూవీ 'ఓం భీం బుష్' కూడా విడుదలవుతోంది. ఈ రెండు చిత్రాలు విజయం సాధించాలి'' అని హీరో శ్రీ విష్ణు అన్నారు. హీరోయిన్ అంజలి టైటిల్ రోల్‌లో నటించిన చిత్రం 'గీతాంజలి మళ్లీ వచ్చింది'. 2014లో వచ్చిన 'గీతాంజలి' సినిమాకు ఈ చిత్రం సీక్వెల్. శివ తుర్లపాటి దర్శకత్వంలో కోన ఫిల్మ్స్ కార్పొరేషన్, ఎంవీవీ సినిమాస్‌పై కోన వెంకట్ నిర్మించిన ఈ చిత్రం మార్చి 22న విడుదలకానుంది. ఈ సినిమా టీజర్ లాంచ్ ఈవెంట్‌కు హీరో శ్రీ విష్ణు, దర్శకులు గోపీచంద్ మలినేని, బాబీ, బుచ్చిబాబు సన అతిథులుగా హాజరయ్యారు. అంజలి మాట్లాడుతూ – ''గీతాంజలి మళ్లీ వచ్చింది' నా కెరీర్‌లో ఓ ప్రత్యేకమైన చిత్రంగా నిలుస్తుంది. యాభై సినిమాలు చేయడం నాకు సంతోషాన్నిస్తోంది'' అన్నారు అంజలి. ''ఈ సినిమాలోని ప్రతి పాత్ర ప్రేక్షకులకు కనెక్ట్ అవుతుంది'' అన్నారు కోన వెంకట్. ''ఓ మంచి చిత్రానికి దర్శకత్వం వహించాననే సంతృప్తి కలిగింది'' అన్నారు శివ తుర్లపాటి. నటులు అలీ, 'సత్యం' రాజేష్, శ్రీనివాస రెడ్డి మాట్లాడారు.

సత్యమేవ జయతే

సాక్షి


'గ్రామం ప్రగతిపథంలో ఉంటే ఎవ్వరూ ముఠా కక్షల జోలికి వెళ్లరు'

WWW.SAKSHI.COM

పేజీలు: 14+4 వెల: ₹ 5.50

సంపుటి: 16 సంచిక: 336

సోమవారం 26-2-2024

SIMULTANEOUSLY PRINTED AT VIJAYAWADA | CHENNAI | DELHI | BANGALORE | HYDERABAD | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VISAKHAPATNAM | WARANGAL

సాక్షి
సోమవారం
26-2-2024

స్పోర్ట్స్



గుడ్‌ఫెలో క్లాసిక్ స్క్వాష్ టోర్నీ విజేత అభయ్

భారత స్టార్ ప్లేయర్ అభయ్ సింగ్ తన కెరీర్‌లో ఎనిమిదో ప్రొఫెషనల్ స్క్వాష్ అసోసియేషన్ (పీఎస్ఏ) సింగిల్స్ టైటిల్‌ను సాధించాడు. కెనడాలోని టొరంటోలో జరిగిన గుడ్‌ఫెలో క్లాసిక్ టోర్నీలో అభయ్ సింగ్ విజేతగా నిలిచాడు. 40 నిమిషాలపాటు జరిగిన ఫైనల్లో 25 ఏళ్ల అభయ్ 11–7, 11–9, 11–9తో మోరిస్ డేవ్‌రెడ్ (వేల్స్)పై విజయం సాధించాడు. ఈ ఏడాది అభయ్‌కిది రెండో టైటిల్. గత నెలలో ముంబైలో జరిగిన జేఎస్‌డబ్ల్యూ విల్లింగ్డన్ టోర్నీలోనూ అభయ్ టైటిల్ గెలిచాడు.

హసరంగపై రెండు మ్యాచ్‌ల నిషేధం

శ్రీలంక టి20 క్రికెట్ జట్టు కెప్టెన్ హసరంగపై అంతర్జాతీయ క్రికెట్ మండలి రెండు మ్యాచ్‌ల నిషేధంతోపాటు మ్యాచ్ ఫీజులో 50 శాతం కోత విధించింది. అఫ్గానిస్తాన్‌తో జరిగిన మూడో టి20 మ్యాచ్ సందర్భంగా అంపైర్ హనిబాల్‌ను హసరంగ దూషించాడు. చివరి ఓవర్లో అఫ్గాన్ బౌలర్ వఫాదార్ వేసిన ఫుల్‌టాస్ బంతి కచ్చితంగా నోబాల్ అని... ఏది నోబాలో గుర్తించలేని స్థితిలో ఉన్న అంపైర్ వేరే ఉద్యోగం చేసుకోవాలని హసరంగ వ్యాఖ్యానించాడు.



సుహాస్‌కు స్వర్ణం



పట్టాయ: పారా బ్యాడ్మింటన్ ప్రపంచ చాంపియన్‌షిప్‌లో భారత షట్లర్లు మూడు స్వర్ణాలు, నాలుగు రజతాలు, 11 కాంస్యాలతో కలిపి మొత్తం 18 పతకాలతో అదరగొట్టారు. పురుషుల సింగిల్స్‌లో ఎస్ఎల్-4 విభాగంలో ఐఏఎస్ అధికారి సుహాస్ యతిరాజ్... ఎస్ఎల్-3 విభాగంలో ప్రమోద్ భగత్... ఎస్‌హెచ్-6 విభాగంలో కృష్ణ నాగర్ పసిడి పతకాలు సొంతం చేసుకొని ప్రపంచ చాంపియన్స్‌గా అవతరించారు. ఫైనల్స్‌లో సుహాస్ 21–18, 21–18తో ఫ్రెడీ సెతియవాన్ (ఇండోనేసియా)పై, ప్రమోద్ 14–21, 21–15, 21–14తో డేనియల్ బెథెల్ (ఇంగ్లండ్)పై, కృష్ణ నాగర్ 22–20, 22–20తో లిన్ నైలీ (చైనా)పై గెలుపొంది విజేతలుగా నిలిచారు.

విజయంతో ముగింపు



రూర్కెలా: పురుషుల ప్రొ హాకీ లీగ్ భారత అంచె పోటీలను టీమిండియా విజయంతో ముగించింది. ఆదివారం జరిగిన మ్యాచ్‌లో హర్మన్‌ప్రీత్ సింగ్ నాయకత్వంలోని భారత జట్టు 4–0 గోల్స్ తేడాతో ఐర్లాండ్‌ను ఓడించింది. భారత్ తరఫున నీలకంఠ శర్మ (14వ ని.లో), ఆకాశ్‌దీప్ సింగ్ (15వ ని.లో), గుర్జంత్ సింగ్ (38వ ని.లో), జుగ్‌రాజ్ సింగ్ (60వ ని.లో) ఒక్కో గోల్ చేశారు. తొమ్మిది జట్లు పోటీపడుతున్న ఈ లీగ్‌లో భారత జట్టు 15 పాయింట్లతో మూడో స్థానంలో ఉంది.

శ్రీనిధి డెక్కన్ ఎఫ్‌సీ గెలుపు



సాక్షి, హైదరాబాద్: ఐ–లీగ్ జాతీయ ఫుట్‌బాల్ టోర్నీలో హైదరాబాద్‌కు చెందిన శ్రీనిధి డెక్కన్ ఫుట్‌బాల్ క్లబ్ (ఎఫ్‌సీ) పదో విజయం నమోదు చేసింది. ఆదివారం జరిగిన మ్యాచ్‌లో శ్రీనిధి డెక్కన్ జట్టు 2–0 గోల్స్ తేడాతో నామ్‌ధారి ఎఫ్‌సీ జట్టును ఓడించింది. శ్రీనిధి జట్టు తరఫున రిల్వాన్ హసన్ (18వ, 57వ ని.లో) రెండు గోల్స్ సాధించాడు.

సొంతమా... సమమా!

భారత లక్ష్యం 192
- ప్రస్తుతం 40/0
- రసవత్తర ముగింపునకు రాంచీ టెస్టు
- టీమిండియాను ఆదుకున్న ధ్రువ్ జురెల్
- అశ్విన్, కుల్దీప్ మాయాజాలం



జో రూట్‌ను అవుట్ చేశాక అశ్విన్ సంబరం

అశ్విన్

అటో...ఇటో... కాదు! స్పిన్ ఎటు తిప్పుతుందో ఎవరికీ తెలియదు. దీంతో రాంచీ టెస్టు రసవత్తర ముగింపునకు చేరుకుంది. మూడో రోజు ఆటలో 13 వికెట్లు రాలితే... ఇందులో 12 స్పిన్ వలలోనే చిక్కాయి. ఈ నేపథ్యంలో భారత్ ముందు ఊరించే 192 పరుగుల లక్ష్యం ఉన్నప్పటికీ... ఇంకా 152 పరుగుల దూరం స్పిన్ టర్న్ దృష్ట్యా భారత్‌కు అంత సులభం కాదు. భారత బ్యాటర్లు స్పిన్‌కు నిలబడితే సిరీస్ 3-1తో మన సొంతమవుతుంది. ఇంగ్లండ్ స్పిన్నర్లు 10 వికెట్లు తీస్తే మాత్రం సిరీస్ 2-2తో సమమవుతుంది.



జురెల్

రాంచీ: మూడో రోజు పూర్తిగా స్పిన్ మలుపు తీసుకున్న నాలుగో టెస్టులో భారత్ పైచేయి సాధించింది. తొలి ఇన్నింగ్స్ ఆధిక్యం కోల్పోయిన టీమిండియా... ప్రత్యర్థి రెండో ఇన్నింగ్స్‌ను 150 పరుగుల్లోపే కూల్చేసింది. ఈ మ్యాచ్ గెలిచేందుకు, సిరీస్ చేజిక్కించుకొనేందుకు 192 పరుగుల లక్ష్యంతో బరిలోకి దిగిన ఆట ముగిసే సమయానికి భారత్ రెండో ఇన్నింగ్స్‌లో వికెట్ కోల్పోకుండా 40 పరుగులు చేసింది. రోహిత్ (24 బ్యాటింగ్), యశస్వి (16 బ్యాటింగ్) క్రీజులో ఉన్నారు. విజయానికి భారత్ 152 పరుగుల దూరంలో ఉంది.

మూడో రోజు ఆట సాగిందిలా...

ఓవర్‌నైట్ స్కోరు 219/7తో ఆదివారం తొలి ఇన్నింగ్స్‌ను కొనసాగించిన భారత్ 103.2 ఓవర్లలో 307 పరుగుల వద్ద ఆలౌటైంది. ధ్రువ్ జురెల్ (149 బంతుల్లో 90; 6 ఫోర్లు, 4 సిక్స్) అద్భుతమైన పోరాటం చేశాడు. ఓవర్‌నైట్ సహచరుడు కుల్దీప్ (131 బంతుల్లో 28; 2 ఫోర్లు)తో ఎనిమిదో వికెట్‌కు 76 పరుగులు జోడించిన జురెల్ తొలి అర్ధసెంచరీ సాధించాడు. వెంటనే జురెల్ సెల్యూట్ చేసి మాజీ సైనికుడు, కార్గిల్ యుద్ధంలో పాల్గొన్న తన నాన్నకు ఈ అర్ధ సెంచరీ అంకితమిచ్చాడు. 253 స్కోరు వద్ద కుల్దీప్ అవుటైనా... అప్పుడే జట్టు ఆలౌట్ కాలేదు. ఆకాశ్‌దీప్ (9)తో తొమ్మిదో వికెట్‌కు 40 పరుగులు జతచేసి జట్టు స్కోరు 300 దాటాకే జురెల్ అవుటయ్యాడు. మూడో రోజు భారత్ 88 పరుగులు చేస్తే అందులో 68 పరుగులు జురెలే సాధించి టాప్‌స్కోరర్‌గా నిలిచాడు.

ఇంగ్లండ్ కూలిందిలా...

తొలి ఇన్నింగ్స్‌లో 46 పరుగులు ఆధిక్యం పొందిన ఇంగ్లండ్ లంచ్ తర్వాత రెండో ఇన్నింగ్స్‌ను ప్రారంభించింది. అయితే తొలి ఓవర్ నుంచే కెప్టెన్ రోహిత్ ఇంగ్లండ్ మెడకు అశ్విన్‌తో స్పిన్ ఉచ్చు బిగించాడు. ఇది ఐదో ఓవర్ నుంచి ఫలితాల్ని ఇవ్వడంతో ఇంగ్లండ్ కుదేలైంది. ఐదో ఓవర్లో అశ్విన్ ఓపెనర్ డకెట్ (15), పోప్ (0)లను వరుస బంతుల్లో పెవిలియన్ చేర్చాడు. మరో ఓపెనర్ క్రాలీ (91 బంతుల్లో 60; 7 ఫోర్లు) అశ్విన్, జడేజా, కుల్దీప్‌ల స్పిన్ త్రయానికి కాసేపు ఎదురునిలిచాడు. కానీ ఈ లోపే రూట్ (11)ను అశ్విన్, అర్ధ శతకం తర్వాత క్రాలీ, స్టోక్స్ (4) వికెట్లను కుల్దీప్ పడేశాడు. జడేజా కూడా బెయిర్ స్టో (30)ను అవుట్ చేయడం ద్వారా 120/6 స్కోరు వద్ద ఇంగ్లండ్ బ్యాటింగ్ బలగమంతా పెవిలియన్‌లో కూర్చుంది. మిగిలిన టెయిలెండర్లలో హార్ట్‌లీ (7), రాబిన్సన్ (0)లను కుల్దీప్ వెనక్కి పంపగా, అండర్సన్ (0)ను అవుట్ చేసిన అశ్విన్ ఇంగ్లండ్ రెండో ఇన్నింగ్స్‌కు 145 పరుగుల వద్ద తెరదించాడు. ఇంగ్లండ్ రెండో ఇన్నింగ్స్‌లో మొత్తం 10 వికెట్లు భారత స్పిన్నర్లకే (అశ్విన్ 5/51; కుల్దీప్ 4/22; జడేజా 1/56) దక్కడం విశేషం.

స్కోరు వివరాలు

ఇంగ్లండ్ తొలి ఇన్నింగ్స్: 353; భారత్ తొలి ఇన్నింగ్స్: 307; ఇంగ్లండ్ రెండో ఇన్నింగ్స్: క్రాలీ (బి) కుల్దీప్ 60; డకెట్ 15; పోప్ (ఎల్బీడబ్ల్యూ) (బి) అశ్విన్ 0; రూట్ (ఎల్బీడబ్ల్యూ) (బి) అశ్విన్ 11; బెయిర్‌స్టో (సి) పటిదార్ (బి) జడేజా 30; స్టోక్స్ (బి) కుల్దీప్ 4; ఫోక్స్ (సి అండ్ బి) అశ్విన్ 17; హార్ట్‌లీ (సి) సర్ఫరాజ్ (బి) కుల్దీప్ 7; రాబిన్సన్ (ఎల్బీడబ్ల్యూ) (బి) కుల్దీప్ 0; బషీర్ (నాటౌట్) 1; అండర్సన్ (సి) జురెల్ (బి) అశ్విన్ 0; **ఎక్స్‌ట్రాలు** 0; **మొత్తం (53.5 ఓవర్లలో ఆలౌట్) 145. వికెట్ల పతనం:** 1-19, 2-19, 3-65, 4-110, 5-120, 6-120, 7-133, 8-133, 9-145, 10-145. **బౌలింగ్:** అశ్విన్ 15.5-0-51-5, జడేజా 20-5-56-1, సిరాజ్ 3-0-16-0, కుల్దీప్ 15-2-22-4. **భారత్ రెండో ఇన్నింగ్స్:** రోహిత్ శర్మ (బ్యాటింగ్) 24; యశస్వి (బ్యాటింగ్) 16; **మొత్తం (8 ఓవర్లలో వికెట్ నష్టపోకుండా) 40. బౌలింగ్:** రూట్ 4-0-17-0, హార్ట్‌లీ 3-0-22-0, బషీర్ 1-0-1-0.

ధీరజ్ ధమాకా

ఆసియా కప్ ఆర్చరీ టోర్నీలో మూడు స్వర్ణాలు సొంతం



బాగ్దాద్ (ఇరాక్): ఆసియా కప్ ఆర్చరీ తొలి అంచె టోర్నమెంట్‌లో భారత్‌కు ప్రాతినిధ్యం వహించిన ఆంధ్రప్రదేశ్ క్రీడాకారుడు బొమ్మదేవర ధీరజ్ మూడు స్వర్ణ పతకాలు సొంతం చేసుకున్నాడు. ఆదివారం ముగిసిన ఈ టోర్నీలో విజయవాడకు చెందిన ధీరజ్ పురుషుల రికర్వ్ వ్యక్తిగత విభాగంలో, టీమ్ విభాగంలో, మిక్స్‌డ్ టీమ్ విభాగంలో విజేతగా నిలిచాడు. వ్యక్తిగత విభాగం ఫైనల్లో ధీరజ్ 7–3తో భారత్‌కే చెందిన తరుణ్‌దీప్ రాయ్‌ను ఓడించాడు. టీమ్ విభాగం ఫైనల్లో ధీరజ్, తరుణ్‌దీప్ రాయ్, ప్రవీణ్ జాధవ్‌లతో కూడిన భారత జట్టు 6–2తో ఇస్లామ్, రూబెల్, అలీఫ్‌లతో కూడిన బంగ్లాదేశ్ జట్టుపై గెలిచింది. మిక్స్‌డ్ టీమ్ ఈవెంట్ ఫైనల్లో ధీరజ్–సిమ్రన్ జోడీ 6–0తో దియా–ఇస్లామ్ జంట (బంగ్లాదేశ్)పై నెగ్గింది. ఇండియన్ ఆర్మీలో హవల్దార్‌గా విధులు నిర్వహిస్తున్న ధీరజ్ విజయవాడలోని ఓల్గా ఆర్చరీ అకాడమీలో ఓనమాలు నేర్చుకున్నాడు. గత ఏడాది థాయ్‌లాండ్‌లో జరిగిన ఆసియా ఒలింపిక్ క్వాలిఫయింగ్ టోర్నీలో ధీరజ్ రజత పతకం సాధించి పారిస్ ఒలింపిక్స్‌కు అర్హత పొందాడు.

75 పరుగులు చేస్తే సెమీస్‌లోకి ఆంధ్ర

ఇండోర్: రంజీ ట్రోఫీ క్రికెట్ టోర్నీలో సెమీఫైనల్ బెర్త్‌కు ఆంధ్ర జట్టు మరో 75 పరుగుల దూరంలో ఉంది. మధ్యప్రదేశ్‌తో జరుగుతున్న క్వార్టర్ ఫైనల్లో 170 పరుగుల లక్ష్యాన్ని ఛేదించడానికి బరిలోకి దిగిన ఆంధ్ర మూడో రోజు ఆట ముగిసే సమయానికి 4 వికెట్లు కోల్పోయి 95 పరుగులు చేసింది. హనుమ విహారి (43 బ్యాటింగ్), కరణ్ షిండే (5 బ్యాటింగ్) క్రీజులో ఉన్నారు. అంతకుముందు ఓవర్‌నైట్ స్కోరు 21/0తో రెండో ఇన్నింగ్స్ కొనసాగించిన మధ్యప్రదేశ్ 40.5 ఓవర్లలో 107 పరుగులకే ఆలౌటైంది. ఆంధ్ర బౌలర్లు నితీశ్ కుమార్ రెడ్డి (4/28), శశికాంత్ (3/20), లలిత్ మోహన్ (3/20) మధ్యప్రదేశ్‌ను దెబ్బ తీశారు.



ఆసీస్ క్లీన్‌స్వీప్

ఆక్లాండ్: న్యూజిలాండ్‌తో మూడో టి20 మ్యాచ్‌లో 27 పరుగులతో నెగ్గిన ఆస్ట్రేలియా సిరీస్‌ను 3–0తో క్లీన్‌స్వీప్ చేసింది. ఆస్ట్రేలియా 10.4 ఓవర్లలో 4 వికెట్లు కోల్పోయి 118 పరుగులు చేశాక వర్షం రావడంతో ఆసీస్ ఇన్నింగ్స్‌ను ముగించారు. డక్‌వర్త్ లూయిస్ పద్ధతి ప్రకారం న్యూజిలాండ్ లక్ష్యాన్ని 10 ఓవర్లలో 126 పరుగులుగా నిర్ణయించారు. న్యూజిలాండ్ 3 వికెట్లు కోల్పోయి 98 పరుగులు చేసి ఓడిపోయింది.

ముంబై ఇండియన్స్‌కు రెండో విజయం

రాణించిన కెర్, షబ్నిమ్, హర్మన్



కెర్, షబ్నిమ్

బెంగళూరు: మహిళల ప్రీమియర్ లీగ్ (డబ్ల్యూపీఎల్–2)లో డిఫెండింగ్ చాంపియన్ ముంబై ఇండియన్స్ జట్టు వరుసగా రెండో విజయం సాధించింది. ఆదివారం జరిగిన మ్యాచ్‌లో హర్మన్‌ప్రీత్ సారథ్యంలోని ముంబై 5 వికెట్ల తేడాతో గుజరాత్ జెయింట్స్‌పై గెలుపొందింది. మొదట గుజరాత్ మహిళల జట్టు 20 ఓవర్లలో 9 వికెట్ల నష్టానికి 126 పరుగులు చేసింది. తనూజ (21 బంతుల్లో 28; 4 ఫోర్లు), కెప్టెన్, ఓపెనర్ బెత్ మూనీ (22 బంతుల్లో 24; 2 ఫోర్లు), క్యాథ్రిన్ బ్రిస్ (24 బంతుల్లో 25 నాటౌట్; 1 ఫోర్, 1 సిక్స్) మెరుగ్గా ఆడారు. ముంబై బౌలర్లు అమెలియా కెర్ (4/17), షబ్నిమ్ (3/18) ప్రత్యర్థిని దెబ్బ తీశారు. అనంతరం సులువైన లక్ష్యాన్ని ముంబై ఇండియన్స్ 18.1 ఓవర్లలో 5 వికెట్లు కోల్పోయి 129 పరుగులు చేసి గెలిచింది. ఓపెనర్లు యస్తిక భాటియా (7), హేలీ మాథ్యూస్ (7) నిరాశపరచగా... కెప్టెన్ హర్మన్‌ప్రీత్ కౌర్ (41 బంతుల్లో 46 నాటౌట్; 5 ఫోర్లు, 1 సిక్స్) అజేయంగా నిలిచి సిక్సర్‌తో మ్యాచ్‌ను ముగించింది. హర్మన్, అమెలియా కెర్ (25 బంతుల్లో 31; 3 ఫోర్లు) నాలుగో వికెట్‌కు 66 పరుగులు జోడించారు. గుజరాత్ బౌలర్లలో తనూజ 2, బ్రిస్, లి తహుహు చెరో వికెట్ తీశారు. నేడు జరిగే పోరులో ఢిల్లీ క్యాపిటల్స్‌తో యూపీ వారియర్స్ తలపడుతుంది.

భవిత

కెరీర్ కౌన్సెలింగ్
మీ సందేహాలు, సలహాలు పంపించాల్సిన
ఈ- మెయిల్ sakshieducation@gmail.com

విద్య, ఉద్యోగ సమాచారం

సింగరేణిలో 272 ఎగ్జిక్యూటివ్, నాన్ ఎగ్జిక్యూటివ్ పోస్టులు

కొత్తగూడెంలోని సింగరేణి కాలరీస్ కంపెనీ లిమిటెడ్(ఎస్‌సీసీఎల్).. ఎగ్జిక్యూటివ్, నాన్ ఎగ్జిక్యూటివ్ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

» మొత్తం పోస్టుల సంఖ్య: 272

పోస్టుల వివరాలు

» **ఎగ్జిక్యూటివ్ పోస్టులు:** మేనేజ్‌మెంట్ ట్రైనీ(మైనింగ్), ఈ2 గ్రేడ్–139, మేనేజ్‌మెంట్ ట్రైనీ(ఎఫ్ అండ్ ఎ), ఈ2 గ్రేడ్–22, మేనేజ్‌మెంట్ ట్రైనీ(పర్సనల్), ఈ2 గ్రేడ్–22, మేనేజ్‌మెంట్ ట్రైనీ(ఐఈ), ఈ2 గ్రేడ్–10, జూనియర్ ఎస్టేట్స్ ఆఫీసర్, ఈ1 గ్రేడ్–10, మేనేజ్‌మెంట్ ట్రైనీ(హైడ్రో–జియాలజిస్ట్), ఈ2 గ్రేడ్–02, మేనేజ్‌మెంట్ ట్రైనీ(సివిల్), ఈ2 గ్రేడ్–18, జూనియర్ ఫారెస్ట్ ఆఫీసర్, ఈ1 గ్రేడ్–03, జనరల్ డ్యూటీ మెడికల్ ఆఫీసర్, ఈ3 గ్రేడ్–30.
» **నాన్ ఎగ్జిక్యూటివ్ పోస్టులు:** సబ్–ఓవర్సీర్ ట్రైనీ (సివిల్), టి–ఎస్ గ్రేడ్–సి–16.
» **వయసు:** గరిష్ఠంగా 30 ఏళ్లు మించకూడదు. జీడీఎంవో పోస్టులకు 45 ఏళ్లు మించకూడదు. ఎస్సీ, ఎస్టీ, బీసీ అభ్యర్థులకు ఐదేళ్ల సడలింపు ఉంటుంది.
» **ఆన్‌లైన్ దరఖాస్తు ప్రారంభతేది:** 01.03.2024
» **ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరితేది:** 18.03.2024
» **వెబ్‌సైట్:** www.scclmines.com

తెలంగాణ ఈసెట్-2024

తెలంగాణ రాష్ట్ర ఉన్నత విద్యా మండలి(టీఎస్‌సీహెచ్‌ఈ) హైదరాబాద్‌లోని ఉస్మానియా యూనివర్సిటీ.. తెలంగాణ స్టేట్ ఇంజనీరింగ్ కామన్ ఎంట్రన్స్ టెస్ట్(టీఎస్ ఈసెట్)–2024 నోటిఫికేషన్ విడుదల చేసింది. దీని ద్వారా పాలిటెక్నిక్ డిప్లొమా, బీఎస్సీ(మ్యాథమేటిక్స్) అభ్యర్థులకు 2024–25 విద్యా సంవత్సరం బీఈ/బీటెక్/బీఫార్మసీ కోర్సుల్లో లేటరల్ ఎంట్రీ విధానంలో రెండో సంవత్సరంలో ప్రవేశాలు కల్పిస్తారు.

» **కోర్సులు:** బీఈ/బీటెక్/బీఫార్మసీ కోర్సుల్లో లేటరల్ ఎంట్రీ
» **అర్హత:** పాలిటెక్నిక్ డిప్లొమా, బీఎస్సీ(మ్యాథమేటిక్స్) ఉత్తీర్ణులై ఉండాలి.
» **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలి.
» **ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరితేది:** 16.04.2024
» **రూ.500 ఆలస్య రుసుముతో దరఖాస్తుకు చివరి తేది:** 22.04.2024.
» **రూ.1000 ఆలస్య రుసుముతో దరఖాస్తుకు చివరితేది:** 28.04.2024.
» **పరీక్ష తేది:** 06.05.2024.
» **వెబ్‌సైట్:** https://ecet.tsche.ac.in

చదువు + కొలువు

బ్యాంక్ జాబ్స్



ఇండస్ట్రియల్ డెవలప్‌మెంట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా(ఐడీబీఐ).. డిగ్రీ ఉత్తీర్ణులకు స్వాగతం పలుకుతోంది. బ్యాంకింగ్ కెరీర్‌పై ఆసక్తి ఉన్న అభ్యర్థులకు పీజీడీబీఎఫ్ కోర్సుతోపాటు జూనియర్ అసిస్టెంట్ మేనేజర్ కొలువు అందుకునే అవకాశం కల్పిస్తోంది. ఎంపికైతే ఏటా రూ. 6.5 లక్షల వరకు వార్షిక వేతనం పొందొచ్చు. ఇందుకోసం చేయాల్సిందల్లా.. ఐడీబీఐ నిర్వహించే ఎంపిక ప్రక్రియలో విజయం సాధించడమే! తాజాగా ఐడీబీఐ 500 జూనియర్ అసిస్టెంట్ మేనేజర్ పోస్టుల భర్తీకి నోటిఫికేషన్ విడుదల చేసింది. ఈ నేపథ్యంలో.. ఐడీబీఐ పోస్టులు, పీజీడీబీఎఫ్ విధానం, ఎంపిక ప్రక్రియ, ప్రిపరేషన్ తదితర వివరాలు..

» 500 పోస్టుల భర్తీకి ఐడీబీఐ నోటిఫికేషన్
» పీజీడీబీఎఫ్‌లో ప్రవేశంతో కొలువులు ఖరారు
» కోర్సు పూర్తయ్యాక బ్యాంకులో నియామకం
» ఏడాదికి రూ. 6.5 లక్షల వరకు వేతనం

మొత్తం పోస్టుల సంఖ్య 500

ఐడీబీఐ తాజా నోటిఫికేషన్ ద్వారా.. మొత్తం 500 జూనియర్ అసిస్టెంట్ మేనేజర్ పోస్టుల భర్తీకి శ్రీకారం చుట్టింది. ఓపెన్ కేటగిరీలో 203; ఈడబ్ల్యూఎస్ కేటగిరీలో 50; ఓబీసీ కేటగిరీలో 135; ఎస్సీ కేటగిరీలో 75, ఎస్టీ కేటగిరీలో 37 పోస్టులు ఉన్నాయి.

అర్హతలు

జనవరి 31, 2024 నాటికి గుర్తింపు పొందిన యూనివర్సిటీ నుంచి బ్యాచిలర్ డిగ్రీ ఉత్తీర్ణత ఉండాలి. **వయసు:** జనవరి 31, 2024 నాటికి 20 నుంచి 25 ఏళ్ల మధ్యలో ఉండాలి. ఎస్సీ/ఎస్టీ అభ్యర్థులకు అయిదేళ్లు, ఓబీసీ అభ్యర్థులకు మూడేళ్లు చొప్పున గరిష్ఠ వయో పరిమితిలో సడలింపు ఉంటుంది.

పీజీడీబీఎఫ్ పూర్తి చేసుకుంటేనే

జూనియర్ అసిస్టెంట్ మేనేజర్ పోస్టులకు నోటిఫికేషన్ విడుదల చేసిన ఐడీబీఐ.. నియామకాల ఖరారుకు వినూత్న విధానాన్ని అమలు చేస్తోంది. ఎస్ఈఐపీఎల్, మణిపాల్ గ్లోబల్ ఎడ్యుకేషన్ సర్వీసెస్ సంస్థలతో కలిసి.. ఏడాది వ్యవధిలోని పోస్ట్ గ్రాడ్యుయేట్ డిప్లొమా ఇన్ బ్యాంకింగ్ అండ్ ఫైనాన్స్(పీజీడీబీఎఫ్) కోర్సును అందిస్తోంది. జూనియర్ అసిస్టెంట్ మేనేజర్ పోస్టుల ఎంపిక ప్రక్రియలో విజేతలుగా నిలిచిన వారు ఈ కోర్సును పూర్తి చేసుకుంటేనే బ్యాంకులో కొలువు ఖరారు చేస్తారు.

పీజీడీబీఎఫ్ ఇలా

పీజీడీబీఎఫ్ కోర్సులో భాగంగా ముందుగా బ్యాంకింగ్ రంగ నైపుణ్యాలపై ఆరు నెలల పాటు క్లాస్ రూమ్ బోధన ఉంటుంది. ఆ తర్వాత రెండు నెలల ఇంటర్న్‌షిప్, మరో నాలుగు నెలలు ఐడీబీఐ శాఖల్లో ఆన్ జాబ్ ట్రెనింగ్ సదుపాయం కల్పిస్తారు. ఈ కోర్సు పూర్తి చేసుకున్న తర్వాత అభ్యర్థులకు ఐడీబీఐ శాఖల్లో అసిస్టెంట్ మేనేజర్ గ్రేడ్–ఓ స్థాయిలో నియామకం ఖరారవుతుంది. కోర్సు పూర్తి చేసుకున్న వారికి కొలువుతోపాటు పీజీడీబీఎఫ్ సర్టిఫికెట్ కూడా అందిస్తారు.

స్టయిఫండ్

ఐడీబీఐ పీజీడీబీఎఫ్ కోర్సులో చేరిన అభ్యర్థులకు స్టయిఫండ్ పేరుతో ఆర్థిక ప్రోత్సాహకాన్ని కూడా అందిస్తారు.ఏడాది వ్యవధిలోని కోర్సు సమయంలో మొదటి ఆరు నెలలు నెలకు రూ.5వేలు; ఆ తర్వాత రెండు నెలల ఇంటర్న్‌షిప్ సమయంలో నెలకు రూ.15 వేలు చొప్పున స్టయిఫండ్ అందిస్తారు.

రూ. 6.5 లక్షల వేతనం

పీజీడీబీఎఫ్ కోర్సును విజయవంతంగా పూర్తి చేసుకుని.. జూనియర్ అసిస్టెంట్ మేనేజర్ గ్రేడ్–ఓ హోదాలో కొలువు ఖరారు చేసుకున్న వారికి ప్రారంభ వార్షిక వేతనం రూ.6.14 లక్షల నుంచి రూ.6.5 లక్షల వరకు ఉంటుంది. ఈ హోదాలో మూడేళ్లు పని చేశాక బ్యాంకు నిబంధనలకు అనుగుణంగా గ్రేడ్–ఎ ఆఫీసర్లుగా పదోన్నతికి అర్హత లభిస్తుంది.

ఏడాది ప్రొబేషన్

జూనియర్ అసిస్టెంట్ మేనేజర్ గ్రేడ్–ఓ హోదాలో నియమితులైన వారికి ఏడాది పాటు ప్రొబేషనరీ పిరియడ్ విధానం అమలవుతోంది. నియామకం ఖరారు చేసుకున్న వారు బ్యాంకులో కనీసం మూడేళ్ల పాటు విధులు నిర్వర్తిస్తామని రూ. 2 లక్షల విలువైన పూచీకత్తు బాండ్ ఇవ్వాల్సి ఉంటుంది.

రెండంచెల ఎంపిక ప్రక్రియ

ఐడీబీఐ బ్యాంకులో జూనియర్ అసిస్టెంట్ మేనేజర్ గ్రేడ్–ఓ పోస్టులకు మార్గం వేసే పీజీడీబీఎఫ్ కోర్సులో ప్రవేశానికి ఎంపిక ప్రక్రియ రెండు దశల్లో నిర్వహిస్తారు.అవి..రాత పరీక్ష,పర్సనల్ ఇంటర్వ్యూ.

నాలుగు విభాగాల్లో రాత పరీక్ష

పీజీడీబీఎఫ్ కోర్సులో ప్రవేశానికి నిర్వహించే రాత పరీక్ష.. రెండు వందల మార్కులకు నాలుగు విభాగాల్లో ఉంటుంది. ఇందులో లాజికల్ రీజనింగ్, డేటా అనాలిసిస్ అండ్ ఇంటర్‌ప్రిటేషన్ 60ప్రశ్నలు–60 మార్కులు, ఇంగ్లిష్ లాంగ్వేజ్ 40 ప్రశ్నలు–40 మార్కులు, క్వాంటిటేటివ్ ఆప్టిట్యూడ్ 40 ప్రశ్నలు–40 మార్కులు, జనరల్/ఎకానమీ/బ్యాంకింగ్ అవేర్‌నెస్/కంప్యూటర్/ఐటీ 60 ప్రశ్నలు–60 మార్కులకు ఉంటాయి. పరీక్ష పూర్తిగా ఆబ్జెక్టివ్ విధానంలో ఉంటుంది. ఈ ఆన్‌లైన్ టెస్ట్‌కు కేటాయించిన సమయం రెండు గంటలు. నెగెటివ్ మార్కింగ్ నిబంధన (ప్రతి తప్పు సమాధానానికి 1/4 మార్కు)ఉంది.

చివరగా పర్సనల్ ఇంటర్వ్యూ

రాత పరీక్షలో చూపిన ప్రతిభ ఆధారంగా అందుబాటులో ఉన్న పోస్టులు, రిజర్వేషన్లను పరిగణనలోకి తీసుకుని మెరిట్ జాబితా రూపొందిస్తారు. ఈ జాబితాలో నిలిచిన వారికి చివరగా 100 మార్కులకు పర్సనల్ ఇంటర్వ్యూ నిర్వహిస్తారు.

వెయిటేజీ విధానం

పీజీడీబీఎఫ్‌కు ఎంపిక చేసేందుకు... తుది జాబితా రూపకల్పనలో వెయిటేజీ విధానాన్ని అమలు చేస్తారు. రాత పరీక్షకు 75 మార్కులు; పర్సనల్ ఇంటర్వ్యూకు 25 మార్కులు చొప్పున వెయిటేజీని నిర్ధారించారు. అభ్యర్థులు పొందిన మార్కులను ఈ వెయిటేజీలకు అనుగుణంగా క్రోడీకరించి.. తుది జాబితా విడుదల చేస్తారు.

రాత పరీక్షలో రాణించేలా

- లాజికల్ రీజనింగ్, డేటా అనాలిసిస్ అండ్ డేటా ఇంటర్‌ప్రిటేషన్‌కు సంబంధించి డైరక్షన్స్, డిస్టెన్స్, అనాలజీ, బ్లడ్ రిలేషన్స్, సిరీస్, డబుల్ లైనప్, డయాగ్రమ్స్, ఫ్లో చార్ట్‌లను ప్రాక్టీస్ చేయాలి.
- ఇంగ్లిష్‌కు సంబంధించి గ్రామర్ అంశాలపై పూర్తి అవగాహన ఏర్పరచుకోవాలి. ముఖ్యంగా వొకాబ్యులరీ, కాంప్రహెన్షన్‌లపై పట్టు సాధించాలి. అదే విధంగా సింపుల్, కాంప్లెక్స్, కాంపౌండ్ సెంటెన్స్‌లను ప్రాక్టీస్ చేయాలి.
- క్వాంటిటేటివ్ ఆప్టిట్యూడ్‌కు సంబంధించి మ్యాథమెటిక్స్‌లోని కోర్ అంశాలతోపాటు అర్థమెటిక్ అంశాలు (నిష్పత్తులు, శాతాలు, టైం అండ్ డిస్టెన్స్, టైం అండ్ వర్క్, యావరేజెస్, స్క్వేర్ రూట్స్, క్యూబ్ రూట్స్, కూడికలు, హెచ్చవేతలు తదితర)పై దృష్టి పెట్టాలి.
- నాలుగో విభాగంలోని జనరల్ అవేర్‌నెస్‌కు సంబంధించి కరెంట్ అఫైర్స్‌పై పట్టు సాధించాలి. ఎకానమీ విషయంలో ఇటీవల కాలంలో ఆర్థిక రంగంలో చోటు చేసుకుంటున్న పరిణామాలు తెలుసుకోవాలి. బ్యాంకింగ్ అవేర్‌నెస్ విషయంలో బ్యాంకింగ్ వ్యవస్థ స్వరూపంతోపాటు తాజా పరిణామాలు, బ్యాంకింగ్ టెర్మినాలజీపై అవగాహన ఏర్పరచుకోవాలి. కంప్యూటర్/ఐటీ అవేర్‌నెస్ విషయంలో అభ్యర్థులు కంప్యూటర్ ఆపరేషన్ టూల్స్‌పై పట్టు సాధించాలి.

ముఖ్య సమాచారం

- దరఖాస్తు విధానం: ఆన్‌లైన్ ద్వారా.
- ఆన్‌లైన్ దరఖాస్తు చివరి తేదీ:2024, ఫిబ్రవరి 26
- ఆన్‌లైన్ టెస్ట్ తేదీ: 2024, మార్చి 17
- పూర్తి వివరాలకు వెబ్‌సైట్: https://www.idbibank.in/idbibankcareerscurrentopenings.aspx

---

తీరరక్షక దళంలో నావిక్ ఉద్యోగాలు

కోస్ట్‌గార్డ్ జాబ్స్

కేంద్ర రక్షణశాఖ పరిధిలోని భారత తీరరక్షక దళం పలు పోస్టుల భర్తీకి ప్రకటన విడుదల చేసింది. దీనిద్వారా 260 నావిక్ (జనరల్ డ్యూటీ) పోస్టులను భర్తీ చేయనుంది.ఇంటర్ విద్యార్హతతో ఈ పోస్టులకు దరఖాస్తు చేసుకోవచ్చు. ఎంపికైతే ప్రారంభంలోనే నెలకు రూ.40వేల వరకూ వేతనం అందుకోవచ్చు.

- మొత్తం పోస్టులు: 260 (ఈస్ట్ జోన్ 33)

» 260 నావిక్ పోస్టులకు ప్రకటన విడుదల
» ఇంటర్‌తోనే దరఖాస్తుకు అవకాశం

అర్హతలు

మ్యాథ్స్, ఫిజిక్స్ సబ్జెక్టులతో ఇంటర్ ఉత్తీర్ణులు ఈ పోస్టులకు దరఖాస్తు చేసుకోవచ్చు. నిర్దిష్ట శారీరక ప్రమాణాలు ఉండాలి. **వయసు:**18–22ఏళ్లలోపు ఉండాలి. ఎస్సీ,ఎస్టీలకు ఐదేళ్లు;ఓబీసీలకు మూడేళ్లు గరిష్ఠ వయసులో సడలింపు లభిస్తుంది.ఈ పోస్టులకు పురుషులు మాత్రమే దరఖాస్తు చేసుకోవాలి.

వేతనాలు

ఈ ఉద్యోగంలో చేరిన వారికి లెవల్–3 ప్రకారం–రూ.21,700 మూలవేతనంగా లభిస్తుంది. దీంతో పాటు డీఏ, హెచ్‌ఆర్ఏ, ప్రోత్సహకాలు అదనం. అన్నీ కలిపి ఈపోస్టుల్లో చేరిన వారికి నెలకు రూ.40 వేల వరకు వేతనంగా పొందే అవకాశం ఉంటుంది. ఈ పోస్టులకు ఎంపికైన వారు నావిక్ నుంచి ప్రధాన నావిక్, అధికారి, ఉత్తమ అధికారి, ప్రధాన అధికారి (లెవల్–8) హోదా వరకు చేరుకోవచ్చు.

ఎంపిక ఇలా

స్టేజ్1, స్టేజ్ 2, స్టేజ్ 3, స్టేజ్ 4 పరీక్షలు, వైద్య పరీక్షలు, ధ్రువపత్రాల పరిశీలన ద్వారా ఎంపిక చేపడతారు. ఎంపికైన వారికి శిక్షణ ఇచ్చి.. అనంతరం ఉద్యోగంలోకి తీసుకుంటారు.

స్టేజ్ 1 రాత పరీక్ష

- స్టేజ్ 1న పరీక్షను ఆన్‌లైన్ విధానంలో నిర్వహిస్తారు. రెండు సెక్షన్‌ల నుంచి ప్రశ్నలు అడుగుతారు. నెగిటివ్ మార్కులు లేవు.
- సెక్షన్–1: ఈ విభాగంలో ప్రశ్నలు పదోతరగతి స్థాయిలోనే అడుగుతారు. మొత్తం 60 మార్కులకు–60 ప్రశ్నలు ఉంటాయి. ఇందులో మ్యాథ్స్–20, సైన్స్–10, ఇంగ్లిష్–15, రీజనింగ్–10, జీకేల నుంచి 5 ప్రశ్నలుంటాయి. పరీక్ష వ్యవధి 45 నిమిషాలు ఉంటుంది.
- సెక్షన్–2: ఈ విభాగంలో 50 మార్కులుంటాయి. 50 ప్రశ్నలు వస్తాయి. వ్యవధి 30 నిమిషాలు. ఇంటర్మీడియట్ సిలబస్ నుంచి మ్యాథ్స్,ఫిజిక్స్ ఒక్కో సబ్జెక్టులో 25చొప్పున ప్రశ్నలు అడుగుతారు.
- ప్రతి సెక్షన్‌లోనూ కనీస మార్కులు సాధించడం తప్పనిసరి. జనరల్ అభ్యర్థులు సెక్షన్–1లో 30, సెక్షన్–2లో 20 చొప్పున మార్కులు పొందాలి. ఎస్సీ, ఎస్టీలకు..సెక్షన్–1లో 27, సెక్షన్–2లో 17 చొప్పున మార్కులు వస్తే అర్హులుగా పరిగణిస్తారు. ఇలా అర్హత సాధించిన వారి జాబితా నుంచి మెరిట్, రిజర్వేషన్ల ప్రకారం ఖాళీలకు అనుగుణంగా స్టేజ్–2కు ఎంపిక చేస్తారు.

స్టేజ్-2 అర్హత పరీక్ష మాత్రమే

ఈ పరీక్షలను ఒకటి లేదా రెండు రోజుల వ్యవధితో నిర్వహిస్తారు. ఇందులో అసెస్‌మెంట్/అడాప్టబిలిటీ టెస్ట్, ఫిజికల్ ఫిట్‌నెస్ టెస్ట్, డాక్యుమెంట్ వెరిఫికేషన్, రిక్రూట్‌మెంట్ మెడికల్ ఎగ్జామినేషన్ ఉంటాయి. వీటిల్లో అర్హత సాధిస్తే సరిపోతుంది. మార్కులు ఉండవు. ఇందులో భాగంగా నిర్వహించే పరీక్షలో సమాధానాలు ఓఎంఆర్‌షీట్‌పై గుర్తించాలి. పరీక్ష జరిగిన గంట తర్వాత ఫలితాలు ప్రకటిస్తారు. ఇందులో అర్హత సాధించినవారికే తర్వాతి దశకు పంపిస్తారు.

- **స్టేజ్–3:** మొదటి రెండు దశల్లో (స్టేజ్–1,2)ప్రతిభను పరిగణలోకి తీసుకొని స్టేజ్–3కి ఎంపిక చేస్తారు. అంటే స్టేజ్–2లో అర్హత సాధించిన వారిని స్టేజ్–1 మెరిట్‌తో స్టేజ్–3కి ఎంపిక చేస్తారు. వీరికి ఐఎన్ఎస్ చిల్కాలో మెడికల్ పరీక్షలను నిర్వహించి అర్హులైన వారిని స్టేజ్–4 ఎంపిక చేస్తారు.
- **స్టేజ్–4:** ఈ దశలో భాగంగా అభ్యర్థుల ఒరిజనల్ సర్టిఫికేట్స్ మరోమారు పరిశీలించి అన్ని సరిగా ఉంటే ట్రెనింగ్‌లోకి తీసుకుంటారు.

స్టేజ్–1 పరీక్షలను ఏప్రిల్, స్టేజ్–2 పరీక్షలను మేలో,స్టేజ్–3 పరీక్షలను అక్టోబర్‌లో నిర్వహిస్తారు.

శిక్షణ ఇలా

ఈ పోస్టులకు ఎంపికైన వారికి సెప్టెంబర్‌లో బేసిక్ ట్రెనింగ్ ఐఎన్ఎస్ చిల్కాలో ప్రారంభమవుతుంది. ఈ ట్రెనింగ్ వ్యవధి 16 వారాలు ఉంటుంది. ఆ తర్వాత వీరికి సముద్రంలో 6నెలల నుంచి రెండున్నర ఏళ్ల వరకు శిక్షణ ఇస్తారు. శిక్షణను విజయవంతంగా పూర్తిచేసుకున్నవారిని ఉద్యోగంలోకి తీసుకుంటారు.

ముఖ్యసమాచారం

- దరఖాస్తు విధానం: ఆన్‌లైన్ ద్వారా.
- దరఖాస్తులకు చివరి తేదీ: ఫిబ్రవరి 27 , 2023
- వెబ్‌సైట్: https://joinindiancoastguard.cdac.in

సత్యమేవ జయతే

సాక్షి

WWW.SAKSHI.COM

పేజీలు: 14+4 వెల: ₹ 5.50

సంపుటి: 16 సంచిక: 336

సోమవారం 26-2-2024

SIMULTANEOUSLY PRINTED AT VIJAYAWADA | CHENNAI | DELHI | BANGALORE | HYDERABAD | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VISAKHAPATNAM | WARANGAL



'జల ప్రాజెక్టులపై జనం ఎన్నెన్నో ఆశలు పెట్టుకున్నారు. వాళ్ల నమ్మకం వమ్ము కాకుండా పనిచేయాలి'




సొంతమా.. సమమా!

4వ టెస్టులో ఇంగ్లండ్‌పై భారత్ పైచేయి.. విజయ లక్ష్యం 192 పరుగులు - IVలో



మీకు మీరే బాస్..!

మీరూ ఓ యూట్యూబర్.. వీక్షకులకు నచ్చితే చక్కని ఆదాయం - IVలో



సముద్ర గర్భంలో పూజలు

సముద్రంలో మునిగిపోయిన శ్రీకృష్ణుడి ద్వారకా నగరాన్ని ప్రధాని మోదీ దర్శించుకొని.. సముద్ర గర్భంలో పూజలు చేశారు.

వివరాలు 6లో ▸



ఉక్రెయిన్‌లో భారతీయుడు మృతి

ఉక్రెయిన్‌లో జరిగిన డ్రోన్ దాడిలో సూరత్‌కు చెందిన హెమిల్ అశ్విన్‌భాయి మంగూకియా అనే యువకుడు మరణించినట్లు సమాచారం.

వివరాలు 6లో ▸



స్వరాష్ట్రంలో నిక్కీ హేలీ ఓటమి

సౌత్ కరోలినాలో జరిగిన రిపబ్లికన్ పార్టీ ప్రైమరీలో భారత సంతతికి చెందిన అధ్యక్ష అభ్యర్థి నిక్కీ హేలీ ట్రంప్ చేతిలో ఓడారు.

వివరాలు 6లో ▸



ఛత్తీస్‌గఢ్‌లో ఎదురుకాల్పులు

ఛత్తీస్‌గఢ్‌లోని కాంకేర్ జిల్లాలో జరిగిన ఎదురుకాల్పుల్లో ముగ్గురు మావోయిస్టులు మృతి చెందారని పోలీసులు తెలిపారు.

వివరాలు 6లో ▸



ప్రశాంతంగా గ్రూప్-2 ప్రిలిమ్స్

8లో

1,327 సెంటర్లలో పరీక్ష నిర్వహణ

ఏపీపీఎస్సీ చరిత్రలోనే అత్యధికంగా 87.17 శాతం మంది హాజరు

జూన్/జులైల్లో మెయిన్ పరీక్షలు

ఫ్యాక్ట్‌చెక్

స్థిరాస్తులకు రక్షణ కల్పించినా ఏడుపేనా?

సామాన్యులకు న్యాయం చేస్తే తట్టుకోలేకపోతున్న రామోజీ

మేలు చేసే ల్యాండ్ టైట్లింగ్ చట్టంపైనా అడ్డగోలు రాతలు


ఫిలిం సిటీ కోసం వేల ఎకరాలు దోచుకున్న ఘనత రాజగురువుదే...

అలాంటి వ్యక్తి ప్రజలకు మేలు చేసే చట్టంపై బురద జల్లడమా హవ్వ!

1లో



జాని.. జాని.. ఎస్.. పాపా!



చంద్రబాబు ఎన్ని సీట్లిచ్చినా, ఏ సీట్లిచ్చినా పవన్ జీ హుజూర్

జనసేన జుట్టును పూర్తిగా చేతిలోకి తీసుకున్న టీడీపీ

గత ఎన్నికల్లో పవన్ పార్టీకి ఎక్కువ ఓట్లు వచ్చిన సీట్లూ టీడీపీకే.. అప్పట్లో జనసేనకు అరకొర ఓట్లు వచ్చిన సీట్లే ఇప్పుడు ఆ పార్టీకి

2019 ఎన్నికల్లో 15 స్థానాల్లో జనసేనకు 30 వేలకు పైగా ఓట్లు

వాటిలో ఒకే ఒక్కటి ఇప్పుడు జనసేనకు... పి.గన్నవరం వంటి సీట్లూ హుళక్కే

విజయవాడలోనూ జనసేన స్థావరాల్లోకి టీడీపీ చొరబాటు.. ఇక్కడ జనసేనకు ఎక్కువ ఓట్లు వచ్చిన రెండు సీట్లూ టీడీపీకే

పవన్ కళ్యాణ్ తీరుపై రగిలిపోతున్న పార్టీ వర్గాలు.. ఇలాగైతే ఓట్ ట్రాన్స్‌ఫర్ సాధ్యం కాదని బాహాటంగానే వ్యాఖ్యలు

గాలికి ఎగిరిపోయే పేలాలు కృష్ణార్పణం..!
బలహీన స్థానాలు జనసేన పరం..!
పొత్తుల పేరుతో జనసేన స్థావరాల్లోకి చొరబాట్లు!
ఇదీ చంద్రబాబు రాజకీయ నీతి!

1లో

గత ఎన్నికల్లో జనసేన కాస్తో కూస్తో ఓట్లు తెచ్చుకున్న స్థానాలను పొత్తుల పేరుతో కబళిస్తూ ఆ పార్టీ చేతులెత్తేసిన సీట్లను మాత్రం చంద్రబాబు బలవంతంగా అంటగట్టేసి చేతులు దులుపుకొంటున్నారు. పొత్తుల పేరుతో నామమాత్రంగా 24 అసెంబ్లీ సీట్లు, 3 ఎంపీ స్థానాలను జనసేనకు కేటాయించిన చంద్రబాబు అందులోనూ తన కుటిల రాజకీయాన్ని ప్రదర్శించారు. గత ఎన్నికల్లో విడివిడిగా పోటీ చేసినప్పుడు జనసేన తమకన్నా అధికంగా ఓట్లు తెచ్చుకున్న సీట్లను కూడా ఈ సారి ఆ పార్టీకి కేటాయించలేదు. అంటే... చంద్రబాబు కోరుకుంటున్నదేంటి? మిత్రపక్షంగా జనసేన గెలుపునా? లేక కేవలం జనసేనతో పొత్తువల్ల తమకు వచ్చే ఓట్లనా? సందేహం లేదు.. ఆ రెండోదే!. మరి ఇన్ని జరుగుతున్నా... ఇలాగైతే జనసేన ఓట్లు టీడీపీకి బదిలీ కావటం సాధ్యం కాదంటూ పార్టీ శ్రేణులు బాహాటంగానే వ్యాఖ్యానిస్తున్నా పవన్ మాత్రం నోరు మెదపటం లేదెందుకు? బాబు ఏం చేసినా ఊ.. కొడుతున్నారెందుకు? మరోసారి ఆయన్ను నమ్మి జనసేన శ్రేణులు దెబ్బతినాల్సిందేనా?

కుప్పానికి 'కృష్ణా' జలాలు

ఆ నియోజకవర్గ ప్రజలకిచ్చిన మాటను నిలబెట్టుకున్న సీఎం జగన్

- యుద్ధప్రాతిపదికన బ్రాంచ్ కెనాల్ పూర్తి
- డిసెంబర్ 18న మూడు దశల్లో కృష్ణా జలాల ఎత్తిపోతల ప్రారంభం
- ఇప్పటికే నియోజకవర్గానికి చేరుకున్న జలాలు
- నేడు చెరువులకు నీరు విడుదలచేసి కుప్పం బ్రాంచ్ కెనాల్‌ను జాతికి అంకితం చేయనున్న ముఖ్యమంత్రి.. గత 57 నెలలుగా కుప్పం సమగ్రాభివృద్ధికి సర్కారు చర్యలు
- ముఖ్యమంత్రిని ప్రశంసిస్తున్న కుప్పం ప్రజలు
- కుప్పం బ్రాంచ్ కెనాల్ పేరుతో దండుకున్న చంద్రబాబు



సీఎం జగన్ చేతుల మీదుగా నీటి విడుదలకు రామకుప్పం మండలంలో సిద్ధమైన కెనాల్

1లో

దిగ్గజ సంస్థ ఐటీసీ భారీ పెట్టుబడులు

రూ.140 కోట్లతో గుంటూరులో వెల్‌కమ్ పేరుతో తొలి ఫైవ్‌స్టార్ హోటల్



- పల్నాడు జిల్లాలో రూ.200 కోట్లతో గ్లోబల్ స్పైసెస్ పార్క్‌కు శ్రీకారం.. ఏటా 20,000 టన్నుల సుగంధ ద్రవ్యాలు ప్రాసెస్ చేసే సామర్థ్యం
- వీటితోపాటు రాష్ట్ర సామాజిక ఆర్థిక కార్యక్రమాల్లో భాగస్వామ్యం.. ఆతిథ్యం నుంచి ఆహారం వరకు వివిధ రంగాల్లో పెట్టుబడులు
- వైఎస్సార్ చేయూత వంటి పథకాల ద్వారా మహిళా సాధికారతలో కీలక అడుగులు

2లో



కుప్పానికి 'కృష్ణా' జలాలు

కుప్పం నియోజకవర్గ ప్రజలకిచ్చిన మాటను నిలబెట్టుకున్న సీఎం జగన్

- కుప్పం బ్రాంచ్ కెనాల్ పేరుతో దండుకున్న చంద్రబాబు
- అధికంగా రూ.30 కోట్లు బిల్లులు చెల్లించినా పూర్తికాని పనులు
- చంద్రబాబు వెన్నుపోటు పొడిచారంటూ మండిపడుతున్న అక్కడి ప్రజలు
- పాలార్ రిజర్వాయర్‌కూ బాబు అడ్డంకులు
- రూ.214.81 కోట్లతో ఈ రిజర్వాయర్ నిర్మాణానికి సీఎం జగన్ గ్రీన్‌సిగ్నల్
- రూ.535 కోట్లతో యామిగానిపల్లి, మాదనపల్లి రిజర్వాయర్లకూ పరిపాలనా అనుమతులు


సభాస్థలిలో ఏర్పాట్లను మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డికి వివరిస్తున్న కలెక్టర్

సాక్షి, అమరావతి : కుప్పం నియోజకవర్గ ప్రజలకు 2022, సెప్టెంబరు 23న ఇచ్చిన మాటను ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నిలబెట్టుకున్నారు. హంద్రీ–నీవా సుజల స్రవంతి పథకంలో అంతర్భాగమైన కుప్పం బ్రాంచ్ కెనాల్‌ను యుద్ధప్రాతిపదికన పూర్తిచేశారు. శ్రీశైలం ప్రాజెక్టు నుంచి హంద్రీ–నీవా కాలువల మీదుగా కుప్పం బ్రాంచ్ కెనాల్ ద్వారా ఇప్పటికే కృష్ణా జలాలు కుప్పం నియోజకవర్గంలోని రామకుప్పం మండలానికి చేరుకున్నాయి. కృష్ణమ్మ స్పర్శతో దుర్భిక్ష కుప్పం పరవశించిపోతోంది. కుప్పం బ్రాంచ్ కెనాల్‌లో 68.466 కిమీ వద్ద క్రాస్ రెగ్యులేటర్ (రామకుప్పం మండలం రాజుపాలెం వద్ద) నుంచి మద్దికుంటచెరువు (2.91 ఎంసీఎఫ్‌టీ), నాగసముద్రం చెరువు (0.25 ఎంసీఎఫ్‌టీ), మనేంద్రం చెరువు (13.78 ఎంసీఎఫ్‌టీ), తొట్లచెరువు (33.02 ఎంసీఎఫ్‌టీ)లకు సోమవారం సీఎం జగన్ కృష్ణాజలాలను విడుదల చేసి, జాతికి అంకితం చేయనున్నారు. ఆ తర్వాత మిగతా 106 చెరువులకు కృష్ణాజలాలను విడుదల చేసి.. కుప్పం, పలమనేరు నియోజకవర్గాల్లో 6,300 ఎకరాల ఆయకట్టుకు సాగునీరు, 4.02 లక్షల మందికి తాగునీరు అందించనున్నారు. ఇచ్చిన మాటను నిలబెట్టుకున్న సీఎం జగన్ తమకు సాగు, తాగునీటి సమస్యను శాశ్వతంగా పరిష్కరించారని ఆ నియోజకవర్గ ప్రజలు హర్షం వ్యక్తంచేస్తున్నారు. గత 57 నెలలుగా నియోజకవర్గ సమగ్రాభివృద్ధి కోసం ముఖ్యమంత్రి చిత్తశుద్ధితో పనిచేస్తున్నారనడానికి కుప్పం బ్రాంచ్ కెనాల్ పూర్తే తార్కాణమని ప్రశంసిస్తున్నారు.

అంచనాల్లోనే బాబు వంచన..

జలయజ్ఞంలో భాగంగా మహానేత వైఎస్ రాజశేఖరరెడ్డి చేపట్టిన హంద్రీ–నీవా సుజల స్రవంతి పథకంలో అంతర్భాగంగా కుప్పం బ్రాంచ్ కెనాల్‌ను చేపట్టి.. సాగు, తాగునీరు అందిస్తానని కుప్పం ప్రజలకు 2015లో అప్పటి సీఎం చంద్రబాబు నమ్మబలికారు. హంద్రీ–నీవాలో అంతర్భాగమైన పుంగనూరు బ్రాంచ్ కెనాల్‌లో చిత్తూరు జిల్లా పెద్దపంజాణి మండలం అప్పినపల్లి (207.8 కిమీ వద్ద) నుంచి రోజుకు 216 క్యూసెక్కులను మూడు దశల్లో ఎత్తిపోసి.. 123.641 కిమీల పొడవున తవ్వే కాలువ ద్వారా తరలించి, 110 చెరువులను నింపడం ద్వారా కుప్పం, పలమనేరు నియోజకవర్గాల్లో 6,300 ఎకరాల ఆయకట్టుకు సాగునీరు, 4.02 లక్షల మందికి తాగునీరు అందిస్తామని ప్రకటించారు. రాజకీయ భిక్ష పెట్టిన పురిటిగడ్డకు నీళ్లందించే పథకంలోనూ చంద్రబాబు దోపిడీకి తెరతీశారు. కుప్పం బ్రాంచ్ కెనాల్‌ను 123.641 కిమీల పొడవున తవ్వేందుకు మట్టి, కాంక్రీట్ పనులకు రూ.203.11 కోట్లు వ్యయం అవుతుంది. మూడు పంప్‌హౌస్‌ల నిర్మాణం, మోటార్లు, ప్రెజర్‌మైన్లు, విద్యుత్ సరఫరా ఏర్పాటుకు రూ.90 కోట్ల వ్యయం అవుతుంది. ఈ లెక్కన 2015–16 ధరల ప్రకారం ఈ పనుల విలువ రూ.293.11 కోట్లు. ఆ మేరకు జలవనరుల శాఖ అధికారులు 2015, మేలో అంచనాలు రూపొందించారు. కానీ.. చంద్రబాబు ఒత్తిడితో పనుల అంచనా వ్యయాన్ని రూ.413 కోట్లకు పెంచేశారు. అంటే.. టెండర్ల దశలోనే రూ.120 కోట్లు పెంచేసినట్లు స్పష్టమవుతోంది.

బినామీతో కలిసి యథేచ్ఛగా దోపిడీ..

ఇక కుప్పం బ్రాంచ్ కెనాల్ పనులను అప్పటి కడపజిల్లా టీడీపీ అధ్యక్షుడు ఆర్. శ్రీనివాసరెడ్డికి చెందిన ఆర్కే ఇన్‌ఫ్రాకు కట్టబెట్టి ఆ రూ.120 కోట్లు కాజేయడానికి చంద్రబాబు స్కెచ్‌వేసి 2015, ఆగస్టులో టెండర్లు పిలిచారు. ఆర్కే ఇన్‌ఫ్రా సంస్థకే పనులు దక్కేలా టెండర్లలో నిబంధనలు రూపొందించారు. దాంతో టెండర్లలో ఆ సంస్థ ఒక్కటే నాలుగు శాతం అధిక (ఎక్సెస్) ధరకు కోట్‌చేస్తూ షెడ్యూలు దాఖలు చేసింది. నిబంధనల ప్రకారం సింగిల్ బిడ్ దాఖలైతే ఆ టెండర్‌ను రద్దుచేయాలి. కానీ.. చంద్రబాబు ఒత్తిడి మేరకు ఆ టెండర్‌ను ఆమోదించి రూ.430.26 కోట్ల పనులను ఆర్కే ఇన్‌ఫ్రాకు కట్టబెట్టారు. మొబిలైజేషన్ అడ్వాన్సుల కింద ఆర్కే ఇన్‌ఫ్రాకు రూ.43 కోట్లు ఇచ్చేలా చక్రం తిప్పిన చంద్రబాబు.. వాటిని ఎవరి జేబులో వేసుకున్నారన్నది బహిరంగ రహస్యమే. ఇక ఈ పనులను శ్రీనివాసరెడ్డికి కట్టబెట్టడంపై చంద్రబాబు బినామీ సీఎం రమేష్ అలకబూనారు. దీంతో50 శాతం పనులను సీఎం రమేష్‌కు చెందిన రిత్విక్ ప్రాజెక్ట్స్‌కు సబ్ కాంట్రాక్టు కింద అప్పగించారు. కానీ.. ఆ తర్వాత శ్రీనివాసరెడ్డిని వెళ్లగొట్టి మొత్తం పనులను సీఎం రమేష్‌కు చంద్రబాబు కట్టబెట్టారు. కానీ, రమేష్ మట్టి తవ్వకం పనులను సబ్ కాంట్రాక్టర్లకు ఇచ్చేసి భారీగా లబ్ధి పొందారు. దోచేసిన సొమ్ములో చంద్రబాబుకు ఎప్పటికప్పుడు వాటాలు పంపారని అప్పట్లో టీడీపీ వర్గాలే కోడై కూశాయి.

చెప్పారంటే చేస్తాడంతే..

వరుసగా ఏడుసార్లు గెలిపించిన కుప్పం నియోజకవర్గాన్ని చంద్రబాబు అడ్డగోలుగా దోచేసి అభివృద్ధికి ఆమడదూరంలో నిలిపారు. కానీ, వైఎస్ జగన్ సీఎం అయ్యాక ఈ నియోజకవర్గంపై ప్రత్యేక శ్రద్ధ పెట్టారు. కుప్పంను మున్సిపాలిటీని చేయడంతోపాటు దీని కేంద్రంగా రెవెన్యూ డివిజన్‌ను, పోలీసు సబ్ డివిజన్‌ను ఏర్పాటుచేశారు. రూ.66 కోట్లతో రోడ్లు, తాగునీరు వంటి మౌలిక సదుపాయాలను అభివృద్ధి చేశారు. ఈ నేపథ్యంలో.. 2022, సెప్టెంబరు 23న కుప్పంలో సీఎం జగన్ పర్యటించారు. కుప్పం బ్రాంచ్ కెనాల్‌ను పూర్తిచేసి.. కృష్ణా జలాలను అందించి సుభిక్షం చేస్తానని హామీ ఇచ్చారు. చెప్పినట్లుగానే ఆ పనులను 2023, డిసెంబరు 15 నాటికే పూర్తిచేయించారు. పుంగనూరు బ్రాంచ్ కెనాల్ నుంచి మూడు దశల్లో కుప్పం బ్రాంచ్ కెనాల్‌కు కృష్ణా జలాలను ఎత్తిపోయడం 2023, డిసెంబర్ 18న ప్రారంభించారు.

పాలార్ రిజర్వాయర్‌కు శ్రీకారం..

కుప్పం నియోజకవర్గాన్ని సుభిక్షం చేయడమే లక్ష్యంగా కుప్పం మండలం గణేశ్వరపురం వద్ద పాలార్ నదిపై 0.6 టీఎంసీల సామర్థ్యంతో రిజర్వాయర్ నిర్మాణానికి సీఎం వైఎస్ జగన్ శ్రీకారం చుట్టారు. రూ.214.81 కోట్లతో పాలార్ రిజర్వాయర్ పనులు చేపట్టేందుకు శుక్రవారం పరిపాలనా అనుమతినిస్తూ జీఓ జారీచేశారు. ఇందులో రిజర్వాయర్ నిర్మాణానికి సర్వే, డీపీఆర్ తయారీకి రూ.0.432 కోట్లు.. ముంపునకు గురయ్యే 90 ఎకరాల భూసేకరణకు, 258 నిర్వాసిత కుటుంబాలకు పునరావాసం కల్పించడానికి, 357.06 ఎకరాల అటవీ భూమికి పరిహారం చెల్లించడానికి రూ.47.878 కోట్లు కేటాయించారు. దీంతోపాటు.. కుప్పం బ్రాంచ్ కెనాల్‌లో అంతర్భాగంగా గుడిపల్లి మండలం యామిగానిపల్లి వద్ద 0.710 టీఎంసీల సామర్థ్యంతో ఓ రిజర్వాయర్ నిర్మించి 2,500 ఎకరాలకు నీళ్లందించడం.. శాంతిపురం మండలం మాదనపల్లి వద్ద 0.354 టీఎంసీల సామర్థ్యంతో రిజర్వాయర్ నిర్మించి 2,500 ఎకరాలకు నీళ్లందించే పనులు చేపట్టడానికి రూ.535.435 కోట్లతో పరిపాలనా అనుమతి ఇచ్చారు. ఇందుకు సంబంధించిన జీఓ–100ను ఆదివారం రాత్రి జారీచేశారు. వాస్తవానికి.. పాలార్ రిజర్వాయర్‌కూ చంద్రబాబు అడుగడుగునా అడ్డంకులు సృష్టించారు. ఇది పూర్తయితే కుప్పంలో తనకు రాజకీయంగా ఉనికిలేకుండా పోతుందని ఆందోళనతో ఆయన తమిళనాడు సర్కారును ఉసిగొల్పి సుప్రీంకోర్టులో కేసులూ వేయించారు.

కుప్పం నీటి కష్టాలకు శాశ్వత పరిష్కారం : పెద్దిరెడ్డి

శాంతిపురం (చిత్తూరు జిల్లా) : కుప్పం ప్రాంతంలో నీటి సమస్యకు శాశ్వత పరిష్కారం చూపేందుకు సీఎం వైఎస్ జగన్మోహన్‌రెడ్డి ప్రాధాన్యత ఇస్తున్నారని మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి తెలిపారు. ముఖ్యమంత్రి కుప్పం పర్యటన ఏర్పాట్లను మంత్రి ఆదివారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడుతూ.. ఇచ్చిన మాట ప్రకారం ముఖ్యమంత్రి కుప్పం కాలువ పనులను పూర్తిచేసి, సోమవారం నీటిని విడుదల చేయనున్నట్లు తెలిపారు. పాలారు ప్రాజెక్టు నిర్మాణానికి కూడా శంకుస్థాపన చేస్తారన్నారు. వీటితో కుప్పం ప్రజలకు తాగు, సాగునీటి కష్టాలు లేకుండా చూడాలన్నదే సీఎం ఉద్దేశమన్నారు. ఎంపీ రెడ్డెప్ప, కలెక్టర్ షన్మోహన్, ఎమ్మెల్సీ భరత్, సీఎం ప్రోగ్రామ్స్ కోఆర్డినేటర్, ఎమ్మెల్సీ తలశిల రఘురాంలతో కలిసి మంత్రి సీఎం పర్యటన ఏర్పాట్లను పరిశీలించారు. సభకు వచ్చే రైతులు, ప్రజలకు ఇబ్బందిలేకుండా చూడాలని అధికారులను ఆదేశించారు.

రూ.30 కోట్లు అధికంగా చెల్లింపు..

ఇక ఈ పనుల్లో సీఎం రమేష్ సంస్థకు రూ.460.88 కోట్లను 2019, ఏప్రిల్ నాటికి చంద్రబాబు ప్రభుత్వం బిల్లుల రూపంలో చెల్లించింది. అంటే.. కాంట్రాక్టు విలువ కంటే రూ.30 కోట్లు ఎక్కువగా చెల్లించినా పనులు పూర్తి కాలేదు. రూ.99.41 కోట్ల విలువైన పనులు మిగిలిపోయాయి. పనుల్లో నాసిరకమైన పైపులు వేయడం వల్ల వర్షపు నీటికి ఆ పైపులు పగిలిపోయాయి.

స్థిరాస్తులకు రక్షణ కల్పించినా ఏడుపేనా?

సామాన్యులకు న్యాయం చేస్తే తట్టుకోలేకపోతున్న రామోజీ

- మేలు చేసే లాండ్ టైట్లింగ్ చట్టంపైనా అడ్డగోలు రాతలు
- ప్రభుత్వంపై దుష్ప్రచారం చేసేందుకే ఈనాడులో వికృత కథనాలు
- ఫిలిం సిటీ కోసం వేల ఎకరాలు దోచుకున్న ఘనత రాజగురువుదే...
- అలాంటి వ్యక్తి ప్రజలకు మేలు చేసే చట్టంపై బురద జల్లడమా హవ్వ!
- వివాదాలు లేని భూ రికార్డుల వ్యవస్థ తీసుకురావడమే ఈ చట్టం లక్ష్యం
- ఒక చట్టం ద్వారా ప్రజల భూములను లాగేసుకోవడం ఎలా సాధ్యం?
- చంద్రబాబు మెప్పు కోసం అదేపనిగా అబద్ధాల ప్రచారం

సామాన్యులకు మంచి జరిగితే తట్టుకోలేకపోతున్నారు. భూ యాజమాన్య హక్కులపై పటిష్ట చట్టం తీసుకొస్తే దానిపై దుష్ప్రచారం చేస్తున్నారు. వివాదాలు లేని భూ రికార్డుల వ్యవస్థ తీసుకొద్దామంటే అడ్డం పడుతున్నారు. దానిపై రెచ్చగొట్టేలా అబద్ధాల కథనాలు అచ్చేస్తున్నారు. ఇదీ రామోజీ సారథ్యంలో నడుస్తున్న ఈనాడు పనితీరు. అసలు హైదరాబాద్‌లో ఫిల్మ్‌సిటీకోసం వేలాది ఎకరాలు ఆక్రమించేసిన రామోజీ ఈ రాష్ట్రంలో పేదలకు న్యాయం చేసేందుకు ప్రభుత్వం కంకణం కట్టుకుంటే దానివల్ల తీరని నష్టమంటూ దెయ్యాలు వేదాలు వల్లించినట్టు గగ్గోలు పెడుతున్నారు. కనీసం నలుగురు నవ్విపోతారన్న ఇంకితం కూడా లేకుండా 'కోర్టులకూ కత్తెర... భూ హక్కులకు పాతర' అంటూ ఓ వికృత కథనాన్ని వండి వార్చారు.

సాక్షి, అమరావతి

హైదరాబాద్‌లో ఫిల్మ్‌సిటీ పేరిట వందల ఎకరాల పేదల భూములను లాక్కున్న రామోజీరావు ఏపీలో భూ హక్కుల గురించి మొసలి కన్నీరు కారుస్తున్నారు. విశాఖ, విజయవాడలోనూ ఈనాడు కార్యాలయాల కోసం అత్యంత విలువైన భూములను లీజు పేరుతో కబ్జా చేసిన ఆయన భూ మాఫియా డాన్‌లకు ఏమాత్రం తీసిపోరు. అలాంటి వ్యక్తి ఏపీలో ప్రజల స్థిరాస్తులకు రక్షణ కల్పించే ల్యాండ్ టైట్లింగ్ చట్టంపై అడ్డగోలుగా వక్రీకరించి ప్రజలను భయాందోళనలకు గురి చేస్తున్నారు. ఈ చట్టం ద్వారా ప్రజలకు ఎక్కడ మేలు జరుగుతుందోనన్న భయంతో అభూతకల్పనలతో దుష్ప్రచారానికి దిగారు. ఒకవైపు ఈ చట్టాన్ని మేధావులు, భూ చట్టాల నిపుణులు ప్రశంసిస్తుంటే దీనివల్ల ఏదో నష్టం జరిగిపోతోందంటూ అబద్ధాలతో ప్రజలను తప్పుదారి పట్టిస్తున్నారు.

అన్నీ అభూత కల్పనలే...

ఈ చట్టం ద్వారా కోర్టులకు కత్తెర పడుతోందని, అధికారులకే హక్కుల నిర్ణయాధికారం ఉంటుందనేది పచ్చి అబద్ధం. కోర్టుల పరిధి, నియంత్రణ ఎప్పటిలానే ఉంటుంది. రికార్డ్ ఆఫ్ టైటిల్స్‌లో నమోదైన వివరాలు, కోర్టు అప్పీళ్లు, రివిజన్ పిటిషన్లు ఉంటే వాటి గురించి టీఆర్ఓ(టైటిల్ రిజిస్ట్రేషన్ అధికారి)కి తెలపాల్సి వుంటుంది. ఏదైనా భూమికి సంబంధించి వివాదం ఏర్పడితే ఆ వివరాలను టీఆర్ఓకి తెలిపితే ఆ వివరాలను రిజిస్టర్‌లో నమోదు చేస్తారు. కోర్టుల్లో పరిష్కారమయ్యాకే తుది వివరాలను అందులో పొందుపరుస్తారు. అంటే భూ యజమానులకు కచ్చితమైన టైటిల్ ఇవ్వడం, దానిపై ప్రభుత్వమే గ్యారంటీ ఇస్తుండడం హక్కులకు పాతర వేయడం ఎలా అవుతుందో రామోజీకే తెలియాలి. తుది నివేదిక మీ భూమి పోర్టల్‌లోనూ ప్రజలకు అందుబాటులో ఉంచుతున్నప్పుడు భూ హక్కులకు ఎందుకు ప్రమాదం ఉంటుందనేది ఎవరికైనా అర్థమవుతుంది. వివాదాలు లేని భూ రికార్డుల వ్యవస్థను తీసుకురావడమే లక్ష్యంగా దేశంలోనే మొట్టమొదటిసారిగా ఏపీ ప్రభుత్వం తీసుకొచ్చిన ఈ చట్టంపై ఈనాడు వక్రీకరిస్తోంది.


కోర్టులకూ కత్తెర
భూహక్కులకు పాత



రీ సర్వే తర్వాతే హక్కుల నిర్ధారణ..

ప్రస్తుతం ఉన్న ప్రజెంటివ్ టైటిల్ విధానంలో భూమి ఆధీనంలో ఉన్నా రెవెన్యూ రికార్డుల్లో పేరు నమోదవకపోతే సంబంధిత యజమానికి ఇబ్బంది ఎదురవుతుంది. రీ సర్వేలో భూములపై ఉన్న వాస్తవ పరిస్థితిని సర్వే చేసి, వాటిని రెవెన్యూ రికార్డుల్లో అప్‌డేట్ చేస్తున్నారు. ఆ తర్వాతే భూ యజమానుల హక్కులను నోటిఫై చేస్తారు. దానిపై రెండేళ్ల వరకు ఎలాంటి వివాదాలు రాకపోతే అప్పుడు ఆ భూమిపై వారికి పూర్తి హక్కు ఇస్తారు. ఆ హక్కుకు ప్రభుత్వమే గ్యారంటీ ఇస్తుంది. దీనివల్ల స్థిరాస్తులకు ఎసరు పెట్టడం ఎలా అవుతుందో రామోజీకే తెలియాలి.

- టీడీపీ హయాంలో వెబ్‌ల్యాండ్‌లో వివరాలు తప్పుగా నమోదు చేయడం వల్ల లక్షలాది ఎకరాలు ఆంక్షల జాబితాలో చేరిపోయాయి. వాటిని నిషేధిత జాబితా నుంచి తొలగించడానికి ఆ భూముల యజమానులు ఇప్పుడు అష్టకష్టాలు పడుతున్నారు. అలాంటి తప్పులు ఈ విధానం ద్వారా తొలగించేందుకు అవకాశం ఉంటుంది.
- ప్రస్తుతం భూములపై రికార్డుల పరంగా కచ్చితమైన హక్కులు లేకపోవడం వల్ల దశాబ్దాలుగా ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. దీనిని ఆసరాగా చేసుకుని భూకబ్జాదారులు మోసాలకు తెగబడుతున్నారు. భూమిపై ఒకలా, రికార్డుల్లో మరోలా హద్దులు ఉండడంతో భూ వివాదాలు ఏర్పడుతున్నాయి. టైట్లింగ్ చట్టం ప్రకారం రీ సర్వే చేస్తే జియో కోఆర్డినేట్స్ ద్వారా హక్కులు నిర్ధారించవచ్చు.

ప్రజలను భయభ్రాంతులను చేసేందుకే...

రీసర్వేలో అందరి సమక్షంలోనే ప్రతి భూ కమతం వివరాలు కొత్త టెక్నాలజీతో సర్వే చేసి, వారి దగ్గరున్న పత్రాలను పరిశీలించి కొత్త రిజిస్టర్‌లో నమోదు చేస్తారు. ప్రస్తుతం ఉన్న అనేక రకాల రికార్డుల స్థానంలో ఇకపై ఈ ఒక్క రిజిస్టర్ ఉంటే సరిపోతుంది. అంతవరకు ఉన్న రికార్డులు కూడా చెల్లుబాటవుతాయి. కానీ వాటి అవసరం ఉండదు. ఒకవేళ అన్ని పత్రాలున్నా రికార్డుల్లో నమోదవకపోతే అప్పిలేట్ అథారిటీని సంప్రదించే అవకాశం ఉంటుంది. కానీ దీనిపై భయభ్రాంతులకు గురిచేసేలా అడ్డగోలుగా ఈనాడులో అచ్చేశారు.

- ఒకసారి భూ హక్కు ఖరారయ్యాక రెండేళ్లలో అభ్యంతరాలు ఏమీ రాకుంటే అదే ఫైనల్ అవుతుంది. దీన్ని వక్రీకరించడం అన్యాయం. రీ సర్వేలో అభ్యంతరాలు లేని భూములు, వివాదాలున్న భూములు, వివిధ కోర్టు కేసుల్లో ఉన్న భూములు, తాకట్టు పెట్టిన భూములు సవివరంగా నమోదవుతాయి. ఎలాంటి వివాదాలు లేని భూములను రిజిస్టర్ ఆఫ్ టైటిల్‌లో ఎక్కిస్తారు. ఆ తర్వాత కూడా ఎవరైనా అభ్యంతరాలు వ్యక్తం చేస్తే కోర్టు ఉత్తర్వులను పరిగణనలోకి తీసుకుని దానిపై నిర్ణయం తీసుకుంటారు.

తప్పుడు ప్రచారంతో పైశాచికానందం

- ఒక భూమితో సంబంధంలేని వ్యక్తి కేవలం వివాదం సృష్టించాలనే ఉద్దేశంతో సివిల్ కోర్టులో కేసు వేస్తే యజమాని కోర్టుల చుట్టూ తిరిగాల్సి వస్తుంది. కొత్త చట్టంలో ఇలాంటి సమస్యలపై సివిల్ ప్రొసీజర్ కోడ్ ప్రకారం కాకుండా సహజ న్యాయ సూత్రాల ప్రకారం సంబంధిత రైతులు, సమీప రైతులు, గ్రామ పెద్దలందరి సమక్షంలో విచారణ నిర్వహించి వివాదాన్ని పరిష్కరించుకోవచ్చు. అయినా సమస్య పరిష్కారం కాకపోతే హైకోర్టును ఆశ్రయించే అవకాశం ఉంటుంది. అయితే సివిల్ కోర్టుల అధికారాన్ని లాక్కుందనేది ఈనాడు తప్పుడు ప్రచారం.
- కోర్టు ఉత్తర్వులు వెంటనే తెలిస్తేనే రికార్డులు పారదర్శకంగా అప్‌డేట్ చేయడానికి అవకాశం ఉంటుంది. పాత వివరాలే రికార్డుల్లో ఉంటే కోర్టు తీర్పు ద్వారా ఎలా న్యాయం జరుగుతుంది. న్యాయబద్ధంగా రికార్డులు ఉండడాలని కోరుకోవడం కోర్టు ఆదేశాలను సత్వరం పాటించకపోవడం కాదు కదా..
- అప్పిలేట్ విధానంలో హైకోర్టు లేదా సుప్రీంకోర్టును ఆశ్రయించే పూర్తి స్వేచ్ఛ ఉంటుంది. తుది రికార్డు తయారయ్యే వరకూ ఏ స్థాయి కోర్టుల్లో వివాదాలున్నా వాటిని కోర్టు పరిధిలో ఉన్న భూమిగానే చూపుతారు. కోర్టుల తుది ఉత్తర్వుల ప్రకారమే రికార్డుల్లో పొందుపరుస్తారు. న్యాయ వ్యవస్థలకు ముకుతాడు వేసేలా ఈ చట్టం ఉందనడం ఈనాడు వక్రబుద్ధికి నిదర్శనం.


అధికారులపైనా ఈనాడు చిన్నచూపు

- బ్రిటీష్ కాలం నుంచి భూపరిపాలనా వ్యవస్థ అధికారుల చేతుల్లోనే ఉంది. ల్యాండ్ సీలింగ్, ఎస్టేట్ ఇనాం, అసైన్‌మెంట్, సర్వే, హద్దుల చట్టం, ఆర్ఓఆర్ వంటి చట్టాలన్నీ ప్రభుత్వంలోని అధికారులు చేసినవే. ఏ ప్రభుత్వం ఉన్నా అధికారులకే భూపాలన అధికారాలు ఇచ్చారు. హక్కుల నిర్ధారణ, రికార్డుల నిర్వహణ, క్షేత్రస్థాయి పరిశీలనలో ఈ విభాగాలకు వందేళ్లకు పైగా అనుభవం ఉంది. అయితే వారికి ఎలాంటి నైపుణ్యం, అవగాహన లేదని చెప్పడం రామోజీ నీచబుద్ధికి నిదర్శనం.
- కన్‌క్లూజివ్ టైటిల్‌ని రాత్రికే రాత్రే ఇవ్వరు. రాత్రికి రాత్రే ఎవరి పేర్లూ మారిపోవు. రీ సర్వే పూర్తయ్యాక టైటిల్స్ ఇస్తారు. దీనికి రెండేళ్లు పడుతుంది. కానీ అధికార పార్టీ నేతలు రాత్రికి రాత్రి రైతుల భూములను ఇతరుల పేర్లకు మార్చేస్తారన్నది ప్రభుత్వంపై అక్కసే.
- ప్రస్తుతం మ్యుటేషన్‌కు దరఖాస్తు చేసుకుంటే అభ్యంతరాలకు 15 రోజుల సమయం ఇస్తున్నారు. కొత్త చట్టంలో రెండేళ్లు అవకాశం ఇచ్చారు. రెండేళ్ల తర్వాత కూడా ఎవరూ అభ్యంతరం చెప్పకపోతే అప్పుడు కన్‌క్లూజివ్ టైటిల్ ఇస్తారు. దీన్ని వక్రీకరించడం ఈనాడుకే చెల్లింది.
- ప్రస్తుతం 1బీ, పాస్‌పుస్తకం, అడంగల్, రిజిస్ట్రేషన్ డీడ్ వంటి అనేక పత్రాలున్నాయి. ఈ చట్టం ప్రకారం వీటన్నింటి స్థానంలో ఒకే ఒక శాశ్వత హక్కు పత్రం ఇస్తారు. రికార్డులన్నీ పూర్తిగా అప్‌డేట్ అయి ఉంటాయి. వాటిని ఎవరూ తారుమారు చేసే అవకాశం ఉండదు. ఆన్‌లైన్‌లోనే సురక్షితంగా రికార్డులు ఉంటాయి కాబట్టి వాటికి ఇబ్బంది ఉండదు. రైతుల వద్ద ఉన్న దస్తావేజులకు విలువ ఉండదనే తప్పుడు ప్రచారం తీసుకొచ్చారు.
- భూపరిపాలనా వ్యవస్థలో అధికారం, కండబలం, ధనబలం లాంటి అంశాలకు ఎట్టిపరిస్థితుల్లోనూ చోటుండకూడదనే ఉద్దేశంతోనే ఈ చట్టం తీసుకొచ్చారు. వివాదాల్లేని రీతిలో కన్‌క్లూజివ్ టైటిల్స్‌ను ఖరారు చేస్తారు. ఈ రికార్డులు ఆన్‌లైన్‌లో, ఇంటర్నెట్‌లో ప్రతి ఒక్కరు చూసే అవకాశం ఉంటుంది. ఎవరైనా ఎప్పుడైనా సరే వారి భూమిపై ఏ విధమైన మార్పు జరిగినా వెంటనే తెలుసుకునే అవకాశం ఉంటుంది. అధికారం ఉన్న వారికి, కండబలం ఉన్న వారి చేతుల్లోకి భూములు వెళ్లిపోయే ప్రమాదం ఉందన్నది రామోజీ వంకర బుద్ధికి నిదర్శనం.

వివరాల నమోదు ఎప్పటినుంచో ఉంది

- అప్పుల వివరాలు రిజిస్టర్‌లో నమోదు చేయడం అన్నది ఇప్పుడే కొత్తగా రాలేదు. వాటివల్ల ఇటు భూ యజమానులు, తాకట్టు పట్టుకున్న వారికీ ఇబ్బంది ఉండదు. దీనివల్ల ఆ ఆస్తికి సంబంధించిన వివరాలు పారదర్శకంగా ఉంటాయి.
- 30 ఏళ్లుగా కేంద్ర ప్రభుత్వం, అనేక రాష్ట్రాలు ఎంతగా ప్రయత్నించినా తీసుకురాలేని ఈ చట్టాన్ని వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం తీసుకురావడం సాహసమే. దానిని ప్రశంసించాల్సింది పోయి దుష్ప్రచారం చేయడం రామోజీ పైశాచిక చర్య.
- రెండేళ్ల సుదీర్ఘ కసరత్తు, కేంద్ర ప్రభుత్వ సూచనలు, రాష్ట్రపతి ఆమోదం తర్వాతే ఈ చట్టాన్ని రాష్ట్ర ప్రభుత్వం తీసుకువచ్చింది. రీ సర్వేలో రైతుల సమక్షంలోనే హద్దులు నిర్ధారించి రికార్డులు అప్‌డేట్ చేయడం యజమానులకే మేలు. కానీ సొంత వారి కోసం రికార్డులు సృష్టిస్తున్నారంటూ తప్పుడు ప్రచారం చేయడం దుర్మార్గం.

జానీ.. జానీ.. ఎస్.. పాపా!



సాక్షి, అమరావతి : జనసేన పార్టీ అధ్యక్షుడు పవన్‌కళ్యాణ్ 2019 ఎన్నికల్లో పోటీ చేసి ఓడిపోయిన రెండు స్థానాలతోపాటు జనసేన గెలిచిన ఏకైక సీటుతో కలిపి ఆ పార్టీ రాష్ట్రవ్యాప్తంగా 15 స్థానాల్లో 30 వేలకు పైగా ఓట్లు సాధించింది. అయితే ఇందులో ఏడు చోట్ల ఇప్పటికే టీడీపీ అభ్యర్థులను చంద్రబాబు ప్రకటించేశారు. మిగిలినవి ప్రస్తుతానికింకా ప్రకటించలేదు. ఈ 15 సీట్లలో ఒక్కటంటే ఒక్కటి... కేవలం కాకినాడ రూరల్ స్థానాన్ని మాత్రమే జనసేనకు కేటాయించారు.

- గత ఎన్నికలో జనసేనకు కేవలం 7,633 ఓట్లు మాత్రమే వచ్చిన నెలిమర్ల లాంటి బలహీన స్థానాలను పొత్తుల పేరుతో చంద్రబాబు ఆ పార్టీకి మరోసారి కేటాయించేశారు. అనకాపల్లి అసెంబ్లీ స్థానంలో గత ఎన్నికల్లో జనసేనకు 11,988 ఓట్లు వచ్చాయి. విచిత్రమేంటంటే పవన్ కళ్యాణ్ సైతం సీట్ల సంఖ్యపై గానీ, ఏఏ సీట్లు అనే విషయంలో గానీ పెద్దగా పట్టుబట్టడం లేదన్నది ఆ పార్టీలో అంతర్గతంగా జరుగుతున్న చర్చ. ఎంత సంఖ్య చెప్పినా 'ఊ' కొట్టేస్తున్నారని... నాదెండ్ల మనోహర్ ఏ జాబితా ఇస్తే ఆ జాబితాను ప్రకటించేస్తున్నారని పార్టీ వర్గాలు రగిలిపోతున్నాయి.
- గత ఎన్నికల్లో జనసేన ఏకంగా 36,259 ఓట్లు దక్కించుకున్న పి.గన్నవరం సీటుకు చంద్రబాబు ఈ దఫా టీడీపీ అభ్యర్థిని బరిలోకి దించి జనసైనికులకు షాక్ ఇచ్చారు. ఇంకా విస్మయకరమైన వాస్తవమేంటంటే జనసేనపై అసభ్యకరమైన వ్యాఖ్యలు చేస్తూ పోస్టులు పెట్టిన మహాసేన రాజేష్‌ను పి.గన్నవరం టీడీపీ అభ్యర్థిగా ప్రకటించడం. దీనిపై జనసేన నేతలు ఆగ్రహావేశాలు వ్యక్తంచేస్తున్నారు.
- మరోవైపు విజయవాడ తూర్పులో జనసేన అభ్యర్థికి 30,137 ఓట్లు, విజయవాడ సెంట్రల్‌లో జనసేనతో మిత్రపక్షంగా నాడు పోటీ చేసిన సీపీఎం అభ్యర్థికి 29,333 ఓట్లు రాగా ఈసారి ఆ రెండు స్థానాల్లోనూ చంద్రబాబు ఇప్పటికే టీడీపీ అభ్యర్థులను ప్రకటించేశారు. ఇక నగరంలో మిగిలింది విజయవాడ పశ్చిమ స్థానమే. జనసేన పట్టుబట్టి దాన్ని సాధించుకున్నా... అక్కడ మిగతా రెండు స్థానాలతో పోలిస్తే జనసేనకు గతంలో తక్కువగా 22,367 ఓట్లు మాత్రమే వచ్చాయి.
- రాజమండ్రి రూరల్‌లో గత ఎన్నికల్లో 42,685 ఓట్లు సాధించిన జనసేన అభ్యర్థి కందుల దుర్గేష్ ఈ దఫా ఉమ్మడి అభ్యర్థిగా పోటీ చేయడానికి ఆసక్తి చూపుతున్నా సిట్టింగ్ ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చయ్య చౌదరి తానూ పోటీలో ఉన్నానంటున్నారు. దుర్గేష్‌ను నిడదవోలు పంపించేందుకు పవన్‌కళ్యాణ్ ద్వారా చంద్రబాబు స్కెచ్ వేసినట్లు సమాచారం. నిడదవోలులో గత ఎన్నికల్లో జనసేనకు 23 వేల ఓట్లు మాత్రమే దక్కాయి. పవన్‌కళ్యాణ్ తర్వాత జనసేనలో చెప్పుకోదగ్గ స్థాయిలో ఓట్లు సాధించిన అభ్యర్థికి సైతం సీటు గ్యారెంటీ లేకపోవడంపై జనసైనికులు కంగు తింటున్నారు.
- తణుకు శాసనసభ నియోజకవర్గంలో గత ఎన్నికల్లో జనసేన అభ్యర్థికి 31,961 ఓట్లు వచ్చాయి. పొత్తుల పేరుతో అక్కడ ఈసారి టీడీపీ పాగా వేసింది. జనసేనకు 35,833 ఓట్లు వచ్చిన కొత్తపేట, 35,173 ఓట్లు వచ్చిన మండపేట, 33,334 ఓట్లు వచ్చిన ముమ్మడివరం, 32,984 ఓట్లు లభించిన పాలకొల్లు నియోజకవరాల్లో సైతం చంద్రబాబు ఇప్పటికే టీడీపీ అభ్యర్థులను ప్రకటించారు. తణుకు పర్యటన సందర్భంగా స్థానిక జనసేన ఇన్‌చార్జ్‌ని గెలిపించుకుందామంటూ ప్రకటనలు చేసిన పవన్‌కళ్యాణ్... పొత్తుల పేరుతో ఆ స్థానాన్ని టీడీపీకి అప్పగించడంపై జనసైనికులకు మాట పెగలటం లేదు.

సీటు లేక పాట్లు

- అసంతృప్త నేతలకు చంద్రబాబు బుజ్జగింపులు
- ఉమా, ఆలపాటి, గంటా, రమణ, పీలాతో మంతనాలు

సాక్షి, అమరావతి: సీట్ల కేటాయింపు తర్వాత టీడీపీలో అసంతృప్తి జ్వాలలు ఎగసిపడటంతో పార్టీ అధ్యక్షుడు చంద్రబాబు బుజ్జగింపుల పర్వానికి తెరతీశారు. అలక పాన్పు ఎక్కిన నేతలను పిలిచి సర్దిచెబుతున్నారు. ఆదివారం ఉండవల్లిలోని తన నివాసంలో సీనియర్ నేతలు దేవినేని ఉమామహేశ్వరరావు, ఆలపాటి రాజా, గంటా శ్రీనివాసరావు, పీలా గోవింద సత్యనారాయణ, బొడ్డు వెంకట రమణలతో విడివిడిగా చర్చలు జరిపారు.

- తొలి జాబితాలో సీటు దక్కని మాజీ మంత్రి గంటా శ్రీనివాసరావును విజయనగరం జిల్లా చీపురుపల్లి అసెంబ్లీ స్థానం నుంచి పోటీ చేయాలని చంద్రబాబు మరోసారి సూచించారు. తనను ఓడిపోయే చోటకు ఎందుకు పంపుతున్నారని గంటా ప్రశ్నించడంతో గెలుస్తావంటూ ఒప్పించేందుకు చంద్రబాబు ప్రయత్నించారు. గంటా ఇందుకు ససేమిరా అంటూ భీమిలి లేదా విశాఖ జిల్లాలో ఏదైనా సీటు ఇవ్వాలని కోరారు. జి.మాడుగుల, చోడవరం స్థానాలకు తన పేరు పరిశీలించాలని కోరినట్లు తెలిసింది.
- మైలవరం సీటు తనకే ఇవ్వాలని దేవినేని ఉమామహేశ్వరరావు కోరగా ఆ సీటు వసంత కృష్ణప్రసాద్‌కి ఇస్తున్నానని చంద్రబాబు చెప్పినట్లు తెలిసింది. ప్రత్యామ్నాయం చూస్తానని దేవినేనికి సర్దిచెప్పారు. ఆయన పేరును పెనమలూరుకు పరిశీలిస్తున్నట్లు ప్రచారం జరుగుతోంది.
- తెనాలిని జనసేనకు కేటాయించడంతో సీటు గల్లంతైన మాజీ మంత్రి ఆలపాటి రాజాతో చంద్రబాబు మంతనాలు జరిపారు. అధికారంలోకి వస్తే ఎమ్మెల్సీ పదవి ఇస్తానని ఆయన్ను బుజ్జగించినట్లు తెలిసింది. అయితే గుంటూరు జిల్లాలో ఏదైనా సీటు ఇవ్వాలని ఆయన కోరినట్లు తెలుస్తోంది.
- తూర్పు గోదావరి జిల్లా రాజానగరం సీటును ఆశిస్తున్న బొడ్డు వెంకట రమణకు భవిష్యత్తులో న్యాయం చేస్తానని చంద్రబాబు హామీ ఇచ్చినట్లు తెలిసింది. దీంతో ఆయన అసంతృప్తితో నిష్క్రమించారు.
- అనకాపల్లి సీటును జనసేనకు కేటాయించడంతో మాజీ ఎమ్మెల్యే పీలా గోవిందుకు నచ్చజెప్పేందుకు చంద్రబాబు ప్రయత్నించారు. భవిష్యత్తులో అవకాశం ఇస్తానని పేర్కొనగా గోవింద్ అసంతృప్తిగా వెళ్లిపోయినట్లు సమాచారం.

సత్యమేవ జయతే

సాక్షి


WWW.SAKSHI.COM

పేజీలు: 14+4 వెల: ₹ 5.50

సంపుటి: 16
సంచిక: 336

సోమవారం 26-2-2024

SIMULTANEOUSLY PRINTED AT VIJAYAWADA | CHENNAI | DELHI | BANGALORE | HYDERABAD | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VISAKHAPATNAM | WARANGAL




'ప్రజా ప్రతినిధులు చేయాల్సింది రెండే, ప్రజా సేవలో సమర్థతను చాటుకోవడమా! లేక తప్పుకోవడమా!'



ధీరజ్ ధమాకా..
ఆసియా ఆర్చరీ టోర్నీలో ఆంధ్రా క్రీడాకారుడికి మూడు స్వర్ణాలు - IVలో



'ముంబై'కు రెండో విజయం
మహిళల ప్రీమియర్ లీగ్‌లో గుజరాత్‌పై ఐదు వికెట్ల తేడాతో విజయం - IVలో



దేశం కోసం ఓటేయండి
తొలిసారి ఓటు హక్కు పొందినవారంతా తప్పనిసరిగా వినియోగించుకోవాలని ప్రధాని మోదీ పిలుపునిచ్చారు.
వివరాలు 6లో ▸



హౌతీలపై దాడులు
సరుకు రవాణా ఓడలు లక్ష్యంగా దాడులు చేస్తున్న యెమెన్‌లోని హౌతీలపై అమెరికా, బ్రిటన్ బలగాలు మరోసారి విరుచుకుపడ్డాయి.
వివరాలు 6లో ▸



మూడేళ్లలో మౌలిక సదుపాయాలు
పీఎం జన జాతి ఆదివాసి న్యాయ మహా అభియాన్ కింద ఏపీలో 1.23 లక్షల గిరిజన కుటుంబాలను కేంద్రం ఎంపిక చేసింది.
వివరాలు 2లో ▸



ఎంచుకున్న కేంద్రాలే కేటాయింపు
టెట్‌కు పరీక్షా కేంద్రాలను అభ్యర్థులు ఎంచుకున్న ప్రాధాన్యత క్రమంలోనే కేటాయిస్తారని పాఠశాల విద్యా శాఖ తెలిపింది.
వివరాలు 8లో ▸

న్యూస్‌రీల్

టెన్త్ పరీక్షలకు సర్వం సిద్ధం



మార్చి 18 నుంచి నిర్వహించనున్న టెన్త్ పరీక్షల కోసం రాష్ట్రవ్యాప్తంగా అన్ని వసతులతో 3,473 సెంటర్లను ప్రభుత్వం సిద్ధం చేసింది. 6,23,092 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరుకానున్నారు. కాపీయింగ్ కట్టడికి డిజిటల్ టెక్నాలజీని వినియోగించనున్నారు.
వివరాలు 8లో ▸

సంక్షేమాభివృద్ధిలో దేశానికే ఆదర్శం



సంక్షేమం, సమగ్రాభివృద్ధిలో దేశానికే ఆంధ్రప్రదేశ్ ఆదర్శంగా నిలిచిందని సీనియర్ సంపాదకులు, పాత్రికేయులు, సామాజిక విశ్లేషకులు స్పష్టం చేశారు. ఐదేళ్లలో రాష్ట్ర సంపద రూ.5.27 లక్షల కోట్లు పెరిగిందని వివరించారు. రాష్ట్ర అభివృద్ధిని ఎల్లో మీడియా కుట్రలతో దాచిపెడుతోందని మండిపడ్డారు.
వివరాలు 2లో ▸

'మార్గదర్శి' షట్టర్ క్లోజ్!



చేతులెత్తేసిన చిట్‌ఫండ్ సంస్థ

- 16 నెలలుగా నిలిచిపోయిన కొత్త చిట్టీ గ్రూపులు
- పాత చిట్టీల చెల్లింపులూ లేవు
- స్తంభించిపోయిన కోట్ల రూపాయల టర్నోవర్
- చీటీలు పాడిన వారికి సకాలంలో పాట మొత్తం చెల్లించలేక ముఖం చాటేస్తున్న మార్గదర్శి యాజమాన్యం
- ఫలితంగా చందాదారులకు రూ.4,880 కోట్లకు పైగా బకాయిలు.. ష్యూరిటీల పేరుతో కొర్రీలు
- మార్గదర్శి కార్యాలయాల చుట్టూ చందాదారుల ప్రదక్షిణాలు

గురివింద రామోజీ-5

సాక్షి, అమరావతి: అక్రమ పునాదులపై ఈనాడు రామోజీరావు నిర్మించుకున్న ఆర్థిక సామ్రాజ్యానికి చట్ట విరుద్ధంగా నిధులు అందించే కామధేనువు 'మార్గదర్శి' ఒట్టిపోయింది. చందాదారుల సొమ్మును నిబంధనలకు విరుద్ధంగా ఆయన తమ సొంత పెట్టుబడులుగా మళ్లించడంతో 'మార్గదర్శి' పాపాల పుట్ట బద్దలైంది. కేంద్ర చిట్‌ఫండ్ చట్టాన్ని కచ్చితంగా అమలుచేయాలని చిట్ రిజిస్ట్రార్ స్పష్టంచేయడంతో ఆ సంస్థలోని ఆర్థిక కార్యకలాపాలు దాదాపు 16 నెలలుగా స్తంభించిపోయాయి. దీంతో లక్షలాది మంది చందాదారుల పరిస్థితి అగమ్యగోచరంగా మారింది. నిర్ణీత కాలంలో చందాదారులకు చిట్టీపాటల ప్రైజ్‌మనీ చెల్లించలేక మార్గదర్శి ముఖం చాటేస్తోంది. ష్యూరిటీలపై కొర్రీలు వేస్తూ కాలహరణం చేస్తోంది. ఒక్క మాటలో చెప్పాలంటే.. 'మార్గదర్శి' ఇక ప్యాకప్ చెప్పడమే

మిగతా 3వ పేజీలో ▶

సైకిల్ సతమతం

- పొత్తులతో ప్రకంపనలు.. అసంతృప్తితో నేతల భగ్గు
- పలుచోట్ల నిరసనలు, ర్యాలీలు
- చంద్రబాబుతో తేల్చుకునేందుకు సిద్ధం
- కోనసీమలో పవన్ ఫ్లెక్సీలకు నిప్పంటించిన కార్యకర్తలు

5లో



విజయనగరం జిల్లా గజపతినగరంలో టీడీపీ అభ్యర్థికి వ్యతిరేకంగా ఆందోళన చేస్తున్న ఆ పార్టీ నాయకులు



డా. బీఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా ఆలమూరులో పవన్ కళ్యాణ్ ఫ్లెక్సీలను దహనం చేస్తున్న జనసేన కార్యకర్తలు



మంగళగిరి ఎయిమ్స్ జాతికి అంకితం

- వర్చువల్ విధానంలో ప్రారంభించిన ప్రధాని మోదీ
- 9 క్రిటికల్ కేర్ యూనిట్లకు శంకుస్థాపన.. కాకినాడలో ఈఎస్ఐ ఆస్పత్రి, ఫుడ్ టెస్టింగ్ ల్యాబ్‌లకు ప్రారంభోత్సవం
- పాల్గొన్న గవర్నర్ జస్టిస్ అబ్దుల్ నజీర్, కేంద్ర, రాష్ట్ర మంత్రులు
- అన్ని వర్గాల ఆరోగ్య పరిరక్షణే కేంద్రం లక్ష్యమన్న గవర్నర్

- వివరాలు 3లో

ఉద్యోగుల జేఏసీ ఆందోళన వాయిదా



- సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం రాతపూర్వకంగా హామీ ఇచ్చింది
- సత్వరమే 12వ పీఆర్సీ ఇవ్వడానికి అంగీకరించింది
- ఉద్యోగ సంఘాల జేఏసీ రాష్ట్ర చైర్మన్ బండి శ్రీనివాసరావు

- వివరాలు 3లో



ఇవిగో నవరత్నాల వెలుగులు

ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రాష్ట్రంలో నిర్విఘ్నంగా అమలు చేస్తున్న నవరత్న పథకాల ద్వారా కోట్లాది మంది జీవితాల్లో వెలుగు నిండింది. ఈ పథకాల వల్లే తాము ఆనందంగా జీవిస్తున్నామని ఊరూరా ప్రజలు సంతోషంగా చెబుతున్నారు. వారంతా ఏ విధంగా అభివృద్ధిపథం వైపు పయనిస్తున్నారో వారి మాటల్లోనే 'సాక్షి' మీ ముందుకు తెస్తోంది.

ఒంటరి బతుకుకు జగనన్న అండ



ఐదేళ్ల క్రితం మా ఆయన ఈరోతు యుధిష్ఠరరావు అనారోగ్యంతో కన్నుమూశారు. అప్పటికే ఇద్దరు పిల్లలున్న మా కుటుంబం కష్టాల్లో పడింది. ఎలా బతకాలో తెలియక సతమతమయ్యాను. అప్పటికే నాకు టైలరింగ్ రావడంతో పార్వతీపురం మన్యం జిల్లా భామిని మండలం సొలికిరి గ్రామంలో దుకాణం పెట్టుకున్నాను. దానిపై కాస్తో కూస్తో ఆదాయం వచ్చేది. కానీ అది భరోసానివ్వలేదు. గత చంద్రబాబు పాలనలో పింఛన్ కోసం ఎన్నోమార్లు దరఖాస్తు చేసుకున్నాను. జన్మభూమి కమిటీలు నాకు పింఛన్ రాకుండా అడ్డుకున్నాయి. ఇంతలో దేవుడిలా జగనన్న ముఖ్యమంత్రి అయ్యారు. నా కుటుంబాన్ని ఆదుకున్నారు. నాకు వితంతు పింఛన్ వచ్చింది. టైలరింగ్ షాప్ నడుపుతున్న నాకు జగనన్న చేదోడు పథకం ద్వారా ఏడాదికి రూ. 10వేల వంతున మూడేళ్ళుగా అందుకొంటున్నాను. ఆ మొత్తంతో నా టైలరింగ్ షాప్‌ను, ఫ్యాన్సీ షాప్‌గా మార్చుకున్నాను. నా ఇద్దరు పిల్లలను ఎంపీపీ స్కూల్‌లో చదివిస్తున్నాను. అందులో ఒకరి పేరున అమ్మ ఒడి పథకం ద్వారా ఏడాదికి రూ. 15వేలు నా ఖాతాలో జమవుతున్నాయి. పిల్లల చదువుకు బెంగ లేకుండా పోయింది. నా ఒంటరి బతుకుకు జగనన్న అండ దొరికింది. ఇప్పుడు ఆర్థిక కష్టాల నుంచి బయట పడ్డాను. దానికి కారణమైన జగనన్నకు రుణ పడి ఉంటాను.

– ఈరోతు కాంచన, సొలికిరి
(టంకాల మోహనరావు, విలేకరి, భామిని)

ప్రభుత్వ సాయంతో నిలదొక్కుకున్నాం



రెక్కాడితే గానీ డొక్కాడని పరిస్థితి మాది. నా భర్త, నేను కూలి చేసుకుంటూ కుటుంబాన్ని నెట్టుకొచ్చేవాళ్లం. ఆ సంపాదనతో ముగ్గురు పిల్లల పోషణ కష్టంగా మారింది. 2019 తర్వాత మా జీవితంలో వెలుగులు నిండాయి. వైఎస్సార్ చేయూత పథకం ద్వారా ఏడాదికి రూ.18,750లు చొప్పున, వైఎస్సార్ ఆసరా పథకం ద్వారా నాలుగేళ్లకు రూ.63,012, జగనన్న తోడులో రూ.10 వేలు, సున్నా వడ్డీగా రూ.2,210, వడ్డీలేని రుణంగా రూ.50 వేలు, బ్యాంకు రుణంగా రూ.2 లక్షలు అందాయి. ఆ మొత్తంతో తిరుపతి నగరం బీటీఆర్ కాలనీలో చిల్లర దుకాణాన్ని ఏర్పాటు చేసుకున్నాం. దాని ద్వారా నెలకు రూ.10వేల నుంచి రూ.13 వేల వరకు ఆదాయం వస్తోంది. పిల్లలు సైతం ప్రైవేటు కంపెనీల్లో ఉద్యోగం చేస్తున్నారు. ప్రస్తుతం మా కుటుంబం సంతోషంగా ఉంది. జగనన్న సంక్షేమ పథకాలతో ఆర్థికంగా నిలదొక్కుకున్నాం. మా కుటుంబాన్ని ఆదుకున్న జగనన్నకు జీవితాంతం రుణపడి ఉంటాం. మళ్లీ జగనన్నే సీఎంగా రావాలి.

– బి.వనజమ్మ, తిరుపతి
(పోగూరి చంద్రబాబు, విలేకరి, తిరుపతి సిటీ)

సర్కారు సాయంతో సాఫీగా జీవనం



మాది నిరుపేద కుటుంబం. రెక్కాడితేగానీ డొక్కాడని పరిస్థితి. టాక్సీడ్రైవర్‌గా ఉంటూ జీవనం సాగిస్తున్నాం. అనుకోకుండా నాకు ప్రమాదం జరిగింది. దాంతో ఏ పనీ చేయలేకపోయాను. గత ప్రభుత్వం నుంచి మాకు ఎలాంటి ఆసరా లభించలేదు. అప్పు చేసి డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా మలికిపురంలో చిన్నపాటి ఎలక్ట్రికల్ దుకాణం పెట్టుకుని జీవనం ప్రారంభించాను. అయితే అంతంతమాత్రంగానే వ్యాపారం సాగడం వల్ల రేపటిగురించి ఎప్పుడూ భయంగానే ఉండేది. అదృష్టవశాత్తూ రాష్టంలో జగనన్న ప్రభుత్వం ఏర్పడింది. నాకున్న ముగ్గురు కుమార్తెల చదువులు ఫీజు రీయింబర్స్‌మెంట్‌తో ఎంతోహాయిగా సాగిపోయాయి. పెద్దమ్మాయి కరీనా బీటెక్ పూర్తి చేసింది. రెండో అమ్మాయి షరీనా హార్టీకల్చర్ మూడో ఏడాది చదువుతోంది. మూడో అమ్మాయి విలీనా బీటెక్ మూడో సంవత్సరం చదువుతోంది. ఫీజు రీయింబర్స్‌మెంట్ రావడం వల్ల వారి చదువులకు ఎలాంటి ఢోకా లేకుండా పోయింది. వైఎస్సార్ ఆరోగ్యశ్రీ పథకంలో కాలికి రూ.50 వేల విలువైన శస్త్ర చికిత్స ఉచితంగా జరిగింది. మా అమ్మకు రెండు కుంచాల భూమి ఉండడంతో రైతు భరోసా కింద రూ.7 వేలు వస్తోంది. నా భార్య మహాలక్ష్మికి వైఎస్సార్ చేయూత కింద ఏడాదికి రూ.18,750 వేలు వంతున అందింది. మా అమ్మ లలితమ్మకు పింఛన్ అందుతోంది. సీఎం జగన్ పాలనలో నా కుటుంబానికి అన్ని విధాలా మేలు జరిగింది.

– నల్లి వెంకయ్యదాసు, మలికిపురం
(తోట సత్యనారాయణ, విలేకరి, మలికిపురం)

దిగ్గజ సంస్థ ఐటీసీ భారీ పెట్టుబడులు



సాక్షి, అమరావతి : రూ.5.13 లక్షల కోట్ల మార్కెట్ క్యాపిటలైజేషన్ కలిగి ఉన్న ప్రముఖ బహుళజాతి కంపెనీ ఐటీసీ రాష్ట్రంలో భారీ పెట్టుబడులు పెడుతోంది. గత ఐదేళ్ల కాలంలో రాష్ట్రంలో అనేక రంగాల్లో పెట్టుబడులు పెట్టడమే కాకుండా రాష్ట్ర ప్రభుత్వం నిర్వహిస్తున్న అనేక సామాజిక కార్యక్రమాల్లో పాల్గొంటూ వేగంగా విస్తరిస్తోంది. ఫైవ్‌స్టార్ హోటల్స్ నుంచి ఫుడ్ ప్రాసెసింగ్, స్పైసెస్ పార్క్, వైఎస్సార్ చేయూత వంటి అనేక కార్యక్రమాల్లో పాలుపంచుకుంటోంది. గుంటూరు పట్టణంలో తొలి ఫైవ్‌స్టార్ హోటల్‌ను ఐటీసీ ఏర్పాటుచేసింది. సుమారు రూ.140 కోట్లతో వెల్‌కమ్ పేరుతో అత్యాధునిక టెక్నాలజీని వినియోగిస్తూ ఈ ఫైవ్‌స్టార్ హోటల్‌ను నిర్మించారు. జనవరి 12, 2022న సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి దీనిని లాంఛనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా ఐటీసీ సీఎండీ సంజీవ్ పూరి మాట్లాడుతూ.. తమ వ్యాపార విస్తరణకు ఏపీ ఎంతో కీలకమని.. విశాఖ, విజయవాడతో పాటు ఆధ్యాత్మిక నగరాల్లో హోటళ్ల ఏర్పాటు అవకాశాలను పరిశీలిస్తున్నట్లు తెలిపారు. ఫుడ్ ప్రాసెసింగ్, ఆక్వా ప్రాసెసింగ్ వంటి రంగాల్లో రూ.400 కోట్ల పెట్టుబడులు పెట్టనున్నట్లు ఆయన వెల్లడించారు.

రూ.200 కోట్లతో ఐటీసీ స్పైసెస్ పార్క్

మరోవైపు.. పల్నాడు జిల్లా యడ్లపాడు సమీపంలో సుమారు 6.2 ఎకరాల్లో సుగంధ ద్రవ్యాలను ప్రాసెస్ చేసి, ఎగుమతి చేసే విధంగా రూ.200 కోట్లతో గ్లోబల్ స్పైసెస్ పార్క్‌ను ఐటీసీ అభివృద్ధి చేసింది. మిర్చితో పాటు పసుపు, అల్లం, ధనియాలు, యాలకులు తదితర సుగంధ ద్రవ్యాలను ప్రాసెస్ చేసి ఎగుమతి చేస్తున్నారు. సుమారు 20,000 టన్నుల వార్షిక ఉత్పత్తి సామర్థ్యం కలిగిన ఈ పార్క్‌ను సీఎం వైఎస్ జగన్ సెప్టెంబర్, 2022లో ప్రారంభించారు. దీని ద్వారా ప్రత్యక్షంగా, పరోక్షంగా 2,200 మందికి ఉపాధి కల్పిస్తోంది. అంతేకాక.. 5,500 మంది రైతు కుటుంబాలు ఈ పార్క్ ద్వారా ప్రయోజనం పొందుతున్నారు. గతంలో ఐటీసీ గ్రూపు రాష్ట్రంలో పొగాకు వ్యాపారానికే పరిమితం కాగా, 2004లో అప్పటి ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి చొరవతో గుంటూరు కేంద్రంగా సుగంధ ద్రవ్యాల విభాగంలోకి అడుగుపెట్టింది. ఇందుకోసం ఐటీ స్పైసెస్ పేరుతో ప్రత్యేకంగా కంపెనీ ఏర్పాటుచేసి, వేగంగా విస్తరించింది. సుమారు 170 గ్రామాల్లో 10,000 మందికి పైగా రైతులతో 35,000 హెక్టార్లలో వివిధ సుగంధ ద్రవ్యాలను సాగుచేయిస్తోంది. ఈ పంటలను నేరుగా కొనుగోలు చేయడం ద్వారా రైతులు మంచి ఆదాయం పొందుతున్నారు. ఐటీసీ గ్రూపు దేశంలో ఆశీర్వాద్ బ్రాండ్ పేరుతో వివిధ సుగంధ ద్రవ్యాల ఉత్పత్తులను విక్రయిస్తున్న సంగతి తెలిసిందే.

'చేయూత'లో భాగస్వామిగా..

ఇక రాష్ట్ర ప్రభుత్వం మహిళల కోసం ప్రవేశపెట్టిన చేయూత పథకంలో ఐటీసీ ప్రధాన భాగస్వామిగా చేరింది. ఇందులో భాగంగా.. మహిళలు చేసే వ్యాపారాలు, మహిళా మార్ట్‌ల పేరుతో ఏర్పాటు చేస్తున్న సూపర్ మార్కెట్లకు ఐటీసీ ఉత్పత్తులను అందించే విధంగా ఒప్పందం కుదుర్చుకుంది.

రాష్ట్ర సామాజిక, ఆర్థిక కార్యక్రమంలో భాగస్వామ్యం అవుతాం

ఐటీసీకి రాష్ట్రంతో సుదీర్ఘ అనుబంధముంది. మా నిర్ణయాలకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రోత్సాహం బాగుంది. ఇప్పటికే అనేక ప్రభుత్వ కార్యక్రమాల్లో భాగస్వామ్యం అయ్యాం. త్వరలో మరో రూ.400 కోట్లు రాష్ట్రంలో పెట్టుబడి పెట్టనున్నాం. ముఖ్యమంత్రి విజన్‌తో రాష్ట్రంలో సామాజిక, ఆర్థిక కార్యక్రమంలో విప్లవాత్మకమైన మార్పులు జరుగుతున్నాయి. ఇందులో భాగస్వామ్యం కావడంతో పాటు ఫుడ్ ప్రాసెసింగ్, ఆక్వారంగాల్లో మరిన్ని పెట్టుబడులు పెట్టనున్నాం.

– గుంటూరులో ఐటీసీ ఫైవ్‌స్టార్ హోటల్ ప్రారంభోత్సవం సందర్భంగా ఆ సంస్థ సీఎండీ సంజీవ్ పూరి

సంక్షేమాభివృద్ధిలో దేశానికే ఏపీ ఆదర్శం

రాష్ట్రంలో ఐదేళ్లలో రూ.5.27 లక్షల కోట్లు పెరిగిన ఆదాయం

- దేశంలో పేదలకు నగదు బదిలీల్లో 11 శాతం ఏపీలోనే..
- నిరుపేదలు ఇప్పుడు మధ్యతరగతి స్థాయికి..
- కుట్రలతో అభివృద్ధిని దాచిపెడుతున్న ఒకవర్గం మీడియా
- జర్నలిస్టులపై చంద్రబాబు హయాంలో దారుణమైన దాడులు
- సీఎం జగన్ పాలనలో సమగ్ర అభివృద్ధి
- 'జగన్ పాలన–జర్నలిస్టుల స్పందన' రౌండ్ టేబుల్ సమావేశంలో ప్రశంసలు

సాక్షి, అమరావతి: ఆంధ్రప్రదేశ్ సంక్షేమం, సమగ్రాభివృద్ధిలో దేశానికే ఆదర్శంగా నిలిచిందని సీనియర్ సంపాదకులు, పాత్రికేయులు, సామాజిక విశ్లేషకులు స్పష్టంచేశారు. స్థూల జాతీయోత్పత్తిలో 17 శాతం వృద్ధి రేటు నమోదవడం ఇందుకు నిదర్శనమన్నారు. గత ప్రభుత్వంలో 8.72 లక్షల కోట్లుగా ఉన్న రాష్ట్ర జీడీపీ 2023–24 నాటికి రూ.14 లక్షల కోట్లకు చేరిందని, తద్వారా ఐదేళ్లలో రాష్ట్ర సంపద రూ.5.27 లక్షల కోట్లకు పెరిగిందని వివరించారు. ఈ క్రమంలోనే పేదలకు రూ.3 లక్షల కోట్ల నగదు బదిలీ చేశారని గుర్తుచేశారు. ఇది దేశ వ్యాప్తంగా నగదు బదిలీల్లో 11శాతం ఉండటం గొప్ప విషయమని అభిప్రాయపడ్డారు. విజయవాడలో ఆదివారం ఏపీ ఎడిటర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో 'జగన్ పాలన – జర్నలిస్టుల స్పందన'పై రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. అంతకు ముందు ఫేక్ మీడియాకు వ్యతిరేకంగా ప్రచార పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సమావేశంలో నవరత్నాలు ఎగ్జిక్యూటివ్ వైస్ చైర్మన్ అంకంరెడ్డి నారాయణ మూర్తి, సీనియర్ జర్నలిస్టులు గణపతి రావు, తుర్లపాటి నాగభూషణ రావు, మన్నె సాంబశివరావు, ఎస్ఆర్కే న్యూస్ చానల్ ఎండీ ఆసిఫ్ ఖాన్ తదితరులు పాల్గొన్నారు.

సమాజాన్ని చీల్చే కుట్ర..



అభివృద్ధిని మురుగునపెట్టి ఒక వర్గం మీడియా సమాజాన్ని, పాఠకులను తప్పుదోవ పట్టిస్తోంది. స్వప్రయోజనాల కోసం జర్నలిస్టుల వృత్తి ధర్మానికి కళంకం తెస్తోంది. జర్నలిజం విలువలు తెలియని వ్యక్తులు సమాజాన్ని అడ్డగోలుగా చీల్చే కుట్రలతో అసత్య కథనాలు ప్రచురిస్తున్నారు. ఏపీలో జర్నలిస్టుల ప్రగతిని ఆకాంక్షించిన నాయకుడు మహానేత వైఎస్సార్.. ఆ తర్వాత ఇప్పుడు వైఎస్ జగన్ మాత్రమే. సీఎం జగన్ 12 మంది పాత్రికేయులను వివిధ హోదాల్లో తన ప్రభుత్వంలో స్థానం కల్పించారు.

– పి.విజయబాబు, ఏపీ అధికార భాషా సంఘం అధ్యక్షుడు

ఇవన్నీ అభివృద్ధి కాదంటే ఎలా?



75 ఏళ్లుగా గాంధీ కలలుగన్న గ్రామ స్వరాజ్యాన్ని పుస్తకాల్లో చదువుకున్నాం. ఒక్క రాజకీయ నాయకుడు దాన్ని ఆచరణలో చూపించలేకపోయారు. సీఎం జగన్ చేస్తే ప్రతిపక్షాలు, ఆ మీడియా ఎందుకు చూడలేకపోతోంది. చరిత్రలో ఎప్పుడైనా 17 మెడికల్ కాలేజీలు వచ్చాయా? 100,32 వైఎస్సార్ క్లినిక్స్, 1126 పీహెచ్‌సీలు, 542 అర్బన్ హెల్త్ సెంటర్లు, నాలుగు పోర్టులు, ఇదంతా అభివృద్ధి కాదా? లేక ఎల్లో మీడియాకు కనిపించట్లేదా? 66లక్షల మంది ఇంటికే పింఛన్ అందుతోంది. ఇవన్నీ కరోనాను తట్టుకుని ఏపీలో జరిగిన అభివృద్ధే కదా?

– బి.అశోక్ కుమార్, లా టైమ్స్ పత్రిక సంపాదకులు

నవరత్నాలతో సంక్షేమ రాష్ట్రంగా..



2014 ఎన్నికల్లో ఒక్క అబద్ధం చెబితే అధికారంలోకి వచ్చే అవకాశం ఉన్నప్పటికీ సీఎం జగన్ ప్రజలను మోసం చేయలేదు. చంద్రబాబు 600లకుపైగా హామీలు ఇచ్చి గెలిచిన మరుక్షణం మేనిఫెస్టోను మాయం చేయించారు. పాలనలో కాకుండా అభివృద్ధిని గ్రాఫిక్స్‌లో చూపించారు. కానీ ఇప్పుడు ఏపీలో పారిశ్రామిక, మౌలిక వసతుల రంగంలో 23.36 శాతం వృద్ధిని నమోదు చేసింది. చంద్రబాబు మోసం చేస్తే.. జగన్ వచ్చి డ్వాక్రా రుణాల మాఫీ చేశారు. నవరత్నాలతో సంక్షేమ రాష్ట్రంగా.. సమగ్రాభివృద్ధిలో సమ్మోహన ఏపీగా నిలబెట్టారు.

– బండ్లమూడి రోజారాణి, జర్నలిస్ట్ మేగ్జైన్ ఫీచర్స్ ఎడిటర్

ఫేక్ మీడియాపై పోరాడాలి..



ఎల్లో మీడియాతో పాటు ఫేక్ మీడియాపై విస్తృతంగా పోరాడాలి. జర్నలిస్టులుగా వాస్తవాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలి. ఎవరో చేసిన అభివృద్ధిని చంద్రబాబు తనదిగా ముద్ర వేసుకుంటే.. ఈనాడు తన రచనలతో గెజిట్‌గా మార్చేసింది. చంద్రబాబు సింగపూర్ కంపెనీలకు పట్టా భూములు రాసిస్తే రామోజీకి గొప్పగా కనిపించింది. 31లక్షల మంది పేదింటి మహిళలకు ఇళ్ల పట్టాలు ఇస్తే మాత్రం ఓర్వలేకపోతున్నారు. ఉద్దానం కిడ్నీ సమస్యకు శాశ్వత పరిష్కారం చూపిస్తే తట్టుకోలేపోతున్నారు.

– కోదూరి కృష్ణారెడ్డి, ఎన్నారై టైమ్స్ సంపాదకులు

లబ్ధి జరిగితేనే ఓటేయమనే దమ్మెవరికుంది?



చంద్రబాబుది మనీఫెస్టో.. జగన్‌ది మేనిఫెస్టో. ఈ రెండింటికీ చాలా వ్యత్యాసం ఉంటుంది. అందుకే లబ్ధి జరిగితేనే ఓటు వేయమని సీఎం జగన్ కోరుతున్నారు. బహుశా దేశ రాజకీయ చరిత్రలో ఇలా ఓట్లడిగిన నాయకుడు ఎవ్వరూ లేరు.

– జీవీఎల్ఎన్ చార్యులు, కాలమిస్టు

మహిళా సాధికారతే అభివృద్ధికి నిర్వచనం..



పల్లెల్లోని పేదలకు సంక్షేమ పథకాలు అందించడం కూడా రాష్ట్ర ప్రగతికి బాటలు వేయడమే. ముఖ్యంగా మహిళా సాధికారతను కూడా అభివృద్ధికి నిర్వచనంగా భావించాలి. అంతేగానీ గ్రాఫిక్స్‌లో బిల్డింగులు, సింగపూర్ కలలను పత్రికల్లో ప్రచురిస్తేనే అభివృద్ధి అంటే ఎలా? గ్రామ/వార్డు సచివాలయ వ్యవస్థ ద్వారా ప్రజల ముంగిటకే పాలన వచ్చింది.

– జి.వసుంధర, ప్రవాసాంధ్ర సమాచారం పత్రిక

పేదరికం తగ్గితే అభివృద్ధి కాదా?



సీఎం జగన్ ఐదేళ్ల పాలనలో సుమారు రెండేళ్లు కరోనాతో పోరాడాల్సి వచ్చింది. మిగిలిన మూడేళ్లు మాత్రమే పూర్తి స్థాయి అభివృద్ధి, పాలనలపై దృష్టి కేంద్రీకరించారు. అప్పటి నుంచి ఒక వర్గం మీడియా, ప్రతిపక్షాలు ముప్పేట దాడి ప్రారంభించాయి. ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధి ప్రజల్లోకి వెళ్లకుండా అడ్డుపడ్డాయి. దేశ మౌలికరంగం వ్యయాల్లో పది శాతం ఏపీలోనే జరుగుతోంది. ఏపీ పోర్టుల ద్వారా రెండువేల రకాల వస్తువులు ఎగుమతి చేస్తూ ఎగుమతుల్లో 10.42 శాతం వాటాతో 9వ స్థానం నుంచి నాలుగో స్థానానికి చేరుకుంది. సామాజిక రంగానికి 55.71 శాతం బడ్జెట్, డిజిటల్ విద్య, విద్యార్థులపై తలసరి వ్యయం రూ.90 వేలతో అగ్రస్థానంలో నిలుస్తోంది. పేదింటి విద్యార్థులకు రూ.4 లక్షల విలువైన ఐబీ సిలబస్‌ను ప్రభుత్వ పాఠశాలల్లోకి తీసుకొస్తోంది. ఏపీలో ఆదాయం పెరిగి, ద్రవ్యోల్బణం తగ్గింది. నిరుపేదలు కాస్త దిగువ మధ్యతరగతికి వచ్చారు. ఇదంతా అభివృద్ధిగా గుర్తించకుంటే ఎలా?

– కృష్ణంరాజు, ఏపీ ఎడిటర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు

బాబు పాలనలో జర్నలిస్టులపై దాడులు



చంద్రబాబు పాలనలో జర్నలిస్టులపై విచ్చలవిడిగా దాడులు జరిగేవి. ఉమ్మడి ఏపీలో వికారాబాద్‌లో ఓ ఎమ్మెల్యే స్థానిక జర్నలిస్టును అతిదారుణంగా హింసిస్తే.. చంద్రబాబు ఆ ఎమ్మెల్యేకి మంత్రి పదవి ఇచ్చారు. దీనిపై ఆ మీడియా ఒక్క వార్త కూడా రాయలేదు. ఇప్పుడేదో మొసలి కన్నీరు కారుస్తోంది. నిరుద్యోగులపై కపట ప్రేమ చూపిస్తున్న రామోజీ గతంలో సొంత సంస్థలో పనిచేస్తున్న వారిని బలవంతపు రాజీనామాలతో ఉద్యోగాల నుంచి తొలగించలేదా? వారికి మద్దతుగా భిక్షాటన చేపట్టిన యూనియన్ నాయకులపై ఎస్సీ, ఎస్టీ కేసులు పెట్టి స్వామని బెదిరించలేదా? పత్రికా రంగంలో రామోజీ నీచమైన సాంప్రదాయన్ని తీసుకొచ్చారు. ఇప్పుడు ఏపీలో నిరుద్యోగం 4.1శాతానికి తగ్గింది. కొత్తగా 14లక్షల పీఎఫ్ ఖాతాల్లో ఓపెన్ అయ్యాయి. ఈ వాస్తవాలను దాచిపెట్టి ఎవరిని మోసం చేస్తున్నారు.

– రావినూతల రామకృష్ణ, జర్నలిస్టుల హక్కుల ఉద్యమ నేత

మూడేళ్లలో ఆదివాసీ ప్రాంతాలకు మౌలిక సదుపాయాలు

- పీఎం జన్‌మన్ పథకానికి ఏపీలో 1.23 లక్షల కుటుంబాల ఎంపిక
- మూడేళ్లలో రూ. 23,104 కోట్లు వ్యయం చేయనున్న కేంద్రం
- అత్యధిక గిరిజన కుటుంబాలు ఎంపికైన రాష్ట్రాల్లో ఏపీకి మూడో స్థానం
- కేంద్ర గిరిజన వ్యవహారాల మంత్రిత్వ శాఖ వెల్లడి

సాక్షి, అమరావతి: దేశవ్యాప్తంగా ఉన్న మారుమూల గిరిజన ప్రాంతాల్లోని ప్రత్యేకంగా దుర్బలమైన గిరిజన సమూహాల (పీవీటీజీ) సంక్షేమం కోసం కేంద్ర ప్రభుత్వం దృష్టి పెట్టింది. దీనిలో భాగంగా పీఎం జన జాతి ఆదివాసి న్యాయ మహా అభియాన్ పథకం (పీఎం–జన్‌మన్) కింద ఆంధ్రప్రదేశ్‌లో 1.23 లక్షల గిరిజన కుటుంబాలను ఎంపిక చేసినట్లు కేంద్ర గిరిజన వ్యవహారాల మంత్రిత్వ శాఖ తెలిపింది. దేశవ్యాప్తంగా 14.56 లక్షల గిరిజన కుటుంబాలను జన్‌మన్ కింద ఎంపిక చేశారు. ఎక్కువ మంది ఎంపికైన రాష్ట్రాల్లో ఆంధ్రప్రదేశ్ మూడో స్థానంలో ఉందని, మధ్యప్రదేశ్, మహారాష్ట్ర తొలి రెండు స్థానాల్లో ఉన్నాయని మంత్రిత్వ శాఖ పేర్కొంది. పీఎం జన్‌మన్ కింద ఎంపిక చేసిన గిరిజన కుటుంబాల సంక్షేమానికి, వారి ఆవాసాల మౌలిక సదుపాయాలకు 11 కేంద్ర మంత్రిత్వ శాఖల ద్వారా మూడేళ్లలో రూ. 23,104 కోట్లను వ్యయం చేయనున్నట్లు తెలిపింది. ఆదివాసీ ప్రాంతాలు, పీవీటీజీల్లోని వారికి మిషన్ మోడ్‌లో వివిధ కేంద్ర, రాష్ట్ర పథకాల ద్వారా పక్కా ఇళ్ల నిర్మాణం, రహదారుల అభివృద్ధి, మొబైల్ మెడికల్ యూనిట్లు ద్వారా ఆరోగ్య పరిరక్షణ, వసతి గృహాలకు రన్నింగ్ వాటర్ సౌకర్యం కల్పించడం, ప్రతి ఇంటికి విద్యుత్, పైపు ద్వారా తాగునీటి సరఫరా, కమ్యూనిటీ వాటర్ సరఫరా, అంగన్‌వాడీ కేంద్రాల నిర్మాణం, మల్టీ పర్పస్ కేంద్రాల ఏర్పాటు, సోలార్ వీధి దీపాలు, మొబైల్ టవర్లు ఏర్పాటు, ఒకేషనల్ విద్యా కేంద్రాలు ఏర్పాటు ద్వారా వారికి నైపుణ్య శిక్షణ వంటి సౌకర్యాలు కల్పించనున్నట్లు స్పష్టం చేసింది. రాష్ట్రంలో 8 జిల్లాల్లోని 3,526 పీజీటీవీ ఆవాసాల్లో ముఖ్యంగా కొండ సవర, కొండరెడ్డి, కుటియా ఖాండ్, డోంగ్రియా ఖాండ్, చెంచు, బోడో గడబ, గుటాబ్ గడబ, పోరెంగి పోర్జా, ఖాండ్ పోర్జా, బోండో పోర్జా, కోలం వంటి తెగల కుటుంబాలను పీఎం జన్‌మన్ పథకానికి ఎంపిక చేశారు.



గాంధీజీ కన్న గ్రామ స్వరాజ్యం
సాక్షాత్కరించిన వేళ
ఇంటికే సంక్షేమ పథకాలు నడిచి వస్తున్న వేళ
లబ్ధిదారుల కళ్లల్లో కన్పిస్తున్న ఆనందం

సంక్షేమ సారథి
ఒంగోలులో సమగ్ర చర్చా వేదిక

ప్రజా ప్రస్థానం
ఈరోజు: 7 PM మీ సాక్షిటీవీలో...

పట్టణ పేద మహిళలకు స్వయం ఉపాధి

- రూ.28 కోట్లు మంజూరు చేసిన ప్రభుత్వం
- పట్టణ సమృద్ధి యూనిట్ల ఏర్పాటుకు మెప్మా ప్రోత్సాహం

సాక్షి, అమరావతి: రాష్ట్రంలోని పట్టణ పేద మహిళల స్వయం ఉపాధికి ప్రభుత్వం మరో అడుగు ముందుకు వేసింది. తక్కువ పెట్టుబడితో స్వయం ఉపాధి పొందేలా.. పట్టణ సమృద్ధి యూనిట్ల ఏర్పాటుకు పట్టణ పేదరిక నిర్మూలన సంస్థ(మెప్మా) చర్యలు చేపట్టింది. ఇందుకోసం 110 యూఎల్బీల్లోని 5,600కు పైగా స్లమ్ లెవల్ ఫెడరేషన్ల(ఎస్ఎల్ఎఫ్)కు రూ.28 కోట్ల నిధులను ప్రభుత్వం అందించింది. స్వయం సహాయక సంఘాల సభ్యులు రూ.50 వేల లోపు పెట్టుబడితో చిన్నస్థాయి ఉపాధి యూనిట్లు ఏర్పాటు చేసుకునేందుకు అవసరమైన ఆర్థిక సాయం పొందవచ్చు.

సొంతంగా వ్యాపారం చేసుకునేలా..

రాష్ట్రంలోని పురపాలక సంఘాల్లో మొత్తం 9,190 స్లమ్ లెవల్ ఫెడరేషన్లు ఉన్నాయి. తొలివిడతలో 5,638 ఎస్ఎల్ఎఫ్‌లను మెప్మా ఎంపిక చేసింది. వీటి కోసం ప్రభుత్వం తిరిగి చెల్లించే అవసరం లేకుండా.. రూ.28 కోట్ల నిధులను మంజూరు చేసింది. ఈ మొత్తం సొమ్ము ఎస్ఎల్ఎఫ్‌లలో ప్రత్యేక నిధులుగా ఉంటాయి. ఈ నిధుల నుంచి ఒక్కో ఎస్ఎల్ఎఫ్‌లోని 250 మంది సభ్యుల్లో.. ఎవరైనా సొంతంగా వ్యాపారం చేసుకునేందుకు రూ.50 వేలు దాటకుండా సాయం పొందవచ్చు. ఆ మొత్తంతో వారు సొంతంగా పట్టణ సమృద్ధి యూనిట్ ఏర్పాటు చేసుకోవచ్చు. సభ్యులు తాము తీసుకున్న మొత్తాన్ని సులభ వాయిదాల్లో తిరిగి ఎస్ఎల్ఎఫ్‌లకు చెల్లించాల్సి ఉంటుంది. మెప్మా పరిధిలో దాదాపు 25 లక్షల మంది సభ్యులుండగా.. ఇప్పటికే 13.50 లక్షల మంది ప్రత్యక్షంగా స్వయం ఉపాధి పొందుతున్నారు. మిగిలిన వారిని కూడా స్వయం ఉపాధి వైపు ప్రోత్సహించేందుకు మెప్మా మిషన్ డైరెక్టర్ విజయలక్ష్మి సభ్యుల అభిప్రాయాలు తెలుసుకున్నారు. అత్యధిక మంది అభిప్రాయం ప్రకారం రూ.50 వేల లోపు పెట్టుబడితో సమృద్ధి యూనిట్లు ఏర్పాటుకు శ్రీకారం చుట్టారు. టైలరింగ్ మెటీరియల్, శారీ మ్యాచింగ్ సెంటర్లు, క్లాత్ బ్యాగ్‌ల తయారీ యూనిట్ల ఏర్పాటు దిశగా మహిళలను మెప్మా ప్రోత్సహిస్తోంది.

సుస్థిర జీవనోపాధి..

గత ఐదేళ్లుగా రాష్ట్ర ప్రభుత్వం మహిళా ప్రగతికి అధిక ప్రాధాన్యం ఇస్తోంది. వివిధ పథకాల ద్వారా అందించిన ఆర్థిక సాయం దుర్వినియోగం కాకుండా స్వయం సహాయక సంఘాల సభ్యులందరికీ సుస్థిర జీవనోపాధి మార్గాలను మెప్మా చూపిస్తోంది. ఇప్పటికే 11 మున్సిపాలిటీల్లో జగనన్న మహిళా మార్టులు, ఆహా క్యాంటీన్లు, అర్బన్ మార్కెట్లు, చేయూత జీవనోపాధి యూనిట్లు తదితరాలు ఏర్పాటు చేయించింది. ఆసక్తి గల మహిళలకు వివిధ చేతివృత్తుల్లో నైపుణ్య శిక్షణ ఇవ్వడంతోపాటు రూ.2.50 లక్షల చొప్పున ఆర్థిక సాయం ద్వారా గత నెలలో 145 పట్టణ ప్రగతి యూనిట్లను కూడా ఏర్పాటు చేయించింది. ఇదే క్రమంలో తక్కువ విద్యార్హత ఉన్న పట్టణ పేద మహిళలు రూ.50 వేల లోపు పెట్టుబడితో సమృద్ధి యూనిట్ల ఏర్పాటు చేసుకునేందుకు అవకాశం కల్పించింది.

ఇదండీ సంగతి



ఏందమ్మా జనసేనకు వేసినట్లు వేస్తున్నావే!
కాస్త ఎక్కువ ధర్మం వేయండి

క్లుప్తంగా...

త్రిపురాంతకంలో కంచి పీఠాధిపతి పూజలు



ధ్వజస్తంభం ప్రతిష్ఠలో పాల్గొన్న శ్రీ శంకర విజయేంద్ర సరస్వతి స్వామి

త్రిపురాంతకం: ప్రకాశం జిల్లా త్రిపురాంతకంలోని త్రిపురాంతకేశ్వర స్వామి వారి ఆలయంలో ధ్వజస్తంభ ప్రతిష్ఠా కార్యక్రమాల్లో కంచి కామకోటి పీఠాధిపతి శ్రీశంకర విజయేంద్ర సరస్వతి మహాస్వామి వారు పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. తుపాను వల్ల ఆలయంలో పడిపోయిన ధ్వజస్తంభం స్థానంలో నూతన ధ్వజస్తంభం, నవగ్రహ, కాలభైరవ ప్రతిష్ఠా కార్యక్రమాలను పురస్కరించుకుని రెండు రోజులుగా వేదపండితులు ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్నారు. ఈ సందర్భంగా వచ్చిన శంకర విజయేంద్ర సరస్వతిస్వామి వారు ఆలయంలోని యాగశాలలో, అమ్మవారి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆయన వెంట ఈవో చెన్నకేశవరెడ్డి, చైర్మన్ సుబ్బారావు, సభ్యులు ఉన్నారు.

యువతిని కిడ్నాప్ చేసిన టీడీపీ నేతలు



పోలీసులు అరెస్టు చేసిన నిందితులు



పోలీసులు స్వాధీనం చేసుకున్న రివాల్వర్

పత్తికొండ టౌన్/రూరల్: కర్నూలు జిల్లా పత్తికొండ మండలంలో ఆదివారం టీడీపీ నాయకులు రివాల్వర్‌తో బెదిరించి ఓ యువతిని కిడ్నాప్ చేశారు. పోలీసులు వెంటనే స్పందించి కిడ్నాపర్ల చెర నుంచి ఆ యువతిని విడిపించి నిందితులను అరెస్టు చేశారు. పత్తికొండ అర్బన్ సీఐ మురళీమోహన్, ఎస్‌ఐ గోపాల్ తెలిపిన వివరాల ప్రకారం.. పత్తికొండ మండలం పులికొండ గ్రామానికి చెందిన పాలేగార్ వరదరాజులునాయుడు తన కుమార్తె శ్రీదేవితో కలిసి మోటార్‌బైక్‌పై పత్తికొండకు వస్తుండగా, దూదేకొండ సమీపంలో దేవనకొండ మండలం కప్పట్రాళ్ల గ్రామానికి చెందిన టీడీపీ నేత పాలేగార్ పరమప్పనాయుడు కుమారుడు సత్యనారాయణ నాయుడు, ఈదుల దేవరబండ గ్రామానికి చెందిన అబ్దుల్ కలాం, కప్పట్రాళ్లకు చెందిన బతుకన్న, కరివేముల క్రిష్ణలతో కలిసి స్కార్పియో వాహనంతో అడ్డగించారు. తుపాకీతో బెదిరించి వరదరాజులు కుమార్తెను బలవంతంగా కిడ్నాప్ చేసి స్కార్పియో వాహనంలో తీసుకెళ్లారు. తనపై దాడి చేసి తన కుమార్తెను కిడ్నాప్ చేశారని వరదరాజుల ఫిర్యాదు మేరకు పోలీసులు వెంటనే స్పందించారు. శ్రీదేవిని దుండగుల నుంచి కాపాడారు. నిందితులైన సత్యనారాయణనాయుడు, బోయ బతుకన్నలను అరెస్టుచేసి తుపాకీని స్వాధీనం చేసుకున్నారు. స్కార్పియో వాహనాన్ని సీజ్ చేశారు. మరో ఇద్దరు పరారీలో ఉన్నట్లు సీఐ తెలిపారు.

విశాఖలో యాదవ సంఘం భవనానికి శంకుస్థాపన

కొమ్మాది (విశాఖ జిల్లా): విశాఖపట్నంలోని ఎండాడలో జాతీయ రహదారి సమీపాన యాదవ సంఘం భవన నిర్మాణానికి ఆదివారం మంత్రి కారుమూరి నాగేశ్వరరావు, మాజీ మంత్రి అనిల్ కుమార్ యాదవ్, మేయర్ గొలగాని హరి వెంకటకుమారిలతో కలిసి వైఎస్సార్‌సీపీ ఉత్తరాంధ్ర రీజినల్ కోఆర్డినేటర్ వైవీ సుబ్బారెడ్డి శంకుస్థాపన చేశారు. వైవీ మాట్లాడుతూ యాదవులను గొప్ప స్థానంలో నిలబెట్టిన ఘనత సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుందన్నారు. వైఎస్సార్‌సీపీలో యాదవులకు సముచిత స్థానం కల్పించామని చెప్పారు. యాదవ సంఘ భవన నిర్మాణం కోసం జాతీయ రహదారికి ఆనుకుని అర ఎకరా స్థలాన్ని కేటాయించడం ఆనందంగా ఉందన్నారు. కాగా, యాదవ సంఘం భవన నిర్మాణానికి విశాఖ ఎంపీ రూ.కోటి విరాళం ఇచ్చారు.

మంగళగిరి ఎయిమ్స్ జాతికి అంకితం

వర్చువల్ విధానంలో ప్రారంభించిన ప్రధాని మోదీ • 9 క్రిటికల్ కేర్ యూనిట్లకు శంకుస్థాపన



మంగళగిరి ఎయిమ్స్‌లో కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న గవర్నర్ అబ్దుల్ నజీర్. చిత్రంలో కేంద్ర, రాష్ట్ర మంత్రులు తదితరులు



కాకినాడలో 100 పడకల ఈఎస్ఐ ఆస్పత్రి ప్రారంభోత్సవంలో ఎంపీ వంగా గీత, ఎమ్మెల్యే చంద్రశేఖరరెడ్డి

సాక్షి, అమరావతి/మంగళగిరి/తెనాలిఅర్బన్/మహారాణిపేట(విశాఖ దక్షిణ)/సాక్షి ప్రతినిధి, కాకినాడ: గుంటూరు జిల్లా మంగళగిరిలో ఏర్పాటు చేసిన ఆల్ ఇండియా ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్(ఎయిమ్స్)ను, కాకినాడలో నిర్మించిన 100 పడకల ఈఎస్‌ఐ ఆస్పత్రిని గుజరాత్‌లోని రాజ్‌కోట్ నుంచి ప్రధాని మోదీ వర్చువల్‌గా ప్రారంభించారు. అలాగే వైఎస్సార్, నెల్లూరు, శ్రీకాకుళం, తిరుపతి, రాజమహేంద్రవరం, కర్నూలు, విజయనగరం మెడికల్ కాలేజీలతోపాటు తెనాలి, హిందూపురంలోని ప్రభుత్వాస్పత్రుల్లో 9 క్రిటికల్ కేర్ యూనిట్ల ఏర్పాటుకు ఆయన శంకుస్థాపన చేశారు. విశాఖపట్నంలో ఏర్పాటు చేసిన మైక్రోబయాలజీ, ఫుడ్ టెస్టింగ్ ల్యాబ్‌ను, నాలుగు సంచార ఫుడ్ టెస్టింగ్ ల్యాబ్‌లను ప్రారంభించారు. ఈ సందర్భంగా మంగళగిరి ఎయిమ్స్‌లో జరిగిన కార్యక్రమంలో గవర్నర్ జస్టిస్ అబ్దుల్ నజీర్ మాట్లాడుతూ అన్ని వర్గాల ప్రజల ఆరోగ్య సంరక్షణే ధ్యేయంగా కేంద్ర ప్రభుత్వం ఆయుష్మాన్ భారత్ సహా పలు కార్యక్రమాలను అమలు చేస్తోందని చెప్పారు. మంగళగిరి ఎయిమ్స్‌లో 960 పడకలున్నాయని.. 41 విభాగాల్లో ప్రజలకు వైద్య సేవలు అందుతున్నాయని వివరించారు. 125 ఎంబీబీఎస్ సీట్లు అందుబాటులోకి వచ్చాయన్నారు. 2019 నుంచి రోగులకు ఓపీ సేవలు కొనసాగుతున్నాయని తెలిపారు. ఎయిమ్స్ సేవలపై ప్రజలకు విస్తృత అవగాహన కల్పించాలని సూచించారు.

అభివృద్ధి చెందిన దేశంగా భారత్..

కేంద్ర మంత్రి ప్రహ్లాద్ జోషి మాట్లాడుతూ 'కరోనా, లాక్‌డౌన్ వంటి క్లిష్ట సమయాన్ని కూడా భారత్ సమర్థంగా ఎదుర్కొని ఐదో అతి పెద్ద ఆర్థిక వ్యవస్థగా అవతరించింది. భారత్‌ను అభివృద్ధి చెందిన దేశంగా మార్చడమే మోదీ ప్రభుత్వ లక్ష్యం' అని చెప్పారు. కేంద్ర ఆరోగ్య శాఖ సహాయ మంత్రి డాక్టర్ ప్రవీణ్ భారతీపవార్ మాట్లాడుతూ '2014కు ముందు ఎయిమ్స్‌లో చికిత్స పొందాలంటే ఢిల్లీకి వెళ్లాల్సి వచ్చేది. మోదీ సర్కార్ వచ్చిన తర్వాత గత పదేళ్లలో ఎయిమ్స్‌ల సంఖ్య 22కు పెరిగింది. దేశాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేస్తూ నవ భారతాన్ని ప్రధాని మోదీ నిర్మిస్తున్నారు' అని పేర్కొన్నారు.

ఎయిమ్స్‌కు అన్ని విధాల సహకారం

రాష్ట్ర వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి విడదల రజిని మాట్లాడుతూ 'వైఎస్ జగన్ పాలనలో రాష్ట్రంలో ఆరోగ్య రంగానికి ప్రాధాన్యత పెరిగింది. ఎయిమ్స్ ఏర్పాటు కోసం రాష్ట్ర ప్రభుత్వం 183 ఎకరాల స్థలాన్ని కేటాయించింది. విద్యుత్ సరఫరా కోసం రూ.35 కోట్లతో 132 కేవీ సబ్‌స్టేషన్ ఏర్పాటుతో పాటు జాతీయ రహదారి నుంచి ఎయిమ్స్‌కు రూ.10 కోట్లతో అప్రోచ్ రోడ్ల అభివృద్ధి చేపట్టాం. రూ.7.74 కోట్లతో నీటి సరఫరా పనులు, రూ.2.2 కోట్లతో డ్రైన్‌ల నిర్మాణానికి ప్రాధాన్యత ఇచ్చాం. ఉచితంగా నీటిని సరఫరా చేస్తున్నాం. రాష్ట్ర ప్రజలకు వరల్డ్ క్లాస్ హెల్త్ కేర్‌ను అందించడమే సీఎం జగన్ లక్ష్యం. నాడు–నేడు, ఫ్యామిలీ డాక్టర్, ఆరోగ్యశ్రీ వంటి ఎన్నో కార్యక్రమాలు రాష్ట్రంలో విజయవంతంగా అమలవుతున్నాయి' అని చెప్పారు. ఈ కార్యక్రమంలో అనకాపల్లి ఎంపీ డాక్టర్ సత్యవతి, రాజ్యసభ సభ్యులు జీవీఎల్ నరసింహారావు, సీఎం రమేశ్, బీజేపీ రాష్ట్ర అధ్యక్షురాలు పురందేశ్వరి, ఉన్నతాధికారులు కృష్ణబాబు, నివాస్, గుంటూరు కలెక్టర్ వేణుగోపాల్‌రెడ్డి, ఎయిమ్స్ డైరెక్టర్ డాక్టర్ మధబానందకర తదితరులు పాల్గొన్నారు.

ఇక గుంతకల్లు... బాలాజీ డివిజన్!

సాక్షి, న్యూఢిల్లీ: ఆంధ్రప్రదేశ్‌లోని గుంతకల్లు రైల్వే డివిజన్‌ను బాలాజీ డివిజన్‌గా మార్చనున్నట్లు తెలుస్తోంది. డివిజన్‌లోని ప్రధాన రైల్వే స్టేషన్లలో తిరుపతి కూడా ఒకటి. ప్రపంచ ప్రఖ్యాతిగాంచిన తిరుమల శ్రీవారి పేరు మీదుగా బాలాజీ డివిజన్‌గా పేరు మార్చడానికి రైల్వే అధికారులు చర్యలు తీసుకుంటున్నట్లు సమాచారం. సదరన్ రైల్వే జోన్‌లో 1956లో ఏర్పాటైన గుంతకల్లు డివిజన్... 1977 అక్టోబర్ రెండో తేదీన దక్షిణ మధ్య రైల్వేకు బదిలీ అయిన విషయం తెలిసిందే.

'మార్గదర్శి' షట్టర్ క్లోజ్!

▶ మొదటి పేజీ తరువాయి

తరువాయి అన్నట్లుగా ఉంది పరిస్థితి.

రూ.4,880 కోట్లకు పైగా బకాయిలు

కేంద్ర చిట్‌ఫండ్స్ చట్టం–1982కు విరుద్ధంగా చందాదారుల సొమ్మును రామోజీరావు తమ సొంత వ్యాపార సంస్థలైన ఉషాకిరణ్ మీడియా ప్రైవేట్ లిమిటెడ్, ఉషోదయ ఎంటర్‌ప్రైజెస్‌లతోపాటు మ్యూచువల్ ఫండ్స్‌లో పెట్టుబడులుగా మళ్లించారు. రాష్ట్ర స్టాంపులు–రిజిస్ట్రేషన్ల శాఖ తనిఖీల్లో ఈ వ్యవహారం బయటపడింది. నిబంధనల ప్రకారం కొత్త చిట్టీలు ప్రారంభించాలంటే జిల్లా చిట్ రిజిస్ట్రార్ అనుమతి తీసుకోవాలి. అలాగే, కేంద్ర చిట్‌ఫండ్ చట్టాన్ని అమలు చేస్తున్నట్లుగా ఆధారాలు చూపాలని చిట్ రిజిస్ట్రార్లు మార్గదర్శి చిట్‌ఫండ్స్ బ్రాంచి మేనేజర్లను ఆదేశించారు. అందుకు రామోజీరావు ససేమిరా అన్నారు. మరోవైపు.. మార్గదర్శి చిట్‌ఫండ్స్ ఆర్థిక అక్రమాలపై సీఐడీ విభాగం 2022 నవంబరులో కేసు నమోదు చేసింది. సొమ్మును రామోజీరావు అక్రమంగా మళ్లిస్తున్నారని తెలియడంతో కొత్త చందాదారులు చిట్టీ గ్రూపుల్లో సభ్యులుగా చేరడంలేదు. అప్పటి నుంచి మార్గదర్శి చిట్‌ఫండ్స్‌లో కొత్త చిట్టీలు నిలిచిపోయాయి. దశాబ్దాలుగా మనీ సర్క్యులేషన్ (గొలుసుకట్టు మోసాలు) తరహాలో వ్యాపారం నిర్వహిస్తున్న రామోజీరావు అక్రమాలకు అడ్డుకట్ట పడింది. ఆ సంస్థలో మనీ టర్నోవర్ నిలిచిపోయింది. దాంతో ఇప్పటికే కొనసాగుతున్న చిట్టీ గ్రూపుల చిట్టీ పాటల మొత్తం (ప్రైజ్‌మనీ) చెల్లించడం రామోజీకి తలకు మించిన భారంగా మారింది. మార్గదర్శి చిట్‌ఫండ్స్ రాష్ట్రంలో దాదాపు 16 నెలలుగా తమ చందాదారులకు ప్రైజ్‌మనీ సక్రమంగా చెల్లించలేకపోతోంది.



➤ ఇక రాష్ట్రంలో 37 బ్రాంచీల ద్వారా మార్గదర్శి చిట్‌ఫండ్స్‌కు నెలనెలా రూ.260 కోట్ల టర్నోవర్ ఉంది. అందులో రూ.80 కోట్లు డివిడెండ్లుగా చెల్లించాల్సి ఉండగా.. రూ.180కోట్ల వరకు చిట్టీ పాటల ప్రైజ్‌మనీగా చెల్లించాల్సి ఉంది. 2022 నవంబరు నుంచి ఆ ప్రైజ్‌మనీ మొత్తం సక్రమంగా చెల్లించలేకపోవడంతో బకాయిలు పేరుకుపోయాయి. ఆ ప్రకారం 16 నెలలకు రూ.2,880 కోట్ల వరకు బకాయిలు పేరుకుపోయాయని స్టాంపులు–రిజిస్ట్రేషన్లు, సీఐడీ అధికారులు గుర్తించినట్లు సమాచారం.

➤ అలాగే, మార్గదర్శి చిట్‌ఫండ్స్ రశీదు రూపంలో సేకరించిన అక్రమ డిపాజిట్లు కాలపరిమితి ముగుస్తున్నా చెల్లించలేకపోతోంది. 4 శాతం నుంచి 5 శాతం వడ్డీ చొప్పున ఆరునెలల నుంచి రెండేళ్ల కాలపరిమితితో అక్రమంగా ఆ డిపాజిట్లను సేకరించింది. కాలపరిమితి ముగిసిన ఆ రశీదు డిపాజిట్లను కూడా మార్గదర్శి చిట్‌ఫండ్స్ 16 నెలలుగా చెల్లించలేకపోతోంది. ఈ బకాయిలు కూడా కలిపితే మొత్తం మీద దాదాపు రూ.2వేల కోట్ల వరకు ఉంటుందని అధికార వర్గాలు చెబుతున్నాయి. వెరసి మార్గదర్శి చిట్‌ఫండ్స్ దాదాపు రూ.4,880 కోట్ల వరకు చందాదారులకు చెల్లించాల్సి ఉంటుందని సీఐడీ అధికారులు అంచనా వేశారు.

చందాదారులకు సీఐడీ రక్షణ

మరోవైపు.. ఈ వ్యవహారాన్ని ఇప్పటికే రిజర్వ్ బ్యాంక్, ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్‌లకు కూడా సీఐడీ నివేదించింది. దాంతో రామోజీ ఆర్థిక అక్రమాల ఆట కట్టింది. మార్గదర్శి చిట్‌ఫండ్స్ చందాదారులు మోసపోకుండా, వారి చిట్టీల మొత్తం, డిపాజిట్లకు న్యాయస్థానాల ద్వారా రక్షణ కల్పించేందుకు సీఐడీ ఉద్యుక్తమైంది. తద్వారా అగ్రిగోల్డ్ తరహాలో రామోజీరావు మార్గదర్శి చిట్‌ఫండ్స్ చందాదారులను ముంచేయకుండా సీఐడీ కార్యాచరణను చేపట్టింది.

కొర్రీలతో చందాదారులకు ముప్పతిప్పలు

ఇదిలా ఉంటే.. చిట్టీ పాటల ప్రైజ్‌మనీ, కాలపరిమితి ముగిసిన డిపాజిట్ల సొమ్ము కోసం చందాదారులు మార్గదర్శి చిట్‌ఫండ్స్ కార్యాలయాల చుట్టూ ప్రదక్షిణాలు చేస్తున్నారు. కానీ, తమ గల్లాపెట్టె ఖాళీ కావడంతో మార్గదర్శి చిట్‌ఫండ్స్ కొర్రీలు వేస్తూ చందాదారులకు మొండిచేయి చూపిస్తోంది. నిబంధనల ప్రకారం మూడు ష్యూరిటీలు చూపించినా.. వారు ప్రభుత్వ ఉద్యోగులు అయినా సరే ఏవేవో కొర్రీలు వేస్తూ తిరస్కరిస్తోంది. పైగా.. చందాదారులకు చెల్లించాల్సిన మొత్తాన్ని మళ్లీ రశీదు డిపాజిట్‌గానే తమ వద్ద డిపాజిట్ చేయాలని సూచిస్తోంది. ప్రస్తుతం తాము ఆ మొత్తాన్ని చెల్లించలేమని చెబుతుండటం గమనార్హం. ఇలా అక్రమంగా రశీదు డిపాజిట్ల దందాను కొనసాగించాలని రామోజీరావు భావిస్తున్నారు. ఎందుకంటే ఆయన అక్రమ వ్యాపార సామ్రాజ్యానికి ఇంధనం ఆ అక్రమ డిపాజిట్లే కాబట్టి. కానీ, సీఐడీ అధికారులు నిశితంగా కేసు దర్యాప్తు చేస్తుండడంతో అక్రమ డిపాజిట్ల దందాకు చెక్ పడింది.


మధ్యవర్తిత్వంతో వివాదాలు పరిష్కారమవ్వాలి

- సుప్రీంకోర్టు న్యాయమూర్తి జస్టిస్ నరసింహ
- పారదర్శకంగా న్యాయ వ్యవస్థను నిలపాలి
- హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ధీరజ్‌సింగ్ ఠాకూర్



శిలాఫలకాన్ని ఆవిష్కరించిన జస్టిస్ నరసింహ, జస్టిస్ ధీరజ్‌సింగ్ ఠాకూర్

సాక్షి ప్రతినిధి, విజయనగరం: మధ్యవర్తిత్వంతో వివాదాల పరిష్కారానికి న్యాయవాదులు ప్రయత్నించాలని సుప్రీంకోర్టు న్యాయమూర్తి జస్టిస్ పమిడిఘంటం నరసింహ సూచించారు. జిల్లా కోర్టు ఆవరణలో రూ.99.20 కోట్లతో నిర్మించనున్న జిల్లా కోర్టు భవనాల సముదాయానికి సుప్రీంకోర్టు న్యాయమూర్తి జస్టిస్ నరసింహ, రాష్ట్ర హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ధీరజ్‌సింగ్ ఠాకూర్‌తో కలిసి ఆదివారం శంకుస్థాపన చేశారు. జస్టిస్ నరసింహమాట్లాడుతూ వివాదాల పరిష్కారం కోసం న్యాయస్థానాలను ఆశ్రయించిన వారు ఏళ్ల తరబడి న్యాయం కోసం వేచి చూడకుండా న్యాయవాదులు కృషి చేయాలన్నారు. కొత్తగా న్యాయవాద వృత్తిలోకి ప్రవేశిస్తున్న యువతీ యువకులు జిల్లా కోర్టుల్లో తమ వృత్తిని ప్రారంభించేలా సీనియర్ న్యాయవాదులు ప్రోత్సహించాలని సూచించారు. విజయనగరంలో నూతన కోర్టు భవనాల ద్వారా మంచి వసతులు సమకూరనున్నాయని, వీటిని వినియోగించుకుని న్యాయవాదులు సమాజానికి సేవలు అందించాలని సూచించారు. జస్టిస్ ధీరజ్‌సింగ్ ఠాకూర్ మాట్లాడుతూ న్యాయవ్యవస్థపై ప్రజల ఆశలు, ఆకాంక్షలు నెరవేర్చేలా న్యాయమూర్తులు నిష్పక్షపాతంగా, పారదర్శకంగా న్యాయ వ్యవస్థను నిలపాల్సి ఉందన్నారు. రాష్ట్ర హైకోర్టు జడ్జి జస్టిస్ యు.దుర్గాప్రసాదరావు, అడ్వొకేట్ జనరల్ ఎస్.శ్రీరాం, జిల్లా పోర్టుఫోలియో జడ్జి జస్టిస్ నిమ్మగడ్డ వెంకటేశ్వర్లు, జిల్లా జడ్జి బి.సాయికళ్యాణ్ చక్రవర్తి పాల్గొన్నారు.



ఉద్యోగుల జేఏసీ ఆందోళన వాయిదా

- సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం రాతపూర్వకంగా హామీ ఇచ్చింది
- సత్వరమే 12వ పీఆర్సీ ఇవ్వడానికి అంగీకరించింది
- ఉద్యోగ సంఘాల జేఏసీ రాష్ట్ర చైర్మన్ బండి శ్రీనివాసరావు వెల్లడి



సాక్షి, అమరావతి: తమకు రావాల్సిన ఆర్థిక, ఆర్థికేతర ప్రయోజనాలు నెరవేర్చేందుకు ప్రభుత్వం రాతపూర్వక హామీ ఇవ్వడంతో ఈ నెల 27న ఉద్యోగ సంఘాల రాష్ట్ర జేఏసీ తలపెట్టిన 'బీఆర్‌టీఎస్ మహా ఆందోళన'ను తాత్కాలికంగా వాయిదా వేసినట్లు జేఏసీ చైర్మన్, ఏపీ ఎన్జీవోల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు బండి శ్రీనివాసరావు తెలిపారు. విజయవాడ ఏపీ ఎన్జీవో హోమ్‌లో ఆదివారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఉద్యోగులకు సత్వరమే 12వ పీఆర్సీ ప్రయోజనాలు కల్పించేలా పీఆర్సీ కమిషన్ వేగంగా పనిచేసేందుకు చర్యలు తీసుకుంటున్నామని, కాబట్టి మధ్యంతర భృతి అవసరం లేదని ప్రభుత్వం చెప్పిందని తెలిపారు. ఉద్యోగుల వైద్య ఖర్చుల నిమిత్తం ఆస్పత్రులకు చెల్లించాల్సిన మొత్తంలో రూ.70 కోట్లు, సీపీఎస్ ఉద్యోగులకు టీఏ, డీఏల నిమిత్తం చెల్లించాల్సిన మొత్తంలో రూ.100 కోట్లను వీలైనంత త్వరగా విడుదల చేసేందుకు చర్యలు తీసుకుంటామని మంత్రుల బృందం స్పష్టం చేసినట్లు చెప్పారు. పెన్షనర్ల డిమాండ్లలో ప్రధానమైన క్వాంటం ఆఫ్ పెన్షన్‌లో మార్పులకు చర్యలు తీసుకుంటామని చెప్పినట్లు తెలిపారు. కాంట్రాక్ట్ ఉద్యోగుల క్రమబద్ధీకరణలో ఉన్న అవాంతరాలను అధిగమించి వారికి న్యాయం చేసేందుకు కూడా ప్రభుత్వం తక్షణ చర్యలు తీసుకుంటుందని తమకు ఇచ్చిన ఒప్పంద పత్రంలో పేర్కొన్నట్లు వివరించారు. ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులకు 30 శాతం జీతం పెంపు కూడా తమ ఒప్పందంలో ఉందన్నారు. ఉద్యోగ సంఘాలు కోరిన డిమాండ్లలో కొన్నింటిని సాధించుకున్నామని తెలిపారు. ఉద్యోగ సంఘాల నేతలతో ప్రభుత్వం రాతపూర్వకంగా చేసుకున్న ఒప్పందం ప్రకారం డిమాండ్లను మార్చి నెలాఖరునాటికి పూర్తిగా నెరవేరుస్తుందనే ఆశాభావంతో తమ ఆందోళనను తాత్కాలికంగా విరమిస్తున్నట్లు తెలిపారు. అయినప్పటికీ తమ ఉద్యోగులను బెదిరించడాన్ని ఖండిస్తూ ఈ నెల 27వ తేదీన జిల్లాల్లో ఏపీ ఎన్జీవో కార్యాలయాల వద్ద ఉద్యోగులు నిరసన తెలుపుతారని చెప్పారు. ఈ సమావేశంలో జేఏసీ కార్యదర్శి కేవీ శివారెడ్డి, జేఏసీలోని వివిధ సంఘాలకు చెందిన నాయకులు పాల్గొన్నారు.

అమరావతి అభివృద్ధిపై బాబును నిలదీయరేం?

1,246వ రోజు రిలే దీక్షలో బహుజన పరిరక్షణ సమితి నేతలు



రిలే నిరాహార దీక్షలో పాల్గొని నిరసన తెలుపుతున్న నేతలు

తాడికొండ: అమరావతిని అభివృద్ధి చేయని చంద్రబాబును కులవాదులు ఎందుకు ప్రశ్నించరని బహుజన పరిరక్షణ సమితి నేతలు మండిపడ్డారు. గుంటూరు జిల్లా తుళ్లూరు మండలం తాళ్లాయపాలెం సీడ్ యాక్సిస్ రోడ్డు జంక్షన్‌లో మూడు రాజధానులకు మద్దతుగా సమితి ఆధ్వర్యంలో చేపట్టిన రిలే నిరాహార దీక్షలు ఆదివారం 1,246వ రోజుకు చేరాయి. పలువురు నాయకులు ప్రసంగిస్తూ అమరావతిలో రోడ్లు కూడా నిర్మించకుండా కాసులకు కక్కుర్తిపడి తాత్కాలిక నిర్మాణాలను చేపట్టిన చంద్రబాబును నిలదీయాలని కులవాదులకు సూచించారు. రాజధానిపై గత టీడీపీ ప్రభుత్వం ఇచ్చిన ప్రతి హామీని ప్రస్తుత సీఎం జగన్ కొనసాగిస్తున్నారని, ఇందులో భాగంగా రైతులకు ప్యాకేజీ రూపంలో ప్రతి ఏటా కౌలు అందిస్తూ రైతు కూలీలకు ఇచ్చే జీవన భృతి పింఛన్‌ను రూ.5,000లకు పెంచారని గుర్తు చేశారు. 29 గ్రామాల ప్రజలతోపాటు రాష్ట్ర ప్రజలను నిలువునా మోసం చేసినందునే గత ఎన్నికల్లో బాబును, ఆయన కుమారుడిని ఓడించారని చెప్పారు. సమితి నేతలు మాదిగాని గురునాథం, కొమరవల్లి కిషోర్‌బాబు, పులి దాసు, ఈపూరి ఆదాం, బి.సలోమీ, బి.సౌమ్య, పల్లె బాబు, బేతపూడి సాంబయ్య, నూతక్కి జోషి పాల్గొన్నారు.



మనం ఎంత పైకి ఎగిరితే,
ఎగరలేనివాళ్లకు అంత చిన్నగా కనబడతాం.
– ఫ్రెడరిక్ నీషే

సాక్షి
సోమవారం, 26 ఫిబ్రవరి 2024

సంజీవని కావాలి!

మనం మనుషులం, మర్త్యులం. పుట్టిన ప్రతి మనిషికీ మరణం తప్పదు. మరణించిన మనుషులు తిరిగి బతికిన ఉదంతాలు అరుదుగా వార్తల్లో కనిపిస్తుంటాయి. చితి మీద నుంచి లేదా శవపేటిక నుంచి అలా బతికి లేచిన వాళ్లు కూడా ఏదో ఒకరోజు మరణిస్తారు. 'జాతస్య హి ధ్రువో మృత్యుః ధ్రువం జన్మ మృతస్య చ/ తస్మాద పరిహార్యేర్థే న/ త్వం శోచితు మర్హసి' అని భగవద్గీతలో ఆ శ్రీకృష్ణ పరమాత్ముడే చెప్పాడు. పుట్టిన వారికి మరణం తప్పదని, మరణించిన వారు తిరిగి పుట్టక తప్పదని, ఇదంతా ఒక చక్రమని చాలా మతాలు నమ్ముతాయి. ఈ నమ్మకంలోని నిజానిజాలు ఆ భగవంతుడికే ఎరుక! ఇది ఇంతవరకు శాస్త్రీయంగా రుజువు కాలేదు. నమ్మకాలకు రుజువులతో పనిలేదు. నమ్మకాలను కలిగి ఉండటం ప్రజల హక్కు గనుక జనన మరణ చక్రంపై నమ్మకాన్ని అలా విడిచిపెడదాం.

మన పురాణాల్లో మరణించిన వారిని బతికించిన ఉదంతాలు ఉన్నాయి. అసురగురుడు శుక్రాచార్యుడి వద్ద మృతసంజీవని విద్య ఉండేదట! ఆ విద్యతోనే దేవతలతో జరిగిన యుద్ధాల్లో మరణించిన దానవులందరినీ ఆయన మళ్లీ బతికించేసేవాడట! అప్పట్లో దేవతల వద్ద ఈ విద్య ఉండేది కాదు. ఆ తర్వాత క్షీరసాగర మథనంలో పుట్టిన అమృతం తాగిన తర్వాతనే దేవతలు అమర్త్యులుగా మారారు. క్షీరసాగర మథనానికి ముందు ప్రమాద నివారణ చర్యల్లో భాగంగా దేవగురువు బృహస్పతి మృతసంజీవని విద్యను శుక్రుని వద్ద నేర్చుకోవడానికి స్వయంగా తన కొడుకు కచుడిని పంపించాడు. శుక్రాచార్యుడి ఆశ్రమంలో కచుడి ప్రవేశం ముక్కోణపు ప్రేమ గాథకు దారితీసింది. అదంతా వేరే కథ!

త్రేతాయుగం నాటి రామాయణంలో కూడా మృతులను బతికించిన సందర్భం కనిపిస్తుంది. అప్పట్లో ఈ విద్య వానర వైద్యుడు సుషేణుడికి తెలుసు. రామ రావణ యుద్ధంలో ఇంద్రజిత్తు బాణం దెబ్బకు లక్ష్మణుడు మూర్ఛిల్లినప్పుడు సుషేణుడి సలహాపై హనుమంతుడు సంజీవని మూలిక దొరికే సుమేరు పర్వతానికి వెళ్లి, మూలికను గుర్తించలేక ఏకంగా పర్వతాన్ని పెకలించుకొచ్చాడు. సుషేణుడు సంజీవని మూలికతో లక్ష్మణుడు తెప్పరిల్లేలా చేశాడు. అప్పటి వరకు యుద్ధంలో మరణించిన వానరులను తిరిగి బతికించాడు. ఇదంతా రామాయణ కథనం. ద్వాపర యుగం నాటికి మరణించినవాళ్లను తిరిగి బతికించే విద్య అంతరించిందేమో! కురుక్షేత్ర యుద్ధంలో మరణించిన వాళ్లెవరూ తిరిగి బతికిన దాఖలాలు కనిపించవు.

ఆధునిక కాలంలో మనమేం చేస్తున్నామంటే, భూమ్మీద సృష్టి మొదలైనది లగాయతు ఇప్పటి వరకు ఏమేమి అంతరించిపోయాయో లెక్కలు వేసుకుంటున్నాం. భూమ్మీద జీవసృష్టి మొదలయ్యాక దాదాపు ఐదువందల కోట్ల జీవరాశులు ఉద్భవించాయి. వాటిలో తొంభైతొమ్మిది శాతం అంతరించిపోయాయి. ఇప్పటికి మిగిలిన జీవజాతులు దాదాపు ఎనభై ఏడు లక్షలు మాత్రమే! వీటిలోనూ కొన్ని జీవజాతులు మన కళ్లముందే అంతరించిపోయే పరిస్థితులు ఉన్నాయని శాస్త్రవేత్తలు చెబుతున్నారు.

భూమ్మీద అంతరించిపోతున్నవి జీవరాశులు మాత్రమే కాదు. భూమ్మీద పుట్టిన మనుషులు సృష్టించుకున్న ఎన్నో నాగరికతలు, భాషలు అంతరించిపోయాయి. ఆధునికత అభివృద్ధి చెందే క్రమంలో ఎన్నో వస్తువులు, ఎన్నో కళలు కనుమరుగైపోయాయి. ప్రపంచవ్యాప్తంగా దాదాపు ఏడువేల భాషలను శాస్త్రవేత్తలు గుర్తించారు. వీటిలో దాదాపు ఐదువందల వరకు భాషలు పూర్తిగా అంతరించాయి. మనుగడలో ఉన్న భాషల్లోనూ కొన్ని సాహితీప్రక్రియలు కనుమరుగైపోయాయి. కొన్ని భాషలు కొన ఊపిరితో ఉన్నాయి. యునెస్కో రూపొందించిన 'వరల్డ్ అట్లాస్ ఆఫ్ లాంగ్వేజెస్' ప్రకారం ప్రస్తుత ప్రపంచంలో సుమారు రెండున్నరవేల భాషలు రానున్న కాలంలో కనుమరుగయ్యే స్థితిలో ఉన్నాయి. ఒక భాష అంతరించిపోతే, ఆ భాషతో ముడిపడి ఉన్న ప్రజల చరిత్ర అంతరించిపోతుంది. ఆ భాషలో నమోదై ఉన్న విలువైన సాహిత్యం, శాస్త్రవిజ్ఞానం; ఆ భాష ప్రజల సంస్కృతి కూడా తుడిచిపెట్టుకుపోతాయి.

ఇప్పటికే అంతరించిపోయిన భాషలను ఎటూ కాపాడుకోలేకపోయాం. కనీసం ప్రమాదం అంచుల్లో ఉన్న భాషలనైనా కాపాడుకోవడానికి ప్రయత్నిస్తే మంచిది. మరణించిన భాషలకు ప్రాణం పోసే మృతసంజీవని విద్య ఏదీ ఇప్పటివరకు లేదు. అయితే, అంతరించిపోయిన కొన్ని అరుదైన జీవరాశులకు తిరిగి ప్రాణం పోయడానికి శాస్త్రవేత్తలు ప్రయత్నిస్తున్నారు. నాలుగు శతాబ్దాల కిందట అంతరించిపోయిన 'డోడో' అనే ఎగరలేని పక్షిని జన్యుసాంకేతిక పరిజ్ఞానంతో తిరిగి పుట్టించడానికి అమెరికన్ శాస్త్రవేత్తలు ప్రయత్నిస్తున్నారు.

నాణ్యత అరుదైపోతున్న ప్రక్రియల విషయానికి వస్తే – తెలుగు సాహిత్యంలో ఇప్పుడు కొన ఊపిరితో ఉన్న ప్రక్రియ విమర్శ. ఆధునిక తెలుగు సాహిత్యంలో కందుకూరి వీరేశలింగంతో మొదలైన విమర్శ – రాచమల్లు రామచంద్రారెడ్డి నాటికి గొప్ప దశకు చేరుకుంది. కానీ, తర్వాత తర్వాత చప్పబడింది. రచయితలు రాటుదేలడానికి విమర్శకులు చాలా అవసరం. తెలుగు సాహిత్యంలో ప్రస్తుతం రచయితలకు, కవులకు కొదవలేదు గాని, విమర్శకుల లోటు బలంగా ఉంది. కొద్దిమంది విమర్శకులు ఈ ప్రక్రియను బతికించుకుంటూ వస్తున్నారు. అలాగని విమర్శ ప్రక్రియ క్షీణతకు కేవలం విమర్శకులను తప్పుపట్టలేం. విమర్శను తట్టుకునే శక్తి రచయితల్లో కొరవడటం కూడా ఈ పరిస్థితికి కారణం కావచ్చు. విమర్శ కనుమరుగైపోతే, సాహితీ సృజన అంతరించిపోవడానికి ఎంతోకాలం పట్టదు. ఇప్పుడు విమర్శకు పునర్జీవం కల్పించే సంజీవని కావాలి!

ఇచ్చిన హామీ కోసమే ఇంత పట్టు!

కామెంట్



కరణ్ థాపర్

వరి, గోధుమ, మరో 21 రకాల దిగుబడుల కనీస మద్దతు ధరకు చట్టపరమైన హామీని ఇవ్వాలని రైతులు డిమాండ్ చేస్తున్నారు. రైతులు మొత్తం 23 రకాల దిగుబడుల కనీస మద్దతు ధరకు హామీని ఇవ్వాలని పట్టు పడుతున్నారూ అంటే... ప్రభుత్వం దేనికైతే కట్టుబడి ఉన్నానని గతంలో హామీ ఇచ్చిందో ఆ హామీని నెరవేర్చాలని మాత్రమే వారు అడుగుతున్నారని అర్థం. ఇంకోలా చెప్పాలంటే... ఇచ్చిన మాటను నిలబెట్టుకోవాలని మాత్రమే వారు ప్రభుత్వాన్ని కోరుతున్నారు. మరోవైపు కనీస మద్దతు ధర ఇచ్చేందుకు ప్రభుత్వానికయ్యే ఖర్చు పది లక్షల కోట్ల వరకు ఉంటుందన్నది తప్పు. 'క్రిసిల్' అంచనా వేసిన 21,000 కోట్ల రూపాయలనేది వాస్తవానికి దగ్గరగా ఉంటుంది.

ఆర్థికశాస్త్రాన్ని ఆకళింపు చేసుకోవటం దుర్లభమనీ, అందులోని వ్యవసాయ ఉపాంగం గందరగోళ పరుస్తుందనీ భావించే వ్యక్తి మీరైతే గనుక... కనీస మద్దతు ధరకు ప్రభుత్వం చట్టపరమైన హామీ ఇవ్వాలన్న రైతుల డిమాండ్ గురించీ, అసలు కనీస మద్దతు ధరను ఎలా లెక్కించాలన్న విషయం గురించీ రెండు వైపుల నుంచి వినవస్తున్న పూర్తి భిన్నాభిప్రాయాలను మీకు తెలియపరిచే ప్రయత్నం చేస్తాను.

ఐసీఆర్ఐఈఆర్ (ఇండియన్ కౌన్సిల్ ఫర్ రీసెర్చ్ ఆన్ ఇంటర్నేషనల్ ఎకనామిక్ రిలేషన్స్) వ్యవసాయ సమాచార విభాగం ప్రొఫెసర్ అశోక్ గులాటీ తనకున్న వృత్తిపరమైన సౌలభ్యం ఆధారంగా కొన్ని కీలకమైన విషయాలను ప్రస్తావనలోకి తెచ్చారు. మొదటిది, భారతదేశంలోని మొత్తం వ్యవసాయ ఉత్పత్తులలో 27.8 శాతం మాత్రమే కనీస మద్దతు ధర (మినిమమ్ సపోర్ట్ ప్రైస్ – ఎంఎస్‌పీ) వర్తింపు కిందికి వస్తాయి. తత్ఫలితంగా 10 శాతం వ్యవసాయ కుటుంబాలు మాత్రమే ఎంఎస్‌పీ వల్ల లబ్ధి పొందుతున్నాయి. అత్యంత వేగంగా 8–9 శాతంతో పుంజుకుంటున్న కోళ్ల పరిశ్రమ, 7–8 శాతంతో దూకుడు మీదున్న మత్స్య పరిశ్రమ, 5–6 శాతంతో పొంగిపొర్లుతున్న పాల ఉత్పత్తి వంటి అభివృద్ధి చెందుతున్న రంగాలు ఎంఎస్‌పీ పరిధిలోకి రావు.

ఈ అంశాలను పరిగణనలోకి తీసుకుంటే, రైతులు డిమాండ్ చేస్తున్నట్లుగా 23 రకాల దిగుబడులకు కనీస మద్దతు ధరను చట్టపరమైన హామీగా ఇవ్వటం అన్నది 'రైతు వ్యతిరేక చర్య' కావచ్చునని గులాటీ అభిప్రాయం. ఎంఎస్‌పీ అన్నది మార్కెట్ ధర కంటే ఎక్కువగా ఉన్న సందర్భాలలో ప్రైవేటు వ్యాపారులు పంట దిగుబడులను కొనుగోలు చేయటానికి నిరాకరిస్తారు. ఆ కారణంగా అమ్ముడు కాని వ్యవసాయ ఉత్పత్తులు రైతుల దగ్గర భారీగా మిగిలిపోతాయి. చివరికి ప్రభుత్వమే రంగంలోకి దిగి ఆ మిగులును కొనుగోలు చేయక తప్పని పరిస్థితి తలెత్తుతుంది. మొదటిది రైతుకు విపత్కరమైనది. రెండోది ప్రభుత్వానికి ఆర్థికపరమైన చిక్కులను తెచ్చిపెట్టి, బడ్జెట్‌నే తలకిందులు చేసేది.

అయితే జవహర్‌లాల్ నెహ్రూ యూనివర్సిటీ ఎకనామిక్స్ ప్రొఫెసర్ హిమాన్షు ఈ వాదనను అంగీకరించడం లేదు. వరి, గోధుమ, మరో 21 రకాల దిగుబడుల కనీస మద్దతు ధరకు చట్టపరమైన హామీని ఇవ్వాలని రైతులు డిమాండ్ చేస్తున్నప్పటికీ... వాస్తవానికి గోధుమ, వరికి తప్ప మిగతా వాటికి మొదటసలు ఎంఎస్‌పీ అమలే కావటం లేదు. అయినప్పటికీ రైతులు మొత్తం 23 రకాల దిగుబడుల ఎంఎస్‌పీకి చట్టపరమైన హామీని ఇవ్వాలని పట్టు పడుతున్నారూ అంటే... ప్రభుత్వం దేనికైతే కట్టుబడి ఉన్నానని గతంలో హామీ ఇచ్చిందో ఆ హామీని నెరవేర్చాలని మాత్రమే అడుగుతున్నారని అర్థం చేసుకోవాలి. ఇంకోలా చెప్పాలంటే, ఇచ్చిన



మాటను నిలబెట్టుకోవాలని ప్రభుత్వాన్ని కోరడం అది!

ఎంఎస్‌పీ అమలు వల్ల కేవలం 10 శాతం వ్యవసాయ కుటుంబాలు మాత్రమే లబ్ధి పొందటానికి కారణం... ఆచరణలోకి వచ్చేటప్పటికి గోధుమ, వరికి తప్ప మిగతా రకాల దిగుబడులకు అది అమలు కాకపోవటమేనని హిమాన్షు అంటారు. వాటికీ అమలయ్యే పనైతే అప్పుడు లబ్ధిదారుల శాతం 30 వరకు, ఇంకా చెప్పాలంటే 40 వరకు పెరగొచ్చు. రెండోది... కోళ్లు, చేపలు, పాడి వంటి కొన్ని పరిశ్రమలు కనీస మద్దతు ధర లేకున్నా అభివృద్ధి చెందుతున్నాయంటే అర్థం పంటలకు అవసరం లేదని కాదనీ, అదొక తూగని వాదన అనీ హిమాన్షు అంటారు.

మరీ ముఖ్యంగా, హిమాన్షు అనడం – ఎంఎస్‌పీ అనేది ధరల స్థిరీకరణకు ఒక సాధనం అని! నిజానికి అభివృద్ధి చెందిన ప్రపంచ దేశాలలో కనీస మద్దతు ధర సదుపాయం లేని రైతులు చాలా తక్కువ. రెండోది – ఎంఎస్‌పీ కనుక మార్కెట్ ధర కంటే ఎక్కువగా ఉన్నప్పుడు ప్రభుత్వమే ప్రతిదీ కొనేస్తుందని కాదు. మొదట ఆ రెండు ధరల మధ్య వ్యత్యాసాన్ని తగ్గించటం వరకు మాత్రమే ప్రభుత్వం ఆ పని చేయవలసి ఉంటుంది. ఒకసారి అలా చేస్తే మార్కెట్ ధరలు వాటంతట అవే పెరుగుతాయి. ఆ దశలో ప్రభుత్వ జోక్యం నిలిచిపోతుందని అంటారు హిమాన్షు.

ఎంఎస్‌పీ అనేది ప్రభుత్వం రైతులకు ఇచ్చే రాయితీగా ప్రజలలో ఒక భావన ఉందన్న దానిపైన మాత్రం గులాటీ, హిమాన్షు ఇద్దరూ అంగీకరిస్తున్నారు. కనీస మద్దతు ధరను వినియోగదారులకు ఇచ్చే సబ్సిడీగా వారు భావిస్తున్నారు. ఉదాహరణకు, ప్రభుత్వం 80 కోట్ల మంది ప్రజలకు ఉచితంగా బియ్యం, గోధుమలు ఇస్తున్నప్పుడు అది ఆ ప్రజలు పొందుతున్న సబ్సిడీ అవుతుందని హిమాన్షు అంటారు.

అలాగే ఇద్దరూ కూడా కనీస మద్దతు ధరకు చట్టపరమైన హామీ ఇచ్చేందుకు అయ్యే ఖర్చును అంచనా వేయటం అంత తేలికైన విషయమైతే కాదని అంగీకరిస్తున్నారు. ప్రాంతానికీ ప్రాంతానికీ అంచనాలు మారుతుండటం మాత్రమే కాదు; అప్పటికి ఉన్న మార్కెట్ ధర, ఆ మార్కెట్ ధరకూ – ఎంఎస్‌పీకీ మధ్య ప్రభుత్వం ఎంత భారీగా వ్యత్యాసాన్ని తగ్గించాలి, ఎంతకాలం ఆ తగ్గింపు కొనసాగాలి అనే వాటి మీద అంచనాలు ఆధారపడి ఉంటాయి. హిమాన్షు మరో అంశాన్ని కూడా లేవనెత్తారు. ప్రభుత్వం కొనుగోలు చేసే ధరకూ, ప్రభుత్వం అమ్మే ధరకూ మధ్య వ్యత్యాసమే ప్రభుత్వానికి అయ్యే అసలు ఖర్చు అని ఆయన అంటారు. అంటే కనీసం పాక్షికంగానే అయినా ఖర్చు ప్రభుత్వ నియంత్రణలో ఉంటుంది. కాబట్టి ఎంఎస్‌పీకి చట్టపరమైన హామీ ఇచ్చేందుకు కాగల ఖర్చు పది లక్షల కోట్లు అన్న లెక్క స్పష్టంగా తప్పు. నిజానికి 'క్రిసిల్' అంచనా వేసిన 21,000 కోట్ల రూపాయల లెక్క వాస్తవానికి దగ్గరగా ఉంది.

ఇప్పుడు రెండో అంశానికి వద్దాం. కనీస మద్దతు ధరను ఎలా లెక్కించాలి? ఉత్పత్తి ఖర్చును, అందులో 50 శాతాన్ని లాభంగా కలిపి లెక్కించాలా? అలా చేస్తే ఆహార ద్రవ్యోల్బణం 25 నుంచి 35 శాతం పెరుగుతుందని గులాటీ అంటారు. అంతేకాక బడ్జెట్‌లో భారీ కేటాయింపులు అవసరమై, ప్రభుత్వ ఆహార పథకం అమలులో ఆర్థికపరమైన సంకట స్థితులు తలెత్తవచ్చు. ప్రముఖ ఆర్థికవేత్త స్వామినాథన్ అయ్యర్ కూడా 50 శాతాన్ని లాభంగా కలిపి మద్దతు ధర ఇవ్వటం సహేతుకం కాదని అంటున్నారు.

ఈ వాదనలతో హిమాన్షు విభేదిస్తున్నారు. ప్రభుత్వం చెబుతున్నట్లు ఇప్పటికే సీ2 (ఉత్పత్తి వ్యయం), అందులో 50 శాతం మొత్తాన్ని కలిపి వరికి, గోధుమలకు కనీస మద్దతు ధరలు వర్తింపజేస్తున్నారు. అయినప్పటికీ గులాటీ భయాలకు దగ్గరలో కూడా ద్రవ్యోల్బణం లాంటిదేమీ లేదని అంటున్నారు. ఇక అయ్యర్ సహేతుకం కాదన్న 50 శాతం లాభం గురించి మాత్రం, కావాలంటే అందులో మార్పులు చేసుకోవచ్చన్నారు. అయితే రైతులకు తగిన ప్రతిఫలం అవసరం. అలా పొందిన ప్రతిఫలాన్ని వారు తిరిగి ఖర్చు చేయటం అన్నది దేశ ఆర్థికాభివృద్ధికి తోడ్పడుతుంది. ఆ అభివృద్ధి అక్కడితో ఆగదు అంటారు హిమాన్షు.

చివరి ముఖ్య విషయం. రైతుల ఆదాయాలను పెంచడానికి ఉత్తమమైన మార్గం... అధిక విలువ గలిగిన పంటల వైవిధ్యానికి వ్యవసాయ ప్రోత్సాహకాలను అందివ్వటం అని గులాటీ అంటారు. దీనికి స్పందనగా హిమాన్షు ఎంఎస్‌పీని మొత్తం 23 రకాల పంటలకు వర్తింపచేస్తే చాలు వైవిధ్యాన్ని ప్రోత్సహించినట్లే అవుతుందని అంటున్నారు. ఆయన అనటం... రైతులు వ్యాపారులు కూడాననీ, అందువల్ల ప్రోత్సాహాలను పొందటానికి మొగ్గు చూపుతారనీ!

ఇదేమైనా మీకు ఉపకరించిందా? ఉపకరించిందనే భావిస్తాను.

వ్యాసకర్త సీనియర్ జర్నలిస్ట్

సోషల్ మీడియా

సోషల్ నెట్ వర్కింగ్ వెబ్‌సైట్లు ఫేస్‌బుక్, ట్విట్టర్‌లలో సెలబ్రిటీల 'మనసులోని మాట'లు తాజాగా ఇలా...!

ఎప్పటికీ అండ



రష్యా అక్రమ దురాక్రమణ యుద్ధానికి వ్యతిరేకంగా ఉక్రెయిన్ రెండేళ్లుగా వీరోచితంగా పోరాడింది. మేము ఉక్రెయిన్‌కు అండగా ఉంటాం. నేడూ రేపూ. ఉక్రెయిన్‌లోని సాహస జనాలందరికీ 'స్లావా ఉక్రెయిన్' (ఉక్రెయిన్‌కు యశము)!

– సన్నా మారిన్, ఫిన్‌లాండ్ ప్రధాని

చేజేతులా...!



దయచేసి పావురాలకు గింజలు వేయడం మానండి. నిజానికి మీరు... మీకే కాదు, మీ చుట్టుపక్కల వారికి కూడా శ్వాస సంబంధ వ్యాధులు రావడానికి తోడ్పడుతున్నారు.

– జుకర్ డాక్టర్, మధుమేహ వైద్యుడు

ఏదైనా చెప్పొచ్చు



నేను 1986లో సైకిల్ తొక్కుతుండగా కింద పడి నా మోకాళ్లు గాయపరుచుకున్నాను. ఇప్పుడెందుకు మీకు ఇది చెప్తున్నాను? మరి అప్పుడు సోషల్ మీడియా లేదుగా!

– ముకుల్ దేఖనే, కమెడియన్

అప్పుడే అయిపోతోందా?



కేవలం 2–3 రోజులు తక్కువ ఉన్నందుకే ప్రతి ఏడాదీ ఫిబ్రవరి నెల ఇట్టే ఎలా అయిపోతుందో అర్థం కాదు. అదే జనవరి మాత్రం సాగుతూనే ఉంటుంది.

– అర్చీసా రాయ్, వ్యాఖ్యాత

ఆరోగ్య మంత్రం



ఆరోగ్యకరమైన డైట్ అనేది, ఆరోగ్యకరమైన బంధంలాగే హితకరంగా, అదే సమయంలో బోరింగ్‌గా ఉంటుంది. కానీ సీజన్/వయసు మారేకొద్దీ అవి మిమ్మల్ని సెలబ్రేట్ చేస్తాయి. మిమ్మల్ని అన్ని రూపాల్లో, పాత్రల్లో ప్రేమిస్తాయి. ఆరోగ్యం, ప్రేమ అనేవి లక్ష్యాలు కావు. అవి రోజువారీ జీవితాన్ని సరళంగా, అందంగా, విజయవంతంగా మార్చగలిగేవి.

– రుజుతా దివేకర్, పోషణ నిపుణురాలు

ఇన్ బాక్స్

కొనసాగాల్సిన స్ఫూర్తి

వ్యవసాయ విస్తరణ కార్యక్రమాలకు ప్రసార మాధ్యమాలు కొండంత అండగా ఉండాలన్న ఉద్దేశ్యంతో కేంద్ర వ్యవసాయ మంత్రిగా శరద్ పవార్ ఉన్న సమయంలో 'కిసాన్ వాణి' పేరుతో కొత్త కార్యక్రమం ప్రారంభించారు. దీని ఖర్చు కేంద్ర వ్యవసాయ శాఖ భరించే ఏర్పాటు చేశారు. అప్పటినుంచి ఇదే పద్ధతి కొనసాగుతూ ఉంది. అసలు మన దేశంలో స్థానిక రేడియో కేంద్రాలు ఆ యా ప్రాంతాల జానపద కళారూపాలకు పెద్ద పీట వేస్తూ, స్థానిక వ్యవసాయ పరిస్థితులకు అనుగుణంగా వ్యవసాయం, అనుబంధ రంగాల ఆధునిక సమాచారంతో పాటు రైతులకు వాతావరణ సలహాలు, మార్కెట్ ధరలు తెలియచేస్తూ వారి జీవితాలలో వెలుగు నింపేందుకు శ్యామ్ పిట్రోడా సలహా మేరకు రాజీవ్ గాంధీ మానస పుత్రికలుగా సమున్నత లక్ష్యంతో ఏర్పాటు అయ్యాయి. ఈ కేంద్రాల నిర్వహణకు సంబంధించి విధి విధానాలు సమగ్రంగా రూపొందించారు. రైతుల భాగస్వామ్యంతో నిరంతరం వారి ప్రాంతాలకు వెళ్లి వారి అనుభవాలను రికార్డ్ చేస్తూ వచ్చారు. శాస్త్రవేత్తలు, రైతులను అనుసంధానం చేస్తూ కొత్త మార్పులకు శ్రీకారం చుట్టారు. సమగ్ర గ్రామీణ అభివృద్ధి కోసం నిర్దేశించిన అన్ని అంశాలలో మహిళల భాగస్వామ్యం అవసరాన్ని పల్లె పల్లెకూ తీసుకువెళ్ళారు. గ్రామ స్వరాజ్యం కోసం కార్యక్రమాలను ప్రత్యేక శ్రద్ధతో ప్రసారం చేస్తూ విజయాలు సాధించారు. అయితే కాలక్రమేణా ఆకాశవాణి లేదా ప్రసార భారతి అధికార గణం ఆచరణలో లక్ష్యాలకు నీళ్ళు వదలి, చివరకు నిధులను సైతం వేరే అవసరాలకు వాడుతూ కేంద్ర వ్యవసాయ శాఖను ఆలోచనలో పడేశారు.

తెలుగు రాష్ట్రాలలో ఆదిలాబాద్, నిజామాబాద్, వరంగల్, కొత్తగూడెం, కర్నూలు, అనంతపురం, తిరుపతి, మార్కాపురం కేంద్రాలలో కిసాన్ వాణి ప్రసారమవుతూ ఉంది. కర్నూలులో సుధాకర రెడ్డి, అదిలాబాద్‌లో సుమనస్పతి, కొత్తగూడెంలో శ్రీహరి, అనంతపురంలో నాగేశ్వరరెడ్డి 'కిసాన్ వాణి' నిర్వహణలో చొరవ తీసుకుని రైతులలో విశ్వసనీయత పెంచారు. నేటి ప్రధాని పదే పదే గుర్తు చేస్తున్న 'వోకల్ ఫర్ లోకల్' నినాదాన్ని 'కిసాన్ వాణి' ఆచరణలో చేసి చూపించింది. మరో వైపు మొన్ననే దేశ పూర్వ ప్రధాని, రైతు నాయకులు చౌదరీ చరణ్ సింగ్, సుప్రసిద్ధ వ్యవసాయ శాస్త్రవేత్త డాక్టర్ ఎమ్మెస్ స్వామినాథన్‌లకు దేశ అత్యున్నత పురస్కారం 'భారత రత్న' ప్రకటించారు. ఈ స్ఫూర్తితో 'కిసాన్ వాణి' మరింత వర్ధిల్లాలి.

– పలేటి గోపీచంద్,
ఆకాశవాణి విశ్రాంత కార్యక్రమ నిర్వాహకులు

దేశఖ్యాతిని పెంచిన నాయకుడు

అభిప్రాయం



పి.ఎల్. శ్రీనివాస్

'మన దేశ ప్రజల మానసిక స్థితిని నేను సరిగ్గా అంచనా వేయగలను. నా అంచనా ప్రకారం రానున్న లోక్ సభ ఎన్నికల్లో ఎన్డీఏ కూటమికి కచ్చితంగా 400 కంటే ఎక్కువ సీట్లు వస్తాయి. అందులో బీజేపీకి కనీసం 370 సీట్లు వస్తాయ'ని అన్నారు ప్రధాని మోదీ రాష్ట్రపతి ప్రసంగానికి ధన్యవాదాలు తెలిపే తీర్మానంపై లోక్‌సభలో జరిగిన చర్చలో పాల్గొంటూ!

రానున్న లోక్ సభ ఎన్నికల్లో 'మిషన్– 400' (దేశంలోని లోక్ సభ స్థానాల్లో 400 సీట్లలో గెలవడం) లక్ష్యంగా పనిచేయాలని ప్రధానమంత్రి నరేంద్రమోదీ బీజేపీ శ్రేణులకు పిలుపునిస్తూ, ఆ లక్ష్యం దిశగా వడివడిగా అడుగులు వేస్తున్నారు. ఢిల్లీలో ఇటీవల జరిగిన భారతీయ జనతా పార్టీ జాతీయ కార్యవర్గ సమావేశాల్లోనూ మోదీ ఇదే విషయాన్ని స్పష్టం చేశారు. దేశంలోని ప్రతిపక్ష పార్టీలు ఎన్నికల్లో పోటీ చేసే ధైర్యం కోల్పోయాయనీ, మూడో దఫా బీజేపీ ప్రభుత్వ పాలన ఎంతో దూరంలో లేదంటూ మోదీ బీజేపీ కార్యకర్తల్లో మనోస్థైర్యాన్ని నింపారు. అదే క్రమంలో జమ్మూ–కశ్మీర్‌కు స్వతంత్ర ప్రతిపత్తిని కల్పించే ఆర్టికల్ 370 రద్దు కోసం జీవితాంతం ఉద్యమించిన శ్యామప్రసాద్ ముఖర్జీకి ఇది నిజమైన నివాళి అవుతుందని అన్నారు.

ప్రధాని మోదీ పిలుపు అందుకున్న పార్టీ కార్యకర్తలంతా ఊరూరా, వాడవాడలా పర్యటిస్తూ ప్రజలతో మమేకమై, లక్ష్య సాధన దిశగా సమరోత్సాహంతో ముందుకు సాగుతున్నారు. తెలంగాణలో బీజేపీ చేపట్టిన 'విజయసంకల్ప యాత్ర' కూడా విజయవంతంగా జరుగుతున్నది.

ఈ ఏడాది ఆరంభంలో జనవరి 22న అయోధ్యలో జరిగిన రామ్ లల్లా ప్రాణప్రతిష్ఠ కార్యక్రమం మొదలుకొని భారతీయ జనతా పార్టీ జాతీయ కార్యవర్గ సమావేశాల దాకా ప్రధాని మోదీ ప్రసంగాల సరళితో బీజేపీ గ్రాఫ్ అనూహ్యంగా పెరుగుతూనే ఉన్నది. రామ మందిరం శాంతికీ, సహనానికీ, సామరస్యానికీ, సమన్వయానికీ చిహ్నమని చెప్పడం ప్రధాని మోదీ ఔన్నత్యానికి నిదర్శనం.

ఇవాళ ఈ దేశానికి దశ దిశ బీజేపీ మాత్రమేననీ, నరేంద్రమోదీ నాయకత్వమే దేశానికి శ్రీరామరక్ష అనీ దేశ ప్రజానీకం భావించడానికి ప్రధాన కారణం భారతదేశ చరిత్రలోనే అత్యంత విజయవంతమైన ప్రధానిగా మోదీ



చరిత్ర కెక్కడమే. భారత దేశ ఆర్థికరంగ బలోపేతానికి కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం తీసుకున్న చర్యల ఫలితంగా మరో 20 ఏండ్లలో భారతదేశం 35 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా అవతరిస్తుంది. ప్రపంచంలోనే అగ్ర దేశాల సరసన నిలవబోతున్నది. ప్రధానమంత్రి మోదీ అవలంబిస్తున్న జాతీయ, అంతర్జాతీయ విధానాలతో భవిష్యత్‌లో భారత్ ప్రపంచంలోనే అగ్రస్థాయి దేశంగా అవతరించనున్నది.

ఐక్యరాజ్యసమితి భద్రతా మండలిలో శాశ్వత సభ్యత్వం ఉన్న దేశాలు భారత ప్రధాని నరేంద్ర మోదీని అభినందిస్తూ, భారత్‌కు కూడా శాశ్వత సభ్యత్వం ఇవ్వడానికి సహకరిస్తామని హామీ ఇచ్చాయి. భారత్, ప్రపంచంలోనే అయిదో అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా అవతరించింది. ఇదంతా ప్రధానమంత్రి మోదీ నాయకత్వంలో కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం సాధించిన విజయమే. మోదీ దౌత్య విజయాలకు ప్రపంచ నేతలందరి నుంచి ప్రశంసలు లభిస్తున్నాయి. ఇవాళ నరేంద్ర మోదీ ప్రపంచ నాయకుడు అయ్యారు. అంతర్జాతీయ వేదికల మీద భారతదేశం విజయాలు మార్మోగుతున్నాయి.

సంక్షేమ పథకాలతో పేద ప్రజలను ఆదు కోవడం ప్రభుత్వాల బాధ్యత అని భావించిన బీజేపీ ప్రభుత్వం ఎన్నో సంక్షేమ పథకాలను విజయవంతంగా అమలు చేస్తూ, కోట్లాది భారతీయుల జీవితాల్లో వెలుగులు నింపుతున్నది. దేశ ప్రజల ఆర్థిక, ఆరోగ్య సంరక్షణ, సామాజిక భద్రత పరంగా సమాజంలోని అన్ని వర్గాలకూ నేరుగా ప్రయోజనం చేకూర్చేందుకు అనేక పథకాలను విజయవంతంగా అందిస్తున్నది. ఎవరు అంగీకరించినా, అంగీకరించకపోయినా ఒక విషయాన్ని మనమందరం గుర్తు చేసుకో వాల్సిన అవసరం ఉన్నది.


ఒకప్పుడు కశ్మీర్‌లో తిరగాలంటే ప్రజలు భయంతో వణికిపోయేవారు. ఇవాళ కశ్మీర్ రోడ్ల మీద స్వేచ్ఛగా క్రికెట్ ఆడుకుంటున్నారు. ఈ దేశాన్ని 55 ఏండ్లు పాలించిన కాంగ్రెస్ పాలనకు, పదేండ్లుగా పాలిస్తున్న బీజేపీ పాలనకు తేడా అదే. అందుకే భారతమాత సేవలో తరిస్తున్న ప్రధానమంత్రి నరేంద్రమోదీ మిషన్ – 400 లక్ష్యానికి అండగా నిలవడం అనే విషయాన్ని అందరూ బాధ్యతగా భావించాల్సి ఉన్నది.

వ్యాసకర్త బీజేపీ నాయకులు

వాదాలు – వివాదాలు

లోకంలో రోజురోజుకూ వాదోపవాదాల హోరు పెరుగుతున్నది. 'విద్యా వివాదాయ, ధనం మదాయ..'(ఖలులకు ధనం హెచ్చితే, మదం హెచ్చినట్టు, విద్య పెరిగితే వాదనలు పెరుగుతాయి) అన్న సుభాషితాన్ని గుర్తుంచుకొన్నవాళ్లు సుదీర్ఘ, శుష్క వాదనలకు దూరంగా ఉంటారు. ఆది శంకరులు కూడా తన శిష్యకోటికి కుతర్కాలు విరమించి, విలువైన కాలాన్ని వేదశాస్త్రాల అధ్యయనంలో వెచ్చించమని హితవు చెప్పారు.

వాదనల వాడీ, నిడివీ పెరిగిన కొద్దీ సత్సంబంధాలూ, సామరస్యం సమసిపోయి; శత్రుత్వాలూ, స్పర్థలూ బలపడడమే గానీ, ఎవరూ ఎవరినీ ఏ విషయంలోనూ ఒప్పించడమంటూ జరగదు. ఒప్పుకొన్నా, విధిలేక ఒప్పుకోవడమే జరుగుతుంది.



జ్యోతిర్మయం

ఇందుకు ముఖ్య కారణం – వాదనకు నిలకడయిన ఆధారం (తర్క పరిభాషలో 'ప్రతిష్ఠానం') అంటూ ఉండదు. 'తర్క అప్రతిష్ఠానాత్...' అని ఈ విషయాన్ని బ్రహ్మ సూత్రాలలోనే గుర్తించారు. సమర్థంగా, బలంగా, తెలివిగా వినిపిస్తే, ఏ వాదానికి ఆ వాదమే సబబనిపించవచ్చు. అంతే కాదు, కింది కోర్టులో నెగ్గిన వాదం, జిల్లా కోర్టులో ఓడిపోవచ్చు. హైకోర్టు ఒప్పుకొన్న వాదనకు సరిగ్గా విరుద్ధమైన వాదం సుప్రీం కోర్టుకు నచ్చవచ్చు. పదకొండుమంది న్యాయమూర్తుల పీఠం ఒక వాదం విని, వాళ్లలో ఆరుగురు దానితో ఏకీభవించడం, అయిదుగురు దాన్ని తోసిపుచ్చడం చూశాం. ఏది 'సరి' అయిన వాదం అంటాం? ఆపైన ప్రజలలో ఆ తీర్పుతో ఏకీభవించేవాళ్లు కొన్ని కోట్లమంది ఉంటే, పెదవి విరిచే వాళ్ళు మరిన్ని కోట్లమంది. వాదనలు పొడిగించి వాళ్లను వీళ్ళు గానీ, వీళ్ళను వాళ్లు గానీ మార్చలేరు. వైమనస్యాలు మాత్రమే పెంచుకోగలరు. కోర్టులలో న్యాయవాదులకు ఈ వాదోపవాదాలు తప్పవు. సామాన్య ప్రజకు శుష్కవాద ప్రియత్వం తగ్గించుకొంటేనే మేలు. పెంచుకొంటే హాని.

ఆధ్యాత్మిక విషయాలలో శుష్కవాదాలు మరీ వ్యర్థం. 'వాదో న అవలంబ్యః' (వాదాలు పెట్టుకోవద్దు) అని నారద భక్తి సూత్రాలు భక్తులను హెచ్చరిస్తాయి. 'బాహుల్య అవకాశత్వాత్, అనియతత్వాత్ చ' – ఈ వాదాలు బహు దిశలుగా సాగి, భిన్న గమ్యాలు చేరే అవకాశం ఉండడం చేత, ఒక క్రమపద్ధతిలో సాగవు గనక. తర్కాతీతమైన ఆధ్యాత్మిక విషయాలు కేవలం తర్కంతో పట్టుబడవు. ఆ తర్కం తెమిలేది కాదు.

– ఎం. మారుతి శాస్త్రి

గ్రహం అనుగ్రహం శ్రీ శోభకృత్ నామ సంవత్సరం, ఉత్తరాయణం, శిశిర ఋతువు, మాఘ మాసం, **తిథి:** బ.విదియ రా.9.21 వరకు, తదుపరి తదియ, **నక్షత్రం:** ఉత్తర రా.2.54 వరకు, తదుపరి హస్త, **వర్జ్యం:** ఉ.8.15 నుండి 10.02 వరకు, **దుర్ముహూర్తం:** ప.12.35 నుండి 1.21 వరకు, తదుపరి ప.2.54 నుండి 3.40 వరకు, **అమృతఘడియలు:** సా.6.54 నుండి 8.40 వరకు; **రాహుకాలం:** ఉ.7.30 నుండి 9.00 వరకు, **యమగండం:** ఉ.10.30 నుండి 12.00 వరకు, **సూర్యోదయం:** 6.26, **సూర్యాస్తమయం:** 6.01.

క్లుప్తంగా...

విజన్ లేని నాయకులు చంద్రబాబు, పవన్

మంత్రి బొత్స సత్యనారాయణ



విజయనగరం: ఎలాంటి విధి విధానాలు, విజన్ లేని నాయకులు చంద్రబాబు, పవన్ కళ్యాణ్ లని రాష్ట్ర విద్యా శాఖ మంత్రి బొత్స సత్యనారాయణ ధ్వజమెత్తారు. విజయనగరంలో ఆదివారం జరిగిన సీనియర్స్ సిటిజన్స్ ఆత్మీయ కలయిక సమావేశం అనంతరం ఆయన మీడియాతో మాట్లాడారు. గడిచిన ఐదేళ్లలో వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ పాలనను, కార్యక్రమాలను చూసి మంచి జరిగితే ఓటు వేయాలని ప్రజలను కోరుతున్నట్టు తెలిపారు. అదే సమయంలో చంద్రబాబు, పవన్‌కళ్యాణ్‌లు ప్రజలకు చేసిన మోసాన్ని, దగాను చూసి, చంద్రబాబు చేసిన పాపాలను, దోపిడీని చూసి ఓటు వేయాలని అడుగుతారా? అని ప్రశ్నించారు. టీడీపీ–జనసేన పొత్తుల్లో భాగంగా జనసేనకు 24 సీట్లు కేటాయించటం ద్వారా ఆ పార్టీ అధ్యక్షుడికి ఎంత విలువుందో అర్థమవుతోందన్నారు. ప్రజలను నమ్ముకున్న వైఎస్సార్‌సీపీ సింగిల్‌గానే పోటీ చేస్తుందని, ప్రజలు వైఎస్సార్‌సీపీకే పట్టం కడతారని బొత్స స్పష్టం చేశారు.

వైఎస్సార్‌సీపీలోనే వడ్డెరలకు సముచిత స్థానం

వడ్డెర కార్పొరేషన్ చైర్‌పర్సన్ దేవళ్ల రేవతి

పాత గుంటూరు: రాష్ట్రంలో వడ్డెరలకు సముచిత స్థానం కల్పించిన ఘనత వైఎస్సార్‌సీపీకే దక్కుతుందని రాష్ట్ర వడ్డెర కార్పొరేషన్ చైర్‌పర్సన్ దేవళ్ల రేవతి అన్నారు. గుంటూరులోని శ్రీ వెంకటేశ్వర విజ్ఞాన మందిరంలో ఆదివారం వడ్డెర హక్కుల పరిరక్షణ సమితి రాష్ట్ర అధ్యక్షులు దేవళ్ల వెంకట్ అధ్యక్షతన వడ్డెర యువ గర్జన సభ నిర్వహించారు. ముఖ్య అతిథులుగా దేవళ్ల రేవతి, మేయర్ మనోహర్ నాయుడు, గుంటూరు తూర్పు నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త నూరి ఫాతిమా పాల్గొన్నారు. రేవతి మాట్లాడుతూ సీఎం జగన్ గతంలో ఎన్నడూ లేని విధంగా వడ్డెరల సంక్షేమం కోసం అనేక పథకాలు అందించి అండగా నిలిచారన్నారు. నగర మేయర్ కావటి మనోహర్ నాయుడు మాట్లాడుతూ నేలను, కష్టాన్ని నమ్ముకుని జీవనం సాగించే వడ్డెరలను రాజకీయంగా, సామాజికంగా, ఆర్థికంగా ఆదుకున్న ఘనత సీఎం జగన్‌కే దక్కిందన్నారు. షేక్ నూరి ఫాతిమా మాట్లాడుతూ అందరూ ఐక్యంగా ఉండాలని పేర్కొన్నారు. సమావేశంలో పలు పార్టీల నేతలు పాల్గొన్నారు.

గత ఫలితాలే పునరావృతం!

టీడీపీ–జనసేన పంపకాలపై చేగొండి విశ్లేషణ

పాలకొల్లు సెంట్రల్: టీడీపీ–జనసేన మధ్య సీట్ల పంపకాన్ని చూస్తుంటే 2019 ఎన్నికల ఫలితాలే పునరావృతమయ్యే అవకాశాలున్నాయని రాజకీయ విశ్లేషకుడు, మాజీ ఎంపీ చేగొండి హరిరామజోగయ్య వ్యాఖ్యానించారు. టీడీపీని దేహీ అని అడగడం ఏమిటన్నారు. ఇది పొత్తు ధర్మం అనిపిస్తుందా? అని ప్రశ్నించారు. ఈ మేరకు ఓట్ల సంక్షోభానికి ఏది తెర? అంటూ ఆదివారం విడుదల చేసిన లేఖలో ఎంపీ చేగొండి పొత్తులపై విశ్లేషించారు. బలమైన అభ్యర్థుల ఆధారంగానే 24 నియోజక వర్గాలను ఎంపిక చేసినట్లు చంద్రబాబుకు పవన్ కళ్యాణ్ వంత పాడడం ఏమిటో తనకు అర్థం కావడం లేదన్నారు. పొత్తుల పేరుతో ప్రకటించిన సీట్లలో కమ్మకు 24, రెడ్లకు 17, కాపులకు 15, బీసీలకు 25 సీట్లు కేటాయించారన్నారు. కానీ జనాభా ప్రాతిపదికన చూస్తే బీసీలకు 50 శాతం, కాపులకు 25 శాతం, కమ్మవారికి 4, రెడ్లకు 6 శాతం సీట్లు దక్కాల్సి ఉందన్నారు. ఈ పంపకం రాష్ట్ర ప్రయోజనాల కోసం అని పవన్ కళ్యాణ్ చెప్పగలరా? అని సూటిగా నిలదీశారు.

మైనార్టీలకు టీడీపీ తీరని అన్యాయం

ముస్లిం జేఏసీ రాష్ట్ర కన్వీనర్ మునీర్ అహ్మద్ షేక్



లబ్బీపేట(విజయవాడతూర్పు): మైనార్టీలపై టీడీపీ అధినేత చంద్రబాబుకు చిత్తశుద్ధి లేదనీ, ఆయన పాలనలో తీవ్ర అన్యాయం చేశాడని ముస్లిం జేఏసీ రాష్ట్ర కన్వీనర్ మునీర్ అహ్మద్ షేక్ మండిపడ్డారు. టీడీపీ ప్రకటించిన 94 స్థానాల్లో ముస్లింలకు ఒక్క సీటు కేటాయించడమే ఇందుకు నిదర్శనమన్నారు. విజయవాడలోని ఆయన మీడియాతో మాట్లాడారు. గుంటూరులో ఆర్భాటంగా 'నారా హమారా' మీటింగ్ పెట్టి, ఎన్నో హామీలు ఇచ్చి, ఒక్కటి కూడా నెరవేర్చలేదని దుయ్యబట్టారు. బీజేపీతో దోస్తీ కోసం ముస్లింలను నిర్లక్ష్యం చేశాడనీ, ఈ అన్యాయాన్ని ప్రతి ఒక్కరూ గుర్తించాలని విజ్ఞప్తి చేశారు. తమకు నాలుగు శాతం రిజర్వేషన్లు కల్పించిన వైఎస్ రాజశేఖరరెడ్డిని ముస్లింలు ఎన్నటికీ మర్చిపోలేరన్నారు. నేడు ఆయన తనయుడు వైద్య, విద్య రంగానికి అత్యంత ప్రాధాన్యత ఇవ్వడం శుభపరిణామన్నారు.

దగా చేసిన బాబు: ఎంఏ హమీద్

కర్నూలు(అర్బన్): రాష్ట్రవ్యాప్తంగా ఉన్న ముస్లింలను టీడీపీ అధినేత చంద్రబాబు దగా చేశారని ఫెడరేషన్ ఆఫ్ ముస్లిమ్స్ అసోసియేషన్ (ఫోమా) అధ్యక్షులు ఎంఏ హమీద్ విమర్శించారు. ఆదివారం కర్నూలులో ఆయన విలేకరులతో మాట్లాడారు. చంద్రబాబు విడుదల చేసిన 94మంది అభ్యర్థుల జాబితాలో ఒక్క నంద్యాల అసెంబ్లీ సీటు మాత్రమే మైనార్టీలకు కేటాయించారనీ, జనాభా అధికంగా ఉన్న కర్నూలు అసెంబ్లీ స్థానాన్ని కూడా ముస్లింలకు కేటాయించలేదన్నారు. ఈ వైఖరిని ముస్లింలు గమనిస్తున్నారని, సరైన సమయంలో స్పందిస్తారని ఆయన అన్నారు.



తణుకులో తన అనుచరులతో సమాలోచనలు చేస్తున్న విడివాడ రామచంద్రరావు



కాకినాడ జిల్లాలో ఆమరణ నిరాహార దీక్షకు దిగిన పాటంశెట్టి సూర్యచంద్ర దంపతులు



కృష్ణాజిల్లా జనసేన అధ్యక్షుడు బండ్రెడ్డి రామకృష్ణ దిష్టిబొమ్మను దహనం చేస్తున్న కార్యకర్తలు

సైకిల్ సతమతం

పొత్తులతో ప్రకంపనలు ● అసంతృప్తితో నేతల భగ్గు ● పలుచోట్ల నిరసనలు, ర్యాలీలు

సాక్షి, అమరావతి, నెట్‌వర్క్: పొత్తు ప్రకంపనలు టీడీపీలో కొనసాగుతూనే ఉన్నాయి. సీట్లు దక్కని నేతలతోపాటు పొత్తులతో అవకాశం కోల్పోయిన అసంతృప్తులు ఆగ్రహంతో రగిలిపోతున్నారు. చంద్రబాబు తమను నమ్మించి మోసం చేశారని నిరసనలతో హోరెత్తిస్తున్నారు. జనసేనతో కలిసి 99 మంది ఉమ్మడి అభ్యర్థుల జాబితాను చంద్రబాబు ప్రకటించిన విషయం తెలిసిందే. దీనిపై పలు చోట్ల నేతలు భగ్గుమంటున్నారు.



బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా ఆలమూరులో పవన్ కళ్యాణ్ ఫ్లెక్సీని చించి వేస్తున్న జనసేన నాయకులు

- విజయనగరం జిల్లా గజపతినగరం టీడీపీ టికెట్‌ను తన అన్న కుమారుడు కొండపల్లి శ్రీనివాస్‌కి కేటాయించడాన్ని నిరసిస్తూ మాజీ ఎమ్మెల్యే కేఏ నాయుడు ఆదివారం గజపతినగరంలో ప్రదర్శన నిర్వహించారు. అనకాపల్లి సీటును జనసేనకు కేటాయించడాన్ని నిరసిస్తూ నల్ల రిబ్బన్లతో నిరసన ప్రదర్శనలు జరిగాయి.
- టీడీపీ బలోపేతం కోసం కష్టపడ్డ తనను అవమానించారని, ఇండిపెండెంట్‌గా ఎన్నికల బరిలోకి దిగుతానని ఉండి మాజీ ఎమ్మెల్యే వేటుకూరి శివ రామరాజు ప్రకటించారు. చంద్రబాబు తనకు కనీస గౌరవం ఇవ్వకుండా పక్కన పెట్టారని మండిపడ్డారు. సిట్టింగ్ ఎమ్మెల్యే రామరాజుకు సహకరించేది లేదన్నారు.
- శ్రీసత్యసాయి జిల్లా పెనుకొండ సీటును సవితకు ఇవ్వడంపై మాజీ ఎమ్మెల్యే బీకే పార్థసారథి వర్గం నిరసనలతో హోరెత్తిస్తోంది. ఆదివారం పెనుకొండలో పార్థసారథి అనుచరులు భారీ బైక్ ర్యాలీతో బల ప్రదర్శన నిర్వహించారు. విజయవాడ వెళ్లి చంద్రబాబుతో తాడోపేడో తేల్చుకుంటానని పార్థసారథి ప్రకటించారు. కనీసం సంప్రదించకుండా అభ్యర్థిని ఎంపిక చేయడంపై మాజీ ఎమ్మెల్యే ఉన్నం హనుమంతరాయ చౌదరి అసహనం వ్యక్తం చేశారు. త్వరలో కార్యాచరణ ప్రకటిస్తామని కార్యకర్తల సమావేశంలో పేర్కొన్నారు.
- అన్నమయ్య జిల్లా తంబళ్లపల్లె అభ్యర్థిగా జయచంద్రారెడ్డిని ప్రకటించడంపై పార్టీ నేతలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. శంకర్‌యాదవ్‌కి టికెట్ ఇవ్వాలని డిమాండ్ చేస్తూ బి.కొత్తకోటలో నిరసన నిర్వహించారు.
- నిడదవోలు నుంచి కందుల దుర్గేష్ బరిలోకి దిగడం దాదాపుగా ఖరారైంది. దీనిపై నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి, మాజీ ఎమ్మెల్యే బూరుగుపల్లి శేషారావుతోపాటు కుందుల సత్యనారాయణ వర్గాలు మండిపడుతున్నాయి. వారంతా టీడీపీకి మూకుమ్మడి రాజీనామా చేసే యోచనలో ఉన్నారు.

జనసేనలోనూ మంటలు...

- తణుకు జనసేన టికెట్ ఆశించి భంగపడ్డ విడివాడ రామచంద్రరావు టీడీపీ అభ్యర్థిగా ప్రకటించిన అరిమిల్లి రాధాకృష్ణపై నిప్పులు కక్కుతున్నారు. తన ఇంటికి రావద్దంటూ అరిమిల్లిపై మండిపడ్డారు. విడివాడ స్వతంత్ర అభ్యర్థిగా పోటీచేసే యోచనలో ఉన్నారు.
- కాకినాడ జిల్లా జగ్గంపేట టికెట్ టీడీపీ నేత జ్యోతుల నెహ్రూకు కేటాయించడాన్ని నిరసిస్తూ జనసేన నియోజకవర్గ ఇన్‌చార్జి పాటంశెట్టి సూర్యచంద్ర ఆలయాల్లో పూజలు చేసి ఆమరణ నిరాహార దీక్షకు దిగారు. 48 గంటల్లో అధినేత స్పందించకుంటే తమ కార్యాచరణ ప్రకటిస్తామని పార్టీ గోకవరం మండలాధ్యక్షుడు ఉంగరాల మణిరత్నం చెప్పారు.
- బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా ఆలమూరులోని జనసేన కార్యాలయం వద్ద పార్టీ నాయకులు చల్లా బాబీ, గుత్తుల నాగేశ్వరరావు, బి.రాంబాబు ఆధ్వర్యంలో కార్యకర్తలు పవన్ కళ్యాణ్ ఫ్లెక్సీలను చించి రోడ్డుపై వేసి నిప్పంటించారు. అతి తక్కువ సీట్లకు ఒప్పందం కుదుర్చుకుని పవన్ కళ్యాణ్ పార్టీ శ్రేణులకు తీరని ద్రోహం చేశారని మండిపడ్డారు. కొత్తపేట నియోజకవర్గాన్ని టీడీపీకి కట్టబెట్టడం దారుణమన్నారు. పదేళ్లుగా అహర్నిశలూ శ్రమిస్తే పార్టీని టీడీపీకి అప్పగించి తమను నట్టేట ముంచారని ఆవేదన వ్యక్తం చేశారు.
- కాకినాడ జిల్లా పెద్దాపురం సీటును టీడీపీ సిట్టింగ్ ఎమ్మెల్యే నిమ్మకాయల చినరాజప్పకు కేటాయించటాన్ని వ్యతిరేకిస్తూ జనసేన నేతలు పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి తుమ్మల బాబు ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించారు.
- పెడన సీటు జనసేనకు కేటాయించకపోవడంపై పార్టీ శ్రేణులు భగ్గుమంటున్నాయి. పెడన ఎమ్మెల్యే సీటు జనసేనకు కేటాయించకపోవడంతో ఆ పార్టీ కృష్ణా జిల్లా పార్టీ అధ్యక్షుడు బండ్రెడ్డి రామకృష్ణ దిష్టిబొమ్మను కార్యకర్తలు ఆదివారం దహనం చేశారు. ఈ సందర్భంగా కృష్ణాజిల్లా పెడన మండలం బల్లిపర్రు గ్రామంలో ఆ పార్టీ నాయకుడు సమ్మెట బాబు విలేకరులతో మాట్లాడుతూ పవన్‌ను గుడ్డిగా నమ్మామని అన్నారు. గౌరవప్రదమైన పొత్తుకు విఘాతం కలిగినట్లుగా జనసైనికులు భావిస్తున్నారని తెలిపారు.

చిత్తూరులో బీసీలు భగ్గు

టీడీపీ ఉమ్మడి చిత్తూరు జిల్లాలో రిజర్వుడు స్థానాలను మినహాయించి చిత్తూరు (కమ్మ), కుప్పం (కమ్మ), నగరి (కమ్మ), తంబళ్లపల్లె (రెడ్డి), పలమనేరు (రెడ్డి) స్థానాలను ఓసీలకు కేటాయించడంపై బీసీలు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. చిత్తూరు అసెంబ్లీ స్థానాన్ని ఆశించిన బీసీ నేత సీఆర్ రాజన్‌కు టీడీపీ మొండి చేయి చూపడంపై ఆయన సామాజిక వర్గం మండిపడుతోంది. శ్రీకాళహస్తి నుంచి కుప్పం వరకు బస్సు యాత్ర నిర్వహించి బీసీలను చైతన్యం చేయాలని నిర్ణయించింది. బెంగళూరు నుంచి దిగుమతి చేసుకున్న గురజాల జగన్‌మోహన్ నాయుడుకు చిత్తూరు టికెట్ ఇవ్వడంపై కాపు నేతలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. చిత్తూరుకు చెందిన కాపు నేతలు కటారి హేమలత, ఆదికేశవులు కుమార్తె తేజస్విని, మనవరాలు చైతన్య, కాజూరు బాలాజీ తదితరులు టీడీపీ టికెట్ ఆశించి భంగపడ్డారు.

టీడీపీ సభలో గాలిలో లేచిన కుర్చీలు

- ఎమ్మిగనూరు మాజీ ఎమ్మెల్యే అనుచరులు హల్‌చల్
- మాచాని సోమనాథ్‌పై దూసుకుపోయిన బీవీ అనుచరులు
- సభకు దూరంగా ఆలూరు నియోజకవర్గ నాయకులు



కుర్చీలు విసురుకుంటున్న ఇరువర్గాల కార్యకర్తలు

కర్నూలు సిటీ: తెలుగు దేశం పార్టీలో విభేదాలు భగ్గుమన్నాయి. కర్నూలు శివారులోని ఎంఆర్‌సీ ఫంక్షన్ హాలులో ఆ పార్టీ జిల్లా స్థాయి జయహో బీసీ సభను ఆదివారం నిర్వహించారు. ఈ సమావేశానికి కర్నూలు పార్లమెంట్ పరిధిలోని నియోజకవర్గాలకు చెందిన నాయకులు హాజరయ్యారు. ఎమ్మిగనూరు నియోజకవర్గానికి చెందిన కోట్ల వర్గీయుడిగా గుర్తింపుపొందిన మాచాని సోమ్‌నాథ్ సభకు హాజరయ్యారు. ఆయనను ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు బీటీ నాయుడు వేదికపైకి ఆహ్వానించారు. దీంతో సమావేశంలో బీవీ అనుచరులు ఈలలు, కేకలు వేస్తూ వేదికపైకి సోమ్‌నాథ్ వెళ్లకుండా అడ్డుకునే ప్రయత్నం చేశారు. ఈ సందర్భంలో బీవీ అనుచరులు, సోమ్‌నాథ్ అనుచరులు కుర్చీలు పైకెత్తి బాహాబాహీకి దిగారు. కార్యకర్తలను జిల్లా అధ్యక్షుడు సముదాయించినా వినిపించుకోలేదు. 'ఓ జయ నాగేశ్వరరెడ్డీ .. నీ అనుచరులకు చెప్పుకుంటావా? సమావేశం నుంచి వెళ్లిపోతావా?' అంటూ అధ్యక్షుడు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇటీవలే ఆ పార్టీ అధ్యక్షుడు చంద్రబాబు నాయుడు ప్రకటించిన ఎమ్మెల్యే అభ్యర్థుల జాబితాలో తమ నాయకుడి పేరు రాకపోవడం..ఈసారి ఎమ్మిగనూరు నియోజకవర్గంలో ప్రస్తుతం ఇన్‌చార్జ్‌గా పని చేస్తున్న బీవీ జయనాగేశ్వరరెడ్డికి ఏ సర్వేల్లో కూడా అనుకూలంగా రాకపోవడంతోనే సీటు ఖరారు చేయలేదని టీడీపీ వర్గాలు చెబుతున్నాయి. వైఎస్సార్‌సీపీ తరుపున ఇన్‌చార్జిగా బలమైన బీసీ సామాజిక వర్గానికి చెందిన మాజీ ఎంపీ బుట్టా రేణుకను ప్రకటించడంతో అక్కడ టీడీపీ అభ్యర్థిగా బీసీలకే ఇవ్వాలని టీడీపీ నిర్ణయించింది. ఇందులో భాగంగానే ఇప్పటికే బీవీ వర్గానికి చెందిన వారు చంద్రబాబు నాయుడు ఆలోచనలపై తీవ్ర ఆగ్రహంతో ఉన్నారు. తమ నాయకుడికి సీటు ఇవ్వకపోతే పార్టీకి రాజీనామా చేస్తామని హెచ్చరించారు.

చంద్రబాబు నిర్ణయంపై అసంతృప్తి

ఉమ్మడి జిల్లాల్లోని తొమ్మిది నియోజకవర్గాలకు అభ్యర్థులను ఖరారు చేసిన చంద్రబాబు..మిగిలిన నియోజకవర్గాల్లో ఖరారు చేయకపోవడంతో అధినేత నిర్ణయంపై ఆ పార్టీ నాయకులు తీవ్ర ఆగ్రహంతో ఉన్నారు. ఆలూరు నియోజకవర్గం పంచాయతీ తేల్చకపోవడంతో ఆ నియోజకవర్గానికి చెందిన నాయకులు, కార్యకర్తలు జిల్లా స్థాయిలో జరిగిన జయహో బీసీ సభకు దూరంగా ఉన్నారు. ఇక ఆదోనిలో పొత్తులో భాగంగా జనసేనకు ఇస్తారని టీడీపీ నేతలు ఏ కార్యక్రమం కూడా చేయడం లేదు. మంత్రాలయంలోనూ అదే పరిస్థితి. ఈసారి అక్కడ బీసీలకు ఇస్తారని ప్రచారం ఉండడంతో ఇన్‌చార్జ్ తిక్కారెడ్డి అధినేత పట్ల అసంతృప్తితో రగిలిపోతున్నారు. పార్టీ కోసం ఇన్నేళ్లు పని చేసిన వారికి ప్రాధాన్యతనివ్వాలని డిమాండ్ చేశారు. సభలో మాజీ మంత్రి కేఈ ప్రభాకర్, తెలుగు యువత మాజీ ఉపాధ్యక్షులు రామకృష్ణ, మాజీ ఎంపీపీ కృష్ణారెడ్డి, వివిధ నియోజకవర్గాల ఇన్‌చార్జ్‌లు, పార్టీ అనుబంధ సంఘాల నాయకులు పాల్గొన్నారు.

టీడీపీపై 'ధర్మవరం' తిరుగుబావుటా?

- అహర్నిశలు కృషిచేసినా ఫలితం లేదని ఆవేదన
- డోన్ నుంచి స్వతంత్ర అభ్యర్థిగా పోటీకి సిద్ధం!



ధర్మవరం సుబ్బారెడ్డి

డోన్ : నంద్యాల జిల్లా డోన్ అసెంబ్లీ స్థానం నుంచి తెలుగుదేశం పార్టీ రెబల్ అభ్యర్థిగా పోటీ చేయాలని ఆ పార్టీ సీనియర్ నాయకుడు, నియోజకవర్గ ఇన్‌చార్జ్ ధర్మవరం సుబ్బారెడ్డి నిర్ణయించుకున్నట్లు తెలిసింది. మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ఆదేశాల మేరకు మూడేళ్లుగా టీడీపీని తన భుజస్కంధాలపై మోసి ఆర్థికంగా నష్టపోయిన ఆయన తనకు టికెట్ రాకపోవడంపై అనుచరుల వద్ద బాధపడుతున్నట్టు సమాచారం. నియోజకవర్గంలో చచ్చిపోయిన పార్టీని బతికించేందుకు అహర్నిశలూ కృషిచేసినా ఫలితం లేకపోయిందని, ఇన్నాళ్లూ పార్టీ తరపున ఒక్క కార్యక్రమాన్నీ నిర్వహించని కోట్ల, కేఈ కుటుంబాల మాటలు నమ్మి చంద్రబాబు తనకు టికెట్ ఇవ్వలేదని మదనపడుతున్నట్టు తెలిసింది. కార్యకర్తలు, అనుచరులతో రెండు రోజులుగా చర్చిస్తున్న ధర్మవరం మరో రెండు రోజుల్లో తన భవిష్యత్ కార్యాచరణను ప్రకటించే అవకాశాలు ఉన్నాయని సమాచారం. కార్యకర్తల అభీష్టం మేరకు వచ్చే అసెంబ్లీ ఎన్నికల బరిలో స్వతంత్ర అభ్యర్థిగా పోటీకి రంగం సిద్ధం చేసుకుంటున్నట్లు తెలిసింది.

టీడీపీ కార్యకర్త ఘరానా మోసం

- జగనన్న ఇంటి పట్టాపై రుణం..రూ.2.80 లక్షల స్వాహా
- పోలీసులను ఆశ్రయించిన బాధితురాలు

దెందులూరు: ఏలూరు జిల్లా దెందులూరు మండలం రామారావుగూడెం పంచాయతీ మలకచర్లలో టీడీపీ కార్యకర్త గొట్టాపు సాయికృష్ణ భారీ మోసానికి తెర తీశాడు. మలకచర్లకి చెందిన చోడవరపు వెంకటలక్ష్మి భీమడోలు ఎస్‌బీఐలో జగనన్న ఇంటి పట్టా మీద రూ.2.80 లక్షల రుణానికి దరఖాస్తు చేసుకుంది. రుణాన్ని సాయికృష్ణ మంజూరు చేయించి ఆమె బ్యాంక్ పుస్తకం, ఏటీఎం కార్డులను 5 రోజుల పాటు తన వద్దనే ఉంచుకుని రుణం మొత్తం కాజేశాడు. బ్యాంక్ సిబ్బంది లబ్ధిదారుల ఇళ్లకు వెళ్లిన సందర్భంగా రుణం మంజూరైన విషయం వెంకటలక్ష్మికి తెలిసింది. తన ఖాతాలోని రుణానికి సంబంధించిన నగదు మాయం కావడంతో దెందులూరు పోలీసులకు ఫిర్యాదు చేసింది. దీనిపై పోలీసులు విచారణ చేస్తున్నారు. బాధితురాలికి న్యాయం చేయాలని వైఎస్సార్‌సీపీ రామారావుగూడెం గ్రామ కమిటీ అధ్యక్షుడు పర్వతనేని వెంకట్రాజు, పర్వతనేని నరేంద్ర, పోతునూరు బాబ్జి, పుల్లా శివప్రసాద్ డిమాండ్ చేశారు.

చిలకలూరిపేటలో టీడీపీ అల్లరిమూకల అరాచకం

- వైఎస్సార్‌సీపీ ఫ్లెక్సీలు చింపి, ఫ్రేమ్‌లు విరగ్గొట్టి విధ్వంసం
- వీడియో తీసేందుకు ప్రయత్నించిన దళిత మహిళపై దాడికి యత్నం

చిలకలూరిపేట: పట్టణంలో టీడీపీ అల్లరిమూకలు పేట్రేగిపోయాయి. వైఎస్సార్‌సీపీ ఫ్లెక్సీలు చింపి, ఫ్రేమ్‌లు విరగ్గొట్టి విధ్వంసం సృష్టించాయి. మాజీ మంత్రి ప్రత్తిపాటి పుల్లారావును టీడీపీ చిలకలూరిపేట నియోజకవర్గ అభ్యర్థిగా ప్రకటించడంతో శనివారం రాత్రి 10.30గంటల సమయంలో ఆ పార్టీ కార్యకర్తలు బాణసంచా కాల్చి సంబరాలు నిర్వహించారు. ఈ క్రమంలో పట్టణంలోని జాతీయ రహదారిపై ఎన్టీఆర్ సెంటర్ నుంచి విజయా బ్యాంకు సెంటర్ వరకు వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ సమన్వయకర్త మల్లెల రాజేష్‌నాయుడు ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన ఫ్లెక్సీలను చింపి విధ్వంసం సృష్టించారు. ఫ్లెక్సీలు చించివేస్తున్న దృశ్యాలను ఫోన్‌లో వీడియో తీసేందుకు దళిత మహిళ, వైఎస్సార్‌సీపీ సోషల్ మీడియా క్రియాశీలక కార్యకర్త చెల్లి శారద ప్రయత్నించగా... ఆమెపై దాడి చేసేందుకు వెంటపడ్డారు. ఆమె ప్రాణభయంతో పారిపోయి పోలీసులకు ఫిర్యాదు చేశారు. టీడీపీ అల్లరిమూకల అరాచకాలతో జాతీయ రహదారిపై వెళుతున్న వాహనదారులతోపాటు పట్టణ ప్రజలను భయభ్రాంతులకు గురిచేసింది.

చంపాలని వెంబడించారు: చెల్లి శారద

'నేను శనివారం రాత్రి 10.30 సమయంలో టిఫిన్ తీసుకుని ఇంటికి వెళుతుండగా ప్రత్తిపాటి పుల్లారావు అనుచరులు బాణసంచా కాలుస్తూ ఊరేగింపు నిర్వహిస్తున్నారు. ఎన్టీఆర్ సెంటర్ నుంచి జాతీయ రహదారి డివైడర్‌పై ఏర్పాటు చేసిన వైఎస్సార్‌సీపీ ఫ్లెక్సీలపై వారు కర్రలతో కసిగా కొడుతూ చింపివేయడం గమనించి ఆ దృశ్యాలను వీడియో తీయడానికి ప్రయత్నించాను. దీంతో టీడీపీ కార్యకర్తలు నన్ను కులం పేరుతో దూషిస్తూ కర్రలు తీసుకుని వెంటపడ్డారు. ప్రాణభయంలో వారి నుంచి తప్పించుకుని పారిపోయాను. టీడీపీ కార్యకర్తల్లో గట్టినేని సాయి, జవ్వాజి హర్ష, మరికొందరు నన్ను వెంబడించారు. నాకు ఏదైనా హాని జరిగితే ప్రత్తిపాటి పుల్లారావు, ఆయన భార్య బాధ్యత వహించాల్సి ఉంటుంది.' అని చెల్లి శారద చెప్పారు.

పవన్‌ను అవమానించిన చంద్రబాబు

మంత్రి చెల్లుబోయిన వేణుగోపాలకృష్ణ



రాజమహేంద్రవరం రూరల్: జనసేన అధినేత పవన్ కళ్యాణ్‌ను టీడీపీ అధ్యక్షుడు చంద్రబాబు పావలాకు కూడా పని చేయని స్థితికి తీసుకొచ్చారని రాష్ట్ర బీసీ సంక్షేమం, సమాచార, పౌర సంబంధాలు, సినిమాటోగ్రఫీ శాఖల మంత్రి చెల్లుబోయిన శ్రీనివాస వేణుగోపాలకృష్ణ ఎద్దేవా చేశారు. టీడీపీ–జనసేన కూటమి సీట్ల ప్రకటనపై ఆయన స్పందించారు. బాబుకు ఆయన కులమే ముఖ్యమని విమర్శించారు. రాజమహేంద్రవరం రూరల్ జనసేన టికెట్ కందుల దుర్గేష్‌కు ఇవ్వకుండా అన్యాయం చేశారని, ఈ సీటు ఆయనకు ఇస్తామని ప్రకటించి, తీవ్రంగా అవమానించారన్నారు. సీట్ల ప్రకటన చూస్తే పవన్‌ను కూడా చంద్రబాబు అవమానించినట్టు అర్థమవుతోందని, ఆయన ట్రాప్‌లో పవన్ ఎందుకు పడుతున్నారని ప్రశ్నించారు. రిజర్వేషన్ల విషయంలో అప్పుడు ముద్రగడ పద్మనాభం, సీట్ల విషయంలో నేడు దుర్గేష్.. చంద్రబాబు ట్రాప్‌లో పడి మోసపోయారన్నారు.

బీసీలంటే చంద్రబాబుకు చిన్నచూపు

- వైఎస్సార్‌సీపీ 50 శాతం బీసీలకు ఇచ్చింది
- బీసీ ఉద్యోగుల సంఘం గౌరవ అధ్యక్షుడు వెంకటేశ్వర్లు



మాట్లాడుతున్న ఆలా వెంకటేశ్వర్లు, పక్కన ఉగ్గం సాంబశివరావు, పీవీ రమణయ్య

గుంటూరు (మెడికల్): టీడీపీ అధినేత చంద్రబాబుకు బీసీలంటే చిన్నచూపు ఉందని బీసీ ఉద్యోగుల సంఘం గౌరవ అధ్యక్షుడు డాక్టర్ ఆలా వెంకటేశ్వర్లు ధ్వజమెత్తారు. ఆదివారం గుంటూరులో మీడియాతో మాట్లాడుతూ.. చంద్రబాబు ప్రకటించిన 99 ఎమ్మెల్యే, ఎంపీ అభ్యర్థుల జాబితాలో బీసీలకు 18 సీట్లు మాత్రమే కేటాయించడంపై మండిపడ్డారు. జనాభాలో 60 శాతం ఉన్న బీసీలకు కేవలం 18 సీట్లేనా అని ప్రశ్నించారు. ఈ మాత్రం దానికే బీసీలకు పెద్దపీట వేస్తున్నామని చంద్రబాబు చెప్పటం హాస్యాస్పదంగా ఉందని చెప్పారు. గెలుపు గుర్రాలకే సీట్లు ఇస్తున్నామని చంద్రబాబు చెబుతున్నారని, 2019లో మీ గెలుపు గుర్రాలు ఏమయ్యాయని ప్రశ్నించారు. బీసీలకు సముచిత సీట్లు కేటాయించాలని, జనాభా నిష్పత్తిలో ప్రతి పార్లమెంటరీ నియోజకవర్గ పరిధిలో మూడు అసెంబ్లీ స్థానాలను బీసీలకు ఇవ్వాలని డిమాండ్ చేశారు.

బీసీలు బలమైన అభ్యర్థులు

బీసీలు బలహీన అభ్యర్థులు కాదనే విషయాన్ని చంద్రబాబు గుర్తు చేసుకోవాలని వెంకటేశ్వర్లు హితవు పలికారు. టీడీపీ వ్యవస్థాపకుడు ఎన్టీ రామారావును కల్వకుర్తిలో ఓడించింది బీసీ అభ్యర్థి అనే విషయాన్ని గుర్తు పెట్టుకోవాలన్నారు. ఎన్టీఆర్ పార్టీ పెట్టినప్పుడు రాష్ట్రమంతటా టీడీపీ హవా ఉన్నా గుంటూరులో 1985లో టీడీపీని బీసీ అభ్యర్థి చదలవాడ జయరాంబాబు ఓడించారనే చరిత్ర తెలుసుకోవాలన్నారు. బీసీలకు ఏ పార్టీ సముచిత స్థానం ఇస్తుందో ఆ పార్టీలనే ఆదరించాలని బీసీ సంఘాల తరపున ప్రతి గ్రామానికి, ప్రతి ఇంటికి వెళ్లి ప్రజల్ని చైతన్యవంతుల్ని చేస్తామన్నారు. బీసీలకు వెన్నుపోటు పొడిచే పార్టీలను భూస్థాపితం చేయటానికి బీసీ సంఘాలన్నీ సిద్ధంగా ఉన్నాయన్నారు.

టీడీపీకి 2019 ఫలితాలే

వైఎస్సార్‌సీపీ బీసీలకు 50 శాతం సీట్లు ఇచ్చిందని, టీడీపీ కూడా 50 శాతం సీట్లు ఇవ్వాలని వెంకటేశ్వర్లు డిమాండ్ చేశారు. బీసీలను పక్కన పెడితే 2019లో టీడీపీకి జరిగిన ఘోర పరాభవం పునరావృతం అవుతుందని హెచ్చరించారు. సమావేశంలో బీసీ ఎంప్లాయిస్ ఫెడరేషన్ గౌరవ అధ్యక్షుడు పీవీ రమణయ్య, బీసీ మహాసభ అధ్యక్షుడు ఉగ్గం సాంబశివరావు, రజక సేవా సమితి ప్రధాన కార్యదర్శి జూపూడి శ్రీనివాసరావు పాల్గొన్నారు.

ఉక్రెయిన్‌లో డ్రోన్ దాడి..
భారతీయుని మృతి

న్యూఢిల్లీ: ఉక్రెయిన్‌లో జరిగిన డ్రోన్ దాడిలో భారతీయుడొకరు ప్రాణాలు కోల్పోయినట్లు సమాచారం. రష్యా సైన్యంలోని సపోర్టు ఉద్యోగాల్లో కొందరు భారతీయులు చేరిన విషయాన్ని కేంద్రం ఇటీవలే ధ్రువీకరించింది. ఈ నేపథ్యంలో తాజా ఘటన వెలుగులోకి రావడం గమనార్హం. గుజరాత్‌లోని సూరత్‌కు చెందిన హెమిల్ అశ్విన్‌భాయి మంగూకియా(23) ఈ నెల 21వ తేదీన ఉక్రెయిన్‌లోని డొనెట్స్క్ వద్ద జరిగిన డ్రోన్ దాడిలో మృతి చెందినట్లు వార్తలు వస్తున్నాయి. అయితే, వీటిపై స్పందించేందుకు భారత విదేశాంగ శాఖ నిరాకరించింది. ఉక్రెయిన్‌తో జరిగే యుద్ధంలో భద్రతా సహాయకులుగా 100 మందికిపైగా భారతీయులను గతేడాది రష్యా ఆర్మీ రిక్రూట్ చేసుకున్నట్లు వచ్చిన వార్తలను రెండు రోజుల క్రితం విదేశాంగ శాఖ ధ్రువీకరించింది.

బీజేపీలోకి బీఎస్పీ ఎంపీ

న్యూఢిల్లీ/లక్నో: సాధారణ ఎన్నికలు సమీపిస్తున్న వేళ బహుజన్ సమాజ్ పార్టీకి గట్టి ఎదురుదెబ్బ తగిలింది. ఆ పార్టీ అంబేడ్కర్ నగర్ లోక్‌సభ సభ్యుడు రితేశ్ పాండే ఆదివారం బీజేపీలో చేరారు. ఢిల్లీలో బీజేపీ ప్రధాన కార్యాలయంలో యూపీ నేతల సమక్షంలో కాషాయ కండువా కప్పుకున్నారు. అంతకుముందు బీఎస్పీ అధినేత్రి మాయావతికి రాజీనామా లేఖ పంపారు.

హౌతీల లక్ష్యాలపై దాడులు


లండన్: యెమెన్‌లోని హౌతీల లక్ష్యాలపై శనివారం అమెరికా, బ్రిటిష్ బలగాలు మరోసారి దాడులు చేశాయి. ఆ ప్రాంతంలో సరుకు ఓడలే లక్ష్యంగా హౌతీలు చేస్తున్న దాడులకు ఫుల్‌స్టాప్ పడకపోవడంతో ఇరాన్ మద్దతున్న ఈ గ్రూప్‌పై దాడులు పునరావృతం చేసినట్లు ఒక ఉమ్మడి ప్రకటన విడుదలైంది. యెమెన్‌లోని 8 ప్రాంతాల్లో ఉన్న ఆయుధాలు, క్షిపణి కేంద్రాలు, రాడార్లు, వాయు రక్షణ వ్యవస్థలు తదితర 18 హౌతీల లక్ష్యాలపై దాడులు జరిపినట్టు పేర్కొంది.

బాణసంచా ఫ్యాక్టరీలో పేలుడు...
యూపీలో ఏడుగురి మృతి

కౌశాంబి: ఉత్తరప్రదేశ్‌లోని కౌశాంబీ జిల్లాలో ఆదివారం బాణసంచా ఫ్యాక్టరీలో సంభవించిన పేలుడులో ఏడుగురు చనిపోయారు. మరో ఏడుగురు గాయపడ్డారు. కొఖ్రాజ్ పోలీస్ స్టేషన్ పరిధిలోని మహేవా గ్రామంలో మధ్యాహ్నం సంభవించిన పేలుడు శబ్దం కిలోమీటర్ల దూరం వరకు వినిపించింది. వెంటనే ఆ ప్రదేశానికి చేరుకున్న ఫైర్ సిబ్బంది మంటలను అదుపులోకి తెచ్చారు. మృతుల్లో ఫ్యాక్టరీ నిర్వాహకుడు కూడా ఉన్నాడు. రసాయనాలు నిల్వ ఉంచిన చోట మంటలు పేలుడుకు దారి తీసినట్లు పోలీసులు తెలిపారు.

స్కాముల్లేని పదేళ్లు

కుంభకోణాలు, అవినీతి వ్యవహారాలకు అడ్డుకట్ట వేశాం
ప్రజల ఆశలు అంతమైన చోటు నుంచే 'మోదీ గ్యారంటీ' ప్రారంభం
ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ఉద్ఘాటన ● గుజరాత్‌లో సుదర్శన్ సేతు ప్రారంభం


సుదర్శన్ సేతును ప్రారంభిస్తున్న ప్రధాని మోదీ

ద్వారక: ప్రతిపక్ష కాంగ్రెస్‌పై ప్రధానమంత్రి నరేంద్ర మోదీ మరోసారి నిప్పులు చెరిగారు. కేవలం ఒక్క కుటుంబం బాగు కోసం ఆ పార్టీ మొత్తం శక్తిని ఉపయోగించిందని అన్నారు. కాంగ్రెస్ పాలనలో అన్ని రకాల కుంభకోణాలు జరిగాయని ఆరోపించారు. తాము అధికారంలోకి వచ్చాక కుంభకోణాలకు, అవినీతి వ్యవహారాలకు అడ్డుకట్ట వేశామని చెప్పారు. గత పదేళ్లుగా దేశంలో స్కామ్‌ల మాటే లేదన్నారు. ప్రధాని మోదీ ఆదివారం తన స్వరాష్ట్రం గుజరాత్‌లో పర్యటించారు. దేశంలోనే అత్యంత పొడవైన తీగల వంతెన 'సుదర్శన్ సేతు'ను ప్రారంభించారు. ఇది బెయిత్ ద్వారక ద్వీపాన్ని, ప్రధాన భూభాగంలోని ఓఖాను అనుసంధానిస్తుంది. రూ.48,000 కోట్ల విలువైన పలు అభివృద్ధి ప్రాజెక్టులను కూడా ఈ సందర్భంగా మోదీ జాతికి అంకితం చేశారు. ఈ సందర్భంగా ద్వారకలో బహిరంగ సభలో ప్రసంగించారు. కాంగ్రెస్ పాలనలో మన దేశం ప్రపంచంలో 11వ అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా ఉండేదని చెప్పారు. తమ హయాంలో ఐదో స్థానానికి చేరిందన్నారు. ప్రజల ఆశలు అంతమైన చోటు నుంచే 'మోదీ గ్యారంటీ' ప్రారంభమవుతుందని ప్రధానమంత్రి వ్యాఖ్యానించారు. ఆంధ్రప్రదేశ్‌లోని మంగళగిరితోపాటు గుజరాత్, పంజాబ్, ఉత్తరప్రదేశ్, పశ్చిమ బెంగాల్‌లో నిర్మించిన 'ఎయిమ్స్'లను ఆయన వర్చువల్‌గా ప్రారంభించారు.

మత్తు వ్యసనంపై పోరాడుదాం

దేశంలో మాదక ద్రవ్యాల వ్యసనం పెరిగిపోతుండడం పట్ల మోదీ ఆందోళన వ్యక్తం చేశారు. మత్తు వ్యసనంపై పోరాడుదామని పిలుపునిచ్చారు. యువతను మత్తు బారి నుంచి కాపాడుకోవాలంటే వారి కుటుంబాల మద్దతు చాలా కీలకమని అన్నారు. కుటుంబం తోడుగా నిలిస్తే వ్యసనం నుంచి యువత సులువుగా బయటపడతారని సూచించారు. డ్రగ్స్ రహిత భారత్ మన లక్ష్యమని, ఇందుకోసం కుటుంబాలు పూనుకోవాలని, సహకారం అందించాలని కోరారు. గాయత్రీ పరివార్ సంస్థ ఆధ్వర్యంలో ఆదివారం అశ్వమేధ యజ్ఞం నిర్వహించారు. ప్రధాని మోదీ ఈ కార్యక్రమాన్ని ఉద్దేశించి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ప్రసంగించారు. కుటుంబం బలంగా ఉంటే సమాజం బలంగా ఉంటుందని తెలిపారు. కుటుంబ వ్యవస్థ బలహీనపడితే సమాజంలో విలువలు పడిపోతాయన్నారు. ఒక కుటుంబంలో సభ్యులంతా రోజుల తరబడి కలుసుకోకపోతే, మాట్లాడుకోకపోతే ముప్పు ముంచుకొచ్చినట్లేనని స్పష్టం చేశారు. మత్తు రహిత దేశ నిర్మాణం కోసం బలమైన కుటుంబ వ్యవస్థ అవసరమని పేర్కొన్నారు. దేశంలో కోట్లాది మంది యువతను మత్తు వ్యసనం నుంచి తప్పించి, దేశ నిర్మాణ కార్యకలాపాల దిశగా మళ్లించడానికి ఈ అశ్వమేధ యజ్ఞం తోడ్పడుతోందని ప్రశంసించారు. దేశ భవిష్యత్తు యువత చేతుల్లోనే ఉందని, మత్తు ముప్పు నుంచి వారిని కాపాడుకోవాలని స్పష్టం చేశారు. ఇప్పటికే మత్తు వలలో చిక్కుకున్నవారిని బయటకు తీసుకొద్దామని సూచించారు. యువత సంక్షేమం కోసం తమ ప్రభుత్వం ఎన్నో పథకాలు అమల్లోకి తీసుకొచ్చిందని వెల్లడించారు. అమృత్ భారత్ పథకం కింద దేశవ్యాప్తంగా 553 రైల్వే స్టేషన్ల ఆధునీకరణ పనులకు మోదీ సోమవారం వర్చువల్‌గా శంకుస్థాపన చేయనున్నారు. మరికొన్ని ప్రాజెక్టులను జాతికి అంకితమిస్తారు.

దేశం కోసం ఓటేయండి

యువ ఓటర్లకు మోదీ పిలుపు
'మన్ కీ బాత్'కు 3 నెలలు విరామం

న్యూఢిల్లీ: లోక్‌సభ ఎన్నికల నేపథ్యంలో 'మన్ కీ బాత్' కార్యక్రమానికి మూడు నెలలు విరామం ఇస్తున్నట్లు ప్రధాని మోదీ చెప్పారు. మార్చిలో ఎలక్షన్ కోడ్ రావచ్చన్నారు. మన్ కీ బాత్ పేరిట ఆయన ప్రతి నెలా చివరి ఆదివారం ప్రజలనుద్దేశించి రేడియోలో ప్రసంగిస్తుండటం తెలిసిందే. తాజాగా 110వ మన్ కీబాత్‌లో మోదీ మాట్లాడారు. రాబోయే ఎన్నికల్లో తొలిసారిగా ఓటు వేయబోతున్న యువ ఓటర్లకు ప్రత్యేక సూచన చేశారు. దేశం కోసం తప్పనిసరిగా తొలి ఓటు ఓటేయండి'' అన్నారు. ''మన్ కీ బాత్ పూర్తిస్థాయిలో విజయవంతమైంది. మూణ్నెల్ల తర్వాత 111వ మన్ కీ బాత్‌తో మళ్లీ కలుద్దాం. చెప్పారు. 111 సంఖ్య చాలా శుభప్రదం. దేశ అభివృద్ధి ప్రయాణంలో నారీశక్తి పాత్ర పెరుగుతుండడం సంతోషకరం. వారు ప్రతి రంగంలో రాణిస్తున్నారు. గ్రామీణ మహిళలు డ్రోన్లు ఎగురవేస్తున్నారు'' అని చెప్పారు.



ద్వారకలో స్కూబా డైవింగ్

సముద్ర గర్భంలో శ్రీకృష్ణుడికి ప్రత్యేక పూజలు

ద్వారక: ఆరేబియా సముద్ర గర్భంలోని ద్వారకా నగరాన్ని మోదీ ఆదివారం దర్శించుకున్నారు. గుజరాత్‌లోని ద్వారక పట్టణ తీరంలో పాంచ్‌కుయి బీచ్ నుంచి స్కూబా డైవింగ్ ద్వారా సముద్ర అడుగు భాగానికి చేరుకున్నారు. ప్రత్యేక పూజలు చేసి కాసేపు గడిపారు. ''సముద్ర గర్భంలో భగవంతుడికి పూజలు చేయడం అద్భుతమైన అనుభూతి! సాక్షాత్తూ దేవుడి సన్నిధిలో గడిపినట్లుగా ఉంది'' అన్నారు. తెల్లని డైవింగ్ హెల్మెట్ ధరించి నేవీ సిబ్బంది సాయంతో స్కూబా డైవింగ్ చేస్తూ సముద్రంలోకి చేరుకున్నారు. కృష్ణుడికి పూజలు చేసి నెమలి పింఛాన్ని సమర్పించుకున్నారు. అనంతరం తన అనుభవాన్ని 'ఎక్స్'లో పోస్టు చేశారు. ఫొటోలను సైతం పంచుకున్నారు. ఇది సాహసం కంటే ఎక్కువని, ఇదొక విశ్వాసమని పేర్కొన్నారు. అనంతరం గుజరాత్‌లో ఒక సభలో మాట్లాడారు. సముద్రంలో ప్రాచీన ద్వారకా నగరాన్ని చేతల్లో తాకగానే, 21వ శతాబ్దపు వైభవోపేత భారతదేశ చిత్రం తన కళ్ల ముందు మెదిలిందని తెలిపారు. సముద్ర గర్భంలో కనిపించిన ద్వారక దృశ్యం దేశ అభివృద్ధి పట్ల తన సంకల్పాన్ని మరింత బలోపేతం చేసిందని వివరించారు. ఆధ్యాత్మిక వైభవంతో కూడిన ప్రాచీన కాలంతో అనుసంధానమైనట్లు భావించానని చెప్పారు. శ్రీకృష్ణుడు మనందరినీ ఆశీర్వదించాలని కోరుకుంటున్నానని తెలిపారు. ప్రాచీన ద్వారకా నగరాన్ని సందర్శించాలన్న తన దశాబ్దాల కల నెరవేరిందని నరేంద్ర మోదీ సంతోషం వ్యక్తం చేశారు. గుజరాత్ సముద్ర తీరంలో ద్వారక పట్టణంలోని శ్రీకృష్ణుడి ఆలయంలోనూ మోదీ పూజలు చేశారు.

గడచిన పదేళ్లలో...
గృహ వినియోగం రెండింతలు

నేషనల్ శాంపిల్ సర్వేలో వెల్లడి


న్యూఢిల్లీ: భారత్‌లో నెలవారీ తలసరి గృహ వినియోగం గడిచిన దశాబ్ద కాలంలో రెండింతలకు పైగా పెరిగినట్టు జాతీయ శాంపిల్ సర్వే కార్యాలయం అధ్యయనంలో వెల్లడైంది. 2011-12 నాటికి తలసరి వినియోగం రూ.2,630గా ఉంటే, 2022-23 నాటికి ఇది పట్టణ ప్రాంతాల్లో రూ.6,459కి పెరిగింది. గ్రామీణ ప్రాంతాల్లో ఇదే కాలంలో తలసరి వినియోగం రూ.1,430 నుంచి రూ.3,773కు చేరింది. గృహ వినియోగ వ్యయంపై ఎన్ఎస్ఎస్‌వో 2022 ఆగస్టు-2023 జూలై మధ్య జరిపిన సర్వే వివరాలను విడుదల చేసింది. ప్రతి వ్యక్తి సగటున చేసే గృహ వినియోగ ఖర్చును తెలుసుకునేందుకు ఈ సర్వే చేపట్టింది. 2021-12 నాటి ధరల ప్రకారం చూస్తే.. సగటు ఎంపీసీఈ పట్టణ ప్రాంతాల్లో రూ.2,630గా ఉంటే, 2022-23 నాటికి రూ.3,510కి చేరింది. గ్రామీణ ప్రాంతాల్లో తలసరి ఎంపీసీఈ రూ.1,430 నుంచి రూ.2,008కి పెరిగింది. రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాల పరిధిలో పట్టణ ప్రాంతాల నుంచి 1,55,014 గృహాలు, గ్రామీణ ప్రాంతాల్లో 1,06,732 గృహాల సగటు శాంపిళ్లను ఈ అధ్యయనంలో భాగంగా ఎన్ఎస్ఎస్‌వో సేకరించింది.

రాజ్యాంగాన్ని మార్చే యత్నాలు: ఖర్గే



బెంగళూరు: దేశ రాజ్యాంగాన్ని మార్చేసేందుకు ప్రయత్నాలు జరుగుతున్నాయని కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే ఆరోపించారు. రానున్న లోక్‌సభ ఎన్నికల్లో దీనిని సమైక్యంగా ఉండి, గట్టిగా ఎదుర్కోలేకపోతే దేశంలో నియంతృత్వపాలన తథ్యమని ఆయన హెచ్చరించారు. ఆదివారం బెంగళూరులో జరిగిన ఒక కార్యక్రమంలో ఖర్గే ప్రసంగించారు. 'రాజ్యాంగాన్ని మార్చేసేందుకు, పూర్తిగా లేకుండా చేసేందుకు చాలా మంది ప్రయత్నిస్తున్నారు. రానున్న ఎన్నికల్లో గట్టిగా, ఐక్యంగా నిలబడకుంటే, దేశంలో నియంతృత్వం రావడం ఖాయం. నియంతృత్వం కావాలనుకుంటున్నారా లేక న్యాయంతో కూడిన జీవితాన్ని గడపాలనుకుంటున్నారా, అన్నది నిర్ణయించుకోవాల్సిన అవసరం చాలా ఉంది. రాజ్యాంగం మనుగడ సాధించిన పక్షంలో దేశం ఐక్యంగా ముందుకు సాగుతుంది. ప్రజాస్వామ్యం ఉంటే ప్రతి ఒక్కరూ సుభిక్షంగా జీవించగలుగుతారు. కానీ, ప్రస్తుత కేంద్ర ప్రభుత్వం రాజ్యాంగాన్ని పరిరక్షించడం లేదు, రాజ్యాంగం ప్రకారం పనిచేయడం లేదు'అని ఖర్గే వ్యాఖ్యానించారు. అందుకే, రాజ్యాంగాన్ని కాపాడుకోవడం, దానికి కట్టుబడి ఉండటం ఎంతో ముఖ్యమని చెప్పారు. ఒక భావజాలాన్ని ప్రజలపై రుద్దేందుకు జరుగుతున్న ప్రయత్నాల పట్ల అప్రమత్తంగా ఉండాలని కోరారు. ప్రస్తుతం ఉన్న రాజ్యాంగాన్ని వదులుకుని కొత్త రాజ్యాంగాన్ని రూపొందించే కుట్ర జరుగుతోందని ఆయన ఆరోపించారు. రాజ్యాంగ పరిరక్షణ గురించి మాట్లాడుతున్న ప్రధాని మోదీ.. ప్రతిపక్ష పార్టీల ఎమ్మెల్యేలను కొనుగోలు చేసి ప్రతిపక్షాల పాలిత రాష్ట్రాలు లేదా ప్రభుత్వాలను ఎందుకు పడగొడుతున్నారని ప్రశ్నించారు. ఇది ఎంతవరకు రాజ్యాంగబద్ధమైందని నిలదీశారు. ఇది ఇలాగే కొనసాగితే ఏదో ఒక రోజు దేశంలో నియంతృత్వం రావచ్చని అన్నారు. ప్రభుత్వ గ్యారెంటీయే కనీసం బీజేపీ ప్రభుత్వ గ్యారెంటీయే అని చెప్పకుండా మోదీ తన గ్యారెంటీ అని చెప్పుకోవడం ఏమిటన్నారు. 'అది నీ గ్యారెంటీ ఎలా అవుతుంది? అది నీది కాదు. ప్రజలు డబ్బుతో అమలు చేసే గ్యారెంటీ'' అన్నారు.

చైనాలో 24 కోట్ల ఏళ్ల డ్రాగన్ శిలాజం



ప్రపంచవ్యాప్తంగా చాలా ప్రదేశాల్లో శిలాజాలు బయటపడుతుంటాయి. వందల సంవత్సరాల క్రితం భూమిలో కూరుకుపోయిన జీవులు క్రమంగా శిలాజంగా మారుతుంటాయి. అయితే, చైనాలో 2003లో బయటపడిన భారీ డ్రాగన్ శిలాజం వయసు 24 కోట్ల సంవత్సరాలు ఉంటుందని సైంటిస్టులు తాజాగా నిర్ధారించారు. ఇంత వయసున్న డ్రాగన్ శిలాజం వెలుగుచూడడం ఇదే మొదటిసారి అని నేషనల్ మ్యూజియమ్స్ స్కాట్లాండ్ ఒక ప్రకటనలో వెల్లడించింది. చైనాలో ట్రియాసిక్ కాలానికి చెందిన ఈ శిలాజం భాగాలను తొలుత 2003లో దక్షిణ చైనాలోని గిజౌ ప్రావిన్స్‌లో గుర్తించారు. గత పదేళ్లలో తవ్వకాల్లో మరిన్ని భాగాలు బయటపడ్డాయి. వాటన్నింటినీ ఒకేచోట అమర్చగా అది ఐదు మీటర్ల డ్రాగన్‌గా తేలింది. 24 కోట్ల ఏళ్ల క్రితమే అది శిలాజంగా మారిపోయిందని పరిశోధకులు కనిపెట్టారు. దీనికి డైనోసెఫాలోసారస్ ఒరియంటలిస్ అని పేరుపెట్టారు. ముక్కు నుంచి తోక దాకా పూర్తి శిలాజాన్ని ఆవిష్కరించామని ఎన్ఎంఎస్ సైంటిస్టు డాక్టర్ నిక్ ఫ్రాసెర్ చెప్పారు. ఇది 8 అంకె ఆకారంలో ఉందని, చైనా డ్రాగన్లను గుర్తుకు తెస్తోందని వివరించారు. డ్రాగన్ కాల్పనిక జీవి కాదని, నిజంగానే ఉండేదని చెప్పడానికి ఈ శిలాజం ఒక ఆధారమని సైంటిస్టులు అంటున్నారు. రాక్షస బల్లుల తరహాలో వాతావరణ మార్పుల కారణంగా కోట్ల సంవత్సరాల క్రితం అవి అంతరించిపోయి ఉండొచ్చని అంచనా వేస్తున్నారు. అయితే, చైనాలో బయటపడిన డ్రాగన్ శిలాజం మెడ చాలా పొడవుగా ఉండడం ఆసక్తి కలిగిస్తోంది. నదులు, చెరువుల్లో చేపలు పట్టుకోవడానికి వీలుగా దాని మెడ పొడవుగా సాగి ఉండొచ్చని భావిస్తున్నారు. **- సాక్షి, నేషనల్ డెస్క్**

సౌర రేడియేషన్‌తో
పెనుముప్పు

అధికంగా శోషించుకుంటున్న భూమి

అంతరిక్షం నుంచి వెలువడే ప్రమాదకర సౌర రేడియేషన్‌ను భూమి అధికంగా శోషించుకుంటోందని దాంతో వాతావరణంలో మార్పులు, విపత్తులు సంభవిస్తున్నాయని పరిశోధకులు చెబుతున్నారు. నాసా తాజా డేటాను విశ్లేషించి సౌర రేడియేషన్ గురించి వారు కీలక విషయాలు వెల్లడించారు. 2000 సంవత్సరం నుంచి 2023 డిసెంబర్ దాకా డేటాను వారు పరిగణనలోకి తీసుకున్నారు. రేడియేషన్‌ను భూమి శోషించుకోవడం అనేది సంవత్సరమంతా ఒకేతీరుగా లేదని, కొన్నిసార్లు ఎక్కువ స్థాయి, మరికొన్నిసార్లు తక్కువ స్థాయిలో నమోదైనట్లు గుర్తించారు. 2023లో ఫిబ్రవరి, మార్చి, డిసెంబర్‌లో అధికంగా సోలార్ రేడియేషన్‌ను భూమి గ్రహించిందని వెల్లడించారు. గత ఏడాది జనవరిలో స్వల్పంగా పెరిగిన రేడియేషన్ ఫిబ్రవరిలో చదరపు మీటర్‌కు 3.9 వాట్లు, మార్చిలో చదరపు మీటర్‌కు 6.2 వాట్లుగా నమోదైందని తెలియజేశారు. 2000 సంవత్సరం నాటి గణాంకాలతో పోలిస్తే 2023లో సౌర రేడియేషన్‌ను భూమి శోషించుకోవడం ఎన్నో రెట్లు పెరిగినట్లు తేల్చారు. ఇది ఇంకా పెరగడమే తప్ప తగ్గే అవకాశం లేదని అంచనా వేస్తున్నారు. దీనివల్ల భూగోళంపై శక్తి సమతుల్యతలో మార్పులు వస్తున్నట్లు పరిశోధకులు వెల్లడించారు. ఇదంతా భూవాతావరణంలో ఉష్ణోగ్రతల పెరుగుదల, వాతావరణ మార్పులు, ప్రకృతి విపత్తులు, మంచు కరిగిపోవడం, సముద్ర మట్టాలు పెరగుదల వంటి పరిణామాలకు దారి తీస్తున్నట్లు స్పష్టం చేశారు.

- సాక్షి, నేషనల్ డెస్క్

ఐఎన్ఎల్‌డీ హరియాణా చీఫ్ కాల్చివేత



చండీగఢ్: ఇండియన్ నేషనల్ లోక్‌దళ్ హరియాణా విభాగం అధ్యక్షుడు నఫే సింగ్ రాఠీ(70)ని గుర్తు తెలియని దుండుగులు కాల్చి చంపారు. ఢిల్లీకి సమీపంలోని బహదూర్‌గఢ్ వద్ద ఆదివారం ఈ ఘటన చోటుచేసుకుంది. కాల్పుల్లో ఒక పార్టీ కార్యకర్త చనిపోగా ఆయన ప్రైవేట్ గన్‌మెన్లు ముగ్గురు గాయాలపాలయ్యారు. ఝజ్జర్ జిల్లాలోని బహదూర్‌గఢ్ నుంచి ఆయన రెండు పర్యాయాలు ఎమ్మెల్యేగా ఎన్నికయ్యారు. తన ఎస్‌యూవీలో వెళ్తున్న రాఠీని కారులో వెంబడించిన దుండుగులు ఆయనపైకి విచక్షణారహితంగా కాల్పులు జరిపారని ఐఎన్ఎల్‌డీ నేత అభయ్ చౌతాలా చెప్పారు. లోక్‌సభ ఎన్నికల వేళ జరిగిన దాడిపై ప్రతిపక్షాలు మండిపడ్డాయి. బీజేపీ పాలిత రాష్ట్రంలో శాంతి భద్రత క్షీణించాయని ఆరోపించాయి.

నౌకకు హైకోర్టు అరెస్టు ఉత్తర్వులు!

కటక్: పారాదీప్ ఓడ రేవులో మూడు నెలలుగా బెర్త్ అద్దెను చెల్లించని ఓ విదేశీ నౌకను అరెస్ట్ చేయాలని ఒరిస్సా హైకోర్టు ఆదేశించింది! ఎంవీ డెబి అనే ఈ నౌకలో రూ.220 కోట్ల విలువైన కొకైన పట్టుబడటంతో గత డిసెంబర్ నుంచి పోర్టులో లంగరేసి ఉంది. తమకు ఫీజు చెల్లించనందుకు షిప్పును అరెస్ట్ చేయాలంటూ పారాదీప్ పోర్టు కార్గో టెర్మినల్ విభాగం కోర్టుకెక్కింది. దాంతో నౌక అరెస్టుకు న్యాయమూర్తి జస్టిస్ వి.నరసింహ ఆదేశించారు. అడ్మిరాలిటీ చట్టం-2017 ప్రకారం ఇలాంటి ఆదేశాలు జారీ చేసే అధికారం ఒరిస్సాతో పాటు మరో ఏడు హైకోర్టులకుంది.

మోదీవి 'పర్ఫార్మెన్స్ పాలిటిక్స్': అమిత్ షా

భోపాల్: కులం, అవినీతి, బుజ్జగింపు, వారసత్వ రాజకీయాలకు ప్రధాని మోదీ ముగింపు పలికారని, పనితీరు ఆధారిత రాజకీయాలతో భారత దేశ ప్రతిష్టను పెంచారని కేంద్ర హోం మంత్రి అమిత్ షా చెప్పారు. దేశంలోని వివిధ ప్రాంతాల్లో వేళ్లూనుకుపోయిన మావోయిజం, ఉగ్రవాదం, తీవ్రవాదం ముగింపు దశకు చేరుకున్నాయని చెప్పారు. గత ప్రభుత్వాలతో మోదీ పాలనను పోల్చి విశ్లేషించుకోవాలని ఆయన ప్రజలను కోరారు. ఆదివారం ఆయన మధ్యప్రదేశ్‌లో పర్యటించారు. గ్వాలియర్, ఖజురహోల్లో జరిగిన పార్టీ కార్యకర్తల సమావేశాల్లో పాల్గొన్నారు. ''పాండవులు, కౌరవుల మధ్య పోరు జరుగుతోంది. మోదీ సారథ్యంలో దేశాన్ని అభివృద్ధి పథంలో నడిపించాలని భావించే దేశభక్తుల గ్రూపు ఒకటి కాగా, వారసత్వ రాజకీయాలను పెంచిపోషిస్తున్న గ్రూపు మరోటి'' అన్నారు.

సొంత రాష్ట్రంలో
నిక్కీ హేలీ ఓటమి

చార్లెస్టన్: సొంత రాష్ట్రం సౌత్ కరోలినాలో జరిగిన రిపబ్లికన్ పార్టీ ప్రైమరీలో భారత సంతతికి చెందిన నిక్కీ హేలీ ఓటమి పాలయ్యారు. ఆమెకు 39.4% ఓట్లు పడగా మాజీ అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ 59.9% ఓట్లతో నెగ్గారు. అయినా వెనక్కి తగ్గేది లేదని, సూపర్ ట్యూస్ డేలో గట్టిపోటీ ఇస్తానని హేలీ అన్నారు. వరుసగా నాలుగో విజయంతో రిపబ్లికన్ అభ్యర్థిత్వానికి ట్రంప్ విజయావకాశాలు మెరుగయ్యాయి. అందుకు 1,215 మంది డెలిగేట్ల మద్దతు కావాలి. ఇప్పటిదాకా హేలీ 17, ట్రంప్ 92 డెలిగేట్ల మద్దతు గెలుచుకున్నారు. ఓవైపు వరుస కోర్టు కేసులు వేధిస్తున్నా అయోవా, న్యూ హ్యాంప్‌షైర్, నెవడా రిపబ్లికన్ ప్రైమరీల్లో ట్రంప్ ఇప్పటికే విజయం సాధించడం తెలిసిందే.

భారత్ జోడో న్యాయ్ యాత్రలో అఖిలేశ్

ఆగ్రా: కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీ సారథ్యంలో యూపీలో కొనసాగుతున్న భారత్ జోడో న్యాయ్ యాత్రలో ఆదివారం సమాజ్‌వాదీ పార్టీ(ఎస్పీ)అధ్యక్షుడు అఖిలేశ్ యాదవ్ పాల్గొన్నారు. రానున్న లోక్‌సభ ఎన్నికల్లో యూపీలో సీట్ల పంపిణీపై రెండు పార్టీల మధ్య పొత్తు కుదిరిన వేళ ఈ పరిణామం చోటుచేసుకుంది. ఆగ్రాలో రహదారికి ఇరువైపులా పెద్ద సంఖ్యలో వేచి చూస్తున్న ప్రజలకు అభివాదం చేస్తూ వారు ముందుకు సాగారు. భారీగా హాజరైన ఇరుపార్టీల కార్యకర్తలు వారికి మద్దతుగా నినాదాలు చేశారు. ఈ సందర్భంగా అఖిలేశ్ యాదవ్ మాట్లాడుతూ..రైతు వ్యతిరేక చర్యలకు పాల్పడుతున్న కేంద్ర ప్రభుత్వం రైతుల శక్తిని చూసి భయపడే పరిస్థితికి వచ్చిందన్నారు. రానున్న రోజుల్లో బీజేపీ ప్రభుత్వం గద్దెదిగి, ఇండియా కూటమి అధికారంలోకి రావడం ఖాయమని చెప్పారు. తమ ప్రభుత్వం రైతులకు తగు గౌరవం ఇస్తుందని చెప్పారు. వెనుకబడిన కులాలు, దళితులు, మైనారిటీలకు బీజేపీ తగు ప్రాధాన్యం ఇవ్వడం లేదని ఆరోపించారు. యాత్రలో కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి ప్రియాంకా గాంధీ వాద్రా కూడా పాల్గొన్నారు. అంతకుముందు నేతలు ఆగ్రాలోని బీఆర్ అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.జోడో యాత్రలో అఖిలేశ్ పాల్గొనడంపై కాంగ్రెస్ హర్షం వ్యక్తం చేసింది.


ఆదివారం ఆగ్రాలో భారత్ జోడో న్యాయ్ యాత్రలో అఖిలేశ్‌తో రాహుల్ సెల్ఫీ

డ్రైవర్ లేకుండానే...
70 కి.మీ. వెళ్లిన గూడ్స్

జమ్మూ/చండీగఢ్: గూడ్స్ రైలొకటి డ్రైవర్ లేకుండానే 70 కిలోమీటర్ల దూరం వెళ్లిపోయింది. అధికారులు చివరికి అప్రమత్తమై ఇసుక బస్తాలను పట్టాలపై అడ్డుగా ఉంచి రైలును నిలపగలిగారు. ఘటన జమ్మూ-జలంధర్ సెక్షన్‌లో ఆదివారం ఉదయం 7.25 నుంచి 9 గంటల మధ్యలో చోటుచేసుకుంది. జమ్మూకశ్మీర్ నుంచి కంకర లోడున్న 53 బోగీల డీజిల్ లోకోమోటివ్ గూడ్స్ రైలు పంజాబ్ వైపు బయలుదేరింది. డ్రైవర్ మార్పిడి కోసం కథువా స్టేషన్ వద్ద రైలును ఆపారు. తర్వాత ఏం జరిగిందో ఏమో..రైలు నెమ్మదిగా జమ్మూ-జలంధర్ సెక్షన్ దిశగా ముందుకు సాగింది. కొంత సేపటికి విషయం తెలిసిన అధికారులు ఆ మార్గంలోని స్టేషన్లతోపాటు, రైల్-రోడ్ క్రాసింగ్‌ల వద్ద అధికారులను అప్రమత్తం చేశారు. దాదాపు 70 కిలోమీటర్ల దూరం వెళ్లాక ఊంచి బస్సీ వద్ద పట్టాలపై ఇసుక బస్తాలను అడ్డుగా ఉంచి రైలును ఆపు చేయగలిగారు. ఘటనపై రైల్వే శాఖ దర్యాప్తునకు ఆదేశించింది.

ఫడ్నవీస్ నన్ను చంపజూస్తున్నారు: జరంగే

ముంబై: మహారాష్ట్ర ఉప ముఖ్యమంత్రి దేవేంద్ర ఫడ్నవీస్ తనను చంపాలని ప్రయత్నిస్తున్నారంటూ మరాఠా కోటా ఉద్యమకారుడు మనోజ్ జరంగే ఆదివారం సంచలన ఆరోపణలు చేశారు. ఫడ్నవీస్ నివాసం ఎదుటే ఆందోళనకు దిగుతానని హెచ్చరించారు. 'తప్పుడు ఆరోపణలతో నాపై ఒత్తిడి తెచ్చేందుకు చాలామందిని ఉసిగొల్పుతున్నారు. ఈ కుట్రల వెనుక ఫడ్నవీస్ ఉన్నారు. విషపూరిత సెలైన్‌తో నన్ను చంపజూస్తున్నారు'' అంటూ మండిపడ్డారు. జరంగే ఆరోపణలపై సీఎం ఏక్‌నాథ్ షిండే మండిపడ్డారు. తమ ఓపికను పరీక్షించొద్దంటూ హెచ్చరించారు.

తమిళ నిర్మాత సూత్రధారిగా డ్రగ్స్ రాకెట్

న్యూఢిల్లీ: తమిళ సినీ నిర్మాత సూత్రధారిగా ఉన్న భారత్, న్యూజిలాండ్, ఆస్ట్రేలియా, మలేసియాల్లో విస్తరించిన డ్రగ్స్ రాకెట్‌ను ఛేదించినట్లు నార్కోటిక్స్ కంట్రోల్ బ్యూరో తెలిపింది. ఢిల్లీలో ఇటీవల జరిపిన సోదాల్లో డ్రగ్స్ తయారీకి వాడే 50 కిలోల సూడో ఎఫెడ్రిన్ రసాయనాన్ని స్వాధీనం చేసుకుని, తమిళనాడుకు చెందిన ముగ్గురిని అరెస్ట్ చేసినట్లు వెల్లడించింది. వీరు డ్రగ్స్‌ను ఓడలు, విమానాల్లో హెల్త్ మిక్స్ పౌడర్, కొబ్బరి పొడిలో డబ్బాలో దాచి రవాణా చేస్తున్నట్లు తేలిందని పేర్కొంది. కిలో రూ.1.5 కోట్లుండే సూడో ఎఫెడ్రిన్‌తో మెథాంఫెటమైన్ అనే ప్రమాదకరమైన సింథటిక్ డ్రగ్‌ను తయారు చేస్తారు. న్యూజిలాండ్ కస్టమ్స్, ఆస్ట్రేలియా పోలీసుల సమాచారం మేరకు డ్రగ్స్ రాకెట్‌పై విచారణ చేపట్టినట్లు ఎన్‌సీబీ వివరించింది. ఇవి ఢిల్లీ నుంచే రవాణా అవుతున్నట్లు అక్కడి బసాయ్‌దారాపూర్‌లోని గోదాం నుంచి వస్తున్నట్లు గుర్తించామని తెలిపింది. పట్టుబడిన వారిని విచారించగా గత మూడేళ్లలో రూ.2 వేల కోట్ల విలువైన 3,500 కిలోల సూడో ఎఫెడ్రిన్‌ను 45 దఫాలుగా పంపించినట్లు తేలింది. సదరు నిర్మాత పరారీలో ఉన్నట్లు వివరించింది. అతని కోసం గాలింపు ముమ్మరం చేశామని తెలిపింది.

ముగ్గురు మావోయిస్టులు మృతి

చర్ల: ఛత్తీస్‌గఢ్‌లో కాంకేర్ జిల్లా కోయిల్‌బెడా అటవీ ప్రాంతంలో ఆదివారం ఉదయం ముగ్గురు మావోయిస్టులు ఎదురు కాల్పుల్లో మృతిచెందారు. డీఆర్‌జీ, ఎస్టీఎఫ్, సీఆర్‌పీఎఫ్, కోబ్రా విభాగాల ప్రత్యేక పోలీసులు తారసపడిన మావోయిస్టులు కాల్పులకు దిగారు. ఎదురుకాల్పుల్లో ముగ్గురు మృతి చెందగా పలువురు గాయపడ్డారు. తప్పించుకున్న మావోయిస్టుల కోసం కూంబింగ్ జరుగుతోందని ఎస్పీ చెప్పారు.

మందుపాతర పేలి జవాను దుర్మరణం

ఛత్తీస్‌గఢ్‌లోని బిజాపూర్ జిల్లాలో ఆదివారం మధ్యాహ్నం మందుపాతర పేలి హెడ్ కానిస్టేబుల్ ఒకరు ప్రాణాలు కోల్పోయారు. కూంబింగ్ జరుపుతుండగా ఆయన పొరపాటున మందుపాతరపై కాలు వేశారని పోలీసులు తెలిపారు.

31 వేల సైనికులను పోగొట్టుకున్నాం

ఆచూకీ తెలియని, గాయపడ్డ వారి సంఖ్య అపారం: జెలెన్‌స్కీ

కీవ్: రష్యా రెండేళ్లుగా కొనసాగిస్తున్న దురాక్రమణను ఎదుర్కొనే క్రమంలో సుమారు 31 వేల మంది సైనికులను కోల్పోయినట్లు ఉక్రెయిన్ అధ్యక్షుడు జెలెన్‌స్కీ తెలిపారు. 'యుద్ధంలో ఉక్రెయిన్ 3 లక్షల మందిని కోల్పోయిందనో, 1.50 లక్షల మందిని కోల్పోయిందనో పుతిన్, అతడి అబద్ధపు ప్రచారాలు ఎన్ని చేసుకున్నా.. మాకు కలిగిన నష్టం 31 వేల మంది. మేం కోల్పోయిన ప్రతి సైనికుడూ మా కోసం గొప్ప త్యాగం చేసినట్లే'అని ఓ కార్యక్రమంలో ఆయన తెలిపారు. గాయపడిన, కనిపించకుండాపోయిన సైనికుల లెక్కలను వెల్లడించలేనని ఆయన అన్నారు.

క్లుప్తంగా...

సీఎం జగన్‌ను ఒంటరిగా ఎదుర్కోలేకే పొత్తులు

డిప్యూటీ సీఎం నారాయణస్వామి



తిరుమల: ప్రజల మన్ననలు పొందిన సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని ఒంటరిగా ఎదుర్కోలేకే ప్రతిపక్ష పార్టీలు ఒక్కటయ్యాయని డిప్యూటీ సీఎం నారాయణస్వామి అన్నారు. ఆదివారం వీఐపీ విరామ సమయంలో ఆయన స్వామివారి సేవలో పాల్గొన్నారు. దర్శనానంతరం రంగనాయకుల మండపంలో వేదపండితులు వేద ఆశీర్వచనం అందించగా.. ఆలయ అధికారులు శ్రీవారి తీర్థప్రసాదాలను అందజేశారు. ఆలయం వెలుపల డిప్యూటీ సీఎం మీడియాతో మాట్లాడుతూ నిజంగా ప్రభుత్వ వైఫల్యాలుంటే ప్రతిపక్షాలు ఒంటరిగానే పోటీ చేసేవన్నారు. కానీ సీఎం వైఎస్ జగన్ ప్రజల మన్ననలు పొంది, ప్రజలకు సంక్షేమ పాలన అందించారని, అందుకే పొత్తులతో జగన్‌ను ఓడించాలని చూస్తున్నారని, కానీ ప్రజలు ప్రతిపక్షాలకు బుద్ధి చెప్పేందుకు సిద్ధంగా ఉన్నారని స్పష్టం చేశారు. వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ వల్లే తన లాంటి పేదలు ఎమ్మెల్యేలుగా గెలవగలిగారని భావోద్వేగానికి లోనయ్యారు. చంద్రబాబు పదవీ వ్యామోహంతో అందరి కాళ్లు పట్టుకుంటున్నారని ఎద్దేవా చేశారు. కులాలను, మతాలను విడగొట్టి ఓట్ల రాజకీయాలు చెయ్యడం ఒక్క చంద్రబాబుకే సాధ్యమని నారాయణస్వామి విమర్శించారు.

ప్రాణం తీసిన జల్లికట్టు

- ఎద్దు ఢీకొట్టడంతో వ్యక్తి మృతి
- పలువురికి తీవ్రగాయాలు



వెంకటమునిని (ఫైల్)

చంద్రగిరి: వినోదం కోసం ఏర్పాటు చేసిన జల్లికట్టులో ఒక వ్యక్తి ప్రాణాలు కోల్పోయిన ఘటన తిరుపతి జిల్లా చంద్రగిరిలో చోటుచేసుకుంది. చంద్రగిరి మిట్టమీద గంగమ్మ ఆలయ చైర్మన్ మొక్కల చంద్రశేఖర్‌రెడ్డి ఆధ్వర్యంలో ఆదివారం పట్టణంలో తొలిసారిగా జల్లికట్టు (పశువుల పందేల) నిర్వహించారు. పశువులను పందేలకు వదిలిన సమయంలో నడింపల్లికి చెందిన వెంకటముని(50)ని ఓ ఎద్దు ఢీకొంది. తీవ్రంగా గాయపడిన వెంకటముని అపస్మారక స్థితికి చేరుకోవడంతో అక్కడే ఉన్న వైద్య సిబ్బంది ప్రథమ చికిత్స చేసి 108 వాహనంలో తిరుపతి రుయాకు తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ అతను మరణించాడు. ఎద్దులు ఒక్కసారిగా దూసుకురావడంతో అనేకమంది తీవ్రంగా గాయపడ్డారు. స్థానిక వైద్యాధికారులు వీరికి ప్రథమ చికిత్స అందించి మెరుగైన వైద్యం కోసం తిరుపతి రుయాకు తరలించారు. పశువుల పందేలు నిర్వహించే క్రమంలో సరైన మార్గదర్శకాలు అనుసరించకపోగా కనీస సౌకర్యాలు కూడా కల్పించలేదని ఆగ్రహం వ్యక్తం చేశారు.

కాపుజాతిని చంద్రబాబుకు తాకట్టు పెట్టిన పవన్

కాపు కార్పొరేషన్ చైర్మన్ అడపా శేషు

సాక్షి, అమరావతి: జనసేన అధినేత పవన్ కళ్యాణ్ బ్రోకర్‌గా మారి కాపు జాతి మొత్తాన్ని చంద్రబాబుకు తాకట్టు పెట్టేశారని కాపు కార్పొరేషన్ చైర్మన్ అడపా శేషు మండిపడ్డారు. ఆదివారం తన కార్యాలయంలో మీడియాతో మాట్లాడుతూ.. పొత్తులో భాగంగా జనసేన 24 సీట్లకు పరిమితం కావడంతో పవన్ ముసుగు తొలగిపోయిందన్నారు. గతంలో కాపు జాతిని పట్టించుకోని చంద్రబాబు ఇప్పుడేం మేలు చేస్తారని ప్రశ్నించారు. వంగవీటి రంగాను చంపి, ముద్రగడ పద్మనాభాన్ని చిత్రహింసలకు గురిచేసిన వ్యక్తితో చేతులు కలపడం సిగ్గుచేటన్నారు. కాపులు ఎక్కువగా ఉన్న జిల్లాల్లో పార్టీ అధ్యక్ష పదవులతో పాటు, కాపుల్ని ఎమ్మెల్యేలు, మంత్రులుగా చేసిన ఘనత సీఎం జగన్‌కే దక్కుతుందన్నారు.

చంద్రబాబు జాబితాలో సామాజిక న్యాయం ఎక్కడ?

మాల మహానాడు జాతీయ అధ్యక్షుడు నత్తా యోనారాజు విమర్శ



సాక్షి, అమరావతి: చంద్రబాబు ప్రకటించిన టీడీపీ – జనసేన అభ్యర్థుల జాబితాలో సామాజిక న్యాయం ఎక్కడా కన్పించలేదని మాల మహానాడు జాతీయ అధ్యక్షుడు నత్తా యోనారాజు దుయ్యబట్టారు. తాడేపల్లిలో ఆదివారం ఆయన మీడియాతో మాట్లాడుతూ.. టీడీపీ, జనసేన పార్టీలు ప్రకటించిన 99 స్థానాల తొలి జాబితాను పరిశీలిస్తే, ఈ రెండు పార్టీలు సామాజిక న్యాయాన్ని పాటించలేదన్న విషయం అర్థమవుతోందన్నారు. ప్రస్తుతం ప్రకటించిన జాబితాలో ఎంతమంది బీసీ, ఎస్సీ, ఎస్టీలకు స్థానం కల్పించారో ఈ రెండు పార్టీలు ఆత్మ పరిశీలన చేసుకోవాలని సూచించారు. జనసేన, టీడీపీ ఉమ్మడి జాబితాలో సోషల్ ఇంజనీరింగ్ జరిగిందని చెప్పుకోవడం హాస్యాస్పదంగా ఉందన్నారు. సామాజిక న్యాయం గురించి సీఎం వైఎస్ జగన్ ఒక బెంచ్ మార్క్ క్రియేట్ చేశారని చెప్పారు. జనసేనకు ఇచ్చిన 24 సీట్లలో పవన్ ఎక్కడి నుంచి పోటీ చేయాలన్న విషయంపైనా స్పష్టత లేదన్నారు. ఒక రాజకీయ పార్టీని పెట్టి.. తన సామాజికవర్గాన్ని, అభిమానుల్ని ఇలా మోసం చేయడం దారుణమని, పవన్‌పై జాలి కంటే ఆయనను అభిమానించే వారిని చూస్తే జాలి కలుగుతోందన్నారు. ఆ 24 మందిలోనూ అంతా చంద్రబాబు పెట్టే అభ్యర్థులే ఉంటారు. ఏదేమైనా మరోమారు వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రి అవుతారని నత్తా యోనారాజు స్పష్టం చేశారు.

రామోజీ.. ఇసుకపై బురద రాతలు మానవా?

ఇసుక తవ్వకాలపై అబద్ధాలను అచ్చేసిన ఈనాడు

- ఎన్జీటీ మార్గదర్శకాలు పాటిస్తున్నా వక్రీకరణ రాతలు
- పర్యావరణ అనుమతుల మేరకే ఇసుక తవ్వకాలు
- డీసిల్టింగ్ పాయింట్లలోనే ఇసుక ఆపరేషన్స్
- ఇసుకపై పర్యవేక్షణకు సీఎస్ నేతృత్వంలో కమిటీ ఏర్పాటుకు ప్రతిపాదన
- బాధ్యతతో వ్యవహరిస్తున్న ప్రభుత్వంపై బురదజల్లుతారా?
- ఖాళీ రీచ్‌ల నుంచి రోజుకు 2 వేల టన్నుల ఇసుక ఎలా తరలిస్తారు?
- ఇసుక రవాణానే లేకపోతే వే బిల్లులు ఎవరు జారీ చేస్తారు?
- కలెక్టర్ల తనిఖీలపైనా తప్పుడు ఆరోపణలు చేస్తారా?

ఫ్యాక్ట్ చెక్

సాక్షి, అమరావతి: రాష్ట్రంలో సక్రమంగా జరుగుతున్న ఇసుక తవ్వకాలపై రామోజీరావు వక్రరాతలు మానడంలేదు. నిత్యం తన ఈనాడు పత్రికలో ఇసుకపై బురద వార్తలు రాస్తూనే ఉన్నారు. తన గలీజుతనాన్ని బయటపెట్టుకుంటూనే ఉన్నారు. ఇసుక తవ్వకాల్లో లేని అక్రమాలను ఉన్నట్లు చూపించేందుకు రామోజీరావు పడుతున్న తాపత్రయం అంతా ఇంతా కాదు. ఇసుక తవ్వకాల్లో భారీ అక్రమాలు జరిగినట్లు ఎన్జీటీ (నేషనల్ గ్రీన్ ట్రిబ్యునల్) తనకు చెప్పినట్లే కథనాలు అల్లేస్తున్నారు. వాటిని చూసి ప్రజలు నమ్మేస్తారని అపోహ పడుతున్నారు. చంద్రబాబు హయాంలో గతంలో ఎప్పుడూ లేనంత పెద్దఎత్తున అక్రమ ఇసుక తవ్వకాలు జరిగినా పట్టించుకోకుండా ఇప్పుడు ప్రజలకు సులభంగా ఇసుక అందుతున్నా కూడా ప్రభుత్వంపై దుష్ప్రచారానికి ఒడిగడుతున్నారు. నిజానికి ఇసుక తవ్వకాల్లో ఎన్జీటీ నిబంధనల ప్రకారమే ప్రభుత్వం వ్యవహరిస్తోంది. రాష్ట్రంలో 110 ఇసుక రీచ్‌లకు పర్యావరణ అనుమతులు ఉన్నా.. ఎన్జీటీ ఇచ్చిన ఆదేశాలతో వాటిల్లో తవ్వకాలను నిలిపివేసింది. ఆ తర్వాత ఎన్జీటీ మార్గదర్శకాలకు అనుగుణంగా తిరిగి అన్ని అనుమతుల కోసం గనుల శాఖ దరఖాస్తు చేసింది. అందులో భాగంగా ఇప్పటి వరకు 61 ఓపెన్ రీచ్‌లకు అనుమతులు లభించాయి. మిగిలిన వాటికి మరో వారం రోజుల్లో అనుమతులు వచ్చే అవకాశం ఉంది. ప్రస్తుతం సంబంధిత శాఖల నుంచి అనుమతులు ఉన్న డీసిల్టింగ్ పాయింట్లలో మాత్రమే ఇసుక తవ్వకాలు జరుగుతున్నాయి. అయినా 'ఉల్లంఘనలు నిజం' అంటూ పతాక శీర్షికతో పచ్చి అబద్ధాలను ఈనాడు అచ్చేసింది.



ఎన్జీటీకి 3 నెలలకోసారి నివేదిక ఇచ్చేలా చర్యలు

ఇసుక విషయంలో ప్రభుత్వం అత్యంత పారదర్శక విధానాన్ని అమలు చేస్తోంది. ఎన్జీటీ నుంచి వచ్చిన సూచనలు, మార్గదర్శకాలతో దీన్ని మరింత పటిష్టం చేసేందుకు ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ఆధ్వర్యంలో ఒక ఉన్నతస్థాయి కమిటీని కూడా ఏర్పాటు చేసేందుకు గనుల శాఖ ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపింది. ఈ కమిటీ ప్రతి మూడు నెలలకు ఒకసారి ఇసుక తవ్వకాలపై సమగ్ర నివేదికను ఎన్జీటీకి సమర్పించేలా ఈ ప్రతిపాదనలు సిద్ధం చేశారు. ఇసుక తవ్వకాలపై ప్రభుత్వం ఇంత బాధ్యతతో వ్యవహరిస్తోంది.

న్యాయస్థానాల ఆదేశాల ప్రకారం తనిఖీలు

న్యాయస్థానాల ఆదేశాలతో జిల్లాల కలెక్టర్లతో కూడిన బృందాలు రాష్ట్రంలోని అన్ని ఇసుక రీచ్‌లను ఇటీవల పరిశీలించాయి. ఆయా రీచ్‌ల్లో ఇసుక తవ్వకాలు జరుగుతున్నాయా? లేదా అనే అంశాలను రికార్డు చేశాయి. ఈ నివేదికలను న్యాయస్థానాలకు సమర్పించారు. ఎన్జీటీ ఆదేశాలకు అనుగుణంగా గనుల శాఖ తీసుకున్న చర్యల కారణంగా అనుమతి లేని రీచ్‌ల్లో తవ్వకాలు నిలిచిపోయాయి. ఇదే అంశాన్ని కలెక్టర్లు కూడా తమ నివేదికలో స్పష్టం చేశారు. ఈనాడు మాత్రం కలెక్టర్లు వచ్చి వెళ్లిన తరువాత ఇసుక తవ్వకాలు మళ్లీ జరుగుతున్నాయంటూ అడ్డగోలుగా అబద్ధాలు ప్రచురించింది. అది కూడా భారీ యంత్రాలను రీచ్‌లకు తరలించి వెంటనే తవ్వకాలు ప్రారంభించారంటూ నిస్సిగ్గుగా రాసింది. ఒకవైపు ఇసుక రీచ్‌ల్లో అధికారిక తనిఖీలు జరుగుతూ ఉంటే, మరోవైపు ఎవరైనా భారీ యంత్రాలను రీచ్‌లకు తరలిస్తారా? అసలు తవ్వకాలే జరగడం లేదని అధికారులు ప్రత్యక్షంగా తనిఖీ చేసి నివేదిక ఇస్తే, రోజుకు రెండు వేల టన్నుల ఇసుక తవ్వుతున్నారంటూ, కంప్యూటరైజ్డ్ వే బిల్లులు లేకుండానే ఆ ఇసుకను రవాణా చేస్తున్నారంటూ తప్పుడు ఆరోపణలు చేసింది. పాత ఫోటోలతో ప్రజలను నమ్మించేందుకు విశ్వప్రయత్నం చేసింది. జరగని రవాణాకు జీపీఎస్ ట్రాకింగ్ లేదంటూ, రీచ్‌ల్లో సీసీ కెమేరాలు లేవని, అడుగడుగునా ఉల్లంఘనలే జరుగుతున్నాయని గగ్గోలు పెట్టడం రామోజీ వక్రబుద్ధికి నిదర్శనం.

ఆ పత్రికకు నిబద్ధత ఎక్కడిది?



గతేడాది ఏప్రిల్ నుంచి నవంబర్ వరకు వర్షాల వల్ల ఇసుక తవ్వకాలు రీచ్‌ల్లో జరగలేదు. వేసవి కాలంలో ముందుజాగ్రత్తగా సిద్ధం చేసిన ఇసుక డిపోల నుంచే ప్రజలకు విక్రయాలు జరిగాయి. గతంలోనూ ఇదే విషయాన్ని స్పష్టంగా చెప్పినప్పటికీ ఈనాడు పత్రిక దానిని అక్రమ ఇసుక తవ్వకాలు కిందనే నిర్ధారించడం ఆ పత్రికకు ఉన్న నిబద్ధతను తెలియజేస్తోంది. బాధ్యతారహితంగా ఈనాడు ప్రచురించే ఇటువంటి కథనాలపై చట్టపరమైన చర్యలు తీసుకుంటాం.

– వీజీ వెంకటరెడ్డి, డైరెక్టర్, మైనింగ్ శాఖ

నాయీబ్రాహ్మణుల సంక్షేమానికి సీఎం జగన్ కృషి

- కల్యాణకట్ట క్షురకులకు రూ.20వేలు వేతనం ఇచ్చేందుకు టీటీడీ సిద్ధం
- దళారుల మాటలు నమ్మి మోసపోవద్దు
- టీటీడీ బోర్డు సభ్యుడు సిద్దవటం యానాదయ్య వెల్లడి



తిరుపతి కల్చరల్ (తిరుపతి జిల్లా): కులమతాలు, రాజకీయాలకు అతీతంగా సంక్షేమ పాలన అందిస్తున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నాయీబ్రాహ్మణుల సంక్షేమానికి పెద్దపీట వేస్తున్నారని టీటీడీ బోర్డు సభ్యుడు సిద్దవటం యానాదయ్య తెలిపారు. తిరుపతి ప్రెస్‌క్లబ్‌లో ఆదివారం ఏర్పాటుచేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ తన పాదయాత్ర సందర్భంగా నాయీ బ్రాహ్మణులకు ఇచ్చిన హామీల అమలు కోసం సీఎం జగన్ ప్రత్యేకంగా ఆరు జీవోలు తీసుకువచ్చారని చెప్పారు. ఇందులో భాగంగా జీవో 110 ద్వారా రాష్ట్రంలోని హిందూ దేవాలయాల్లో పనిచేసే నాయీ బ్రాహ్మణులందరికీ రూ.20వేలు వేతనం ఇచ్చేలా చర్యలు తీసుకున్నారని తెలిపారు. ప్రభుత్వం తీసుకుచ్చిన జీవో నంబర్ 110ను సైతం టీటీడీలో అమలు చేసే దిశగా పాలక మండలి ఆమోదం తెలిపిందని చెప్పారు. టీటీడీ కార్పొరేషన్‌లో చేరిన వారితోపాటు శ్రీవారి సేవకుల పేరుతో కల్యాణకట్టలో పని చేస్తున్న 850మందికి కూడా నెలకు రూ.20 వేలు జీతం ఇచ్చేందుకు టీటీడీ సిద్ధమైందని వివరించారు. అయితే టీటీడీలో పనిచేసే ఇద్దరు బ్రోకర్లు నాయీబ్రాహ్మణులను తప్పుదారి పట్టిస్తూ వేతనాలు ఇప్పిస్తామని డబ్బులు వసూలు చేసి మోసం చేస్తున్నారన్నారు. మరోవైపు కమ్యూనిస్టులు కూడా కల్యాణకట్ట క్షురకులను రెచ్చగొడుతూ ధర్నాలు, ముట్టడి పేరుతో హడావుడి చేస్తున్నారని, ఇది మంచి పద్ధతి కాదన్నారు. వచ్చే నెల నుంచి కల్యాణకట్ట క్షురకులకు రూ.20వేలు వేతనాలను టీటీడీ ఇస్తుందని చెప్పారు. కల్యాణకట్ట నాయీబ్రాహ్మణుల నుంచి వసూళ్లకు పాల్పడినవారిపై విజిలెన్స్ విచారణ చేపట్టి నిజాలు నిగ్గుతేలుస్తామని స్పష్టం చేశారు. నాయీబ్రాహ్మణ వెల్ఫేర్ డెవలప్‌మెంట్ చైర్మన్ తొండమనాటి పుల్లయ్య, నాయీబ్రాహ్మణ సంఘ నేతలు వెంకటేష్, ఆంజనేయులు, వీరభద్రం, కుమార్ పాల్గొన్నారు.

ఏపీలో సినిమాల చిత్రీకరణకు కృషి



మాట్లాడుతున్న ఏఎం రత్నం

ఏపీ ఫిల్మ్ చాంబర్ అధ్యక్షుడు ఏఎం.రత్నం

తిరుపతి కల్చరల్ (తిరుపతి జిల్లా): హైదరాబాద్‌కు సమాంతరంగా ఏపీలోనూ చిత్ర పరిశ్రమను బలోపేతం చేయడానికి ఆంధ్రప్రదేశ్ చలనచిత్ర వాణిజ్య మండలి కృషి చేస్తోందని ప్రముఖ నిర్మాత, ఏపీ ఫిల్మ్ చాంబర్ అధ్యక్షుడు ఏఎం రత్నం తెలిపారు. తిరుపతిలో ఆదివారం జరిగిన ఏపీ ఫిల్మ్ చాంబర్ ఆఫ్ కామర్స్, తిరుపతి, చిత్తూరు, అన్నమయ్య జిల్లాల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఏపీలో చలనచిత్ర పరిశ్రమను అభివృద్ధి చేయాలన్న సంకల్పంతో ఏపీ ఫిల్మ్ చాంబర్ ఆఫ్ కామర్స్ జిల్లాల వారీగా సమావేశాలు చేపడుతోందని చెప్పారు. రాష్ట్రంలోనే సినిమా చిత్రీకరణలను ప్రోత్సహించడం, ప్రభుత్వ పరంగా నిర్మాతలకున్న రాయితీలపై అవగాహన కల్పించడం, జిల్లాల వారీగా ఫిల్మ్ చాంబర్ కమిటీలు ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. కళాకారులకు, ఇతర సాంకేతిక నిపుణులకు వృత్తి నైపుణ్యం పెంచడంపై శిక్షణ ఇచ్చే అంశాలపై చర్చించామన్నారు. ఏపీలో సినీ స్టూడియో నిర్మించడానికి ప్రణాళిక సిద్ధం చేస్తున్నామన్నారు. ఫిల్మ్ ఛాంబర్ ప్రధాన కార్యదర్శి జేవీ.మోహన్‌గౌడ్ మాట్లాడుతూ ఏపీకి చెందిన నిర్మాతలు ఇక్కడే చిత్రీకరణలు చేయాలని, ఇందుకు చాంబర్ కూడా సహకరిస్తుందన్నారు. ఏపీలో షూటింగ్‌లు చేస్తే ప్రభుత్వం నుంచి రాయితీలు లభిస్తాయని, లొకేషన్లను ఉచితంగా ఇస్తుందని చెప్పారు. అనంతరం తిరుపతి జిల్లా కో–ఆర్డినేటర్‌గా ఏవీ రవిచంద్రారెడ్డి, చిత్తూరు జిల్లా కో–ఆర్డినేటర్‌గా జెమినికాంత్, అన్నమయ్య జిల్లా కో–ఆర్డినేటర్‌గా నక్కా రాజేంద్రప్రసాద్‌ను నియమించారు. ఉమ్మడి చిత్తూరు జిల్లాకు చెందిన పలువురు కళాకారులను ఏఎం రత్నం సత్కరించారు. చాంబర్ నేతలు పి.విజయవర్మ, మంతా శ్రీనివాస్, ఎస్ఎస్ మూర్తి, పి.రమణారెడ్డి, పీడీఆర్.ప్రసాద్‌రెడ్డి, రవీంద్ర గోపాల పాల్గొన్నారు.

నేటినుంచి రాష్ట్రస్థాయి జర్నలిస్టుల క్రికెట్ టోర్నీ

సాక్షి, అమరావతి: అనంతపురంలోని ఆర్డీటీ మైదానంలో సోమవారం నుంచి రాష్ట్రస్థాయి జర్నలిస్టుల క్రికెట్ టోర్నీ జరగనుంది. ఈ పోటీలు ఐదురోజులు జరుగుతాయి. ఈ టోర్నీ జెర్సీలను ఆంధ్రప్రదేశ్ వర్కింగ్ జర్నలిస్ట్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు మచ్చా రామలింగారెడ్డి ఆధ్వర్యంలో ఆవిష్కరించారు.

ఇంకా సీట్లు మిగిలే ఉన్నాయిగా!

బీజేపీ పొత్తులపై రాష్ట్ర అధ్యక్షురాలు పురందేశ్వరి వ్యాఖ్య



సాక్షి, అమరావతి: 'టీడీపీ జనసేన పొత్తులో 99 స్థానాలకు అభ్యర్థులను ప్రకటించినా.. ఇంకా సీట్లు మిగిలి ఉన్నాయి కదా..' అంటూ బీజేపీ రాష్ట్ర అధ్యక్షురాలు దగ్గుబాటి పురందేశ్వరి వ్యాఖ్యానించారు. విజయవాడలోని పార్టీ రాష్ట్ర కార్యాలయంలో ఆదివారం ఆమె విలేకరులతో మాట్లాడుతూ టీడీపీ జనసేన పొత్తులో బీజేపీ కలిసే అవకాశంపై ఓ విలేకరి అడిగిన ప్రశ్నకు ఈ విధంగా స్పందించారు. 'ఆ పార్టీలతో బీజేపీ పొత్తు ఉంటుందా, పొత్తు ఉంటే ఎన్ని సీట్లు.. అన్న విషయాలన్నీ మా పార్టీ అధిష్టానమే చూసుకుంటుంది. పొత్తుపై జాతీయ నాయకత్వం నిర్ణయం తీసుకునే వరకు రాష్ట్రంలో 175 అసెంబ్లీ, 25 లోక్‌సభ స్థానాల్లో మా నాయకులు పని చేసుకుంటూపోతారు' అని పేర్కొన్నారు.

బాబు చేతిలో మరోసారి మోసపోయాం

ఆంధ్రప్రదేశ్ కాపు ఐక్య వేదిక రాష్ట్ర చైర్మన్ రావి శ్రీనివాస్

సాక్షి, అమరావతి : చంద్రబాబు నయవంచనతో మరోసారి కాపులు మోసపోయారని కాపు ఐక్య వేదిక రాష్ట్ర చైర్మన్ రావి శ్రీనివాస్ ఆవేదన వ్యక్తం చేశారు. ఆదివారం ఆయన విడుదల చేసిన ప్రకటనలో 2014 ఎన్నికల్లోనే చతికిలపడ్డ టీడీపీకి మద్దతు ఇచ్చి అధికారంలోకి తీసుకొచ్చిన పవన్‌ను 2019 ఎన్నికల్లో రెండు చోట్లా ఓడించడంలో చంద్రబాబు కుట్రలు చేశారని ఆరోపించారు. ఆరు నెలల్లో కాపులకు బీసీ రిజర్వేషన్లు అమలు చేస్తామని చెప్పి మేనిఫెస్టోలో పెట్టిన హామీని తుంగలో తొక్కారని, వెంటనే తప్పులు సరిదిద్దుకోకుంటే టీడీపీ అభ్యర్థుల ఓటమే ధ్యేయంగా కాపు ఐక్యవేదిక పని చేస్తుందని హెచ్చరించారు.

రెచ్చిపోయిన తెలుగు తమ్ముళ్లు

- ఎమ్మెల్యే ఉదయభాను కాన్వాయ్‌కు దారి ఇవ్వకుండా కవ్వింపు
- వైఎస్సార్ సీపీ కార్యకర్తలపై దాడి
- ఇరు పార్టీల కార్యకర్తల మధ్య చెలరేగిన ఘర్షణ
- అధికారపార్టీ ఫ్లెక్సీల చించివేత
- పోలీసులు నియంత్రిస్తున్నా రాళ్లు రువ్విన టీడీపీ కార్యకర్తలు
- పోలీసులకు, విలేకరులకూ గాయాలు



వైఎస్సార్‌సీపీ కార్యకర్తలపై దౌర్జన్యానికి పాల్పడుతున్న టీడీపీ కార్యకర్తలు

జగ్గయ్యపేట అర్బన్: ఎన్టీఆర్ జిల్లా జగ్గయ్యపేట పట్టణంలో తెలుగుదేశం కార్యకర్తలు రెచ్చిపోయారు. ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే సామినేని ఉదయభాను కాన్వాయ్‌కు దారి ఇవ్వకుండా కారు వెనుక అద్దాలను కొడుతూ కవ్వింపు చర్యలకు దిగారు. వైఎస్సార్ సీపీ కార్యకర్తలపై దాడికి తెగబడ్డారు. దీంతో ఇరు పార్టీల కార్యకర్తల మధ్య ఘర్షణ నెలకొంది. అసలేం జరిగిందంటే.. ఆదివారం మధ్యాహ్నం ఎమ్మెల్యే ఉదయభాను బలుసుపాడు రోడ్డులోని టిడ్కో గృహాల వద్ద జరుగుతున్న పనులను పరిశీలించి జగ్గయ్యపేటకు తిరిగి వస్తుండగా పట్టణంలోని పెద్ద సెంటర్‌లో టీడీపీ కార్యకర్తలు దళిత ఆత్మీయ సమ్మేళనం పేరుతో ర్యాలీగా వస్తూ ఎదురుపడ్డారు. ఈ సమయంలో ఎమ్మెల్యే కాన్వాయ్‌కు దారి ఇవ్వకుండా టీడీపీ జెండాలు ఊపుతూ కవ్వింపు చర్యలకు దిగారు. ఎమ్మెల్యే కారు వెనుక అద్దాలను కొడుతూ టీడీపీ జిందాబాద్ అంటూ పెద్దగా నినాదాలు చేశారు. ఆ సమయంలో ఎమ్మెల్యే ఉదయభాను వెంట సుమారు 15 మంది కార్యకర్తలు ఉండగా, టీడీపీ వారు వందలాది మంది ఉన్నారు. టీడీపీ కార్యకర్తల కవ్వింపు చర్యలకు ప్రతిగా ఓ వైఎస్సార్ సీపీ కార్యకర్త తమ జెండా ఊపడంతో ఆగ్రహించిన తెలుగు తమ్ముళ్లు అతనిపై దాడికి తెగబడ్డారు. దీంతో ఇరు వర్గాల మధ్య ఘర్షణ చెలరేగింది. పోలీసులు రంగంలోకి దిగి వైఎస్సార్ సీపీ కార్యకర్తలను పాత మునిసిపల్ కార్యాలయం ఆవరణలో ఉంచి గేట్లు వేశారు. అయినా టీడీపీ కార్యకర్తలు రాళ్లు రువ్వుతూ వీరంగం సృష్టించారు. కొన్ని రాళ్లు పోలీసులు, విలేకరులకు కూడా తగిలాయి. కనిపించిన చోటల్లా వైఎస్సార్ సీపీ ఫ్లెక్సీలను ధ్వంసం చేశారు. పోలీసులు ఆందోళనకారులను నియంత్రించి పరిస్థితిని చక్కదిద్దారు. నందిగామ ఏసీపీ డాక్టర్ బి.రవికిరణ్ వచ్చి బందోబస్తును పర్యవేక్షించారు. ముఖ్య కూడళ్ల వద్ద పికెట్లు ఏర్పాటు చేశారు. సాయంత్రం వీధుల్లో కవాతు నిర్వహించారు. శాంతియుతంగా వస్తున్న తమ కార్యకర్తలపై టీడీపీ కార్యకర్తలు దౌర్జన్యానికి దిగారని, కొందరిని గాయపరిచారని, వారిపై పోలీసులకు ఫిర్యాదు చేస్తున్నట్లు వైఎస్సార్ సీపీ జగ్గయ్యపేట పట్టణ అధ్యక్షుడు ఆకుల శ్రీకాంత్, మున్సిపల్ వైస్ చైర్మన్ తుమ్మల ప్రభాకర్ తెలిపారు.

చంద్రబాబు కుటిల రాజకీయాలకు కాపులు బలి

- మొన్న రంగా.. నిన్న చిరంజీవి.. నేడు పవన్
- కాపులను అణగదొక్కుతూ బానిసల్లా చూస్తున్న బాబు
- హరిరామజోగయ్య హెచ్చరిస్తూనే ఉన్నా కళ్లు మూసుకుపోయాయి
- విజయవాడ తూర్పు నియోజకవర్గ జనసేన ఇన్‌చార్జ్ బత్తిన రాము



ఆటోనగర్(విజయవాడ తూర్పు): కుట్ర పూరిత రాజకీయాలు, నమ్మించి మోసం చేయడం, నోటితో నవ్వి నొసటితో వెక్కిరించడం చంద్రబాబు నైజమని, జీవిత చరమాంకంలోనూ ఆయనలో ఎలాంటి మార్పు రాలేదని జనసేన విజయవాడ తూర్పు నియోజకవర్గ ఇన్‌చార్జ్ బత్తిన రాము ఘాటైన విమర్శలు చేశారు. టీడీపీ, జనసేన పొత్తులో భాగంగా తాజాగా ప్రకటించిన సీట్ల కేటాయింపుపై రాము అసహనం వ్యక్తం చేశారు. ఎన్టీఆర్ జిల్లా విజయవాడలోని తన కార్యాలయంలో ఆదివారం మీడియాతో మాట్లాడారు. చంద్రబాబు ఎత్తులు, జిత్తులపై ఎప్పటికప్పుడు కాపు నేత హరిరామజోగయ్య హెచ్చరిస్తూనే ఉన్నా.. కళ్లు మూసుకుపోయిన మనం గుర్తించలేకపోయామన్నారు. జనసేనకు కేవలం 24 సీట్లు మాత్రమే ప్రకటించడాన్ని జనసైనికులు జీర్ణించుకోలేక పోతున్నారని, కాపులను బానిసలుగా చూసేలా చంద్రబాబు వ్యవహార శైలి ఉందని తేల్చి చెప్పారు. చంద్రబాబు కుటిల రాజకీయాలకు కాపు నేతలు బలవుతూనే ఉన్నారని విమర్శించారు. వంగవీటి రంగాను చంద్రబాబు అంతమొందించాడని గుర్తు చేశారు. అప్పటి నుంచే కాపులను అణగదొక్కుతూ కేవలం ఓటు బ్యాంకుగానే చంద్రబాబు వాడుకుంటున్నాడని ఆగ్రహం వ్యక్తం చేశాడు. తర్వాత చిరంజీవినీ ఇదే తరహాలో మోసం చేశారని, ప్రజారాజ్యం పార్టీని విలీనం చేసేంత వరకు బాబు నిద్రపోలేదన్నారు. కాపుల ఓట్ల కోసం మళ్లీ ఇప్పుడు పవన్‌ను వాడుకుంటున్నాడని, దీనిని జనసైనికులు గుర్తించాలన్నారు.

చంద్రబాబుతో మనం ఎందుకు కలిసి వెళ్లాలి?

ఈనాడు పత్రికతో కలిసే చంద్రబాబు దుర్నీతి రాజకీయాలకు పాల్పడుతున్నాడని రాము విమర్శించారు. ప్రజా రాజ్యం పార్టీపై ఈనాడులో ముందుగా 'జెండా పీకేద్దాం' అని రాయించి చిరంజీవిలో భయం పుట్టించి.. నమ్మకం కోల్పోయేలా చేసి.. నెమ్మదిగా పార్టీని భూ స్థాపితం చేశారని ధ్వజమెత్తారు. చంద్రబాబు కుటిల రాజకీయాలకు ఎల్లో గ్యాంగ్ నిత్యం తోడుగానే ఉంటుందన్న విషయాన్ని, ఎల్లో మీడియా విషకోరల నుంచి జనసేనను కాపాడుకుందామని జన సైనికులు పిలుపునిచ్చారు. 14 ఏళ్లు సీఎంగా చేసి రాష్ట్రానికి ఏ మేలు చేశాడో ధైర్యంగా చెప్పలేని వ్యక్తితో మనం ఎందుకు కలిసి వెళ్లాలని ప్రశ్నించారు. 2019 ఎన్నికల్లో జనసేన పార్టీ తరపున పోటీ చేసి విజయవాడ తూర్పు నియోజకవర్గంలో 31 వేల ఓట్లు సాధించానని రాము వెల్లడించారు. తెనాలిలో ఓటు బ్యాంక్ లేని జనసేనకు ఎందుకు సీటు కేటాయించారని, జనసేన బలం ఉన్న విజయవాడ తూర్పుకు ఎందుకు ఇవ్వలేదని సూటిగా ప్రశ్నించారు. కేవలం ఓడిపోయే ప్రాంతాల్లో మాత్రమే జనసేనకు కుట్ర పూరితంగా చంద్రబాబు సీట్లు కేటాయించారని ఆగ్రహం వ్యక్తం చేశారు.

జాతీయ స్థాయిని మించి ఏపీ తలసరి వినియోగ వ్యయం

జాతీయ స్థాయిలో గ్రామాల్లో నెలవారీ తలసరి వినియోగ వ్యయం రూ.3,860

- పట్టణాల్లో అయితే రూ.6,521
- ఏపీలోని గ్రామాల్లో నెలవారీ తలసరి వినియోగ వ్యయం రూ.4,996
- పట్టణాల్లో ఆ మొత్తం రూ.6,887
- గృహ వినియోగ వ్యయ సర్వే నివేదిక వెల్లడి



సాక్షి, అమరావతి: ఆంధ్రప్రదేశ్‌లో గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో నెలవారీ తలసరి వినియోగ వ్యయం జాతీయ స్థాయిని మించి నమోదైంది. ఈ విషయాన్ని కేంద్ర గణాంకాలు, కార్యక్రమాల అమలు మంత్రిత్వ శాఖ ఆదివారం విడుదల చేసిన గృహ వినియోగ వ్యయ సర్వే 2022–23 వెల్లడించింది. వివిధ సంక్షేమ పథకాల ద్వారా ప్రభుత్వాలు అందిస్తున్న ఉచిత ఆహార, ఇతర వస్తువులతోపాటు ఆహారేతర వస్తువుల వినియోగం ఆధారంగా 2022–23 గృహ వినియోగ వ్యయ సర్వే కోసం క్షేత్రస్థాయి నుంచి సమాచారాన్ని సేకరించినట్టు సర్వే నివేదిక వెల్లడించింది. ఆహార పదార్థాలైన బియ్యం, గోధుమలు, మొక్కజొన్న రాగులు, పప్పులు, చక్కెర, వంట నూనెలు, ఆహారేతర వస్తువులైన ల్యాప్‌టాప్, పీసీ, టాబ్లెట్, మొబైల్, సైకిల్, మోటార్ సైకిల్, స్కూటీ, స్కూల్ యూనిఫాం, స్కూల్ షూ తదితర వస్తువులను పరిగణనలోకి తీసుకుని నెలవారీ తలసరి వినియోగ వ్యయాన్ని లెక్కించినట్టు సర్వే నివేదిక తెలిపింది.

రాష్ట్రంలో తలసరి వ్యయం ఇలా..

జాతీయ స్థాయిలో గ్రామాల్లో నెలవారీ తలసరి వినియోగ వ్యయం రూ.3,860 ఉండగా.. పట్టణాల్లో ఆ వ్యయం రూ.6,521 ఉన్నట్టు సర్వే పేర్కొంది. ఏపీ విషయానికి వస్తే గ్రామాల్లో నెలవారీ తలసరి వినియోగ వ్యయం రూ.4,996 ఉండగా.. పట్టణాల్లో రూ.6,877 ఉన్నట్టు సర్వే వెల్లడించింది. పొరుగు రాష్ట్రం తెలంగాణ గ్రామాల్లో నెలవారీ తలసరి వినియోగ వ్యయం కంటే ఆంధ్రప్రదేశ్‌లోనే ఎక్కువగా ఉంది. తెలంగాణలో తలసరి వినియోగ వ్యయం రూ.4,959గా ఉంది. అత్యల్పంగా ఛత్తీస్‌గఢ్ రాష్ట్రంలోని గ్రామాల్లో నెలవారీ తలసరి వినియోగ వ్యయం రూ.2,257 రూపాయలు ఉండగా.. పట్టణాల్లో రూ.4,557 ఉందని సర్వే తెలిపింది. కేంద్రపాలిత ప్రాంతాల్లో చూస్తే ఛండీగఢ్‌లో గ్రామాల్లో అత్యధికంగా నెలవారీ తలసరి వినియోగ వ్యయం రూ.7,467 ఉండగా.. పట్టణాల్లో రూ.12,577 ఉంది. అత్యల్పంగా లద్దాఖ్‌లో గ్రామాల్లో నెలవారీ తలసరి వినియోగ వ్యయం రూ.4,062 ఉండగా.. పట్టణాల్లో రూ.5,511 ఉందని సర్వే నివేదిక తెలిపింది.

■ తెలంగాణ

తెలంగాణ మీడియా అకాడమీ చైర్మన్‌గా శ్రీనివాస్‌రెడ్డి

సాక్షి, హైదరాబాద్: తెలంగాణ రాష్ట్ర మీడియా అకాడమీ చైర్మన్‌గా ప్రముఖ పాత్రికేయుడు కలిమెకొలన్ శ్రీనివాస్‌రెడ్డి నియమితులయ్యారు. ఈ మేరకు ప్రభుత్వం ఆదివారం ఉత్తర్వులు జారీచేసింది. ఆయన రెండేళ్లపాటు ఈ పదవిలో కొనసాగనున్నట్టు సమాచార, పౌర సంబంధాల శాఖ ప్రత్యేక కార్యదర్శి ఎం.హనుమంతరావు జారీచేసిన ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. నల్లగొండ జిల్లా పల్లెపహాడ్ గ్రామానికి చెందిన కె.శ్రీనివాస్‌రెడ్డి ఐదు దశాబ్దాలకుపైగా పాత్రికేయ వృత్తిలో కొనసాగుతున్నారు. 21 ఏళ్ల వయసులోనే విశాలాంధ్ర దినపత్రికలో స్టాఫ్ రిపోర్టర్‌గా వృత్తి జీవితాన్ని ఆరంభించారు. ప్రస్తుతం ప్రజాపక్షం సంపాదకుడిగా ఉన్నారు. ఆంధ్రప్రదేశ్ యూనియన్ ఆఫ్ వర్కింగ్ జర్నలిస్ట్స్(ఏపీయూడబ్ల్యూజే) ప్రధాన కార్యదర్శిగా, అధ్యక్షుడిగా పనిచేసిన ఆయన ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో ప్రెస్ అకాడమీకి వ్యవస్థాపక చైర్మన్‌గా కేబినెట్ హోదాలో సేవలందించారు. ఐజేయూ సెక్రటరీ జనరల్ పని చేశారు. ప్రస్తుతం అధ్యక్షుడిగా ఉన్నారు.

సీబీఐ విచారణకు 26న ఢిల్లీ రాలేను

సీబీఐకి బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కవిత లేఖ

సాక్షి, హైదరాబాద్: ముందే నిర్ణయించిన కార్యక్రమాల దృష్ట్యా ఈనెల 26న ఢిల్లీలో విచారణకు హాజరుకావడం సాధ్యం కాదని బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత సీబీఐకి స్పష్టం చేశారు. సీఆర్‌పీసీ సెక్షన్ 41ఏ కింద తనకు జారీ చేసిన నోటీసుల రద్దు లేదా ఉపసంహరించుకోవాలని సీబీఐని కోరారు. ఈ మేరకు ఆదివారం కవిత సీబీఐకి లేఖ రాశారు. ఢిల్లీ లిక్కర్ కేసులో విచారణకు హాజరు కావాలని ఎమ్మెల్సీ కవితకు సీబీఐ ఇటీవల సీఆర్‌పీసీ 41ఏ కింద నోటీసులు జారీ చేసింది. ఆ నోటీసులకు ప్రతిస్పందనగా రాసిన లేఖలో కవిత కీలకాంశాలను ప్రస్తావించారు. తనకు సీఆర్‌పీసీ సెక్షన్ 41ఏ కింద నోటీసులు ఇవ్వడం సబబు కాదని, 2022 డిసెంబరులో అప్పటి విచారణ అధికారి ఇదే తరహా నోటీసు సెక్షన్ 160 కింద ఇచ్చారని, గతంలో జారీ చేసిన సెక్షన్ 160 నోటీసుకు ప్రస్తుత సెక్షన్ 41ఏ నోటీసు పూర్తి విరుద్ధంగా ఉందని చెప్పారు. సెక్షన్ 41ఏ కింద ఎందుకు, ఏ పరిస్థితుల్లో నోటీసులు ఇచ్చారో స్పష్టత లేదని, సీబీఐకి ఏవైనా ప్రశ్నలకు సమాధానం లేదా సమాచారం కావాలంటే వర్చువల్‌గా అందుబాటులో ఉంటానన్నారు.

క్లుప్తంగా...

ముంబైలో వేడుకగా శ్రీవారి కల్యాణం



కల్యాణోత్సవంలో టీటీడీ చైర్మన్ భూమన కరుణాకరరెడ్డి, ఈవో ధర్మారెడ్డి

తిరుపతి (అలిపిరి) (తిరుపతి జిల్లా): మహారాష్ట్రలోని ముంబై నగరంలో ఆదివారం రాత్రి శ్రీ వేంకటేశ్వరస్వామి కల్యాణం వేడుకగా జరిగింది. తిరుమల శ్రీవారి ఆలయ అర్చకులు స్వామికి, శ్రీదేవి, భూదేవి అమ్మవార్లకు శాస్త్రోక్తంగా కల్యాణోత్సవం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న మహారాష్ట్ర ముఖ్యమంత్రి ఏక్‌నాథ్ షిండే, ఉపముఖ్యమంత్రి దేవేంద్ర ఫడ్నవీస్ మాట్లాడుతూ టీటీడీ నిర్వహిస్తున్న సనాతన హిందూధర్మ ప్రచారాన్ని అభినందించారు. ఎంపీ శ్రీకాంత్ షిండే, టీటీడీ చైర్మన్ భూమన కరుణాకరరెడ్డి, ఈవో ఎ.వి.ధర్మారెడ్డి, శ్రీవారి ఆలయ ప్రధాన అర్చకులు వేణుగోపాల దీక్షితులు, వేలాదిమంది భక్తులు పాల్గొన్నారు. అన్నమాచార్య ప్రాజెక్టు కళాకారులు అన్నమాచార్య సంకీర్తనలు ఆలపించారు.

సీఎం జగన్ పథకాలతో ప్రజలు ఆనందంగా ఉన్నారు

టీడీపీ నేత జేసీ దివాకర్‌రెడ్డి



అనంతపురం ఎడ్యుకేషన్: 'సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అమలు చేస్తున్న పథకాలు బాగున్నాయి. వీటివల్ల ప్రజలు ఆనందంగా ఉన్నారు. చంద్రబాబు అధికారంలోకొస్తే ఈ స్కీములన్నీ కొనసాగించడంతో పాటు ఇంకా బెటర్ స్కీములు ఇస్తారు' అని మాజీ ఎంపీ జేసీ దివాకర్‌రెడ్డి అన్నారు. ఆదివారం అనంతపురంలో ఆయన మీడియాతో మాట్లాడారు. వివిధ సర్వేలపై ఆధారపడి తెలుగుదేశం, జనసేన పార్టీలు టికెట్లు ఇచ్చాయన్నారు. ఈ క్రమంలో చంద్రబాబు చాలామంది ఆప్తులను కూడా పక్కన పెట్టారని చెప్పారు. కుటుంబంలో ఒకరికి మాత్రమే టికెట్ అనే విషయాన్ని చంద్రబాబు తమకు చెప్పలేదని, తన కుమారుడు జేసీ పవన్‌కుమార్‌రెడ్డి టికెట్ విషయం తనకు తెలీదన్నారు. ఇటీవల తన సోదరుడు, తన కుమారుడు ఇద్దరూ చంద్రబాబుతో భేటీ అయ్యారని, తన కుమారుడి విషయంలో ఏ నిర్ణయం తీసుకుంటారో తెలీదని చెప్పారు. సీఎం జగన్‌ను గద్దె దించాలన్న లక్ష్యంతో చంద్రబాబు, పవన్‌లు పనిచేస్తున్నారని చెప్పారు.

ఇండియన్ మిలటరీ కాలేజీకి రాజుపాలెం విద్యార్థి



రాజుపాలెం: డెహ్రాడూన్‌లోని ప్రతిష్టాత్మక రాష్ట్రీయ ఇండియన్ మిలటరీ కాలేజీకి వైఎస్సార్ జిల్లా రాజుపాలెం మండల విద్యార్థి సంబటూరు వీరప్రజాపతిరెడ్డి ఎంపికయ్యాడు. మండలంలోని అర్కటవేముల గ్రామానికి చెందిన వీరప్రజాపతిరెడ్డి ప్రొద్దుటూరు దొరసానిపల్లెలోని గోపికృష్ణ సెంట్రల్ హైస్కూల్‌లో 9వ తరగతి చదువుతున్నాడు. బద్వేలు సుబ్బారెడ్డి, హైదరాబాద్ రాము వద్ద ఆర్ఐఎంసీ ప్రవేశ పరీక్ష కోసం ప్రత్యేక శిక్షణ తీసుకున్నాడు. దేశవ్యాప్తంగా ఈ కాలేజీలో ఖాళీగా ఉన్న 33 సీట్లకుగాను నిర్వహించిన పరీక్షలకు వేలాదిమంది హాజరుకాగా అందులో 21 మంది మాత్రమే విజయం సాధించారు. ఆంధ్రప్రదేశ్ నుంచి ఎంపికైన ఏకైక విద్యార్థి కావడంపై అతడి తల్లిదండ్రులు రమణారెడ్డి, ఉమానాగేశ్వరి, తాత అన్నపురెడ్డి రాఘవరెడ్డి సంతోషం వ్యక్తం చేశారు.

చుక్కల దుప్పి చర్మం, కొమ్ములు అక్రమ రవాణా

నలుగురి అరెస్ట్.. దుప్పి చర్మం, 20 కొమ్ములు స్వాధీనం



నిందితులతో డీఎఫ్‌వో, సిబ్బంది

నరసరావుపేట రూరల్: చుక్కల దుప్పి చర్మం, కొమ్ముల అక్రమ రవాణాకు పాల్పడుతోన్న ముఠాను పల్నాడు జిల్లా అటవీ శాఖాధికారులు అరెస్ట్ చేసి చుక్కల దుప్పి చర్మంతో పాటు 20 దుప్పి కొమ్ములను స్వాధీనం చేసుకున్నారు. జిల్లా అటవీశాఖ కార్యాలయంలో డీఎఫ్‌వో ఎస్.రామచంద్రరావు కేసు వివరాలను ఆదివారం వెల్లడించారు. బొల్లాపల్లి అటవీ పరిసర ప్రాంతాల్లో చుక్కల దుప్పులను వేటాడి వాటి చర్మం, కొమ్ములను స్మగ్లింగ్ చేస్తున్నారనే సమాచారంతో ప్రత్యేక టీం ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఈ నెల 24న చుక్కల దుప్పి చర్మం, కొమ్ముల అక్రమ రవాణాకు ప్రయత్నిస్తున్న బొల్లాపల్లికి చెందిన షేక్ మాబుసాహెబ్, వి.వెంకటరాజులు, తన్నీరు నరసింహారావు, గోగు నాగరాజులను అదుపులోకి తీసుకున్నట్లు చెప్పారు. ఈ అక్రమ రవాణాలో పాల్గొన్న విజయవాడకు చెందిన పోలీస్ కానిస్టేబుల్ షేక్ రహంతుల్లా, బొల్లాపల్లికి చెందిన గోగు కనకయ్యలు పరారీలో ఉన్నట్లు చెప్పారు. కేసులో కీలకపాత్ర పోషించిన వినుకొండ ఫారెస్ట్ రేంజ్ ఆఫీసర్ సయ్యద్ హుస్సేన్, డిప్యూటీ రేంజ్ ఆఫీసర్ సురేంద్ర, ఫారెస్ట్ బీట్ ఆఫీసర్ రామకృష్ణ, ప్రత్యేక బృందం సిబ్బందిని డీఎఫ్‌వో అభినందించారు.

టెన్త్ పరీక్షలకు సర్వం సిద్ధం

మార్చి 18 నుంచి 30 వరకు నిర్వహణ


రాష్ట్రవ్యాప్తంగా హాజరుకానున్న 6,23,092 మంది విద్యార్థులు

- అన్ని వసతులతో 3,473 సెంటర్ల ఏర్పాటు
- మాస్ కాపీయింగ్ కట్టడికి డిజిటల్ టెక్నాలజీ వినియోగం
- మార్చి 31 నుంచి ఏప్రిల్ 8 వరకు స్పాట్ వ్యాల్యూషన్
- అనంతరం రీ వెరిఫికేషన్, రీ కౌంటింగ్

పదో తరగతి పరీక్షల షెడ్యూల్ ఇలా..

- 18-3-2024: ఫస్ట్ లాంగ్వేజ్ పేపర్ (గ్రూప్-ఏ)
- 18-3-2024: ఫస్ట్ లాంగ్వేజ్ పేపర్-1 (కాంపోజిట్ కోర్సు)
- 19-3-2024: సెకండ్ లాంగ్వేజ్
- 20-3-2024: ఇంగ్లిష్
- 22-3-2024: మ్యాథమెటిక్స్
- 23-3-2024: ఫిజికల్ సైన్స్
- 26-3-2024: బయోలాజికల్ సైన్స్
- 27-3-2024: సోషల్ స్టడీస్
- 28-3-2024: ఫస్ట్ లాంగ్వేజ్ పేపర్-2 (కాంపోజిట్ కోర్సు)
- 28-3-2024: ఓఎస్సెస్సీ మెయిన్ లాంగ్వేజ్ పేపర్-1 (సంస్కృతం, అరబిక్, పర్షియన్)
- 30-3-2024: ఓఎస్సెస్సీ మెయిన్ లాంగ్వేజ్ పేపర్-2 (సంస్కృతం, అరబిక్, పర్షియన్)
- 30-3-2024: ఎస్సెస్సీ ఒకేషనల్ (థియరీ)

సాక్షి, అమరావతి: పదో తరగతి పబ్లిక్ పరీక్షలకు పాఠశాల విద్యాశాఖ ఎగ్జామ్స్ విభాగం ఏర్పాట్లు పూర్తిచేసింది. మార్చి 18 నుంచి 30వ తేదీ వరకు నిర్వహించనున్న పరీక్షల కోసం రాష్ట్రవ్యాప్తంగా అన్ని వసతులతో 3,473 సెంటర్లను సిద్ధం చేసింది. ప్రధాన పరీక్షలు మార్చి 28వ తేదీతో ముగుస్తాయి. ఆ తర్వాత రెండు రోజులు ఓరియంటల్, ఒకేషనల్ పరీక్షలు ఉంటాయి. కాగా, 2023–24 విద్యా సంవత్సరంలో మొత్తం 6,23,092 మంది విద్యార్థులు పదో తరగతి పరీక్షలకు ఎన్‌రోల్ చేసుకున్నారు. వీరిలో గత ఏడాది పదో తరగతి ఫెయిలై తిరిగి ప్రవేశం పొందినవారు 1,02,528 మంది ఉన్నారు. ఓరియంటల్ విద్యార్థులు 1,562 మంది ఉన్నారు. కాగా, మొత్తం పదో తరగతి విద్యార్థుల్లో 3,17,939 మంది బాలురు, 3,05,153 మంది బాలికలు ఉన్నారు. ఉదయం 9.30 నుంచి మధ్యాహ్నం 12.15 గంటలకు పరీక్షలు నిర్వహిస్తారు. విద్యార్థులను ఉదయం 8.45 నుంచి 9.30 గంటలకు వరకు పరీక్షా కేంద్రాల్లోకి అనుమతిస్తారు. ప్రత్యేక సందర్భాల్లో మరో 30 నిమిషాల వరకు అంటే ఉదయం 10గంటల వరకు అనుమతిస్తారు. మొత్తం 156 ఫ్లయింగ్ స్క్వాడ్స్, 682 సిట్టింగ్ స్క్వాడ్స్‌ను అధికారులు సిద్ధంచేశారు. సమస్యాత్మక పరీక్ష కేంద్రాలను గుర్తించి అక్కడ స్థానిక జిల్లా విద్యాశాఖ అధికారులు సిట్టింగ్ స్క్వాడ్‌ను నియమిస్తారు. 130కి పైగా కేంద్రాల్లో సీసీ కెమెరాలను సైతం ఏర్పాటు చేశారు.



'క్యూఆర్ కోడ్'తో పేపర్ లీకులకు చెక్

పదో తరగతి పరీక్షల్లో మాల్ ప్రాక్టీస్‌కు అవకాశం లేకుండా ఈ ఏడాది ప్రశ్నపత్రాలను ప్రత్యేక టెక్నాలజీతో రూపొందించారు. ప్రతి పేపర్‌పైనా, ప్రతి ప్రశ్నకు క్యూఆర్ కోడ్‌ను ముద్రించారు. దీంతో మాల్ ప్రాక్టీస్ చేసినా, పేపర్ లీక్ చేసినా ఆ పేపర్ ఏ జిల్లా, ఏ మండలం, ఏ సెంటర్‌లో ఏ విద్యార్థికి కేటాయించినది అనేది వెంటనే తెలిసిపోతుంది. మరోవైపు ఇన్విజిలేటర్లు, విద్యాశాఖ అధికారులు, పోలీసులు, నాన్-టీచింగ్ సిబ్బంది, ఏఎన్ఎంలతోపాటు పరీక్షల సరళిని పర్యవేక్షించే చీఫ్ ఇన్విజిలేటర్లు కూడా పరీక్షా కేంద్రాలకు సెల్‌ఫోన్ తీసుకువెళ్లకుండా నిషేధించారు. ఎలక్ట్రానిక్ పరికరాలు సైతం ఎవరూ తీసుకువెళ్లకూడదని విద్యాశాఖ పరీక్షల విభాగం స్పష్టంచేసింది.

వెబ్ లింక్ ద్వారా పేపర్ సాఫ్ట్ కాపీ

మార్చి 31 నుంచి ఏప్రిల్ 8 వరకు స్పాట్ వ్యాల్యూషన్ పూర్తిచేసి అనంతరం ఫలితాలను వెల్లడించనున్నారు. గతంలో రీ కౌంటింగ్, రీ వ్యాల్యూషన్‌కు దరఖాస్తు చేసుకుంటే ఫలితాలు తెలుసుకునేందుకు సంబంధిత పేపర్ ఇచ్చేవారు. ఈ ఏడాది అలాంటి వారికి వెబ్ లింక్ పంపించనున్నారు. సదరు లింక్‌ను ఓపెన్ చేస్తే పేపర్ సాఫ్ట్ కాపీని పొందేలా ఏర్పాట్లు చేశారు.

పరీక్షలకు ఆర్టీసీలో ఉచిత ప్రయాణం

పదో తరగతి పరీక్షలకు వెళ్లే విద్యార్థులకు ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణ సదుపాయం కల్పించారు. విద్యార్థులు పదో తరగతి హాల్‌టికెట్‌ను చూపించి తమ ఇంటి నుంచి పరీక్ష కేంద్రాలకు ఆల్ట్రా పల్లెవెలుగు, పల్లెవెలుగు, సిటీ ఆర్డినరీ బస్సుల్లో ఉచితంగా వెళ్లి, రావొచ్చు. ఈ సదుపాయం ఓపెన్ స్కూల్ టెన్త్ పరీక్షలకు హాజరయ్యే విద్యార్థులకు కూడా కల్పించారు.

టీడీపీ ఎంపీటీసీ కుటుంబానికి సీఎం రిలీఫ్ ఫండ్

రూ.8 లక్షల చెక్కును అందించిన మంత్రి ఆదిమూలపు సురేష్



మోహనరావు కుటుంబ సభ్యులకు చెక్కును అందజేస్తున్న మంత్రి సురేష్

జరుగుమల్లి: ఆపదలో ఉన్నవారిని ఆదుకునే క్రమంలో రాజకీయాలకు, కులమతాలకు అతీతంగా వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం వ్యవహరిస్తుందని మరోమారు రుజువయింది. ప్రకాశం జిల్లా జరుగుమల్లి మండలం ఎడ్లూరపాడు గ్రామంలో తెలుగుదేశం పార్టీ ఎంపీటీసీ బత్తిన మోహనరావు (53) బ్లాక్ ఫంగస్ వ్యాధికి గురై అనేక ఆస్పత్రులకు తిరిగి దాదాపు రూ. 30 లక్షల వరకు ఖర్చుచేశారు. అయినా ఫలితం లేక గతేడాది నవంబర్‌లో మరణించారు. దుఃఖంలో ఉన్న మోహనరావు కుటుంబానికి స్థానిక వైఎస్సార్‌సీపీ నాయకులు పార్టీలకు అతీతంగా అండగా నిలిచారు. స్థానిక నాయకులు చుండి శ్రీనివాసరావు, చుండూరి సురేష్ ఈ విషయాన్ని మంత్రి డాక్టర్ ఆదిమూలపు సురేష్ దృష్టికి తీసుకెళ్లారు. దీంతో ఆయన సీఎం రిలీఫ్ ఫండ్ నుంచి రూ. 8 లక్షలు మంజూరు చేయించారు. ఈ నెల 19న మోహనరావు కుటుంబ సభ్యులకు చెక్కును అందజేశారు.

మానవత్వంతో ఆదుకున్నారు

మా పెదనాన్న గత ఎంపీటీసీ ఎన్నికల్లో టీడీపీ అభ్యర్థిగా పోటీ చేసి గెలుపొందారు. అనారోగ్యానికి గురవడంతో పలు ఆస్పత్రులకు తిప్పి మా శక్తికి మించి రూ.30 లక్షల వరకు ఖర్చు చేశాం. అయినా ఆయన మాకు దక్కలేదు. ఆ సమయంలో స్థానిక నాయకులు, మంత్రి సురేష్ పార్టీలు చూడకుండా మానవత్వంతో మాకు సీఎం రిలీఫ్ ఫండ్ నుంచి రూ.8 లక్షలు మంజూరు చేయించి ఇచ్చారు.

– బత్తిన శరత్‌బాబు, మృతుని తమ్ముని కుమారుడు

'టెట్'కు అభ్యర్థులు ఎంచుకున్న కేంద్రాలే

పాఠశాల విద్యాశాఖ కమిషనర్ వెల్లడి

సాక్షి, అమరావతి: ఉపాధ్యాయ అభ్యర్థులకు ఈ నెల 27 నుంచి మార్చి 9వ తేదీ వరకు నిర్వహించే ఉపాధ్యాయ అర్హత పరీక్ష (టెట్)–2024కు పరీక్షా కేంద్రాలను అభ్యర్థులు ఎంచుకున్న ప్రాధాన్యత క్రమంలో మాత్రమే కేటాయిస్తారని పాఠశాల విద్యాశాఖ ప్రకటించింది. ఆదివారం 'ఈనాడు' పత్రికలో 'టెట్ అభ్యర్థులు కేంద్రానికి వెళ్లడమే పెద్ద పరీక్ష' పేరిట ప్రచురించిన కథనం పూర్తిగా అవాస్తమని కమిషనరేట్ ఓ ప్రకటనలో ఖండించింది. అభ్యర్థులకు పరీక్ష కేంద్రాల ఎంపికలో ఆరు కేంద్రాలను ప్రాధాన్యతా క్రమంలో ఎంచుకోవాలన్నారు. అలా మొత్తం దరఖాస్తు చేసుకున్న వారిలో 82 శాతం మందికి మొదటి ప్రాధాన్య కేంద్రాన్నే కేటాయించినట్టు పాఠశాల విద్యా శాఖ కమిషనర్ పేర్కొన్నారు.

కేటాయింపు ఇలా..

మ్యాథ్స్, సైన్స్ విభాగంలో దరఖాస్తు చేసుకున్న 58,631 మందిలో 90.97 శాతం మందికి మొదటి ప్రాధాన్య కేంద్రాన్ని కేటాయించగా, కేవలం 37 మందికి మాత్రమే ఆరో ప్రాధాన్య కేంద్రాన్ని కేటాయించారన్నారు. మరో 3,389 మందికి (5.78 శాతం) రెండో ప్రాధాన్య కేంద్రాన్ని, 1,406 మందికి మూడో ప్రాధాన్య కేంద్రాన్ని, 373 మందికి నాలుగో ప్రాధాన్య కేంద్రాన్ని, 93 మందికి ఐదో ప్రాధాన్య కేంద్రాన్ని కేటాయించినట్టు విద్యా శాఖ కమిషనర్ వివరించారు.

- సోషల్ విభాగంలో 36,776 మందిలో 31051 మంది (84.43శాతం)కి మొదటి ప్రాధాన్య కేంద్రాన్ని కేటాయించగా, కేవలం ముగ్గురికి మాత్రమే ఆరో కేంద్రాన్ని కేటాయించారన్నారు.
- తెలుగు విభాగంలో వచ్చిన దరఖాస్తుల్లో 149 మందికి మాత్రమే ఆరో ప్రాధాన్య కేంద్రాన్ని కేటాయించగా, మిగిలిన వారికి మొదటి కేంద్రాన్నే ఇచ్చామన్నారు.
- ఇంగ్లిష్ విభాగంలో 17 మందికి మాత్రమే ఐదో ప్రాధాన్య కేంద్రాన్ని కేటాయించారన్నారు. ఈ విభాగంలో ఆరో ప్రాధాన్య కేంద్రాన్ని ఎవరికీ ఇవ్వలేదన్నారు.
- హిందీ విభాగంలో 8,752 మందికి (80.43 శాతం) మొదటి ప్రాధాన్య కేంద్రం, మరో ఇద్దరికి ఆరో ప్రాధాన్య కేంద్రం ఇచ్చినట్టు పేర్కొన్నారు. ఉర్దూ విభాగంలో అందరికీ మొదటి ప్రాధాన్య కేంద్రాన్ని కేటాయించినట్టు తెలిపారు.



ఫ్లోటింగ్ బ్రిడ్జ్‌ను ప్రారంభించి నడుస్తున్న రాజ్యసభ సభ్యుడు వైవీ సుబ్బారెడ్డి తదితరులు

విశాఖ సిగలో మరో పర్యాటక మణిహారం

- బీచ్‌లో పర్యాటకులకు అందుబాటులోకి వచ్చిన ఫ్లోటింగ్ బ్రిడ్జ్
- ప్రారంభించిన ఎంపీ వైవీ సుబ్బారెడ్డి

మహారాణిపేట(విశాఖ దక్షిణ): విశాఖ సాగర తీరంలో వైఎంసీఏ సమీపంలో ఏర్పాటుచేసిన ఫ్లోటింగ్ బ్రిడ్జ్ (నీటిపై తేలియాడే వంతెన)ని రాజ్యసభ సభ్యుడు, వైఎస్సార్‌సీపీ రీజనల్ కోఆర్డినేటర్ వైవీ సుబ్బారెడ్డి ఆదివారం ప్రారంభించారు. పర్యాటకులను విశేషంగా ఆకట్టుకునేలా వీఎంఆర్‌డీఏ ఆధ్వర్యంలో సుమారు రూ.1.60 కోట్ల వ్యయంతో ఫ్లోటింగ్ బ్రిడ్జిని అందుబాటులోకి తీసుకొచ్చారు. ఈ సందర్భంగా వైవీ సుబ్బారెడ్డి మాట్లాడుతూ విశాఖ సిగలో మరో పర్యాటక మణిహారం ఫ్లోటింగ్ బ్రిడ్జ్ అని అన్నారు. విశాఖ అభివృద్ధిపై సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రత్యేక శ్రద్ధ చూపిస్తున్నారని తెలిపారు. గత రెండున్నరేళ్లలో విశాఖకు వచ్చే పర్యాటకుల సంఖ్య విపరీతంగా పెరగడం రాష్ట్ర ప్రభుత్వం పర్యాటక రంగానికి పెద్ద పీట వేసిందనడానికి నిదర్శనమన్నారు. రాష్ట్రంలో వివిధ ప్రాంతాల్లో ఉన్న బీచ్‌లను అభివృద్ధి చేస్తున్నామని, అందులో భాగంగా విశాఖ బీచ్‌ను మరింత సుందరంగా తీర్చిదిద్దేందుకు కృషి చేస్తున్నామని వివరించారు. విశాఖను పరిపాలన రాజధానిగా భావించిన రాష్ట్ర ప్రభుత్వం ఇక్కడ అన్ని రకాల మౌలిక వసతులు కల్పించేందుకు చర్యలు చేపట్టిందన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర ఐటీ శాఖ మంత్రి గుడివాడ అమర్‌నాథ్, జిల్లా కలెక్టర్ డాక్టర్ ఏ.మల్లికార్జున, వీఎంఆర్‌డీఏ కార్యదర్శి డి.కీర్తి, ఎమ్మెల్సీ వరుదు కల్యాణి, ఉత్తర నియోజకవర్గ సమన్వయకర్త కె.కె.రాజు, పార్టీ నాయకులు మళ్ల విజయప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.



కదన విన్యాసాలు ప్రారంభం

- యుద్ధ భూమిని తలపించిన విశాఖ సాగర తీరం
- ప్రత్యేక ఆకర్షణగా విక్రాంత్, విక్రమాదిత్య యుద్ధ విమాన వాహక నౌకలు

సాక్షి, విశాఖపట్నం: సముద్ర జలాల్లోనూ, ఉపరితలంపైనా నౌకాదళ పరాక్రమానికి సంబంధించిన శక్తివంత ప్రదర్శన విశాఖ తీరంలో అద్భుతంగా సాగింది. భారత నౌకాదళం విశాఖ కేంద్రంగా ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న మిలాన్–2024లో కీలకమైన సీఫేజ్ విన్యాసాలు ఆదివారం సాయంత్రం ప్రారంభమయ్యాయి. భారత నౌకాదళంతోపాటు స్నేహపూర్వక విదేశీ దేశాలకు చెందిన యుద్ధ నౌకలు, విమానాల మధ్య సహకారంతో ప్రదర్శన ప్రారంభించారు. గాలి వేగంతో పోటీపడుతూ దూసుకొచ్చేలా యుద్ధ విమానాలు వైమానిక లక్ష్యాలకు వ్యతిరేకంగా ఆయుధ కాల్పులు, జలాంతర్గామి వ్యతిరేక యుద్ధం, క్రాస్-డెక్ ల్యాండింగ్‌లు, క్యారియర్ కార్యకలాపాలు, సీమాన్‌షిప్ విన్యాసాలు ప్రేక్షకులను అబ్బురపరిచాయి. సముద్ర సామర్థ్యాలను పెంపొందించడానికి, అంతర్జాతీయ సహకారాన్ని పెంపొందించడానికి నిబద్ధతను ప్రతిబింబించేలా విన్యాసాలు సాగాయి. సముద్రపు డొమైన్‌లో శాంతి, స్థిరత్వం, పరస్పర చర్యను ప్రోత్సహించడంలో పాల్గొనే దేశాల నిబద్ధతకు నిదర్శనంగా మిలాన్ విన్యాసాలు నిర్వహించినట్లు నౌకాదళ వర్గాలు తెలిపాయి. భారత్ సహా 15 దేశాల యుద్ధ నౌకలు ఈ విన్యాసాల్లో పాల్గొనగా..భారత్‌కు చెందిన యుద్ధ విమాన వాహక నౌకలు ఐఎన్ఎస్ విక్రాంత్, ఐఎన్ఎస్ విక్రమాదిత్య ప్రధాన ఆకర్షణగా నిలిచాయి.


ప్రశాంతంగా గ్రూప్–2 ప్రిలిమ్స్

- 1,327 సెంటర్లలో పరీక్ష నిర్వహణ
- ఏపీపీఎస్సీ చరిత్రలోనే అత్యధికంగా 87.17 శాతం మంది హాజరు
- జూన్/జూలైల్లో మెయిన్స్ పరీక్షలు

సాక్షి, అమరావతి: రాష్ట్ర ప్రభుత్వంలోని వివిధ శాఖల్లో 899 పోస్టుల భర్తీకి ఆదివారం ఆంధ్రప్రదేశ్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ (ఏపీపీఎస్సీ) నిర్వహించిన గ్రూప్–2 ప్రిలిమ్స్ పరీక్ష ప్రశాంతంగా ముగిసింది. 24 జిల్లాల్లో 1,327 సెంటర్లలో ఉదయం 10.30 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు పరీక్ష నిర్వహించారు. ఈ పరీక్షకు 4,83,525 మంది అభ్యర్థులు దరఖాస్తు చేసుకున్నారు. 4,63,517 మంది హాల్‌టికెట్లను డౌన్‌లోడ్ చేసుకోగా 87.17 శాతం మంది పరీక్షకు హాజరయ్యారు. ఏపీపీఎస్సీ గతంలో నిర్వహించిన పరీక్షలకు గరిష్టంగా 68–70 శాతం వరకు మాత్రమే హాజరయ్యేవారు. ఈ రికార్డులను బద్దలు కొడుతూ ఈసారి గ్రూప్–2 ప్రిలిమ్స్‌కు అత్యధికంగా హాజరవడం విశేషం. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో ఇప్పటివరకు ముందుగా ప్రకటించిన షెడ్యూల్ ప్రకారం వివిధ పరీక్షలు నిర్వహించడంతో అభ్యర్థుల్లో ఏపీపీఎస్సీ పట్ల నమ్మకం పెరిగింది. దీంతో ప్రస్తుత గ్రూప్–2 ప్రిలిమ్స్‌ను కూడా షెడ్యూల్ ప్రకారమే నిర్వహిస్తారన్న నమ్మకంతో అభ్యర్థులు సీరియస్‌గా పరీక్షకు సిద్ధమయ్యారు. దీంతో పరీక్ష రాసినవారి సంఖ్య పెరిగింది. కాగా, గ్రూప్–2 ప్రిలిమ్స్ ఫలితాలను 5 నుంచి 8 వారాల్లో ప్రకటిస్తామని ఏపీపీఎస్సీ కార్యదర్శి ప్రదీప్ కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. జూన్ లేదా జూలైలో గ్రూప్–2 మెయిన్స్ నిర్వహిస్తామని వెల్లడించారు.

ఇక ఉడుకు.. ఉక్కపోత

- క్రమంగా పెరుగుతున్న ఉష్ణతాపం
- సాధారణం కంటే 3–4 డిగ్రీలు అధికం
- త్వరలో 40 డిగ్రీలకు చేరువయ్యే అవకాశం
- బలహీనపడిన ద్రోణి, ఉపరితల ఆవర్తనం



సాక్షి, విశాఖపట్నం: రాష్ట్రం క్రమంగా వేడెక్కుతోంది. దాదాపు 15 రోజుల పాటు వాతావరణం సాధారణంగా ఉంది. ద్రోణి, ఉపరితల ఆవర్తనం ప్రభావంతోపాటు పొగమంచు కురవడం ఇందుకు దోహదపడింది. వాస్తవానికి ఫిబ్రవరి మొదటి వారం నుంచే ఎండల ప్రభావం కనిపించింది. దాదాపు వారం రోజుల పాటు రాష్ట్రంలో పలుచోట్ల గరిష్ట ఉష్ణోగ్రతలు సాధారణం కంటే 3–5 డిగ్రీలు అధికంగా రికార్డయ్యాయి. కర్నూలు, అనంతపురం, వైఎస్సార్, నంద్యాల జిల్లాల్లో 38 డిగ్రీలకు పైగా నమోదయ్యాయి. ఆ సమయంలో దక్షిణ తెలంగాణ నుంచి దక్షిణ తమిళనాడు వరకు ఒక ద్రోణి, మరఠ్వాడా పరిసర ప్రాంతాల నుంచి విదర్భ వరకు మరొక ద్రోణి, దక్షిణ ఛత్తీస్‌గఢ్ మీదుగా కోస్తాంధ్ర వరకు ఉపరితల ఆవర్తనాలు కొనసాగాయి. అంతే కాదు.. రాష్ట్రంపైకి ఈ నెల 17 వరకు ఈశాన్య, తూర్పు గాలులు 18 నుంచి ఆగ్నేయ, నైరుతి గాలులు వీచాయి. ఫలితంగా ఇన్నాళ్లూ అసాధారణ ఉష్ణోగ్రతలే నమోదవుతుండటంతో ఉష్ణతాపం అంతగా అనిపించలేదు.

వెస్టర్న్ డిస్టర్బెన్స్ ప్రభావం తోడవడంతో..

ప్రస్తుతం ఉత్తర భారతదేశంపై వెస్టర్న్ డిస్టర్బెన్స్ (పశ్చిమ ఆటంకాల) ప్రభావం కొనసాగుతోంది. సాధారణంగా ఈ సమయంలో ఇవి ఉత్తర భారతదేశంపైనే కొనసాగుతాయి. కానీ.. ఇప్పుడు దక్షిణ భారతదేశం వైపు, ముఖ్యంగా ఆంధ్రప్రదేశ్ వైపు కదులుతున్నాయని వాతావరణ నిపుణులు చెబుతున్నారు. ఫలితంగా ఉదయం, రాత్రి వేళల్లో కొద్దిసేపు మేఘాలు ఆవరించి చల్లదనం పరచుకున్నా.. మధ్యాహ్నం మాత్రం ఉష్ణ తీవ్రత ఎక్కువగా ఉంటుందని వాతావరణ శాఖ రిటైర్డ్ అధికారి ఆర్.మురళీకృష్ణ 'సాక్షి'కి చెప్పారు. వీటి ప్రభావం మార్చి, ఏప్రిల్ వరకు ఉంటుందన్నారు.

త్వరలోనే 40 డిగ్రీలకు చేరే అవకాశం

ద్రోణి, ఉపరితల ఆవర్తనాలు బలహీనపడటంతో పగటి, రాత్రి ఉష్ణోగ్రతలు మళ్లీ పెరుగుతున్నాయి. ప్రస్తుతం రాష్ట్రంలో ఉష్ణోగ్రతల పెరుగుదల ప్రభావం రాయలసీమలో కనిపిస్తోంది. ఉత్తర కోస్తాంధ్ర, దక్షిణ కోస్తాంధ్ర కంటే అనంతపురం, కర్నూలు, వైఎస్సార్ జిల్లాల్లో ఉష్ణతీవ్రత ఎక్కువగా ఉంటోంది. కొన్నిచోట్ల సాధారణం కంటే 3–4 డిగ్రీలు అధికంగా ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయి. గడచిన 24 గంటల్లో అనంతపురంలో 39 డిగ్రీల పగటి ఉష్ణోగ్రత రికార్డయింది. మరికొద్ది రోజుల్లో రాష్ట్రంలో కొన్నిచోట్ల ఉష్ణోగ్రతలు 40 డిగ్రీలకు చేరుకునే అవకాశం ఉందని వాతావరణ నిపుణులు అంచనా వేస్తున్నారు. మార్చి ఆరంభంలోనే ఈ పరిస్థితి తలెత్తడం అసాధారణమేనని వీరు చెబుతున్నారు. కాగా కొద్ది రోజులపాటు రాష్ట్రంలో ఉష్ణతాపం, ఉక్కపోతతో కూడిన అసౌకర్య వాతావరణం నెలకొంటుందని, ఈ పరిస్థితి రాయలసీమలో ఒకింత అధికంగా ఉంటుందని భారత వాతావరణ శాఖ (ఐఎండీ) ఆదివారం నాటి నివేదికలో వెల్లడించింది.

ఐదుగురిని బలిగొన్న మద్యం మత్తు

- అన్నమయ్య జిల్లాలో ఘోర రోడ్డు ప్రమాదం
- కారుతో బీభత్సం సృష్టించిన యువకులు
- అందరూ మదనపల్లెకు చెందినవారే



ప్రమాదంలో నుజ్జునుజ్జు అయిన స్కార్పియో వాహనం

మదనపల్లె: యువకుల మద్యం మత్తు ఐదుగురిని బలి తీసుకుంది. మదనపల్లెకు చెందిన ఐదుగురు యువకులు మద్యం సేవించి కారును అతి వేగంగా నడిపి రోడ్డుపై నిల్చున్న ఇద్దరు పాడి రైతులతోపాటు తమలో ముగ్గురి ప్రాణాలను గాల్లో కలిపారు. కారు నడుపుతున్న యువకుడు వాహన వేగాన్ని నియంత్రించలేక లారీని ఢీకొనడంతో ఈ ఘోర ప్రమాదం జరిగింది. అతడి తల తెగి మొండెం నుంచి వేరవడం ప్రమాద తీవ్రతకు అద్దంపట్టింది. ఈ ఘటన ఆదివారం రాత్రి అన్నమయ్యజిల్లా మదనపల్లె మండలం బార్లపల్లె వద్ద కడప–బెంగళూరు హైవేపై జరిగింది. ప్రమాద వివరాలివి. మదనపల్లె పట్టణం రామారావుకాలనీ, అమ్మచెరువుమిట్ట, తట్టివారిపల్లెకు చెందిన తిలక్(19), విక్రమ్(38), శీను(25), హరీష్, మహేష్‌లు స్నేహితులు. సాయంత్రం వీరు మద్యం తాగేందుకు విక్రమ్‌కు చెందిన స్కార్పియోలో కర్ణాటక సరిహద్దులోని రాయల్పాడు వెళ్లారు. అక్కడ అతిగా మద్యం సేవించి, తిరుగుముఖం పట్టారు. స్కార్పియో యజమాని విక్రమ్ వేగంగా కారు నడుపుతూ కర్ణాటక సరిహద్దు చెక్‌పోస్ట్‌లో తొలుత పోలీస్ బ్యారికేడ్లను ఢీకొట్టాడు. అంతే వేగంతో ఆంధ్రా సరిహద్దులోని బార్లపల్లెకు సమీపంలో ఎదురుగా వస్తున్న ఓ కారును ఢీకొన్నాడు. ఆ ధాటికి కారు దెబ్బతినడంతో, భయంతో మరింత వేగం పెంచాడు. ఆ సమయంలో మదనపల్లె మండలం చీకలబైలు పంచాయతీ కోళ్లవారిపల్లెకు చెందిన పాడి రైతులు కరమల సుబ్రహ్మణ్యం ఆచారి అలియాస్ కాళిదాసు(55), యల్లుట్ల చంద్రప్ప(50) స్థానిక పాల డిపోలో పాలు పోసి రోడ్డుపై నిల్చున్నారు. వీరిని కూడా స్కార్పియో వేగంగా వచ్చి ఢీకొనడంతో వారు అక్కడికక్కడే మృతి చెందారు. స్థానికుల కేకలతో మరింత భయపడిన విక్రమ్ కారు వేగాన్ని అదుపుచేయలేక ఎదురుగా వస్తున్న లారీని ఢీకొన్నాడు. ఒక్కసారిగా స్కార్పియో గాల్లోకి ఎగిరి, పైకప్పు లేచిపోయింది. ఆ ధాటికి డ్రైవింగ్ సీట్లో ఉన్న విక్రమ్ తల తెగి, మొండెం మాత్రమే మిగిలింది. వాహనంలో మిగిలిన నలుగురిలో తిలక్, శీను అక్కడికక్కడే మరణించగా, హరీష్, మహేష్ తీవ్రంగా గాయపడ్డారు. ప్రమాదవార్త తెలిసిన రూరల్ సీఐ ఎస్.శేఖర్ 108కు సమాచారం అందించి, సంఘటన స్థలానికి చేరుకున్నారు. క్షతగాత్రులను మదనపల్లె జిల్లా ఆస్పత్రిలో చేర్చారు. పరిస్థితి విషమంగా ఉండటంతో అక్కడి నుంచి బెంగళూరుకు తరలించారు.

Published and Printed by V. Murali on behalf of Jagati Publications Limited, Published at Survey no 481 phase-2, Jawahar Auto Nagar, Vijaywada, NTR District - 520 007 (AP) and Printed at Jagati Publications Limited, Survey no 481 phase-2, Jawahar Auto Nagar, Vijaywada, NTR District - 520 007 (AP)., Editor: V. Murali, (Responsible for selection of News under the PRB Act) Phone No. 0866-2547436 Fax: No. 0866-2547433. RNI Reg No. APTEL/2008/23794.



నిత్యాన్నదానానికి విరాళం

దుర్గమ్మ సన్నిధిలో నిత్యాన్నదానానికి విశాఖపట్నం, రాజమండ్రికి భక్తులు రూ. లక్ష చొప్పున విరాళాన్ని అందజేశారు. ఆలయాధికారులు దాతలను సత్కరించారు. ▸II లో



వీరమ్మతల్లి నామస్మరణతో..

ఉయ్యూరు: ఉయ్యూరు పట్టణం వీరమ్మతల్లి నామస్మరణతో మార్మోగింది. తిరునాళ్ల సందర్భంగా భక్తులు పెద్ద ఎత్తున వీరమ్మతల్లి దర్శనానికి విచ్చేసి, మొక్కులు చెల్లించుకున్నారు.

నేడు స్పందన



గాంధీనగర్(విజయవాడసెంట్రల్): కలెక్టరేట్‌లో సోమవారం ఉదయం 10 గంటల నుంచి స్పందన కార్యక్రమం ప్రారంభమవుతుందని కలెక్టర్ ఎస్. ఢిల్లీరావు తెలిపారు. మండల, డివిజన్ స్థాయిలోనూ కార్యక్రమం కొనసాగుతుందని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

న్యూస్‌రీల్

రేపు గ్రీవెన్స్ డే

లబ్బీపేట(విజయవాడతూర్పు): వైద్య ఆరోగ్య, కుటుంబ సంక్షేమశాఖ రాష్ట్ర సంచాలకుల ఆదేశాల మేరకు ఈ నెల 27న వైద్య సిబ్బంది సమస్యల పరిష్కారం కోసం గ్రీవెన్స్ డే నిర్వహిస్తున్నట్లు ఎన్టీఆర్ జిల్లా డీఎంహెచ్ఓ డాక్టర్ మాచర్ల సుహాసిని తెలిపారు. అందులో భాగంగా గ్రామీణ, పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, వాటి పరిధిలోని వైఎస్సార్ విలేజ్ హెల్త్ క్లినిక్‌లు, గ్రామ, వార్డు సచివాలయాల్లో పనిచేసే ఏఎన్ఎంలు, సీహెచ్ఓలు, ఆశా కార్యకర్తలు, వివిధ స్థాయిల్లో సిబ్బంది వినతులు ఇవ్వవచ్చన్నారు. విజయవాడ పాత ప్రభుత్వాస్పత్రి ప్రాంగణంలోని తమ కార్యాలయంలో ఈ గ్రీవెన్స్ నిర్వహిస్తున్నట్లు ఆమె తెలిపారు.

కార్తికేయుని సన్నిధిలో భక్తుల కోలాహలం



మోపిదేవి: ప్రసిద్ధ పుణ్యక్షేత్రంగా విరాజిల్లుతున్న మోపిదేవి వల్లీదేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వరస్వామివారి ఆలయం భక్తజనంతో కోలాహలంగా మారింది. ఆదివారం కావడంతో ఉభయ తెలుగు రాష్ట్రాలతో పాటు పలు ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులతో ఆలయ ప్రాంగణం కళకళలాడింది. నాగపుట్ట, నాగమల్లి వృక్షం, పొంగళ్లశాల వద్ద భక్తుల రద్దీ ఏర్పడింది. ఆలయ ఏసీ ఎన్ఎస్ చక్రధరరావు ఆధ్వర్యంలో సూపరింటెండెంట్ బొప్పన సత్యనారాయణ ఏర్పాట్లను పర్యవేక్షించారు

28న మినీ జాబ్ మేళా

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): నిరుద్యోగ యువకులకు ఉపాధి కల్పించాలనే ఉద్దేశంతో ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో విజయవాడలోని ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల నందు ఈనెల 28న మినీ జాబ్ మేళా నిర్వహించనున్నట్లు ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ ఎస్. ఢిల్లీరావు ఓ ప్రకటనలో తెలిపారు. ఎస్ఎస్‌సీ ఇంటర్మీడియెట్, డిగ్రీ, బీటెక్, ఫార్మసీ, ఐటీఐ, డిప్లొమా అర్హత కలిగిన విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఔత్సాహికులు skilluniverse. apssdc.inలో రిజిస్ట్రేషన్ చేసుకోవాలన్నారు. మినీ జాబ్ మేళాలో నాలుగు కంపెనీల ప్రతినిధులు ఇంటర్వ్యూలు నిర్వహించి ఎంపిక చేస్తారన్నారు. వివరాలకు 93477 79032, 90326 33548, 93912 54464లో సంప్రదించాలని కోరారు.

తిరుపతమ్మకు ఉదయపొంగళ్లతో నివేదన



పెనుగంచిప్రోలు: తిరుపతమ్మవారి పెద్ద తిరునాళ్ల మూడోరోజు ఆదివారం అంకమ్మ క్రతువుల్లో భాగంగా శాలివాహనులు ఉదయ పొంగళ్లు చేసి అమ్మవారికి, సహదేవతలకు నివేదించారు. భక్తులు పెద్ద సంఖ్యలో అమ్మవారికి, పాలు, పొంగళ్లు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. ఆచారం ప్రకారం జలబిందెలు మోసినవారు ఇత్తడి తాంబూలాల్లో మూడు ఒత్తులు వెలిగించి ప్రధాన ఆలయంతో పాటు సహదేవతామూర్తుల ఆలయం చుట్టూ ప్రదక్షిణలు చేశారు. అనంతరం బయనీడి వారితో ఒగ్గుకథ చెప్పించారు. కార్యక్రమాలను ఆలయ చైర్మన్ జంగాల శ్రీనివాసరావు పర్యవేక్షించారు.

మాస్టర్ అథ్లెటిక్స్ విజేతలకు సన్మానం



విజయవాడస్పోర్ట్స్: ఇటీవల జరిగిన మాస్టర్ అథ్లెటిక్స్ జాతీయ పోటీల్లో పతకాలు సాధించిన ఉమ్మడి జిల్లా క్రీడాకారులను కృష్ణాజిల్లా మాస్టర్ అథ్లెటిక్స్ అసోసియేషన్ ప్రతినిధులు ఆదివారం సన్మానించారు. విజయవాడ ఇందిరాగాంధీ మునిసిపల్ కార్పొరేషన్ స్టేడియంలో జరిగిన ఈ కార్యక్రమంలో క్రీడాకారులు సీహెచ్ రామస్వామి, బి.జోషి, కె.గీతాంజలి, రణధీర్‌కుమార్, రోశయ్య, ఆంజనేయకుమార్, ఏవీ సుబ్బలక్ష్మిని శాలువాలతో ఘనంగా సత్కరించి జ్ఞాపికలు అందజేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఏపీ జెన్‌కో ఎస్ఎస్ఓ బి.మెహర్‌కుమార్, పాపులర్ షూమార్ట్ ఎండీ చుక్కపల్లి అరుణ్‌కుమార్, ప్రాఫిట్ షూమార్ట్ ఎండీ బి.కోటేశ్వరరావు పాల్గొని క్రీడాకారులను అభినందించారు. సంఘ అధ్యక్ష, కార్యదర్శులు కె.గంగాధరరావు, జీవీ ప్రసాదరావు, ప్రతినిధులు పాల్గొన్నారు.

ఎగసిన ఆగ్రహావేశాలు

టికెట్ల లెక్కలపై జనసేన శ్రేణుల ఆక్రందన

- పెడన టికెట్ టీడీపీకి కేటాయించడంపై తీవ్ర అసంతృప్తి
- పార్టీకోసం కష్టపడిన వారిని పవన్ దారుణంగా మోసం చేశారని ఆవేదన
- జనసేన పార్టీ కృష్ణా జిల్లా అధ్యక్షుడి దిష్టిబొమ్మ దహనం
- నిర్ణయం మారాల్సిందేనంటూ అల్టిమేటం
- టీడీపీలోనూ కొనసాగుతున్న ప్రతిష్టంభన



పెడనలో జనసేన పార్టీ కృష్ణా జిల్లా అధ్యక్షుడి దిష్టిబొమ్మను దహనం చేస్తున్న ఆ పార్టీ కార్యకర్తలు

సాక్షి ప్రతినిధి, విజయవాడ: చంద్రబాబు, పవన్‌తో కలిసి ప్రకటించిన టీడీపీ–జనసేన తొలి ఉమ్మడి అభ్యర్థుల జాబితా జనసేన శ్రేణుల్లో ఆగ్రహజ్వాలలు రగిలిస్తోంది. పదేళ్లుగా పార్టీ కోసం కష్టపడ్డామని, తీరా జనసేనకు కేటాయించిన సీట్లు చూస్తే తమ ఆశలన్నీ అడియాశలు అయ్యామని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పవన్ తమను దారుణంగా మోసం చేశారని రగిలిపోతున్నారు. ముఖ్యంగా పెడన టికెట్ టీడీపీకి కేటాయించడంతో అధినేత పవన్‌పై జనసేన శ్రేణులు మండిపడుతున్నాయి. ఆగ్రహంతో రోడ్డెక్కి జనసేన పార్టీ కృష్ణా జిల్లా అధ్యక్షుడు బండ్రెడ్డి రామకృష్ణ దిష్టిబొమ్మను దహనం చేసి నిరసన తెలిపాయి. రామకృష్ణ టీడీపీకి కోవర్టుగా పనిచేస్తున్నారని, టీడీపీకి అమ్ముడుపోయారని, అందువల్లే పెడన టికెట్టు జనసేనకు రాకుండా పోయిందని కార్యకర్తలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. తమను సంప్రదించకుండా టికెట్టు ఎలా కేటాయిస్తారని.. ఈ నిర్ణయం మారకపోతే రెండురోజుల్లో భవిష్యత్తు కార్యాచరణ ప్రకటిస్తామని అల్టిమేటం జారీ చేశారు. ఇప్పటికే టీడీపీకి చెందిన సీనియర్ నేత బూరగడ్డ వేదవ్యాస్ సైతం తమకు టికెట్ కేటాయించలేదనే ఆవేదనతో కుప్పకూలి ఆస్పత్రి పాలైన విషయం విదితమే. మొత్తం మీద టికెట్ల ప్రకటన జనసేన, టీడీపీ పార్టీలో ప్రకంపనలు రేపుతున్నాయి.

చంద్రబాబు దుర్బుద్ధితోనే..

చంద్రబాబు నాయుడు పొత్తులో భాగంగా జనసేనకు 24 సీట్లే కేటాయించడంపైనా జనసేన కార్యకర్తలు అగ్గిమీద గుగ్గిలం అవుతున్నారు. జనసేన కార్యకర్తలుగా, నాయకులుగా, శ్రేయోభిలాషులుగా ఆవేదన వ్యక్తం చేస్తున్నట్లు బహిరంగంగానే ప్రకటిస్తున్నారు. అధికార పార్టీ వ్యతిరేక ఓటు చీలకూడదని, అన్ కండిషనల్‌గా పొత్తుకు ఒప్పుకుంటే.. దానిని చంద్రబాబు నాయుడు అలుసుగా తీసుకుంటున్నారనే భావన పార్టీ శ్రేణుల్లో వ్యక్తం అవుతోంది. చంద్రబాబు దుర్బుద్ధి బయట పడిందని, ఆయన ఎన్ని పార్టీలు, ఎంతమంది జీవితాలు నాశనం చేసింది ఇప్పుడు జనసేన పార్టీ కార్యకర్తలు గుర్తు చేసుకొంటున్నారు. ప్రజారాజ్యం పార్టీని భూ స్థాపితం చేసి, చిరంజీవిని క్షోభకు గురిచేసి, రాజకీయాల నుంచి తప్పుకొనేలా చేసిన ఘటనలను తలచుకుంటున్నారు. వంగవీటి రంగా ఉదంతాన్ని గుర్తు చేసుకొంటున్నారు. చంద్రబాబు మోసానికి కేరాఫ్ అడ్రస్ అని, తేనెపూసిన కత్తిలాంటి వాడనే భావన కాపుల్లో వ్యక్తం అవుతోంది. విజయవాడ తూర్పు నియోజకవర్గ జనసేన ఇన్‌చార్జి బత్తిన రాము విలేకర్ల సమావేశంలో మాట్లాడుతూ పలు కీలక వ్యాఖ్యలు చేశారు. అధికారాన్ని షేర్ చేసుకోవాల్సిందేనని, తమకు గౌరవప్రదమైన సీట్లు కేటాయించకపోతే ప్రజాకోర్టులోనే తేల్చుకొంటామని హెచ్చరికలు జారీ చేశారు. ఇలా ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా జనసేన కార్యకర్తలు తమ ఆక్రందనను వినిపిస్తున్నారు. ప్రజాకోర్టులో చంద్రబాబుకు మరోసారి గట్టిగా బుద్ధిచెప్పి, జనసేన కార్యకర్తల తడాఖా ఏంటో చూపుతామని హెచ్చరిస్తున్నారు. పవన్ కల్యాణ్ కూడా పూర్తిగా చంద్రబాబుకు సరెండర్ అవడాన్ని వారు జీర్ణించుకోలేకపోతున్నారు.

టీడీపీలోనూ ఇదే తంతు..

టీడీపీలో పెనమలూరు, మైలవరం నియోజకవర్గ టికెట్లపైనా ప్రతిష్టంభన కొనసాగుతోంది. పెనమలూరు నియోజకవర్గంలో టీడీపీ ఇప్పటికే పలువురు నేతల పేరుతో ఐవీఆర్ఎస్ సర్వేలు చేయించింది. శనివారం ఆదిశేషగిరిరావు, తాజాగా ఎంకే బేగ్ పేరుతో కూడా సర్వేలు చేసింది. రోజుకో అభ్యర్థి పేరుతో టీడీపీ అధిష్టానం సర్వే చేస్తూ, అక్కడి పార్టీ శ్రేణులను గందరగోళంలోకి నెడుతోంది. ఓవైపు సర్వేలన్నీ తనకే అనుకూలంగా ఉన్నాయని, తానే పోటీచేస్తానని బోడే ప్రసాద్ గట్టిగా చెబుతున్నారు. ఎవరో ఎల్లయ్యోకో, పుల్లయ్యకో సీటు ఇస్తే చేతులు ముడుచుకొని కూర్చొనే ప్రసక్తే లేదని అధిష్టానికి హెచ్చరికలు పంపుతున్నారు. మైలవరంలో సైతం వసంతకృష్ణప్రసాద్, దేవినేని ఉమా, కేశినేని చిన్ని మధ్య టికెట్ పోరు సాగుతోంది. అలాగే పొత్తులో భాగంగా జనసేనకు కేటాయిస్తారని భావిస్తున్న అవనిగడ్డ, విజయవాడ వెస్ట్ నియోజకవర్గాల అభ్యర్థుల విషయంలో కూడా క్లారిటీ లేకపోవడంతో, పలువురు తమదే టికెట్ అని ప్రచారం చేసుకొంటున్నారు.

ప్రశాంతంగా గ్రూప్–2 స్క్రీనింగ్ పరీక్ష



పరీక్ష సరళిని పరిశీలిస్తున్న కలెక్టర్ ఢిల్లీరావు

వన్‌టౌన్(విజయవాడపశ్చిమ)/చిలకలపూడి(మచిలీపట్నం): కృష్ణా, ఎన్టీఆర్ జిల్లాల్లో ఆదివారం ఆంధ్రప్రదేశ్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ (ఏపీపీఎస్సీ) గ్రూప్–2 స్క్రీనింగ్ పరీక్ష ఆదివారం ప్రశాంతంగా జరిగింది. ఏర్పాటు చేసిన పరీక్ష కేంద్రాల్లో ఉదయం నుంచి మధ్యాహ్నం వరకూ పరీక్షలు విజయవంతంగా ముగిసినట్లు అధికారులు వివరించారు. అన్ని పరీక్ష కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమలు చేశారు. ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పటిష్ట పోలీస్ బందోబస్తు నిర్వహించారు. ఎక్కడా మాల్ ప్రాక్టీస్ జరగకుండా ఇన్విజిలేటర్స్ పకడ్బందీగా చర్యలు తీసుకున్నారు. సెల్ ఫోన్స్, ఎలక్ట్రానిక్ వస్తువులు పరీక్ష కేంద్రాల్లోనికి అనుమతించలేదు.

ఎన్టీఆర్ జిల్లాలో..

ఎన్టీఆర్ జిల్లాలో పరీక్షల నిర్వహణకు ప్రభుత్వం 54 కేంద్రాలను ఏర్పాటు చేసింది. జిల్లాలో 24,373 మంది అభ్యర్థులకుగానూ 20,304 మంది పరీక్షకు హాజరైనట్లు కలెక్టర్ ఢిల్లీరావు ప్రకటించారు. సుమారు 83.31 శాతం నమోదైందన్నారు. ఎస్ఆర్ఆర్ అండ్ సీవీఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల, పీబీ సిద్ధార్థ కాలేజ్ ఆఫ్ ఆర్ట్స్ అండ్ సైన్స్, బిషప్ అజరయ్య జూనియర్ కాలేజీ, నలంద డిగ్రీ కళాశాల పరీక్ష కేంద్రాలను ఆకస్మికంగా సందర్శించారు.

కృష్ణా జిల్లాలో 13,341 మంది హాజరు..

కృష్ణా జిల్లాలో ఏర్పాటు చేసిన 51 పరీక్ష కేంద్రాల్లో 17,241 మంది హాజరుకావాల్సి ఉండగా.. వీరిలో 13,341 మంది అభ్యర్థులు హాజరు కాగా.. మరో 3,900 మంది హాజరుకాలేదని జాయింట్ కలెక్టర్ గీతాంజలి శర్మ తెలిపారు. స్థానిక మంగినపూడి రోడ్డులో గల శ్రీ వెంకటేశ్వర హిందూ ఇంజినీరింగ్ కళాశాలలో జరుగుతున్న పరీక్ష కేంద్రాన్ని ఆకస్మికంగా తనిఖీ చేసి పరీక్ష నిర్వహణ తీరును నిశితంగా పరిశీలించారు. ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పరీక్షలు ప్రశాంతంగా జరిగాయన్నారు. పరీక్ష కేంద్రాన్ని తనిఖీ చేసిన వారిలో బందరు డీఎస్పీ ఎండీ అబ్దుల్ సుబాన్, తహసీల్దార్ పి. సతీష్, ఎస్వీహెచ్ ఇంజినీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్ డి. శ్రీనివాసరావు ఉన్నారు.

ముగిసిన వేణుగోపాలుడి బ్రహ్మోత్సవాలు



కల్యాణమూర్తులకు వసంతోత్సవం

కోడూరు: హంసలదీవి రుక్మిణీ సత్యభామ సమేత వేణుగోపాలస్వామి బ్రహ్మోత్సవాలు ఘనంగా ముగిశాయి. ఆదివారం ఉదయం కల్యాణమూర్తులకు వసంతోత్సవం కనులపండువగా నిర్వహించారు. స్వామివార్ల ఉత్సవమూర్తులకు ఆలయ సమీపంలోని చెరువులో అవభృదోత్సవాన్ని శాస్త్రోక్తంగా జరిపారు. ప్రత్యేక పల్లకీలో స్వామివార్లను ఊరేగించారు. సాయంత్రం ధ్వజారోహణ చేసి, యాగశాలలో పూర్ణాహుతి జరిపారు. రాత్రికి కల్యాణమూర్తులకు పుష్పాభిషేకం చేశారు. పవళింపుసేవతో ఉత్సవాలకు ముగింపు పలికారు. అనంతవరానికి చెందిన కుప్పా రామగోపాల సోమయాజీ దంపతులు ఉభయదాతలుగా వ్యవహరించారు. శనివారం రాత్రి కల్యాణమూర్తులకు రథోత్సవాన్ని కనులపండువగా నిర్వహించారు. మూడు రోజుల పాటు జరిగిన ఉత్సవాల్లో పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు. బ్రహ్మోత్సవాల ముగింపును పురస్కరించుకొని మూలమూర్తికి వెండి కవచాలను అలంకరించారు. ధర్మాధికారి కుప్పా సుబ్రహ్మణ్య అవధాని ఏర్పాట్లు పర్యవేక్షించారు.

పామర్రులో 'విద్యా దీవెన' కార్యక్రమం



సభా ప్రాంగణంలో పనులు పరిశీలిస్తున్న కలెక్టర్ రాజాబాబు, ఎమ్మెల్యేలు పేర్ని నాని, అనిల్

- ఈనెల 29న నిర్వహణకు ఏర్పాట్లు
- సభా స్థలిని పరిశీలించిన అధికారులు, నాయకులు

పామర్రు: విద్యార్థులకు మరో దఫా జగనన్న విద్యా దీవెన అందించేందుకు ముహూర్తం ఖరారైంది. ఈనెల 29న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి చేతుల మీదుగా నగదు విడుదల చేయనున్నారు. దీనికి సంబంధించిన రాష్ట్ర స్థాయి కార్యక్రమం కృష్ణాజిల్లా పామర్రులో నిర్వహించనున్నారు. ఈ నేపథ్యంలో కలెక్టర్ పి. రాజాబాబు, మాజీ మంత్రి, ఎమ్మెల్యే పేర్ని వెంకట్రామయ్య(నాని), స్థానిక ఎమ్మెల్యే కైలే అనిల్‌కుమార్, జాయింట్ కలెక్టర్ గీతాంజలి శర్మ, ఎస్పీ అద్నాన్ నయీమ్ అస్మి, గుడివాడ డీఎస్పీ శ్రీకాంత్‌లతో కలిసి సభా స్థలిని ఆదివారం పరిశీలించారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ స్థానిక పెట్రోల్ బంక్ ఎదురుగా ఉన్న స్థలంలో సీఎం బహిరంగ సభకు ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. సుమారు 15 ఎకరాల విస్తీర్ణం గల ఈ స్థలంలో ప్రస్తుతం చదును చేసే పనులు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. నాలుగు గ్యాలరీలుగా ప్రాంగణాన్ని ముస్తాబు చేస్తున్నట్లు కలెక్టర్ వివరించారు.

హెలి ప్యాడ్ నుంచి ఇలా..

సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి స్థానిక చల్లపల్లి రోడ్డులో ఏర్పాటు చేసిన హెలీ ప్యాడ్ వద్ద దిగి, రోడ్డు షోగా సభా స్థలికి చేరుకుంటారని కలెక్టర్ వివరించారు. సీఎం వచ్చే రహదారికి ఇరువైపులా బారికేడ్‌లతో భద్రత ఏర్పాటు చేస్తామని చెప్పారు. సభకు రాష్ట్ర నలుమూలల నుంచి వచ్చే వాహనాల ఏర్పాటుకు ప్రత్యేకంగా స్థలం ఏర్పాటు చేస్తున్నట్లు చెప్పారు.

అధికారులతో సమీక్ష..

సీఎం ఈ కార్యక్రమానికి హాజరు కానున్న నేపథ్యంలో అన్ని శాఖల అధికారులతో కలెక్టర్ రాజాబాబు, ఎమ్మెల్యే అనిల్‌కుమార్ సమీక్ష నిర్వహించారు. స్థానిక ఆరేపల్లి కల్యాణ మండపంలో పలు అంశాలను వివరించారు. విద్యా దీవెన గురించిన పూర్తి సమాచారాన్ని అధికారులు తమ దగ్గర ఉంచుకోవాలని ఆదేశించారు. సీఎం సభకు సమయం తక్కువగా ఉన్నందున అందరూ అధికారులు సమన్వయ పర్చుకుని సీఎం సభను విజయవంతం చేసేందుకు ప్రతి ఒక్కరూ తగు విధంగా కృషి చేయాలని అన్నారు. ఆర్డీవోలు, తహసీల్దార్‌లు, పార్టీ నాయకులు, కార్యకర్తలు అభిమానులు పాల్గొన్నారు.

విశ్రాంత ఉద్యోగులకు సహకరించాలి

ఏఐబీఆర్ఎఫ్ ప్రధాన కార్యదర్శి ఎస్‌సీ జైన్



మాట్లాడుతున్న ఏఐబీఆర్ఎఫ్ ప్రధాన కార్యదర్శి ఎస్.సి.జైన్

కృష్ణలంక(విజయవాడతూర్పు): విశ్రాంత బ్యాంక్ ఉద్యోగులు చాలీచాలని పెన్షన్‌తో ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, పెన్షన్ నవీనీకరణకు అనేక దశాబ్దాలుగా ప్రభుత్వంతో పోరాడుతూనే ఉన్నా విజయం సాధించలేకపోయామని ఆలిండియా బ్యాంక్ రిటైరీస్ ఫెడరేషన్(ఏఐబీఆర్ఎఫ్) ప్రధాన కార్యదర్శి ఎస్‌సీ జైన్ అన్నారు. పెన్షన్ నవీకరణకు ప్రభుత్వం సహకరించాలని డిమాండ్ చేశారు. ఎన్టీఆర్ జిల్లా విజయవాడ గవర్నర్‌పేటలోని మాకినేని బసవపున్నయ్య విజ్ఞాన కేంద్రంలో ఆంధ్రప్రదేశ్ బ్యాంకు రిటైరీస్ ఫెడరేషన్ మూడో త్రైవార్షిక సమావేశం ఆదివారం జరిగింది. ముఖ్య అతిథిగా పాల్గొన్న జైన్ మాట్లాడుతూ కుటుంబ పెన్షన్, వైద్య ఖర్చులు తదితర విషయాల్లో మెరుగుదల ఆశిస్తున్నట్లు తెలిపారు. ఏఐబీఆర్ఎఫ్ అధ్యక్షుడు ఎస్.ఎం.దేశ్‌పాండే మాట్లాడుతూ రిజర్వ్ బ్యాంక్, స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ఉద్యోగులకు ఇస్తున్న విధంగానే పెన్షన్ అన్ని జాతీయ బ్యాంక్ విశ్రాంత ఉద్యోగులకు వర్తింపజేయాలని డిమాండ్ చేశారు. ఫెడరేషన్ ఉప ప్రధాన కార్యదర్శి ఎస్.ఎస్.ఎన్.రెడ్డి, ఏఐటీయూసీ ప్రధాన కార్యదర్శి జి.ఓబులేసు, ఫెడరేషన్ ఏపీ అధ్యక్షుడు బి.వి.కొండలరావు, ప్రధాన కార్యదర్శి ఎ.ఎల్లారావు, నాయకులు ప్రసంగించారు.

నూతన కార్యవర్గం ఎన్నిక..

ఈ సమావేశంలో ఫెడరేషన్ ఏపీ కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఫెడరేషన్ చైర్మన్‌గా ఎం.బి.శంకరరావు, అధ్యక్షుడిగా బి.వి.వి.కొండలరావు, ప్రధాన కార్యదర్శిగా ఎ.ఎల్లారావు, కోశాధికారిగా నరేంద్రదేవ్, సహ కోశాధికారిగా ఎస్.కృష్ణమోహన్, సంయుక్త ప్రధాన కార్యదర్శిగా వి.జగన్ మోహనరావు, కార్యనిర్వాహక కార్యదర్శులుగా ఎం.వి.ఎస్.శర్మ, పి.నారాయణరావు, జి.కృష్ణవేణితో పాటు 33 కార్యవర్గ సభ్యులను ఎన్నుకున్నారు.

ఊపిరి స్వచ్ఛం



విజయవాడ నగరంలో రోడ్ల పక్కన పచ్చదనం పంచుతున్న మొక్కలు

- స్వచ్ఛమైన గాలి పీలుస్తున్న విజయవాడ ప్రజలు
- గాలిలో భారీగా తగ్గిన దుమ్ముశాతం
- గత ప్రభుత్వ హయాంలో డేంజర్ బెల్స్
- వైఎస్సార్ సీపీ ప్రభుత్వ చర్యలతో సత్ఫలితాలు
- నిరంతరం గాలిలో వాయువుల పరిశీలన

లబ్బీపేట(విజయవాడతూర్పు): వైఎస్సార్ సీపీ ప్రభుత్వం చేపట్టిన చర్యలు సత్ఫలితాలను ఇచ్చాయి. విజయవాడ నగరంలో వీస్తున్న గాలి స్వచ్ఛంగా మారింది. గాలిలో దుమ్ము, విషవాయువుల శాతం భారీగా తగ్గింది. ఫలితంగా నగర ప్రజలు ఊపిరి స్వచ్ఛంగా పీల్చుకుంటున్నారు. టీడీపీ హయాంలో అప్పటి ప్రభుత్వం నగరాభివృద్ధిని గాలికొదిలేసింది. కేవలం రాజధాని పేరుతో సింగపూర్ గ్రాఫిక్స్ చూపుతూ కాలం గడిపేసింది. ఫలితంగా నగరంలోని రోడ్లన్నీ దుమ్ముతో నిండియాయి. గాలిలో దుమ్ము ఉండాల్సిన దానికంటే అధికంగా నమోదవుతున్నట్లు సెంట్రల్ పొల్యూషన్ బోర్డు అధికారులు గుర్తించారు. గాలి అలానే ఉంటే నగర ప్రజలకు శ్వాసకోశ సంబంధ వ్యాధులు వ్యాపిస్తాయని హెచ్చరికలు జారీ చేశారు. అయినా అప్పటి పాలకులు తమకేమీ పట్టనట్లు వ్యవహరించారు. వైఎస్సార్ సీపీ అధికారంలోకి వచ్చాక విజయవాడ నగరంలో తీసుకున్న చర్యలు సత్ఫలితాలను ఇచ్చాయి. ఇప్పుడు గాలిలో దుమ్మశాతం అతి తక్కువగా ఉన్నట్లు అధికారులు గుర్తించారు. దీంతో నగర ప్రజలు ఊపిరి పీల్చుకున్నారు.

గాలిలో దుమ్ము ఎంత ఉండొచ్చంటే..

గాలిలో దుమ్మును రెండు విధాలుగా కొలుస్తారు. పీఎం 2.5 మైక్రాన్ రకం గాలిలో క్యూబిక్ మీటరుకు 60 యూజీ/ఎం3 వరకు, పీఎం 10 మైక్రాన్ రకం 100 యూజీ/ఎం3 వరకు ఉండొచ్చు. 2018లో పీఎం 10 రకం 110 యూజీ/ఎం3ని దాటిపోయింది. ప్రస్తుత ప్రభుత్వం తీసుకున్న చర్యలతో పీఎం 2.5 మైక్రాన్ రకం దుమ్ము ఒక క్యూబిక్ మీటరుకు 42 యూజీ/ఎం3, పీఎం10 మైక్రాన్ రకం 70 యూజీ/ఎం3గా నమోదవుతోంది. దీంతో పర్యావరణవేత్తలు ఊపిరి పీల్చుకుంటున్నారు.

నిరంతరం పర్యవేక్షణ

- ఆంధ్రప్రదేశ్ కాలుష్య నియంత్రణ మండలి ఆధ్వర్యంలో గాలిలోని వాయువులను నిరంతరం పర్యవేక్షిస్తున్నారు.
- విజయవాడ పరిధిలోని కానూరు వీఆర్ సిద్ధార్థ ఇంజినీరింగు కళాశాల, రాజీవ్‌గాంధీ పార్క్, భవానీపురంలలో కాలుష్యాన్ని నమోదు చేసేందుకు కంటిన్యూయస్ యాంబియయట్ ఏ క్వాలిటీ మానిటరింగ్ సిస్టమ్(సీఏఏక్యూఎం)ను ఏర్పాటు చేశారు.
- ప్రజలకు తెలిసేలా డిస్‌ప్లే బోర్డులు ఏర్పాటు చేశారు.
- పాయకాపురంలో కూడా ఇటీవల ఏర్పాటు చేశారు. వీటి ద్వారా గాలిలో దుమ్ము శాతం, ఓజోన్ శాతం, కార్బన్ మోనాక్సైడ్, సల్ఫర్ డయాక్సైడ్, అమ్మోనియం వంటి వాటిని కొలుస్తారు.
- వాటిని పొల్యూషన్ డాష్ బోర్డుకు అనుసంధానం చేయడంతో ఎక్కడ నుంచైనా వాటి వివరాలు తెలుసుకుంటున్నారు.
- మాన్యువల్ పద్ధతిలో గుర్తించిన హాట్ స్పాట్లలో నిరంతరం కాలుష్యాన్ని కొలుస్తున్నారు.
- విజయవాడ నగరంలో పోలీస్ కంట్రోల్ రూమ్, బెంజిసర్కిల్, రామవరప్పాడు రింగ్, గొల్లపూడి అయ్యప్ప టెంపుల్ వంటి ప్రాంతాలను హాట్ స్పాట్లుగా గుర్తించారు.

ఎలా తగ్గించగలిగారంటే..

- నగరంలో ఒకప్పుడు ఫ్లై ఓవర్లు లేక పోవడంతో ట్రాఫిక్ ఎక్కువగా ఉండేది. ప్రస్తుత ప్రభుత్వ హయాంలో కనక దుర్గమ్మ ఫ్లై ఓవర్‌తో పాటు, బెంజిసర్కిల్ వద్ద రెండో ఫ్లై ఓవర్ నిర్మాణం పూర్తిచేశారు. దీంతో ట్రాఫిక్‌ను నియంత్రించగలిగారు.
- నగరంలో 24 గంటలూ స్వీపింగ్ వాహనాలతో రోడ్లుపై దుమ్ము లేకుండా శుభ్రం చేస్తున్నారు.
- స్వచ్ఛ నగరం పేరుతో పారిశుద్ధ్య కార్యక్రమాలు విస్తృతంగా చేపట్టారు. కార్మికులు 24 గంటలూ పారిశుద్ధ్య పనుల్లో నిమగ్నమవుతున్నారు.
- పచ్చదనం పెంపొందించేందుకు రోడ్ల వెంట పచ్చని మొక్కలు పెంచడం వంటి చర్యలు చేపట్టారు.
- నగరంలో అనేక ప్రాంతాల్లో రూ.కోట్లు వెచ్చించి పార్కులు ఏర్పాటు చేసి, వాటిని ఆహ్లాదకర ప్రదేశాలుగా తీర్చిదిద్దారు.
- ఆటోనగర్‌లో సైతం పటిష్ట చర్యలతో దుమ్మును తగ్గించగలిగారు.
- ప్రభుత్వం తీసుకున్న చర్యలు సత్ఫలితాలు ఇచ్చాయి. నగర ప్రజలకు ఆరోగ్యకర వాతావరణాన్ని అందించారు.



విజయవాడలో ఏర్పాటు చేసిన పొల్యూషన్ మానిటరింగ్ యూనిట్

దుమ్ము శాతాన్ని తగ్గించగలిగాం



గాలిలో దుమ్ము శాతాన్ని తగ్గించేందుకు ప్రణాళికాబద్ధంగా కృషి చేస్తున్నాం. రెసిడెన్షియల్ కాలనీల్లో రోడ్లకు ఇరువైపులా మొక్కలు పెంచుతున్నాం. ఎస్టీపీల నుంచి పొల్యూషన్ రాకుండా సైంటిఫిక్‌గా ప్రాసెస్ చేస్తున్నాం. రోడ్లుపై దుమ్ము లేకుండా నిరంతరం స్వీపింగ్ మెషిన్‌లతో శుభ్రం చేస్తున్నాం. వాటర్ ట్యాంకర్లతో దుమ్ము ఉన్న ప్రాంతంలో వాటరింగ్ చేయించడం వంటి కార్యక్రమాలను నిరంతరం చేపట్టడం ద్వారా దుమ్ము శాతాన్ని తగ్గించగలిగాం

– సత్యవతి,
అదనపు కమిషనర్ (ప్రాజెక్ట్స్), వీఎంసీ

రెవెన్యూ డివిజన్లలో ఏర్పాటు



ఒకప్పుడు విజయవాడలో గాలిలో దుమ్ముశాతం పెరగడంతో సెంట్రల్ పొల్యూషన్ బోర్డు అప్రమత్తం చేసింది. దీంతో ప్రభుత్వం తీసుకున్న అనేక చర్యల ద్వారా కాలుష్యాన్ని తగ్గించగలిగాం. గాలిలోని కాలుష్యాన్ని కొలిచేందుకు పలు ప్రాంతాల్లో నిరంతరం మానిటరింగ్ యూనిట్‌లు ఏర్పాటు చేశాం. వాటిని డ్యాష్‌బోర్డుకు అనుసంధానం చేయడంతో ఎక్కడ నుంచయినా తెలుసుకునే అవకాశం ఉంది. రెవెన్యూ డివిజన్లలో కూడా వీటిని ఏర్పాటు చేసేందుకు ప్రణాళికలు సిద్ధం చేస్తున్నాం.

– పి.శ్రీనివాసరావు,
పర్యావరణ ఇంజినీరు, కాలుష్య నియంత్రణ మండలి

క్లుప్తంగా

గ్రూప్-2 పరీక్ష కేంద్రాల తనిఖీ



కోనేరుసెంటర్: జిల్లాలో ఆదివారం నిర్వహించిన గ్రూపు -2 స్క్రీనింగ్ పరీక్ష కేంద్రాలను ఎస్పీ అద్నాన్ నయీమ్ అస్మి పరిశీలించారు. ఈ సందర్భంగా పరీక్షా కేంద్రాల వద్ద సిబ్బంది నిర్వహిస్తున్న బందోబస్తును పరిశీలించి సలహాలు, సూచనలు ఇచ్చారు. అభ్యర్థులకు ఎటువంటి ఆటంకం కలుగకుండా పరీక్షా కేంద్రాలకు అనుమతించినదీ లేనిదీ అధికారులను అడిగి తెలుసుకున్నారు. అభ్యర్థులు సెల్‌ఫోన్‌లు, ఇతర ఎలక్ట్రానిక్ వస్తువులు ఏవైనా పరీక్షా కేంద్రాల్లోకి తీసుకెళ్లింది లేనిదీ క్షుణ్ణంగా పరిశీలించింది లేనిదీ ఆరా తీశారు. అలాగే పరీక్షా కేంద్రాలకు సమీపంలో ఉన్న జిరాక్స్, నెట్ సెంటర్‌లు మూతపడింది లేనిదీ స్వయంగా చూశారు. బందోబస్తును సమర్థవంతంగా నిర్వహించిన అధికారులు, సిబ్బందిని ఆయన అభినందించారు. తొలుత మచిలీపట్నంలోని డీఎంఎస్ ఎస్‌వీహెచ్ ఇంజినీరింగ్ కళాశాలను సందర్శించిన ఎస్పీ అక్కడి నుంచి బయలుదేరి గుడ్లవల్లేరు ఇంజినీరింగ్ కళాశాలను సందర్శించి పరీక్షల నిర్వహణను పరిశీలించారు.

రవాణాశాఖ సాంకేతిక అధికారుల సంఘ కార్యవర్గం



పటమట(విజయవాడతూర్పు): ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని రవాణా శాఖ సాంకేతిక అధికారుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు దుర్గాప్రసాద్ రెడ్డి ప్రకటించారు. సంఘం ఎన్నికలు బెంజ్‌సర్కిల్ సమీపంలో ఒక హోటల్లో ఆదివారం నిర్వహించారు. ఎన్నికల అధికారిగా ఎన్జీఓ ఎన్టీఆర్ జిల్లా కార్యదర్శి ఎండీ ఇక్బాల్ వ్యవహరించారు. రాష్ట్ర సంఘానికి నూతన కార్యవర్గంలో 27 పదవులకు 26 మందిని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ప్రధాన కార్యదర్శి పదవికి ఎన్నిక జరిగింది. 56 ఓట్ల ఆధిక్యతతో ఆర్.ప్రవీణ్ గెలుపొందారు. అధ్యక్షుడిగా టి.దుర్గాప్రసాద్‌రెడ్డి, సహాధ్యక్షులుగా వై.పూర్ణచంద్రరావు, వై.ప్రసాద్, టి.వి.ఎస్.సుబ్బారావు, జి.సత్యంనాయుడు, ఉపాధ్యక్షులుగా జి.తిమ్మరుసు నాయుడు, జి.భాస్కరరావు, జి.నాగమురళి, ఆర్.సుధీర్, కార్యనిర్వాహక కార్యదర్శి సహా ఐదుగురు సంయుక్త కార్యదర్శులు, కోశాధికారిగా సీహెచ్ రాంబాబు సహా ఇతర కార్యవర్గ సభ్యులు ప్రమాణ స్వీకారం చేశారు. నూతనంగా ఎన్నికైన కార్యవర్గాన్ని ఏపీ జేఏసీ చైర్మన్ బండి శ్రీనివాసరావు, కార్యదర్శి కె.వి.శివారెడ్డి, ఎన్జీఓ సంఘం రాష్ట్ర కోశాధికారి రంగారావుతో పాటు సంఘంలోని వివిధ జేఏసీల నాయకులు అభినందించారు. ఉద్యోగుల సమస్యల పట్ల వేగంగా స్పందిస్తానని, మరింత బాధ్యతాయుతంగా వ్యవహరిస్తానని దుర్గాప్రసాద్‌రెడ్డి చెప్పారు.

ఇంటర్ పరీక్షలకు సన్నద్ధం

- ఎన్టీఆర్ జిల్లాలో పరీక్షలు రాయనున్న విద్యార్థులు : 76,092
- మొదటి ఏడాది పరీక్షకు : 40,391
- రెండో ఏడాది పరీక్షకు : 35,701
- జిల్లాలో పరీక్షా కేంద్రాలు : 99
- మార్చి 1 నుంచి 20 వరకు పరీక్షలు



పరీక్షలకు హాజరుకానున్న ఇంటర్మీడియెట్ విద్యార్థులు

వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): జిల్లాలో ఇంటర్మీడియెట్ వార్షిక పరీక్షల సందడి ప్రారంభమైంది. అధికార యంత్రాంగం పరీక్షలకు సంబంధించి అన్ని ఏర్పాట్లు పూర్తి చేసింది. ఈ నెల 11 నుంచి ప్రారంభమైన ప్రాక్టికల్ పరీక్షలు 20వ తేదీ నాటికి ముగిశాయి. మార్చి 1 నుంచి 20వ తేదీ వరకు థియరీ పరీక్షలు జరగనున్నాయి. పూర్తి స్థాయి భద్రతతో ఇంటర్ పరీక్షలు నిర్వహించేందుకు బోర్డు అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. పరీక్ష కేంద్రంలోని ప్రతి గదిలోనూ సీసీ కెమెరాలు ఏర్పాటు చేస్తున్నారు. జిల్లాలో మొత్తం 76,092 మంది విద్యార్థులు పరీక్షలు రాయనున్నారు. విద్యార్థుల సంఖ్యకు అనుగుణంగా పరీక్ష కేంద్రాలను అధికారులు ఏర్పాట్లు చేశారు. ఇప్పటికే కలెక్టర్ ఢిల్లీరావు అధ్యక్షతన పరీక్షల ఏర్పాటుకు సంబంధించి సమీక్ష నిర్వహించి అధికారులకు బాధ్యతలు అప్పగించారు. వొకేషనల్ కోర్సులను అభ్యసిస్తున్న విద్యార్థులు 1938 మంది ఉన్నారు. అలాగే మొదటి ఇంటర్మీడియట్ పరీక్షలకు హాజరవుతున్న వారిలో మొదటి ఏడాది విద్యార్థులు 40,391 మంది కాగా, ద్వితీయ సంవత్సరం విద్యార్థులు 35,701 మంది ఉన్నట్లు అధికారులు వెల్లడించారు. వీరంతా మరో నాలుగు రోజుల్లో ప్రారంభమయ్యే పరీక్షలు రాయనున్నారు.

పరీక్ష కేంద్రాల్లో మౌలిక వసతులు...

ఎన్టీఆర్ జిల్లాలో 99 పరీక్షా కేంద్రాలను అధికారులు ఏర్పాటు చేశారు. మార్చి మొదటి తేదీ నుంచి జరిగే ఈ పరీక్షలు ఉదయం తొమ్మిది గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకూ కొనసాగుతాయి. మార్చి 1, 4, 6, 9, 13, 15, 18, 20 తేదీల్లో మొదటి సంవత్సరం ఇంటర్ పరీక్షలు జరుగుతాయి. అలాగే మార్చి 2, 5, 7, 11, 14, 16, 19, 21 తేదీల్లో ద్వితీయ సంవత్సరం పరీక్షలు జరగనున్నాయి. ముఖ్యంగా పరీక్ష కేంద్రాల్లో సమస్యలు తలెత్తకుండా ముందస్తు చర్యలు చేపడుతున్నారు. ఆయా కేంద్రాల్లోని మౌలిక వసతుల గురించి ఇప్పటికే ఆదేశాలు జారీ చేశారు. ప్రతి కేంద్రంలోనూ ఇబ్బందులు తలెత్తకుండా ఫర్నీచరు, తాగునీరు, వెలుతురు ఉండేలా చర్యలు తీసుకుంటున్నారు.

వెబ్‌సైట్ ద్వారా హాల్‌టికెట్లు....

పరీక్షలకు హాజరయ్యే విద్యార్థులు హాల్‌టికెట్ల కోసం ఎలాంటి ఇబ్బందులు పడాల్సిన అవసరం లేకుండా ప్రభుత్వం ప్రత్యేక చర్యలు చేపట్టింది. కొన్ని ప్రైవేట్ కళాశాలలు విద్యార్థులు హాల్‌టిక్కెట్లు జారీ చేసేందుకు ఇబ్బందులకు గురి చేసిన సందర్భాలు ఉండటంతో ఈ ఏడాది సైతం ప్రత్యేకంగా చర్యలు తీసుకుంది. అందులో భాగంగా ప్రతి విద్యార్థి హాల్‌టిక్కెట్ వెబ్‌సైట్‌లో ఉంచారు. నేరుగా విద్యార్థులు హాల్‌టికెట్లను డౌన్‌లోడ్ చేసుకోవచ్చు. ప్రిన్సిపాల్ సంతకం అవసరం లేదు. హాల్‌టికెట్ తీసుకుని నేరుగా పరీక్ష కేంద్రాలకు హాజరుకావచ్చని అధికారులు ప్రకటించారు.

అన్ని జాగ్రత్తలు తీసుకుంటున్నాం

మార్చి మొదటి తేదీ నుంచి జరిగే ఇంటర్మీడియెట్ పరీక్షల నిర్వహణలో ఎక్కడా ఎటువంటి సమస్యలు లేకుండా జాగ్రత్తలు తీసుకుంటున్నాం. ఇప్పటికే జిల్లా కలెక్టర్ అధ్యక్షతన ఆయా విభాగాల అధికారులు, పరీక్షా కేంద్రాల బాధ్యులతో సమావేశం నిర్వహించాం. అందులో స్పష్టంగా ఆదేశాలు జారీ చేశారు. ఇంటర్మీడియట్ పరీక్షలు చివరి వరకూ ఎటువంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా చర్యలు తీసుకుంటున్నాం.

– సీఎస్ఎస్ఎన్ రెడ్డి,
జిల్లా ఇంటర్మీడియట్ అధికారి

సాహితీ సంచార యాత్రికుడు పూర్ణచందు



గ్రంథావిష్కరణ సభలో సుబ్బారావు, బుద్ధప్రసాద్, జీవీ పూర్ణచందు, చిగురుపాటి తదితరులు

విజయవాడ కల్చరల్: నిరంతర సాహితీ సంచార యాత్రికుడు డాక్టర్ జీవీ పూర్ణచందు అని ప్రపంచ తెలుగు రచయితల సంఘం అధ్యక్షుడు గుత్తికొండ సుబ్బారావు అన్నారు. సాహితీ మిత్ర బృందం ఆధ్వర్యంలో బందరురోడ్డులోని ఠాగూర్ గ్రంథాలయంలో ఆదివారం సాహితీవేత్త బహుగ్రంథ రచయిత డాక్టర్ జీవీ పూర్ణచందు సాహిత్య స్వర్ణోత్సవం, పూర్ణచంద రచించిన సొంపైన తెలుగు గ్రంథావిష్కరణ నిర్వహించారు. సభకు అధ్యక్షత వహించిన గుత్తికొండ మాట్లాడుతూ 50 సంవత్సరాల సుదీర్ఘ ప్రస్థానంలో 143 పుస్తకాలను రచించి తెలుగు సాహితీ సరస్వతి నుదుట సింధూర తిలకం దిద్దినట్లు తెలిపారు. సొంపైన తెలుగు గ్రంథాన్ని ప్రపంచ తెలుగు రచయితల సంఘం గౌరవ అధ్యక్షుడు డాక్టర్ మండలి బుద్ధప్రసాద్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మాతృభాష పట్ల మమకారం పెంచుకోవాలని సూచించారు. జీవీ పూర్ణచందు గురించి మాట్లాడుతూ కృష్ణా జిల్లా రచయితల సంఘం ప్రధాన కార్యదర్శిగా రచయితల సంఘం మహాసభలను విజయవంతం చేయడంలో కీలక పాత్ర పోషించినట్లు తెలిపారు. మాజీ శాసన మండలి సభ్యుడు చిగురుపాటి వరప్రసాద్ మాట్లాడుతూ తెలుగు భాష వికాసం కోసం అందరూ చిత్తశుద్ధితో పనిచేయాల్సిన అవరముందన్నారు. సిలికాన్ ఆంధ్రా విశ్వవిద్యాలయం ఆచార్యులు డాక్టర్ అద్దంకి శ్రీనివాస్ సొంపైన తెలుగు గ్రంథ విషయాలను సోదాహరణంగా వివరించారు. పుస్తక రచయిత జీవీ పూర్ణచందు తన సాహితీ ప్రయాణంలో మైలురాళ్లను వివరించారు. సభకు కేంద్ర సాహిత్య అకాడమీ పురస్కార గ్రహీత డాక్టర్ దీర్ఘాసి విజయభాస్కర్ అధ్యక్షత వహించారు. కాలనాథభట్ల వీరభద్రశాస్త్రి, కృష్ణా జిల్లా గ్రంథాలయ పరిషత్ చైర్‌పర్సన్ తిప్పరమల్లి జమల పూర్ణమ్మ, డాక్టర్ సామల రమేష్‌బాబు, ఆచార్య గారపాటి ఉమామహేశ్వరరావు, మాజీ మేయర్ జంధ్యాల శంకర్, పెనుగొండ లక్ష్మీ నారాయణతో పాటు 50 మంది వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన సాహితీ మిత్ర బృంద సభ్యులు పూర్ణచందు సాహితీ విశేషాలను వివరించారు.

త్రికోటేశ్వరుని అన్నదానానికి రూ.1,00,116 విరాళం



విరాళాన్ని ఈవో శ్రీనివాసరెడ్డికి అందజేస్తున్న పద్మజ, శశిధర్

నరసరావుపేట రూరల్: కోటప్పకొండ శ్రీ త్రికోటేశ్వర స్వామి దేవస్థానంలో నిత్యాన్నదాన పథకానికి విజయవాడకు చెందిన యలవర్తి పద్మజ, వారి కుమారుడు శశిధర్‌లు రూ.1,00,116 విరాళంగా అందజేసారు. ఆలయ కార్యాలయంలో ఆదివారం ఈవో గొలమూరి శ్రీనివాసరెడ్డిని కలిసి విరాళం చెక్‌ను అందించారు. దాతలకు స్వామి వారి శేషవస్త్రం, చిత్రపటం, ప్రసాదంను ఈవో అందజేసారు. కార్యక్రమంలో ఆలయ సూపరింటెండెంట్ నాగిరెడ్డి ఉన్నారు.

జగనన్న సురక్షతో సూపర్ స్పెషాలిటీ వైద్య సేవలు

వైద్య ఆరోగ్య శాఖ స్పెషల్ చీఫ్ సెక్రటరీ కృష్ణబాబు



మందులు పరిశీలిస్తున్న స్పెషల్ చీఫ్ సెక్రటరీ ఎం.టి.కృష్ణబాబు

కృష్ణలంక(విజయవాడతూర్పు): జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమంలో భాగంగా ప్రభుత్వం ప్రజలకు ఉచితంగా సూపర్ స్పెషాలిటీ వైద్య సేవలు అందిస్తుందని ఆంధ్రప్రదేశ్ వైద్య ఆరోగ్య శాఖ స్పెషల్ చీఫ్ సెక్రటరీ ఎం.టి.కృష్ణబాబు అన్నారు. కృష్ణలంకలోని నవభారత పబ్లిక్ స్కూల్‌లో ఆంధ్రప్రదేశ్ ప్రైవేట్ హాస్పిటల్స్ అండ్ నర్సింగ్ హోమ్స్ అసోసియేషన్, లయన్స్ క్లబ్ ఆఫ్ విజయవాడ ఈస్ట్, లక్ష్మీ సమీర లయన్స్ కంటి ఆసుపత్రి ఆధ్వర్యంలో ఆదివారం ఉచిత మెగా వైద్య శిబిరం నిర్వహించారు. ముఖ్య అతిథిగా కృష్ణబాబు పాల్గొని ఉచిత వైద్య శిబిరాన్ని ప్రారంభించి మాట్లాడారు. జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమంలో స్వచ్ఛందంగా ప్రైవేట్ వైద్య నిపుణులు వైద్య సేవలు అందించడం అభినందనీయమని చెప్పారు. ప్రముఖ వైద్యులు, లయన్స్ క్లబ్ సభ్యులు విలువైన సమయాన్ని వెచ్చించి సేవ చేయటం మంచి పరిణామం అని తెలిపారు. లయన్స్ క్లబ్ లయన్ డాక్టర్ హనుమయ్య మాట్లాడుతూ ఐఎంఏ వైద్యులు, లయన్స్ క్లబ్ సభ్యులు సేవ చేయడంలో ఎప్పుడు నిమగ్నమై ఉన్నారని చెప్పారు. ఈ శిబిరంలో 450 మందికి గుండె, మూత్ర పిండ, చెవి, ముక్కు, గొంతు, బీపీ, షుగర్, గర్భకోశ వ్యాధి సంబంధించి వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ ఎం.సుహాసిని, లయన్స్ జిల్లా గవర్నర్ శంకరగుప్తా, లయన్స్ క్లబ్ వైస్ ప్రెసిడెంట్ ఎ.సూర్యనారాయణ, గోపినాథ్, రమణ, డాక్టర్ బోడపూడి చౌదరి, డాక్టర్ మనోహర్, డాక్టర్ నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

దుర్గమ్మ సన్నిధిలో విద్యార్థుల సందడి



హాల్ టికెట్లను అమ్మవారికి చూపుతున్న ఇంటర్ విద్యార్థులు



క్యూలైన్‌లో వేచి ఉన్న భక్తులు

- ఆదివారం కావడంతో పెరిగిన రద్దీ
- సర్వ దర్శనానికి రెండు గంటలు
- భక్తులతో కిటకిటలాడిన క్యూలైన్లు

ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): దుర్గా మల్లేశ్వర స్వామి వార్ల దేవస్థానం ఇంద్రకీలాద్రిపై ఆదివారం భక్తుల రద్దీ కనిపించింది. మరో నాలుగు రోజులలో ఇంటర్ మొదటి, ద్వితీయ సంవత్సర విద్యార్థుల వార్షిక పరీక్షల నేపథ్యంలో పెద్ద ఎత్తున విద్యార్థులు ఇంద్రకీలాద్రికి తరలివచ్చారు. తమ పరీక్ష హాల్ టికెట్లను అమ్మవారికి చూపి మంచి మార్కులతో ఉత్తీర్ణత సాధించేలా దీవించమని వేడుకున్నారు. మరో వైపున నవ వధూవరులు, వారి కుటుంబ సభ్యులు అమ్మవారిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. తెల్లవారుజామున నుంచే ఇంద్రకీలాద్రిపై భక్తుల తాకిడి కనిపించింది. ఆదివారం కావడంతో అమ్మవారికి నిర్వహించిన ఖడ్గమాలార్చన, ఆలయ ప్రాంగణంలో నిర్వహించిన లక్ష కుంకుమార్చన, శ్రీ చక్రనవార్చన, శాంతి కల్యాణం, చండీ హోమాలలో విశేషంగా ఉభయదాతలు పాల్గొన్నారు. పవిత్ర కృష్ణానదిలో పుణ్యస్నానాలు ఆచరించిన భక్తులు ఘాట్‌రోడ్డు, మహామండపం లిఫ్టు, మెట్ల మార్గం ద్వారా కొండపైకి చేరుకున్నారు. సర్వ దర్శనంతో పాటు రూ. 100, రూ300, రూ.500 టికెట్లు క్యూలైన్ల ద్వారా ఆలయానికి చేరుకుని అమ్మవారిని దర్శించుకున్నారు. సర్వ దర్శనం క్యూలైన్‌లో అమ్మవారి దర్శనానికి రెండు గంటల సమయం పట్టింది. భక్తులకు ఎటువంటి ఇబ్బందులు కలుగకుండా ఆలయ అధికారులు క్యూలైన్లను పర్యవేక్షించారు. మధ్యాహ్నం రెండున్నర గంటల వరకు భక్తుల రద్దీ కొనసాగింది. సాయంత్రం అమ్మవారి పంచహారతుల సేవ, పల్లకీ సేవలోనూ భక్తులు, ఉభయదాతలు విశేషంగా పాల్గొన్నారు.



కుంకుమార్చనలో అమ్మవారి ఉత్సవ మూర్తి

నిత్యాన్నదానానికి విరాళాలు



దాతలకు అమ్మవారి చిత్రపటం అందజేస్తున్న ఏఈవో రమేష్‌బాబు

ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): ఇంద్రకీలాద్రిపై దుర్గమ్మ సన్నిధిలో నిత్యాన్నదానానికి రాజమండ్రికి చెందిన భక్తులు ఆదివారం రూ. లక్ష విరాళాన్ని అందచేశారు. రాజమండ్రి అబిద్‌నగర్‌కు చెందిన ఎ. చిన్న సత్యనారాయణ కుటుంబ సభ్యులు ఆదివారం అమ్మవారిని దర్శించుకునేందుకు ఇంద్రకీలాద్రికి విచ్చేశారు. ఆలయ అధికారులను కలిసి రూ. లక్ష విరాళాన్ని అందించారు. అనంతరం దాతలకు ఆలయ మర్యాదలతో అమ్మవారి దర్శనం కల్పించారు. వేద పండితుల ఆశీర్వచనం అందచేయగా, ఆలయ ఏఈవో ఎస్.రమేష్‌బాబు దాతలకు అమ్మవారి చిత్రపటం, ప్రసాదాలు, శేషవస్త్రాలు అందచేశారు. అలానే విశాఖపట్నంకు చెందిన భక్తులు ఆదివారం రూ. లక్ష విరాళాన్ని అందచేశారు. కె. వెంకటేశ్వరరావు, జయంతి ఆలయ ఈవో కెఎస్.రామారావును కలిసి నిత్యాన్నదానానికి రూ. లక్ష విరాళాన్ని అందచేశారు. అనంతరం దాతలకు ఆలయ మర్యాదలతో అమ్మవారి దర్శనం కల్పించారు. వేద పండితుల ఆశీర్వచనం అనంతరం దాతలకు ఆలయ ఈవో రామారావు అమ్మవారి చిత్రపటం, ప్రసాదాలు, శేషవస్త్రాలను అందచేశారు.

నేత్ర పర్వంగా శివలీలలు నృత్యం



శివలీలలు నృత్య రూపకాన్ని ప్రదర్శిస్తున్న సంతోష్ బృందం

విజయవాడ కల్చరల్: దృశ్యవేదిక ఆధ్వర్యంలో నెలవారీ కార్యక్రమంలో భాగంగా గాంధీనగర్‌లోని హనుమంతరాయ గ్రంథాలయంలో ఆదివారం ప్రదర్శించిన సంప్రదాయ నృత్యాలుయ నేత్ర పర్వంగా సాగాయి. శారదా నృత్య కళాపీఠం వ్యవస్థాపకుడు ఎ.సంతోష్ ఆధ్వర్యంలో శివలీలా వైభవం నృత్య రూపకాన్ని ప్రదర్శించారు. శివ లీలలను వివరిస్తూ నృత్య రూపకం సాగింది. రెండవ ప్రదర్శనగా నాట్యాచారిణి యల్లా జోస్యుల అనూరాధ బృందం జడకోలాటం, కరగం, లంబాడీ నృత్యం, పట్నమెల్లి వచ్చింది, నీలమ్మ నీలమ్మ తదతర అంశాలను ప్రదర్శించారు. సభకు ముఖ్య అతిథిగా పాల్గొన్న డాక్టర్ గుమ్మా సాంబశివరావు మాట్లాడుతూ భారతీయ నృత్య వైభవం ప్రపంచానికి ఆదర్శంగా నిలిచిందని చెప్పారు. చిత్తశుద్ధి, ఏకాగ్రత, లక్ష్యం, అంకిత భావం, సాధన కళాకారులను పరిపూర్ణమైన కళాకారులుగా తీర్చిదిద్దు కోవ చ్చని తెలిపారు. భారతీయ నృత్యాలకు ప్రామాణికం భరతముని నాట్య శాస్త్రమేనని వివరించారు. దృశ్య వేదిక ఉపాధ్యక్షుడు డాక్టర్ హిమసాగర చంద్రమూర్తి, దొంతనాల ప్రకాష్, సంస్థ వ్యవస్థాపకుడు హెచ్‌వీఆర్ఎస్ ప్రసాద్ పాల్గొన్నారు. సంస్థ సభ్యుడు డి.రమేష్ నిర్వహించారు.

బాడీ బిల్డింగ్ పోటీలో శ్రీనివాస్‌కు బంగారు పతకం



జాతీయ బాడీబిల్డింగ్ పోటీలో గెలుపొందిన శ్రీనివాస్‌కు మెమెంటో అందజేస్తున్న దృశ్యం

పెనమలూరు: మిస్టర్ ఇండియా జాతీయ బాడీ బిల్డింగ్ పోటీల్లో ఉమ్మడి కృష్ణా జిల్లాకు చెందిన కె.శ్రీనివాసరావు బంగారు పతకం సాధించాడు. ఉమ్మడి కృష్ణా జిల్లా బాడీ బిల్డింగ్ అసోసియేషన్ కార్యదర్శి తాళ్లూరి అశోక్ ఆదివారం రాత్రి వివరాలు తెలుపుతూ జాతీయ బాడీబిల్డింగ్ పోటీలు ఈ నెల 23వ తేదీ నుంచి 25వ తేదీ వరకు తమిళనాడులో నిర్వహించారన్నారు. 75 కేజీల విభాగంలో ఉమ్మడి కృష్ణా జిల్లాకు చెందిన కె.శ్రీనివాస్ బంగారు పతకం సాధించాడన్నారు. శ్రీనివాస్ జాతీయ స్థాయిలో పతకం సాధించటం పట్ల టీఏబీబీఏ అధ్యక్షుడు స్వామి రమేష్, కార్యదర్శి వాడపల్లి శ్రీనివాసరాజు, ఉమ్మడి కృష్ణా జిల్లా సభ్యులు ఈదా రాజేష్, వైష్ణవి నరేంద్ర, బి.మనోహర్ పలువురు అభినందనలు తెలిపారు.

సాగర్ నీటిమట్టం

విజయపురిసౌత్: నాగార్జునసాగర్ జలాశయ నీటిమట్టం ఆదివారం 516.60 అడుగుల వద్ద ఉంది. సాగర్ జలాశయం నుంచి ఎస్ఎల్‌బీసీకి 1,350 క్యూసెక్కులు విడుదలవుతోంది. శ్రీశైలం జలాశయ నీటిమట్టం 816.20 అడుగుల వద్ద ఉంది.

ఉరేసుకొని యువకుడి ఆత్మహత్య



కోనేరుసెంటర్: మచిలీపట్నంలో ఓ యువకుడు ఆత్మహత్య చేసుకున్న ఘటనపై చిలకలపూడి పోలీస్‌స్టేషన్‌లో ఆదివారం కేసు నమోదైంది. గోపాల్‌నగర్‌కు చెందిన అందే సోమేశ్వర సాయినాథ్ (17) ఇంటర్మీడియెట్ చదువుకున్నాడు. ఖాళీ సమయంలో తండ్రికి తోడుగా తాపీ పనులకు వెళుతుంటాడు. గూడురుకు చెందిన ఓ యువతితో ప్రేమలో పడిన సాయినాథ్ కొన్ని రోజులుగా ముభావంగా ఉంటున్నాడు. ఆదివారం ఇంట్లో వారంతా బంధువుల ఇంట్లో జరిగే శుభకార్యానికి వెళ్లగా ఇంట్లో ఒంటరిగా ఉన్న సాయినాథ్ తలుపుకు గెడ పెట్టి గదిలో ఫ్యానుకు ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. కుటుంబ సభ్యులు ఇంటికి వచ్చి చూడగా తలుపుకు లోపలి గెడ పెట్టి ఉంది. అనుమానం వచ్చిన కుటుంబ సభ్యులు కిటికీలో నుంచి చూడగా ఫ్యానుకు వేలాడుతూ కనిపించాడు. స్థానికుల సహాయంతో కిందికి దింపి చికిత్స నిమిత్తం మచిలీపట్నం సర్వజన ఆసుపత్రికి తరలించగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. పోలీసులు ఆసుపత్రికి చేరుకుని కుటుంబ సభ్యుల నుంచి వివరాలు సేకరించారు. ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ సతీష్ తెలిపారు. పోస్టుమార్టం అనంతరం మృతదేహాన్ని కుటుంబసభ్యులకు అప్పగించనున్నట్లు సీఐ తెలిపారు.

మేడపై నుంచి దూకి వ్యక్తి....

చిట్టినగర్(విజయవాడపశ్చిమ): పక్షవాతంతో కుటుంబానికి భారం కాకూడదనే బావనతో మేడపై నుంచి దూకి వ్యక్తి ఆత్మహత్యకు పాల్పడిన ఘటన కొత్తపేట పోలీస్ స్టేషన్ పరిధిలోని జక్కంపూడి కాలనీలో ఆదివారం చోటు చేసుకుంది. ఘటనపై పోలీసులు అనుమానాస్పద మృతి కింద కేసు నమోదు చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... జక్కంపూడి కాలనీ బ్లాక్ నెం 230లో పి. కౌసల్య, సోమినాయుడు (44) దంపతులు నివాసం ఉంటున్నారు. వీరికి ఇద్దరు పిల్లలు. కౌసల్య ఓ ప్రయివేటు కంపెనీలో ఉద్యోగం చేస్తుంటుంది. భార్యాభర్తల మధ్య విభేదాల కారణంగా గత కొన్నేళ్లగా విడివిడిగా ఉంటున్నారు. ఈ క్రమంలో సోమినాయుడు కాలనీలోని బ్లాక్ నెం 34లో నివాసం ఉంటున్న రోజారాణి అనే మహిళతో సహజీవనం చేస్తున్నాడు. ఏడాది కిందట సోమినాయుడికి పక్షవాతం రావడంతో కుడికాలు, కుడి చేయి పని చేయడం లేదు. దీంతో ఈ నెల 4వ తేదీన సోమినాయుడిని కౌసల్యకు అప్పగించిన రోజారాణి, తనకు మరో వ్యక్తితో వివాహం అయిందని చెప్పి వెళ్లిపోయింది. అయితే సోమినాయుడిని చూసుకునేందుకు మరో ఇల్లు అద్దెకు తీసుకుని కౌసల్య, ఇంట్లో సామాన్లు సర్దే క్రమంలో భర్తను రోజారాణికి అప్పగించింది. ఆదివారం తెల్లవారుజామున కౌసల్యకు తెలిసిన వారు ఫోన్ చేసి నీ భర్త కాలనీలో మేడపై నుంచి దూకి ఆత్మహత్యకు పాల్పడ్డాడని చెప్పారు. దీంతో బ్లాక్ వద్దకు వచ్చే నేలపై చనిపోయి ఉండటంతో రోజారాణిని విషయం అడిగి తెలుసుకుంది. రాత్రి అందరూ భోజనాలు చేసిన తర్వాత నిద్రపోగా, తెల్లవారుజామున ఏదో పెద్ద శబ్దం రావడంతో ఇంటి బయటకు వచ్చి చూసేసరికి నేలపై సోమినాయుడు చనిపోయి ఉన్నాడని చెప్పింది. దీంతో ఘటనపై పోలీసులకు ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేశారు.

ఆర్థిక ఇబ్బందులతో ఆటోడ్రైవర్...

చిట్టినగర్(విజయవాడపశ్చిమ): ఆర్థిక ఇబ్బందులతో ఆటోడ్రైవర్ విష పదార్థం తిని ఆత్మహత్యకు పాల్పడిన ఘటన కొత్తపేట పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. ఘటనపై మృతుడి భార్య ఫిర్యాదు మేరకు పోలీసులు ఆదివారం కేసు నమోదు చేశారు. సౌమ్య థియేటర్ సమీపంలో షేక్. షాహీనా, వలీ దంపతులు నివాసం ఉంటున్నారు. వలీ ఆటో నడుపుకుని జీవనం సాగిస్తుంటాడు. గత కొంత కాలంగా ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్న వలీ శనివారం మధ్యాహ్నం పేరు తెలియని విష పదార్థాన్ని తిన్నాడు. దీంతో వెంటనే వాంతులు కావడంతో భార్య గమనించి ప్రభుత్వాసుపత్రికి తరలించింది. వలీ చికిత్స పొందుతూ ఆదివారం తెల్లవారుజామున మృతి చెందాడు. పోలీసులు మృతుడి భార్య నుంచి వివరాలు సేకరించి కేసు నమోదు చేశారు.

గంజాయితో రౌడీషీటర్ అరెస్టు

చిట్టినగర్(విజయవాడపశ్చిమ): గంజాయి కలిగి ఉన్న రౌడీషీటర్‌ను కొత్తపేట పోలీసులు ఆదివారం అరెస్టు చేశారు. నిందితుడి వద్ద నుంచి 1.6 కేజీల గంజాయిని స్వాధీనం చేసుకున్నట్లు పేర్కొన్నారు. రైల్వే అప్ యార్డు వద్ద గంజాయిని విక్రయిస్తున్నట్లు పోలీసులకు సమాచారం అందింది. దీంతో సీఐ గణేష్ రైల్వే అప్‌యార్డు వద్ద తనిఖీలు నిర్వహిస్తుండగా, చిట్టినగర్ సొరంగం రోడ్డుకు చెందిన బియ్యపు లోకేష్ అనుమానాస్పదంగా కనిపించాడు. అదుపులోకి తీసుకుని తనిఖీ చేయగా గంజాయిని గుర్తించారు. నిందితుడిపై కేసు నమోదు చేసి అరెస్టు చేశారు.

క్లుప్తంగా

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

మొగల్రాజపురం(విజయవాడ తూర్పు): స్థానిక రింగ్‌రోడ్డు విద్యుత్ సబ్‌స్టేషన్ ఆర్టీసీ కాలనీ ఫీడర్ పరిధిలో విద్యుత్ లైన్ల మరమ్మతుల కారణంగా సోమవారం ఉదయం 9 నుంచి 11 గంటల వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని ఏపీసీపీడీసీఎల్ గుణదల డివిజన్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ పి.హరిబాబు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆర్టీసీ కాలనీలోని 1, 2, 3 అంతర్గత రహదారులు, ఎస్ఎస్ఆర్ వీధి పరిసర ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాను నిలిపివేస్తామన్నారు.

మొగల్రాజపురం, మహాత్మాగాంధీ ఇండోర్ సబ్‌స్టేషన్ పరిధిలో

లబ్బీపేట(విజయవాడతూర్పు): విద్యుత్ లైన్ల మరమ్మతుల నేపథ్యంలో మొగల్రాజపురం సెక్షన్, మహాత్మాగాంధీ ఇండోర్ సబ్‌స్టేషన్ పరిధిలోని పలు ప్రాంతాల్లో సోమవారం విద్యుత్ సరఫరాను నిలిపివేస్తున్నట్లు ఏపీసీపీడీసీఎల్ కార్యనిర్వాహక ఇంజినీర్ బీవీ సుధాకర్ ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 8 నుంచి 10 గంటల వరకూ 11 కేవీ కళానికేతన్ ఫీడర్ పరిధిలోని జమ్మిచెట్టు సెంటర్, పీవీపీ రోడ్డు, మినర్వా గ్రాండ్ రోడ్డు, కళానికేతన్, ఆదర్శ నగర్ తదితర ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందన్నారు.

ఘనంగా సరస్వతీ సహిత మేధా దక్షిణామూర్తి హోమం



కృష్ణలంక(విజయవాడతూర్పు): బస్టాండ్ సమీపంలోని శ్రీ కాళీమాత అమ్మవారి దేవస్థానం (త్రిశక్తి పీఠం)లో పది, ఇంటర్మీడియెట్ విద్యార్థుల పరీక్షా సమయాన్ని దృష్టిలో ఉంచుకుని ఆదివారం శ్రీ సరస్వతీ సహిత మేధా దక్షిణామూర్తి హోమం వేద పండితులు ఘనంగా నిర్వహించారు. సరస్వతీ అష్టోత్తర, సరస్వతీ పూజ, మేధా దక్షిణామూర్తి హోమం, సరస్వతీ హోమం విద్యార్థులచే ఉచితంగా చేయించారు. విద్యార్థుల హాల్ టికెట్లను సరస్వతీ అమ్మవారి ముందు ఉంచి పూజలు నిర్వహించారు. విద్యార్థులకు పెన్ను, సరస్వతీ అమ్మవారి ప్రతిమ, రక్ష, ప్రసాదం పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ కార్యదర్శి కె.జగదీష్‌కుమార్, ఆధ్యాత్మిక సలహాదారుడు భారతుల విజయకిరణ్, సూపరింటెండెంట్ మధుసూదనరావు, సభ్యులు విశ్వేశ్వరయ్య, జగన్, రాజా, అర్చకుడు శిష్టా ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

భవిష్యత్‌లో సౌరశక్తి వినియోగం పెరుగుతుంది



పటమట(విజయవాడతూర్పు): రానున్న రోజుల్లో సౌరశక్తి వినియోగం పెరుగుతుందని ఏపీ ఎనర్జీ కమిటీ వైస్ చైర్మన్ బి.ఫణిచంద్ర అన్నారు. వాసవ్య మిత్రమండలి, సమ భావన మిత్ర మండలి విజయవాడ శాఖ సమావేశం టీచర్స్ కాలనీలో ఆదివారం జరిగింది. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన ఫణిచంద్ర మాట్లాడుతూ సౌర శక్తి కోసం కొండలపైనా, నదులపైనా, ఇళ్లపైనా పరికరాలను అమర్చుకోవచ్చన్నారు. ప్రస్తుతం 42 శాతం సౌర శక్తి వినియోగంలో ఉందన్నారు. 2030 నాటికి 500 కిలోవాట్‌లు వాడుకోవడానికి కేంద్ర ప్రభుత్వం ప్రణాళిక సిద్ధం చేస్తుందని చెప్పారు. దీనికి ప్రభుత్వం సబ్సిడీ ఇస్తోందన్నారు. అనంతరం ఫణిచంద్రను సభ్యులు సన్మానించారు. కార్యక్రమంలో ఆయా సంఘాల ప్రతినిధులు టి.శోభనాద్రి, యార్లగడ్డ రంగారావు, డాక్టర్ గుమ్మా సాంబశివరావు, సీహెచ్.వెంకటరెడ్డి, డాక్టర్ ఎం.వి.రావు, కొండపల్లి మాధవరావు, గోళ్ల నారాయణరావు, కె.భీమేశ్వరరావు, కె.భాస్కరరావు, డాక్టర్ జంధ్యాల శంకర్, ఆచార్య ఆర్.కె.ప్రసాద్ పాల్గొన్నారు.

శక్తి పీఠంలో విశేష పూజలు

మధురానగర్(విజయవాడసెంట్రల్): మధురానగర్ నేతాజీకాలనీ అంకమ్మతల్లి శక్తిపీఠంలో మాఘమాసం ఆదివారం సందర్భంగా ప్రత్యేక పూజలు, అభిషేకాలు జరిగాయి. పీఠం వ్యవస్థాపకుడు అన్నాబత్తుల శరాబందీరావు అమ్మవారికి ప్రీతికరమైన శ్రీచక్రార్చన, కుంకమ పూజలు నిర్వహించారు. పెద్ద సంఖ్యలో భక్తులు అమ్మ వారిని దర్శించుకుని మొక్కుబడులు చెల్లించుకున్నారు.







గ్రూప్ - 2 స్క్రీనింగ్ పరీక్ష ప్రశాంతం



ఆంధ్రప్రదేశ్ పబ్లిక్ సర్వీస్ కమిషన్(ఏపీపీఎస్సీ) గ్రూప్ – 2 స్క్రీనింగ్ పరీక్ష ఆదివారం ప్రశాంతంగా ముగిసింది. నగరంలో ఏర్పాటు చేసిన పరీక్షా కేంద్రాలకు ఉదయాన్నే అభ్యర్థులు చేరుకోవడంతో కోలాహలం నెలకొంది. ఆయా కేంద్రాల్లో అభ్యర్థులను తనిఖీ చేసిన అనంతరం పరీక్షకు అనుమతించారు. ఎలాంటి ఇబ్బందులు కలగకుండా వసతులు కల్పించడంతో ప్రశాంత వాతావరణంలో పరీక్ష జరిగింది.

– సాక్షి ఫొటోగ్రాఫర్, విజయవాడ

టీడీపీ పాలనలో ప్రజా సంక్షేమం కనుమరుగు



3వ డివిజన్‌లో చెక్కులు పంపిణీ చేస్తున్న దేవినేని అవినాష్, డెప్యూటీ మేయర్ దుర్గ, కార్పొరేటర్లు

వైఎస్సార్ సీపీ తూర్పు ఇన్‌చార్జి దేవినేని అవినాష్

గుణదల(విజయవాడ తూర్పు): గత టీడీపీ ప్రభుత్వ పాలనలో ప్రజా సంక్షేమం కనుమరుగైందని వైఎస్సార్ సీపీ తూర్పు ఇన్‌చార్జి దేవినేని అవినాష్ అన్నారు. 3వ డివిజన్ పరిధిలోని ఈఎస్ఐ ఆస్పత్రి వద్ద ఆదివారం జరిగిన కార్యక్రమంలో పేద కుటుంబాలకు రూ.2 లక్షలు విలువ చేసే ఐదు తోపుడు బండ్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా అవినాష్ మాట్లాడుతూ.. ప్రజా సమస్యలను గాలికి వదిలేసి చంద్రబాబు ప్రజా ధనాన్ని దోచుకున్నారని విమర్శించారు. మరలా ఆ పార్టీ అధికారంలోకి వస్తే పేదల బతుకులు రోడ్డున పడతాయని తెలిపారు. ప్రజా సమస్యలు పరిష్కరించి సుపరిపాలన అందించే దిశగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి కృషి చేస్తున్నారన్నారు. సీఎం వైఎస్ జగన్‌ను ఆదర్శంగా తీసుకుని తాము సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని చెప్పారు.

వైఎస్సార్ సీపీ హయాంలో సుపరిపాలన

వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన నాటి నుంచి రాష్ట్రంలో సుపరిపాలన మొదలైందని అవినాష్ తెలిపారు. ప్రజా సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయంగా సీఎం జగన్‌మోహన్‌రెడ్డి పాలన సాగిస్తున్నారని పేర్కొన్నారు. ప్రజా ద్రోహి చంద్రబాబుకు, ప్రజల నాడి తెలిసిన నాయకుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలనకు మధ్య వ్యత్యాసాన్ని ప్రజలు గుర్తించారన్నారు. వచ్చే ఎన్నికల్లో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ విజయం సాధిస్తుందని స్పష్టం చేశారు. ప్రభుత్వం అమలు పరుస్తున్న సంక్షేమ పథకాలే తమను అధికారంలోకి తెస్తాయని ధీమా వ్యక్తం చేశారు. అనంతరం జరిగిన కార్యక్రమంలో జీవనోపాధి నిమిత్తం 3 ఇస్త్రీ బండ్లు, 1 టిఫిన్ బండి, 1 తోపుడు బండి అందజేశారు.

సీఎం సహాయనిధి చెక్కుల పంపిణీ

గుణదల(విజయవాడతూర్పు): పేదల ఆరోగ్యానికి ప్రభుత్వం పెద్ద పీట వేస్తోందని వైఎస్సార్ సీపీ తూర్పు నియోజకవర్గ ఇన్‌చార్జి దేవినేని అవినాష్



బండ్లు పంపిణీ చేస్తున్న దేవినేని అవినాష్, నాయకులు

అన్నారు. 3వ డివిజన్‌లోని ఈఎస్ఐ ఆస్పత్రి సమీపంలోని పోస్టాఫీస్ వద్ద సీఎం సహాయనిధి చెక్కుల పంపిణీ కార్యక్రమం ఆదివారం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పేదల పక్షపాతిగా సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి వ్యవహరిస్తున్నారని తెలిపారు. పేద ప్రజలకు సంక్షేమ పాలన అందించే దిశగా ఆయన చేస్తున్న కృషి అభినందనీయమన్నారు. ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాల్లో ఆరోగ్యశ్రీ ద్వారా పేదలకు ఎంతో మేలు జరుగుతుందన్నారు. పేద వాడికి కార్పొరేట్ తరహా వైద్యం అందించే దిశగా ఆరోగ్య శ్రీ పథకం వినియోగపడుతుందని చెప్పారు. ప్రస్తుతం మన రాష్ట్రంలోనే కాక ఇతర రాష్ట్రాల్లో సైతం ఆరోగ్య శ్రీ సేవలు లభిస్తున్నాయన్నారు. ఏదైనా కారణాల చేత ఈ పథకం అమలు కాని పరిస్థితుల్లో సీఎం సహాయనిధి ద్వారా పేదలను ఆదుకుంటున్నామని చెప్పారు. బాధితునికి వైద్యానికి అయిన ఖర్చు యావత్తు సీఎం సహాయనిధి ద్వారా ప్రభుత్వమే చెల్లిస్తుందని పేర్కొన్నారు. కార్యక్రమంలో భాగంగా 5వ డివిజన్‌కు చెందిన తోట లక్ష్మికి రూ.85 వేలు, 6వ డివిజన్‌కు చెందిన రుద్రా పల్లంరాజుకు రూ.75 వేలు, 9వ డివిజన్‌కు చెందిన కనకాల శివ రాణికి 1 లక్షా 40 వేల రూపాయల చెక్కులను అందజేశారు. ఆయా కార్యక్రమాల్లో డెప్యూటీ మేయర్ బెల్లం దుర్గ, కార్పొరేటర్లు భీమిశెట్టి ప్రవల్లిక, కలపాల అంబేడ్కర్, వియ్యపు అమర్‌నాథ్, 9వ డివిజన్ పార్టీ అధ్యక్షుడు గద్దే కళ్యాణ్ పాల్గొన్నారు.

రూ.12 కోట్లతో అభివృద్ధి పనులు

కృష్ణలంక(విజయవాడతూర్పు): తూర్పు నియోజకవర్గ పరిధిలోని రాణిగారితోట 18వ డివిజన్‌లో రూ.12 కోట్లతో అభివృద్ధి పనులు చేపట్టామని డివిజన్ కార్పొరేటర్, ఫ్లోర్‌లీడర్ వెంకట సత్యనారాయణ అన్నారు. డివిజన్‌లోని ఆయన కార్యాలయంలో ఆదివారం విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వెంకట సత్యనారాయణ మాట్లాడుతూ.. డివిజన్‌లో సీసీ రోడ్లు, యూజీడీ పైప్‌లైన్, పార్క్, కమ్యూనిటీ హాల్, హైమాస్ట్ లైట్స్, రిటైనింగ్ వాల్‌ను ఏర్పాటు చేశామన్నారు. మంగళవారం సాయంత్రం 4 గంటలకు మాదంశెట్టి సీతయ్య వీధిలోని వినాయకుని గుడి వద్ద నుంచి గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం ప్రారంభమవుతుందని, ముఖ్య అతిథిగా వైఎస్సార్ సీపీ తూర్పు నియోజకవర్గ ఇన్‌చార్జి దేవినేని అవినాష్ పాల్గొంటారని తెలిపారు. సీఎం వైఎస్ జగ



మాట్లాడుతున్న కార్పొరేటర్ వెంకట సత్యనారాయణ

న్‌మోహన్‌రెడ్డి ఆధ్వర్యంలో రాష్ట్రంలో జరుగుతున్న అభివృద్ధి, సంక్షేమం, డివిజన్‌లో జరుగుతున్న అభివృద్ధి, సంక్షేమాన్ని వివరిస్తామన్నారు. గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. సమావేశంలో వైఎస్సార్ సీపీ ఎన్టీఆర్ జిల్లా విద్యార్థి విభాగం అధ్యక్షుడు దొడ్డా అంజిరెడ్డి, పార్టీ నాయకులు బిక్షాలురెడ్డి, కె.నాగేశ్వరరావు పాల్గొన్నారు.

ఘనంగా అమ్మవారి రథోత్సవం

పెనమలూరు: పెదపులిపాక గ్రామంలో వేంచేసి ఉన్న శ్రీవిజయ రాజరాజేశ్వరి అమ్మవారి ఆలయంలో అష్టమ వార్షికోత్సవాల్లో భాగంగా ఆదివారం అమ్మవారి కల్యాణోత్సవం జరిగింది. శ్రీసుందరేశ్వర స్వామివారికి ఏకాదశ రుద్రాభిషేకం, 108 మంది దంపతులచే చండీహోమం నిర్వహించారు. శ్రీ వాసుదేవానందగిరి స్వామీజీ అనుగ్రహభాషణ చేశారు. అనంతరం రథోత్సవం నిర్వహించారు.

నేరస్తులు సత్ప్రవర్తనతో మెలగాలి



రౌడీషీటర్లకు కౌన్సెలింగ్ నిర్వహిస్తున్న ఏసీపీ రత్నరాజు

కృష్ణలంక(విజయవాడతూర్పు): నేర ప్రవృత్తిని విడనాడి సత్ప్రవర్తనతో మెలగాలని సౌత్ డివిజన్ ఏసీపీ జి.రత్నరాజు రౌడీషీటర్లు, సస్పెక్ట్ షీటర్లకు సూచించారు. కృష్ణలంక పోలీస్ స్టేషన్ ఆవరణలో స్టేషన్ పరిధిలోని రౌడీషీటర్లు, సస్పెక్ట్ షీటర్లకు సీఐ ఏ.మురళీకృష్ణతో కలిసి ఆయన ఆదివారం కౌన్సెలింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా రత్నరాజు మాట్లాడుతూ.. పోలీస్ రికార్డ్‌లో రౌడీషీటర్‌గా, సస్పెక్ట్‌గా నమోదైన ప్రతి ఒక్కరి కదలికలపై నిరంతరం నిఘా ఉంటుందన్నారు. నేరప్రవృత్తి మార్చుకోకపోయిన, చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడినా కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కళ్ల ముందు ఏ అన్యాయం జరిగినా వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని సూచించారు. సత్ప్రవర్తన కలిగి ఉండి ఏదో ఒక పని చేసుకుంటూ సమాజంలో కుటుంబంతో కలిసి సంతోషంగా జీవించాలన్నారు. ప్రతి ఆదివారం కౌన్సెలింగ్ తప్పనిసరిగా హాజరుకావాలని సూచించారు. కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

కూచిపూడి కళాకారిణికి వాషింగ్టన్ యూనివర్సిటీ డాక్టరేట్



లబ్బీపేట(విజయవాడతూర్పు): విజయవాడ నగరానికి చెందిన కూచిపూడి కళాకారిణి బి.స్వర్ణలతకు అమెరికాలోని జార్జ్ వాషింగ్టన్ యూనివర్సిటీ ఆఫ్ పీస్ నుంచి గౌరవ డాక్టరేట్ లభించింది. ఈ నెల 24న బెంగళూరులో జరిగిన అంతర్జాతీయ పీస్ కాన్ఫరెన్స్‌లో యూనివర్సిటీ పలు రంగాలకు చెందిన వారికి డాక్టరేట్‌లు ప్రదానం చేసింది. అందులో భాగంగా కూచిపూడి కళాకారిణి స్వర్ణలతకు డాక్టరేట్ ప్రధానం చేశారు. ఈ సందర్భంగా నీతి అయోగ్ ఐఈఎస్ సలహాదారు శివప్ప, సెక్రటరీ జనరల్ డాక్టర్ శ్రీనివాస్ ఏలూరి, ఆ యూనివర్సిటీ డైరెక్టర్ నీలమణి తదితరుల నుంచి డాక్టరేట్ అందుకున్నారు.

380 మందికి వైద్య పరీక్షలు

మధురానగర్(విజయవాడసెంట్రల్): వయోవృద్ధుల ఆరోగ్య పరిరక్షణే ధ్యేయంగా ఉచిత వైద్య పరీక్షలు నిర్వహించి అవసరమైన మందులు అందజేస్తున్నామని వయోవృద్ధ చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ డాక్టర్ చల్లా హరికుమార్ అన్నారు. దుర్గాపురం విజయ్ నర్సింగ్ స్కూల్‌లో ఆదివారం వయోవృద్ధ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యాన ఆరోగ్య అవగాహన, ఉచిత వైద్యశిబిరం జరిగింది. ఆయన మాట్లాడుతూ తాము దాతలు, ట్రస్ట్ సభ్యుల సహకారంతో ప్రముఖ అల్లోపతి, ఆయుర్వేదం, హోమియో వైద్య నిపుణులతో ఆరోగ్య విషయాలపై అవగాహన కల్పించటంతో పాటు అవసరమైన మందులు పంపిణీ చేస్తున్నామన్నారు. వయోవృద్ధులు ట్రస్ట్ సేవలను సద్వినియోగం చేసుకుని ఆరోగ్యకర జీవనం సాగించాలని సూచించారు.

కమనీయం శ్రీవారి మహా పుష్పయాగం

ముగిసిన బ్రహ్మోత్సవాలు



స్వామి వారి పుష్పయాగం

వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): వన్‌టౌన్‌లో కొలువై ఉన్న శ్రీ వేంకటేశ్వరస్వామి వారి మహాపుష్పయాగం ఆదివారం కమనీయంగా జరిగింది. బ్రాహ్మణవీధిలోని శ్రీ వేంకటేశ్వరస్వామి వారి దేవస్థానంలో జరుగుతున్న స్వామి వారి వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా చివరి రోజైన వివిధ రకాల సుగంధ పరిమళాలను వెదజల్లే పలు రకాల పుష్పాలతో కలియుగ దైవమైన శ్రీదేవి, భూదేవి సమేత శ్రీ వేంకటేశ్వరస్వామి వారికి అర్చకస్వాములు పుష్పయాగాన్ని నయనానందకరంగా నిర్వహించి భక్తులను తరింపజేశారు. గులాబీ, తులసీ, మల్లె, చామంతి వంటి విభిన్న జాతి పుష్పాలతో జరిగిన పుష్పయాగాన్ని తిలకించిన భక్తులు తన్మయులయ్యారు. ఉత్సవమూర్తులను పూర్తిగా పూలతో కప్పే విధంగా వందలాది కిలోల పుష్పాలతో ఈ యాగాన్ని నిర్వహించారు. అలంకార ప్రియుడైన నారాయణుడు ఈ సేవతో మరింత పులికించి భక్తులను అనుగ్రహిస్తాడని పండితులు తెలిపారు. వేద పఠనం, మేళతాళాలు, సంకీర్తనాగానాలు, మంత్రోచ్ఛరణలు, భక్తులు శ్రీహరి నామ స్మరణల మధ్య స్వామి వారి పుష్పయాగం జరిగింది. ప్రముఖ ఆగమ పండితులు ఆధ్వర్యంలో ప్రధానార్చకులు పాణింగిపల్లి శ్రీరామచంద్రమూర్తి పుష్పయాగాన్ని శాస్త్రోక్తంగా నిర్వహించారు.

ఘనంగా తిరుమంజనం

ఉత్సవాల్లో భాగంగా ఉదయం స్వామివారికి తిరుమంజన సేవను అత్యంత ఘనంగా నిర్వహించారు. పంచామృతాలు, చందనం వంటి సుగంధ పరిమళ ద్రవ్యాలతో శ్రీదేవి, భూదేవి సమేత శ్రీ వేంకటేశ్వరస్వామి వారికి అభిషేకించిన అర్చక స్వాములు పలు ప్రత్యేక పూజలను నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ ఈఓ, చైర్మన్లు స్వామివారికి పట్టు వస్త్రాలను సమర్పించారు. అనంతరం స్వామివారికి ప్రత్యేక పూజలను నిర్వహించారు. శాశ్వత బ్రహ్మోత్సవ ఉభయ దాతలను, ఉత్సవాలకు సహకరించిన దాతలను సత్కరించారు.

వైభవంగా ద్వాదశ ప్రదక్షిణలు

స్వామివారి బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఆదివారం రాత్రి ఆలయ ప్రాంగణంలో స్వామి వారి ద్వాదశ ప్రదక్షిణలు, పవళింపు సేవ తదితర కార్యక్రమాలను శాస్త్రోక్తంగా నిర్వహించారు. ఉత్సవ మూర్తులను ప్రత్యేక పల్లకీపై అధిష్ఠింపజేసి వివిధ రకాల సేవలతో 12 మార్లు ఆలయంలో ప్రదక్షిణలను నిర్వహించారు. మధ్యాహ్నం వేలాది మంది భక్తులకు అన్నదానం చేశారు. ఈ సందర్భంగా ఉత్సవాలకు సహకరించిన అందరికీ ఆలయ ఈఓ ఘంటసాల శ్రీనివాసరావు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమాలను ఆలయ చైర్మన్ గుడిపాటి పాపారావు పర్యవేక్షించారు.

ఘనంగా లార్డ్ బాడెన్ పావెల్ జయంతి



నివాళులర్పిస్తున్న రాజారావు, వర కుమార్, విద్యార్థులు

భవానీపురం(విజయవాడపశ్చిమ): భారత్ స్కౌట్స్ అండ్ గైడ్స్ వ్యవస్థాపకుడు లార్డ్ బాడెన్ పావెల్ జయంతిని పురస్కరించుకుని విద్యాధరపురంలోని బెజవాడ రాజారావు హైస్కూల్‌లో స్కౌట్స్ – గైడ్స్ విద్యార్థులతో ఆల్ ఫెయిత్ ప్రేయర్(సర్వమత ప్రార్థన)ను స్కౌట్స్ ఉపాధ్యాయులు బీఎస్ వరప్రసాద్ చేయించారు. ఈ సందర్భంగా పాఠశాల కరస్పాండెంట్ బెజవాడ రాజారావు మాట్లాడుతూ.. ప్రపంచ వ్యాప్తంగా స్కౌట్స్ అండ్ గైడ్స్ ఉద్యమానికి ఆద్యుడు బాడెన్ పావెల్ చిరస్మరణీయుడన్నారు. బాల బాలికల్లో దేశభక్తిని పెంపొందించి వారిని సమాజ సేవకులుగా తీర్చిదిద్దటానికి ప్రారంభించబడినదే స్కౌట్స్ అండ్ గైడ్స్ ఉద్యమం అని తెలిపారు. ఇందులో బాలుర బృందాలను స్కౌట్స్ అని, బాలికల బృందాలను గైడ్స్ అని అంటారన్నారు. అత్యవసర సమయాల్లో స్కౌట్స్ అండ్ గైడ్స్ విద్యార్థులు రంగంలోకి దిగి సేవలు అందించాలని సూచించారు. కార్యక్రమంలో భాగంగా బాడెన్ పావెల్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు.

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం

గన్నవరం: స్థానిక జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాల 1984–85 బ్యాచ్ పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం ఆదివారం కేసరపల్లిలోని జాస్తి చంద్రమౌళి సదన్‌లో ఉత్సాహంగా జరిగింది. పాఠశాలలో పదో తరగతి పూర్తి చేసిన పూర్వ విద్యార్థులందరూ 40 ఏళ్ల తర్వాత ఒకే వేదికపై తిరిగి కలుసుకున్నారు. పాఠశాల జ్ఞాపకాలు, విద్యాబుద్ధులు నేర్పిన గురువులతో ఉన్న అనుబంధాన్ని నెమరువేసుకున్నారు. ఆత్మీయ సమ్మేళనానికి దేశ, విదేశాల్లో స్థిరపడిన మిత్రులందరూ హాజరుకావడం సంతోషకరమన్నారు. ప్రతి ఏటా ఆత్మీయ సమ్మేళనం జరపాలని నిర్ణయించారు.

వైఎస్సార్ సీపీతోనే సంక్షేమ పాలన సాధ్యం



కరపత్రాలు అందజేస్తున్న దేవినేని క్రాంతి, ప్రవల్లిక

గుణదల(విజయవాడతూర్పు): వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీతోనే ప్రజలకు సంక్షేమ పాలన సాధ్యమవుతుందని వైఎస్సార్ సీపీ తూర్పు ఇన్‌చార్జి దేవినేని అవినాష్ సోదరి దేవినేని క్రాంతి అన్నారు. గుణదల 3వ డివిజన్ పరిధిలోని ఎస్సీ ఏరియాలో గడప గడప మీ అవినాష్ అన్న హామీ కార్యక్రమం ఆదివారం జరిగింది. కార్యక్రమంలో భాగంగా ఆమె ఇంటింటికీ వెళ్లి స్థానికులను కలుసుకున్నారు. ఆమె మాట్లాడుతూ.. కుల మతాలకు అతీతంగా సంక్షేమ పథకాలు అమలు చేయడంలో సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సఫలీకృతమయ్యారని తెలిపారు. అర్హులైన పేదలందరికీ సంక్షేమ ఫలాలు అందుతున్నాయని పేర్కొన్నారు. రాష్ట్రంలో అన్ని వర్గాల ప్రజలు లబ్ధి పొందుతున్నారన్నారు. సీఎం వైఎస్ జగన్ స్ఫూర్తితో దేవినేని అవినాష్ తూర్పు నియోజకవర్గంలో అనేక అభివృద్ధి కార్యక్రమాలు పూర్తి చేశారని తెలిపారు. అన్ని డివిజన్లలో తాగునీరు, విద్యుత్, రోడ్లు, డ్రెయినేజీ వ్యవస్థలతో పాటు మౌలిక వసతులు కల్పించామన్నారు. మరుగున పడిన వీఎంసీ స్థలాలను సుందరమైన పార్కులుగా తీర్చిదిద్దామని గుర్తు చేశారు. ఈ సంక్షేమాభివృద్ధి కొనసాగాలంటే వచ్చే ఎన్నికల్లో వైఎస్సార్ సీపీని గెలిపించుకోవాలని పిలుపునిచ్చారు. తూర్పులో దేవినేని అవినాష్‌ను గెలిపించడం ద్వారా నియోజకవర్గం మరింత అభివృద్ధి సాధిస్తుందని చెప్పారు. అనంతరం జరిగిన కార్యక్రమంలో ఇంటింటికీ వెళ్లి కరపత్రాలను అందజేశారు. కార్యక్రమంలో డెప్యూటీ మేయర్ బెల్లం దుర్గ, 3వ డివిజన్ కార్పొరేటర్ భీమిశెట్టి ప్రవల్లిక, నాయకులు భీమిశెట్టి బాబురావు, నాని, డేవిడ్ రాజు తదితరులు పాల్గొన్నారు.

సాక్షి ప్రాఫిట్ ప్లస్
సోమవారం
26-2-2024

స్టాక్ మార్కెట్లు (శుక్రవారం ముగింపు)

దేశీ సూచీలు

సూచీ	మార్పు	ముగింపు
సెన్సెక్స్ ▽	15	73,143
నిఫ్టీ ▽	5	22,213

మరిన్ని బిజినెస్ వార్తల కోసం 'సాక్షి ప్లస్' చూడండి

విదేశీ సూచీలు

సూచీ	ముగింపు		మార్పు
నాస్‌డాక్	15,997	▽	45
డోజోన్స్	39,132	△	62
ఎఫ్‌టీఎస్‌ఈ 100	7,706	▽	22
డాక్స్	17,419	△	49
షాంఘై	3,005	△	17
నికాయ్	39,099	△	836

అమెరికా • బ్రిటన్ • జర్మనీ • చైనా • జపాన్

ఫారెక్స్ రేట్లు రూ. లలో

	కరెన్సీ	కొనుగోలు	అమ్మకం
$	యూఎస్ డాలర్	81.31	84.06
£	బ్రిటన్ పౌండ్	102.90	107.47
€	యూరో	87.78	90.86
¥	జపాన్ ఎన్ (100)	45.00	66.00
AU$	ఆస్ట్రేలియా డాలర్	52.35	56.06
S$	సింగపూర్ డాలర్	59.59	63.82
SAR	సౌదీ రియాల్	21.21	22.78
UAE D	యూఏఈ దిర్హామ్	21.69	23.47
¥	చైనా యువాన్	10.39	12.39




మీరూ ఓ యూట్యూబర్..!
- అభిరుచులకు అనుగుణంగా చానల్
- స్మార్ట్‌ఫోన్ సాయంతో ప్రారంభించొచ్చు
- వీక్షకులకు నచ్చితే చక్కని ఆదాయం
- ఉద్యోగం లేదా వ్యాపారం చేస్తూనే నిర్వహణ
- వారానికి ఒక్క వీడియో అయినా సరే
- మంచి మార్కెటింగ్ సాధనం

మీకు మీరే బాస్

ఒక్క వీడియో వైరల్‌గా మారినా.. లక్షలాది రూపాయలు వచ్చి బ్యాంక్ ఖాతాలో జమ అవుతాయి. యూజర్లు నచ్చే, మెచ్చే అలాంటి వీడియోలను మరిన్ని అందిస్తూ వెళితే మంచి పేరు, గుర్తింపు, ఐశ్వర్యం సంపాదించుకోవచ్చు. ఇదంతా యూట్యూబ్ ప్రపంచం గురించే. నేడు వయసుతో సంబంధం లేకుండా యూట్యూబర్ కావాలనే అభిలాష చాలామందిలో కనిపిస్తోంది. యూట్యూబ్ కంటెంట్ ద్వారా దండిగా ఆదాయాన్ని సంపాదించుకోవాలన్న కాంక్ష కూడా కనిపిస్తోంది. కానీ ఎలా..?

ఎలాంటి సందేహం వచ్చినా, ఆరోగ్యం లేదా ఆహారం, విద్య, వృత్తి, వినోదం, విహారం, యోగాభ్యాసం ఇలా అన్నింటికీ చిరునామాగా యూట్యూబ్ మారిపోయింది. ఎలాంటి సమాచారం కావాలన్నా కళ్ల ముందుంచుతుంది. వీక్షకులకు కావాల్సినంత సమాచారం, వినోదం. పంచే వారికి పండంటి ఆదాయం. ప్రపంచవ్యాప్తంగా 27 శాతం మంది ఇంటర్నెట్ యూజర్లు 2023లో వారంలో 17 గంటల చొప్పున వీడియోలను వీక్షించినట్టు గణాంకాలు చెబుతున్నాయి. నేడు ఎక్కువ మంది సమాచారాన్ని వీడియోల రూపంలోనే పొందుతున్నారు. కనుక యూట్యూబ్ వినోదం లేదా సమాచార వేదికగానే మిగిలిపోవడం లేదు. ఉపాధిని వెతుక్కునే అవకాశాలకు చిరునామాగా మారిపోయింది. ప్రతి నెలా రూ.లక్షలాది రూపాయలు సంపాదించే తెలుగు యూట్యూబర్లు ఎందరో ఉన్నారు. అలాంటి వారిలో ఒకరిగా చేరిపోవాలంటే..?

ఏమి కావాలి..?



ఎలాంటి పెట్టుబడి లేకుండా యూట్యూబ్ చానల్ ఆరంభించడం చాలా మందిని ఆకర్షిస్తున్న అంశం. ఓ మంచి ఫోన్, ల్యాప్‌టాప్, వీడియో ఎడిటింగ్ టూల్ (ఉచిత), రూ.150 పెట్టుబడితో వచ్చే మైక్ ఉంటే చాలు. ఇక్కడ ధన పరమైన పెట్టుబడి పెద్దగా అవసరం లేదు. ప్రయత్నం, కృషి, అంకిత భావం వంటి వనరులు కావాలి. వీలైనంత సమయాన్ని వెచ్చించాలి. ''నేను నా కుటుంబంతో గడిపే దానికంటే పది రెట్లు అధిక సమయాన్ని యూట్యూబ్ కోసం ఆరంభంలో వెచ్చించాల్సి వచ్చేది. వీడియో చేయాలంటే అందుకు సంబంధించిన కంటెంట్ (సమాచారం) సిద్ధం చేసుకోవాలి. దాన్ని అర్థం చేసుకోవాలి. తర్వాత వీడియో షూట్ చేసి, ఎడిటింగ్ అనంతరం పబ్లిష్ చేయాలి. ఇందుకు ఎంతో సమయం పట్టేది. ప్రతిరోజూ ఒక వీడియో అంటే అది అసాధ్యం. దీనికంటే వారానికి రెండు, మూడు వీడియోలకు కుదించుకోవడం మంచిది. ప్రతి సోమవారం, శుక్రవారం సాయంత్రం నిర్దిష్ట సమయంలో వీడియోలను అప్‌లోడ్ చేయడం వల్ల యూజర్లకు మరింత చేరువ కావచ్చు''అని యూట్యూబర్ రతీష్ ('రతీష్‌ఆర్‌మీనన్') తెలిపారు. వ్యక్తిగతంగా ఒక నెలలో 8 వీడియోలకు మించి చేయడానికి సమయం సరిపోదన్నది అతడి అభిప్రాయం. బాగా పాపులర్ అయి, సబ్‌స్క్రయిబర్లు మిలియన్ దాటిపోతే, అప్పుడు సహాయకులను పెట్టుకుని పూర్తి స్థాయి యూట్యూబర్‌గా మరిన్ని వీడియోలు చేయడాన్ని పరిశీలించొచ్చు. కానీ, ఆరంభంలో పరిమాణం కాకుండా, నాణ్యతకు పెద్దపీట వేయాలి. యూజర్లతో బలమైన బాండింగ్ అవసరం.

ఎలా పని చేస్తుంది..?



యూట్యూబ్‌లో వీడియోలను పోస్ట్ చేయాలంటే అందుకు సంబంధించి నియమ, నిబంధనలు తెలిసి ఉండాలి. అశ్లీల, హానికారక, తప్పుదోవ పట్టించే, అవాస్తవ, కల్పిత సమాచారాన్ని వ్యాప్తి చేయకూడదు. చట్టబద్ధంగా వ్యవహరించాలి. వీడియోలు పోస్ట్ చేసే విషయంలో పరిమితి లేదు. వాటిపై ఆదాయం కోరుకునేట్టు అయితే యూట్యూబ్ పార్ట్‌నర్ ప్రోగ్రామ్ (వైపీపీ) కింద రిజిస్టర్ చేసుకోవాల్సి ఉంటుంది. మానిటైజేషన్ ప్రోగ్రామ్‌ను ఎంపిక చేసుకోవాలి. యూట్యూబ్ చానల్‌కు ఎంత మంది సబ్‌స్క్రయిబర్లు (సభ్యులు) ఉన్నారనేది ఇక్కడ కీలకం అవుతుంది. ఒకరు ఎంపిక చేసుకున్న ప్రోగ్రామ్ మాడ్యూల్ ఆధారంగా ఆర్జించే మొత్తం ఆధారపడి ఉంటుంది. ''ఆవిష్కరణలకు యూట్యూబ్ మద్దతు పలుకుతుంది. సృజనాత్మకత ఎలా ఉన్నా సరే దాన్ని యూజర్లకు చేరువ చేసి వారికి తగిన ప్రతిఫలం అందించడమే మా లక్ష్యం. భారత్‌లో 2008లో పార్ట్‌నర్ (భాగస్వామి) కార్యక్రమాన్ని ప్రారంభించాం. వీడియో క్రియేటర్లు కంటెంట్ ద్వారా ఆర్జించడం మొదలైంది. క్రియేటర్ల విజయంపైనే ప్రకటనల ఆదాయం ముడిపడి ఉంటుంది''అని యూట్యూబ్ ఇండియా డైరెక్టర్ ఇషాన్ జాన్ ఛటర్జీ వివరించారు.

ఆరంభం ఇలా..



- 18 ఏళ్లు నిండి, భారత్‌లో నివసించే స్థానికులు ఎవరైనా యూట్యూబ్ పార్ట్‌నర్ ప్రోగ్రామ్ (వైపీపీ)లో నమోదుకు అర్హులే. చానల్ ప్రారంభించి వీడియోల పోస్టింగ్ అనంతరం ఆదాయాన్ని సంపాదించుకోవచ్చు.
- వైపీపీలో చేరాలంటే కనీస చందాదారులను సంపాదించి ఉండాలి. 'నోటిఫై మీ వెన్ ఐ యామ్ ఎలిజిబుల్' నోటిఫికేషన్ అలర్ట్ పెట్టుకుంటే చాలు. మీ చానల్‌కు అర్హత లభించిన వెంటనే యూట్యూబ్ నుంచి ఆహ్వానం వస్తుంది.
- ఒక్కసారి మీ చానల్ వైపీపీ కోసం ఎంపిక అయిందంటే అప్పుడు నియమ, నిబంధనలకు అంగీకరిస్తూ, మానిటైజేషన్ ఫీచర్లను ఎంపిక చేసుకోవాల్సి ఉంటుంది.



చానల్ సక్సెస్ కోసం..?



ఏదైనా ఒక రంగం/విభాగం/సబ్జెక్ట్/కళలో నైపుణ్యాలు ఉంటే, దాన్ని యూజర్లకు అందించొచ్చు. మంచి సృజనాత్మకత ఉండాలి. లేదా సాధారణ విషయాలను సైతం కళాత్మకంగా పంచుకునే నైపుణ్యాలు కావాలి. విలువైన, ఉపయోగకరమైన కంటెంట్‌తో వీడియోలు పోస్ట్ చేయడమే కాదు.. వినూత్నంగా ఉండేలా చూసుకోవాలి. మీ ఛానల్ నుంచి కొత్త వీడియోలు ఎప్పుడు పోస్ట్ అవుతాయనే స్పష్టత యూజర్లలో ఉండాలి. రోజుకు ఒకటా? వారానికి ఒకటా లేదా రెండా..? ఏ సమయంలో వస్తుందనే స్పష్టత ఇవ్వాలి. వీడియోలను పోస్ట్ చేసిన తర్వాత వీక్షకులతో అనుసంధానం కావాలి. వీలైతే కామెంట్లను చదివి, వారి అభిప్రాయాలు అర్థం చేసుకోవడం, వారికి నచ్చేలా కంటెంట్‌ను అందించడంపై దృష్టి పెట్టాలి. వీలు చేసుకుని సబ్‌స్క్రయిబర్లతో చాట్, సమావేశం ఏర్పాటు చేసుకోవాలి. దీనివల్ల బాండింగ్, బ్రాండింగ్ పెరుగుతుంది. అనలైసిస్ టూల్ వాడుకోవాలి. ఆరంభంలో ప్రయోగాలకు వెనుకాడకూడదు. సమయం చాలడం లేదని నాణ్యతలో రాజీపడకూడదు. మరింత మంది యూజర్లను చేరుకునేందుకు, అప్పటికే పాపులర్ అయిన యూట్యూబర్ల సాయం తీసుకోవచ్చు. యూజర్లను పెంచుకునే విషయంలో యూట్యూబ్ సైతం కావాల్సినంత సహకారం, మద్దతును అందిస్తుంది. యూజర్లకు చేరువ అయితే, ఆదాయం అదే వస్తుంది.

ఆదాయం ఏ రూపంలో..?



యూట్యూబ్‌లో కొత్తగా చేరిన వారు ఫ్యాన్ ఫండింగ్ ఫీచర్ ద్వారా ఆదాయాన్ని పొందొచ్చు. చానల్ సభ్యులు నెలవారీగా చెల్లించే మొత్తం నుంచి కొంత యూట్యూబ్ పంచుతుంది. సూపర్ చాట్, సూపర్ స్టికర్స్ కోసం సభ్యులు చెల్లింపులు చేస్తారు. బిట్స్ పిలానీ పూర్వ విద్యార్థి మన్‌దీప్ సింగ్ 2021లో 'డేటాసైన్స్‌డైరీస్' పేరుతో యూట్యూబ్ చానల్ తెరిచాడు. కృత్రిమ మేధకు సంబంధించి కంటెంట్‌ను ఇది అందిస్తుంటుంది. చందాదారులు కేవలం 1,500 మందే ఉన్నారు. దీంతో ఫ్యాన్ ఫండింగ్ ఫీచర్ ద్వారా ప్రతి నెలా కొన్ని వేల రూపాయల చొప్పున ఆదాయం సంపాదించే వాడు. అదే ఫ్రీలాన్స్ వెబ్ డిజైనర్ రతీష్ ఆర్ మీనన్ 'రతీష్‌ఆర్ మీనన్' పేరుతో 2012 నుంచి చానల్ నడుపుతుండగా, ప్రస్తుతం చందాదారులు 11.2 లక్షలకు చేరుకున్నారు. మూడు మార్గాల ద్వారా అతడికి ఆదాయం వస్తోంది. యూట్యూబ్ ప్రకటనల ఆదాయంతోపాటు, స్పాన్సర్డ్ ప్రకటనలు, అఫిలియేట్ మార్కెటింగ్ కమీషన్ ద్వారా ఆదాయం వస్తోంది. ఇందులో యూట్యూబ్ ప్రకటనల ఆదాయం ఒక్కటే నేరుగా యూట్యూబ్ నుంచి వచ్చేది. మిగిలిన రెండూ థర్డ్ పార్టీల రూపంలో వస్తుంది. స్పాన్సర్డ్ ప్రకటనలకు సంబంధించి కంపెనీలు, బ్రాండ్లతో నేరుగా సంప్రదింపులు నిర్వహించుకోవచ్చు. ఇక అఫిలియేట్ మార్కెటింగ్ అంటే.. చానల్ డిస్క్రిప్షన్ లింక్ ద్వారా ఎవరైనా ఉత్పత్తిని కొనుగోలు చేస్తే వచ్చే ఆదాయం. ఉదాహరణకుఒక ఉత్పత్తికి సంబంధించిన యూఆర్‌ఎల్ లింక్‌ను వీడియో డిస్క్రిప్షన్‌లో ఉంచడం. ఎవరైనా యూజర్ ఆ లింక్‌ను క్లిక్ చేసి, సంబంధిత ఉత్పత్తి కొనుగోలు చేస్తే, దానిపై 2–5 శాతం కమీషన్‌గా లభిస్తుంది. ఫ్యాన్ ఫండింగ్ ఫీచర్‌లో తనకు వచ్చే ఆదాయం నుంచి 70 శాతాన్ని యూట్యూబ్ చెల్లిస్తుంది. షార్ట్‌లకు సంబంధించి వ్యూస్ ఆధారంగా (ఎంత మంది వీక్షించారు) ఆదాయంలో 45 శాతాన్ని చెల్లిస్తుంది. వీడియోల్లో ప్రదర్శించే ప్రకటనల రూపంలో వచ్చే ఆదాయంలో 55 శాతాన్ని చెల్లిస్తుంది. యూట్యూబ్‌కు ప్రీమియం మెంబర్‌షిప్ ద్వారా కూడా ఆదాయం వస్తుంటుంది. ఈ ఆదాయంలోనూ కొంత వాటాను.. ఛానల్ కంటెంట్‌ను ఏ మేరకు యూజర్లు చూశారనే దాని ఆధారంగా యూట్యూబర్‌కు పంచుతుంది.



తమ కంటెంట్‌కు ప్రపంచవ్యాప్త వీక్షకులు యూట్యూబ్ వల్లే సాధ్యమైనట్టు మెజారిటీ యూట్యూబర్లు అంగీకరిస్తున్నారు. కంటెంట్ ద్వారా ఆదాయాన్ని పొందే అవకాశం లభించినట్టు 80 శాతం మంది చెబుతున్నారు. ఇతర వృత్తి, ఉద్యోగాన్ని విడిచి పెట్టేసి యూట్యూబ్‌ను ప్రధాన ఆదాయ మార్గంగా చేసుకుందామని అనుకుంటున్నారా..? ఆచరణలో అదంత సులభమైన పని కాదు. యూట్యూబ్ ప్రపంచంలో ప్యాసివ్ ఆదాయం కోసం (రెండో ఆదాయ మార్గం) చానళ్లను నడిపిస్తున్న వారే ఎక్కువగా ఉంటున్నారు. తమ కంటెంట్‌కు ఆదరణ వస్తూ, ఆదాయం పెరిగిన తర్వాత, పూర్తి స్థాయిలో యూట్యూబర్‌గా మారుతున్నారు. కనుక ప్రస్తుతం చేస్తున్న వృత్తి లేదా వ్యాపారం లేదా జాబ్ కొనసాగిస్తూనే.. తమకున్న ప్రత్యేక నైపుణ్యాల ఆధారంగా యూట్యూబ్ ఛానల్‌ను ఆరంభించి, ఖాళీ సమయాన్ని కంటెంట్ క్రియేషన్‌పై వెచ్చించడం మంచి ఆలోచన అవుతుంది. యూజర్లను ఎలా ఆకర్షించాలి, ఆదాయం ఎలా పెంచుకోవాలి? తదితర విషయాలన్నీ తెలియడానికి కొంత వ్యవధి తీసుకుంటుంది. కనుక అప్పటి వరకు ఇతర ఆదాయ మార్గాలను ఎందుకు

రెగ్యులర్ ఆదాయానికి ప్రత్యామ్నాయమా..?

కాదనుకోవాలి. ఒకవైపు వృత్తి లేదా ఉద్యోగం చేస్తూ, మరోవైపు యూట్యూబ్ వీడియోల కోసం కావాల్సినంత సమయాన్ని వెచ్చించడం కూడా కష్టమైన టాస్కే. అందుకే ఆరంభంలో కాస్తంత సమతుల్యం చేసుకుని, ఆ తర్వాత ప్రణాళిక ప్రకారం ముందుకు వెళ్లాలి. సమయాన్ని పొదుపుగా వినియోగించుకున్న వారికే ఇది సాధ్యపడుతుంది. అసలు వీలు చేసుకోవడమే పెద్ద సమస్య అని కార్పొరేట్ ట్రైనర్ అయిన నిధి సైని పేర్కొన్నారు. 'నిధిసైని2808' పేరుతో ఆమె 2020లో యూట్యూబ్ చానల్ ప్రారంభించింది. 2,690 మంది యూజర్లే ఉన్నారు. అయినా కానీ తన చానల్‌ను మానిటైజ్ (ఆదాయం పొందడం) చేసుకోలేదు. కంటెంట్‌ను అందించేందుకు తగినంత సమయాన్ని వెచ్చించలేనన్నది ఆమె అభిప్రాయం. కనీసం 1,000 మంది సబ్‌స్క్రయిబర్లు, 4,000 గంటల వాచ్ అవర్స్ (గడిచిన ఏడాది కాలంలో) ఉంటే ఆదాయం పొందడానికి మార్గం ఏర్పడినట్టేనని రతీష్ అంటున్నారు. యూట్యూబ్ ప్రపంచంలో స్వల్ప మొత్తాన్ని ఆర్జించే వారే ఎక్కువ. యూట్యూబ్‌నే ప్రధాన వృత్తిగా మలుచుకుని, కావాల్సినంత ఆదాయం సంపాదించే వారు తక్కువ. యూట్యూబ్ ఛానల్ ఆరంభించి వీడియోలు పోస్ట్ చేసిన వెంటనే ఆదాయం మొదలు కాదు. ఎంత మంది చూశారు? ఎన్ని గంటల పాటు చూశారు? తదితర పారామీటర్ల ఆధారంగా ఆదాయం మొదలు కావడానికి సమయం తీసుకోవచ్చు. రతీష్‌ఆర్‌మీనన్ 2011లో చానల్ ప్రారంభించగా, నెల రోజుల్లోనే అతడికి ఆదాయం రావడం మొదలైంది. కాకపోతే అప్పట్లో నిబంధనలు ఇప్పటి మాదిరి కఠినంగా లేవు. 2014లో తన చానల్‌ను రీబ్రాండింగ్ చేసుకోగా, ఏడాదిన్నర క్రితమే ఒక మిలియన్ సబ్‌స్క్రయిబర్ల మార్క్ దాటింది. టెక్ వీడియోలు అప్‌లోడ్ చేసే రతీష్, ట్రావెల్ వీడియోలను కూడా పోస్ట్ చేసే యోచనలో ఉన్నారు. ఒక వీడియోకి 20,000 వీక్షణలు ఉంటే, టెక్ క్రియేటర్లకు నెలవారీ 500 డాలర్ల వరకు ఆదాయం (రూ.41,000) ప్రకటనల రూపంలో వస్తుందని చెప్పారు. అదే ఎంటర్‌టైన్‌మెంట్ చానల్ అయి, ఒక మిలియన్ వ్యూస్ ఉంటే నెలవారీ ఆదాయం రూ.2–3 లక్షల మధ్య ఉంటుందట.

ఏమిటి మార్గం..?



చానల్‌పై ఎంత సమయం వెచ్చించగలరనేది ముందుగా నిర్ణయించుకోవాలి. తమ పరిమితులు తెలుసుకోవాలి. మరిన్ని వీడియోలు అందించే కొద్దీ ఆదాయం కూడా పెరుగుతుంది. ఎవరైనా యూట్యూబ్ ఛానల్ ప్రారంభించొచ్చు. కానీ, దాన్నే ప్రధాన ఆదాయ మార్గంగా మార్చుకోవడానికి ఎంతో సహనం, సమయం కావాలి. పెట్టిన చానల్, పోస్ట్ చేసే వీడియోలు ఆదరణ సంపాదించలేకపోవచ్చు. సక్సెస్ అవ్వకపోయే అవకాశాలు కూడా ఉంటాయి. ఒకవేళ అనుకున్నట్టుగా ఫలితం రాకపోతే, అప్పుడు ప్లాన్ బీ కూడా ఉండాలి. యూట్యూబ్‌లో వీడియోలు పోస్ట్ చేయడం ఆపివేసిన వెంటనే, ఆదాయ మార్గం తప్పకుండా ఉండేలా చర్యలు తీసుకోవాలి. సంప్రదాయ వ్యాపారస్థులు కస్టమర్లను చేరుకునేందుకు యూట్యూబ్ ఛానళ్లను వినియోగించుకుంటున్నారు. తమ ఉత్పత్తులకు సంబంధించిన వీడియోలతో కస్టమర్లకు చేరువ అవుతున్నారు. సంగీతం, ఇతర కళల్లో పట్టున్న వారు యూట్యూబ్ చానళ్ల తెరిచి యూట్యూబ్ సాయంతో అభిమానులను పెంచుకుంటున్నారు. ఫలానా అనే కాకుండా, ప్రస్తుత మీ ఉపాధి, వృత్తి నైపుణ్యాలను విస్తరించుకునేందుకు సైతం యూట్యూబ్‌ను వేదికగా చేసుకోవచ్చు.

ఐసీఐసీఐ ప్రూ గోల్డ్ పెన్షన్ సేవింగ్స్

ఐసీఐసీఐ ప్రుడెన్షియల్ లైఫ్ ఇన్సూరెన్స్ రిటైర్‌మెంట్ సేవింగ్స్ ఉత్పాదన ఐసీఐసీఐ ప్రూ గోల్డ్ పెన్షన్ సేవింగ్స్‌ను ప్రవేశపెట్టింది. మెచ్యూరిటీ నాటికి సేకరించిన పొదుపులో 60% వరకు పన్ను రహిత మొత్తం ఉపసంహరించుకునే అవకాశం ఉంది.

ఎడెల్‌విస్ టోకియో లైఫ్ నుంచి లెగసీ ప్లస్ ప్లాన్

ఎడెల్‌విస్ టోకియో లైఫ్ ఇన్సూరెన్స్ సంస్థ తాజాగా లెగసీ ప్లస్ పాలసీని ప్రవేశపెట్టింది. ఒకే పథకం ద్వారా ఇద్దరికి లైఫ్ కవరేజీ, 3 తరాలకు ఆదాయాన్ని ఇచ్చేలా వినూత్నంగా ఈ పథకం ఉంటుందని సంస్థ తెలిపింది. పాలసీదారు లేదా కుటుంబ ఆర్థిక అవసరాలను బట్టి పోగుపడిన నిధి నుంచి పాక్షికంగా విత్‌డ్రా చేసుకోవచ్చు. అలాగే ఎర్లీ ఇన్‌కమ్ ఆప్షన్ కింద పాలసీ తీసుకున్న తొలి ఏడాది నుంచే పాలసీదారు ఆదాయాన్ని అందుకోవచ్చు.

కోడిగుడ్లు (హోల్‌సేల్-నెక్ / 100కు రూ.లలో)

26-2-2024	
విశాఖ	500–00
చిత్తూరు	568–00
ఈస్ట్, వెస్ట్ గోదావరి	490–00
విజయవాడ	490–00
రిటైల్ ధర (డజను)	72.00
25-2-2024 ఫామ్ ధర...	
హైదరాబాద్	500–00
వరంగల్	502–00
రిటైల్ ధర	5.60

సాక్షి స్టాక్స్

భారతీ ఎయిర్‌టెల్ — రెలిగేర్ బ్రోకింగ్ — కొనొచ్చు

ప్రస్తుత ధర: రూ. 1,127 **టార్గెట్:** రూ. 1,366

ఎందుకంటే: మొబైల్ టెలికం దిగ్గజం భారతీ ఎయిర్‌టెల్ ఈ ఏడాది అక్టోబర్–డిసెంబర్(క్యూ3)లో ఆసక్తికర ఫలితాలు సాధించింది. మొత్తం ఆదాయం వార్షికంగా 6 శాతం స్వల్ప వృద్ధితో రూ. 37,900 కోట్లను తాకింది. ఇందుకు ప్రధానంగా దేశీ బిజినెస్ సహకరించింది. దేశీ మొబైల్ సర్వీసుల విభాగం 12 శాతం ఎగసి ఆదాయంలో 57 శాతం వాటాను ఆక్రమించింది. అయితే ఆఫ్రికా మొబైల్ సర్వీసుల టర్నోవర్ 7 శాతం క్షీణించి ఆదాయంలో 27 శాతం వాటాకు పరిమితమైంది. మిగిలిన 16 శాతం ఆదాయం మొబైలేతర బిజినెస్ నుంచి లభించింది. నిర్వహణ లాభం తదుపరి 54 శాతం జంప్‌చేసి రూ. 2,442 కోట్లకు చేరింది. కస్టమర్లను



జత చేసుకోవడంలో నెమ్మదించినప్పటికీ దేశీయంగా ఒక్కో వినియోగదారుపై సగటు ఆదాయం(ఏఆర్‌పీయూ) పెంచుకుంటూ వస్తోంది. నాణ్యతగల కస్టమర్లపై దృష్టిపెట్టడంతో పాటు వినియోగదారుల సంఖ్యను నిలుపుకుంటూ రావడం ఇందుకు తోడ్పాడునిస్తోంది. వివిధ ప్రాంతాలలో దశలవారీగా 5జీ మౌలిక సదుపాయాలను అభివృద్ధి చేసుకుంటూ వస్తోంది. ఈ బాటలో కస్టమర్లను పెంచుకోవడంతోపాటు ఏఆర్‌పీయూను మెరుగుపరచుకునేందుకు 60,000కుపైగా గ్రామాలను లక్ష్యంగా చేసుకుని ముందుకు సాగుతోంది. పోస్ట్‌పెయిడ్ బిజినెస్‌కు వ్యూహాత్మక ప్రాధాన్యతను ఇస్తోంది.

ప్రైకోల్ — ఎమ్‌కే గ్లోబల్ — కొనొచ్చు

ప్రస్తుత ధర: రూ. 415 **టార్గెట్:** రూ. 525

ఎందుకంటే: ఆటో విడిభాగాల రంగంలో కార్యకలాపాలు విస్తరించిన ప్రైకోల్‌పట్ల సానుకూల అంచనాలున్నాయి. రానున్న మూడేళ్లలో షేరు ధర రెట్టింపయ్యేందుకు వీలున్నట్లు భావిస్తున్నాం. ఆదాయంలో 65 శాతం వాటాను ఆక్రమిస్తున్న డ్రైవర్ ఇన్ఫర్మేషన్ సిస్టమ్స్(డీఐఎస్) మార్కెట్లో పటిష్ట వాటాను కలిగి ఉంది. దేశ, విదేశాలలో కనిపిస్తున్న బలమైన డిజిటైజేషన్ ట్రెండ్(టీఎఫ్‌టీ స్క్రీన్ల వినియోగానికి ఊతం) కారణంగా కంపెనీకి భారీ అవకాశాలకు తెరలేవనుంది. ఇది లాభదాయకతను పెంచే వీలుండటంతో కంపెనీకి ఆకర్షణను తీసుకువస్తోంది. కంటెంట్ వాహన బిజినెస్‌లో అధిక వృద్ధిని ఊహిస్తూ మూడేళ్లలో ఆదాయంలో 22 శాతం, షేరువారీ ఆర్జన(ఈపీఎస్)లో 34 శాతం వృద్ధిని



అంచనా వేస్తున్నాం. నగదు నిల్వలు కలిగిన బ్యాలన్స్‌షీట్‌తో పాటు.. 25 శాతం రిటర్న్ రేషియోలు, మల్టీప్రొడక్టుల తయారీలోకి ప్రవేశం కంపెనీకి దీర్ఘకాలంలో లబ్ధిని చేకూర్చనున్నాయి. ఎలక్ట్రానిక్స్, సాఫ్ట్‌వేర్‌లో కంపెనీకున్న బలాలను వినియోగించుకుంటూ ఈకాక్‌పిట్, హెడ్సప్ డిస్‌ప్లేలు, టెలిమాటిక్స్, బీఎంఎస్‌సహా.. డిస్క్ బ్రేక్స్‌పైనా కన్నేసింది. నిజానికి ప్రస్తుతం అభివృద్ధి దశలో ఉన్న బీఎంఎస్, కనెక్టెడ్ సొల్యూషన్స్ తదితర ప్రొడక్టుల నుంచి లభించనున్న ఆదాయాలను మేము పరిగణనలోకి తీసుకోనేలేదు. ప్రస్తుతం వీటిని పలు ఆటో రంగ దిగ్గజాలతో పరీక్షిస్తోంది.

గమనిక: ఈ కాలమ్‌లో షేర్లపై ఇచ్చిన సలహాలు, సూచనలు, వివిధ బ్రోకరేజ్ సంస్థలు వ్యక్తం చేసిన అభిప్రాయాలు మాత్రమే

డైరెక్ట్ ప్లాన్లలో ఎస్‌డబ్ల్యూపీ, ఎస్‌టీపీ ఎలా..?

Q & A



ధీరేంద్ర కుమార్
సీఈవో, వ్యాల్యూ రీసెర్చ్



డైరెక్ట్ ప్లాన్లలో నేను ఇన్వెస్ట్ చేస్తే.. సిస్టమ్యాటిక్ ఇన్వెస్ట్‌మెంట్ ప్లాన్ (ఎస్‌డబ్ల్యూపీ), సిస్టమ్యాటిక్ ట్రాన్స్‌ఫర్ ప్లాన్ (ఎస్‌టీపీ)లను ఏర్పాటు చేసుకునే సేవలను ఫండ్ సంస్థ అందిస్తుందా?

– విజయ్ కుమార్

డైరెక్ట్ ప్లాన్లు అనేవి ఇన్వెస్టర్లు స్వయంగా నిర్వహించుకునేవి. డైరెక్ట్ ప్లాన్లకు సంబంధించి పెట్టుబడులు, ఇతర లావాదేవీలను ఇన్వెస్టర్ రెండు మూడు మార్గాల్లో నిర్వహించుకోవచ్చు. సిప్ లేదా ఎస్‌డబ్ల్యూపీ లేదా మరే ఇతర లావాదేవీ అయినా బ్రిక్స్ అండ్ మోర్టార్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్‌ను వినియోగించి చేసుకోవాలి. అంటే ఫండ్ హౌస్ రిజిస్ట్రార్ అండ్ ట్రాన్స్‌ఫర్ ఏజెంట్లు అయిన కేఫిన్‌టెక్, క్యామ్స్ ద్వారా ఈ లావాదేవీలు చేసుకోవచ్చు. సమీపంలోని ఇన్వెస్టర్ సర్వీస్ సెంటర్‌కు స్వయంగా వెళ్లి సిప్ లేదా ఎస్‌డబ్ల్యూపీ లేదా ఎస్‌టీపీ కోసం దరఖాస్తు చేసుకోవచ్చు. ఫండ్ హౌస్ వెబ్‌సైట్ నుంచి కూడా చేసుకోవచ్చు. కొన్ని ఆన్‌లైన్ ఇన్వెస్ట్‌మెంట్ ప్లాట్‌ఫామ్‌లు సైతం డైరెక్ట్ ప్లాన్లకు సంబంధించి ఈ సేవలు అందిస్తున్నాయి. ఈ సదుపాయాల ద్వారా ఇన్వెస్టర్లు సొంతంగా ఈ లావాదేవీలు చేసుకోవాల్సి ఉంటుంది. ఫండ్ హౌస్ సంస్థ నేరుగా సాయం అందించదు.

నేను కొన్ని సంవత్సరాలుగా మ్యూచువల్ ఫండ్ యుటిలిటీస్ అనే ప్లాట్‌ఫామ్‌ను ఇందుకోసం వినియోగిస్తున్నాను. ఇది ఎంతో సౌకర్యంగా ఉండడమే కాకుండా, మ్యూచువల్ ఫండ్స్‌లో లావాదేవీలను ఇబ్బందులు లేకుండా చేసుకోవచ్చు. నెట్ బ్యాంకింగ్ లావాదేవీల నిర్వహణ తెలిసిన అందరికీ ఈ ప్లాట్‌ఫామ్ ద్వారా మ్యూచువల్ ఫండ్స్ లావాదేవీల నిర్వహణ సౌకర్యంగానే ఉంటుంది. కాకపోతే మొదట కేవైసీ, ఇతర అవసరాలను ఇచ్చే సమయంలో కొంచెం ఇబ్బంది అనిపించొచ్చు. వీటిని సైతం ఇంటి నుంచే చేసుకునే సౌలభ్యం ఉంది. డైరెక్ట్ ప్లాన్లకు సంబంధించి సేవలను ఇన్వెస్టర్లు సులభంగా ఆన్‌లైన్ ద్వారా పొందొచ్చు.

నేను ఎన్‌పీఎస్ పథకంలో ఇన్వెస్ట్ చేస్తున్నాను. నా వయసు 54 ఏళ్లు. ఈక్విటీలకు 50 శాతం, ప్రభుత్వం బాండ్లకు 25 శాతం, కార్పొరేట్ బాండ్లకు 25 శాతం చొప్పున నా పెట్టుబడుల కేటాయింపులు (అస్సెట్ అలోకేషన్) ఉన్నాయి. ప్రస్తుత పరిస్థితుల్లో నా ప్రభుత్వ బాండ్ల పెట్టుబడులను 25 శాతం నుంచి 10 శాతానికి తగ్గించుకుని.. కార్పొరేట్ బాండ్లలో పెట్టుబడులను 40 శాతానికి పెంచుకోవడం సరైనదేనా..?

– మనోరంజన్

గిల్ట్ ఫండ్స్ లేదా ప్రభుత్వ బాండ్లలో అస్థిరతలు.. షార్ట్ డ్యూరేషన్ లేదా కార్పొరేట్ బాండ్ ఫండ్స్‌తో పోలిస్తే సహజంగా ఎక్కువే. ఎందుకంటే గిల్ట్ ఫండ్స్ అన్నవి ప్రధానంగా మధ్య కాలం నుంచి దీర్ఘ కాల వ్యవధితో కూడిన ప్రభుత్వ బాండ్లలో ఇన్వెస్ట్ చేస్తుంటాయి. ఇవి వడ్డీ రేట్ల మార్పులకు ఎక్కువ ప్రభావితమవుతూ ఉంటాయి. అదే సమయంలో కార్పొరేట్ బాండ్లతో పోలిస్తే ప్రభుత్వ బాండ్లలో క్రెడిట్ రిస్క్ దాదాపు ఉండదనే చెప్పుకోవాలి. స్వల్పకాలంలో ప్రభుత్వ బాండ్లు మరింత అస్థిరతలను ఎదుర్కొంటాయి. దీర్ఘకాలంలో ఇవి కనుమరుగు అవుతాయి. మూడు, ఐదేళ్లు అంతకుమించిన కాలాల్లో కార్పొరేట్ బాండ్ ఫండ్స్ మాదిరే గిల్ట్ ఫండ్స్ కూడా రాబడులు ఇచ్చాయి. ఎన్‌పీఎస్ టైర్ 1 ఖాతాలో మీ పెట్టుబడులు 60 ఏళ్ల వరకు లాకిన్ అయి ఉంటాయి. అంటే మరో ఆరేళ్ల సమయం మీకు మిగిలి ఉంది. మీరు డెట్‌కు కేటాయించిన మొత్తంలో సగాన్ని ప్రభుత్వ బాండ్లలో పెట్టినా.. అవి మొత్తం పెట్టుబడుల్లో 25 శాతమే. వడ్డీ రేట్ల పెరుగుదల నేపథ్యంలో ప్రభుత్వ బాండ్లలో పెట్టుబడులను తగ్గించుకోవాలని అనుకుంటే.. తర్వాత ఏదో ఒక సమయంలో మళ్లీ ప్రభుత్వ బాండ్లలో పెట్టుబడులు పెంచుకోవాల్సి రావచ్చు. దీనివల్ల పెట్టుబడుల విషయంలో యాక్టివ్‌గా పనిచేయాల్సి రావచ్చు. రిటైర్మెంట్‌కు దగ్గర్లో ఉన్నారు. కార్పొరేట్ బాండ్లలో పెట్టుబడులు పెంచుకోవడం అంటే రిస్క్ కొంచెం తీసుకున్నట్టే అవుతుంది. కనుక మీ పెట్టుబడులను యథాతథంగా కొనసాగించుకోవచ్చు.

